ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 17-8-2017 గురువారం సిటీ సంపుటి 44 సంచిక 8 | రూ. 5-00. పేజీలు 16+16 | www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ప్రాజెక్టులపై పెద్ద మనసు

- సాగునీటి ప్రాజెక్టులకు 2% తక్కువ వడ్డీకే రుణం
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయం
- బాండ్ల ద్వారా రూ.9,020 కోట్ల సమీకరణకు నాబార్డుకు అనుమతి
- ఏపీలో 8, తెలంగాణలో 11 పథకాలకు ప్రయోజనం

ఈనాడు - దిల్లీ

సత్వర సాగునీటి ప్రయోజన కార్యక్రమం (ఏఐబీపీ) కింద దేశవ్యాప్తంగా 99 సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం మార్కెట్ రేటు కంటే 2% తక్కువ వడ్డీకి రాష్ట్రాలకు రుణం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం 2017-18 ఆర్థిక సంవత్సరానికి అదనపు బడ్జెట్ వనరుల కింద (ఎక్స్ట్రా బడ్జెట్ రిసోర్సెస్) రూ.9,020 కోట్లను బాండ్ల రూపంలో సేకరించడానికి నాబార్డుకు అనుమతిస్తూ కేంద్ర మంత్రివర్గం బుధవారం నిర్ణయించింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ నుంచి 8, తెలంగాణవి 11 ప్రాజెక్టులున్నాయి. నిధుల కొరతతో ఏళ్లతరబడి సాగుతూ వస్తున్న 99 ప్రాజెక్టులను 2019కల్లా ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకొంది. ఇందుకోసం 2017-18లో రూ.29వేల కోట్లు అవసరం అవుతుందని అంచనా వేసింది. బడ్జెట్‌లో ప్రకటించిన దానికి అదనంగా రూ.9,020 కోట్లు అవసరం అవుతుందని గుర్తించి ఆ మొత్తాన్ని బాండ్ల ద్వారా సేకరించడానికి నాబార్డ్‌కు అనుమతిచ్చింది. నాబార్డు రుణం రాష్ట్రాలకు భారంగా మారకుండా చూడటానికి వడ్డీ రేటును 6%కి పరిమితం చేస్తున్నట్లు ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ బుధవారం వెల్లడించారు. అందుకే 2016-17 నుంచి 2019-20 మధ్యకాలంలో (మిగతా 2లో)

శరవేగంగా కొలువుల భర్తీ

- టీఎస్‌పీఎస్సీకి గురుతర బాధ్యత
- కమిషన్‌కు మరో 90 పోస్టులు
- ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు
- మరో నెల రోజుల్లో 12 వేల నియామకాలు
- త్వరలో గ్రూపు-1, 2 ఫలితాలు ప్రకటిస్తాం: సీఎంతో చక్రపాణి
- ముఖ్యమంత్రి ఆదేశాలతో కడియం సమావేశం

ఈనాడు - హైదరాబాద్



అధికారులతో సమీక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి. చిత్రంలో టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, ఉన్నతాధికారులు

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు 84,876 పోస్టుల భర్తీకి శాఖల వారీగా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని ఉన్నతాధికారులు, పబ్లిక్ సర్వీసు కమిషన్ ఛైర్మన్ ఘంటా చక్రపాణి ఆధ్వర్యంలో అధికారులు వారానికోసారి సమావేశమై నియామక ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్‌కు ఇది గురుతర బాధ్యత అన్నారు. పనిభారం పెరిగినందున కమిషన్‌కు మరో 90 పోస్టులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకుల విద్యాసంస్థల్లో వేల మంది ఉపాధ్యాయుల నియామకాలను వెంటనే చేపట్టాలని సీఎం ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరిని ఆదేశించారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేదికపై భారీ ఎత్తున ఉద్యోగ నియామకాలను ప్రకటించిన సీఎం దీని అమలుపై బుధవారం ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్, టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ చక్రపాణితో మాట్లాడారు. నియామకాలను ఆలస్యం చేయకుండా వెంటనే ఖాళీలు భర్తీ చేయాలన్నారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా ఇప్పటికే 58 నోటిఫికేషన్లు జారీ చేసి నియామక ప్రక్రియలను ముందుకు తీసుకెళ్తున్నామని సీఎంతో చక్రపాణి చెప్పారు. 'కమిషన్ ద్వారా ఇప్పటికే 5వేల మంది నియమితులయ్యారు. మరో నెలరోజుల్లో 12వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ముగుస్తుంది. న్యాయపరమైన వివాదాలు కొలిక్కి వచ్చినందున త్వరలోనే గ్రూపు-1, గ్రూపు-2 ఫలితాలు ప్రకటిస్తాం' అని వివరించారు.

మార్గదర్శకాల రూపకల్పనపై భేటీ

సీఎం ఆదేశాల నేపథ్యంలో కడియం సచివాలయంలో టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ చక్రపాణి, సీఎస్ ఎస్పీసింగ్, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఉద్యోగ ఖాళీలను త్వరగా భర్తీ చేయడానికి, న్యాయపరమైన అడ్డంకులు లేకుండా టీఎస్‌పీఎస్సీ ద్వారా ప్రకటనల జారీకి మార్గదర్శకాలను రూపొందించడంపై చర్చించారు. ఇప్పుడు అమల్లో ఉన్న రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు పాత పది జిల్లాల ప్రాతిపదికన ప్రకటనలు జారీ చేయాలా? 31 జిల్లాలను పరిగణలోకి తీసుకొని ముందుకు వెళ్లాలా అన్నదానిపై న్యాయశాఖ తన ప్రతిపాదనలు, సలహాలను వెంటనే ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి కడియం ఆదేశించారు. శాఖలు, కేడర్ వారీగా ఖాళీల సంఖ్యను గుర్తించి వివరాలు ఇవ్వాలని, వాటి భర్తీకి అభ్యర్థులకు కావాల్సిన విద్యార్హతలు, రోస్టర్ పాయింట్లను రూపొందించాలన్నారు. శాఖల వారిగా ఉద్యోగాల భర్తీకి వెనువెంటనే నోటిఫికేషన్లు జారీచేయాలని, వచ్చే ఏడాది ఏర్పడే ఖాళీలను ముందుగా గుర్తించి (మిగతా 2లో)

> ప్రభుత్వం ఏ పని చేపట్టినా అడ్డుకోవడానికి కొన్ని ప్రతీప శక్తులు కాచుకొని ఉన్నాయి. కోర్టు కేసుల ద్వారా ఉద్యోగ నియామకాల ప్రక్రియకు ఆటంకాలు కల్పిస్తున్నాయి. న్యాయపరమైన చిక్కులకు అవకాశం లేకుండా నోటిఫికేషన్లు జారీ చేయాలి. వీటి జారీకి ముందే న్యాయశాఖ అధికారులతో చర్చించాలి. ఎవరైనా కోర్టుల్లో కేసులు వేస్తే సమర్థంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి. టీఎస్‌పీఎస్సీ స్ఫూర్తిదాయకంగా పనిచేసి 84,876 ఖాళీలను భర్తీ చేయాలి.
>
> - సీఎం కేసీఆర్



కీలెరిగి మేలు

- కృత్రిమ కీళ్ల ధరలను 70 శాతం తగ్గించిన కేంద్రం
- ఇకపై రూ.54 వేల నుంచి రూ.1.14 లక్షల మధ్యే లభ్యం
- ఏటా 1.5 లక్షల మంది రోగులకు లబ్ధి

దిల్లీ: కృత్రిమ కీళ్ల ధరలు దిగొచ్చాయి. కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్న 'నీ ఇంప్లాంట్స్' ధరలకు కేంద్ర ప్రభుత్వం గరిష్ఠ పరిమితిని విధించింది. పరికరాన్ని బట్టి రూ.54 వేలు- రూ.1.14 లక్షల మధ్య వీటిని స్థిరీకరించింది. ప్రస్తుతం వసూలు చేస్తున్న ధరలతో పోలిస్తే ఇవి సుమారు 70 శాతం తక్కువ కావడం విశేషం! ప్రభుత్వ నిర్ణయంతో, ఏటా కృత్రిమ కీలు శస్త్రచికిత్స చేయించుకునే లక్షన్నరమంది (మిగతా 2లో)

మెట్రో రైల్‌లో ప్రైవేట్ భాగస్వామ్యం తప్పనిసరి

- అప్పుడే కేంద్రం నుంచి ఆర్థిక సాయం
- నూతన విధానానికి మంత్రివర్గం ఆమోదం

13లో

7 శాతం వడ్డీతో పంట రుణాలు

- 2017-18కి వడ్డీ రాయితీ పథకం
- ఆధార్ తప్పనిసరి: ఆర్‌బీఐ

2లో

ప్రమాదాల నివారణకు ఏం చేశారు?

- నిర్లక్ష్యంగా వ్యవహరించినవారిపై ఏం చర్యలు తీసుకున్నారు
- బోరు బావుల ప్రమాదాలపై తెలంగాణ సర్కారును ప్రశ్నించిన హైకోర్టు

11లో

కోటి ఎకరాల మాగాణి

అదే కేసీఆర్ ఆకాంక్ష

- సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం
- మంత్రి కేటీఆర్ వెల్లడి

పేట్‌బషీరాబాద్, షాపూర్‌నగర్, దుండిగల్, న్యూస్‌టుడే

మహాకవి దాశరథి 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటే.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష కోటి ఎకరాల మాగాణి అని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో చేపట్టిన, చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన హాజరయ్యారు. మిషన్ భగీరథలో భాగంగా రూ.628 కోట్లతో ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని 163 గ్రామాలు, ఏడు మున్సిపాలిటీలకు ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇచ్చే పథకం పైలాన్‌ను కొంపల్లిలో మంత్రి ఆవిష్కరించారు. గండిమైసమ్మ-దుండిగల్ మండలం డి.పోచంపల్లి పరిధిలో 1600 రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలకు ఆయన (మిగతా 2లో)



షాపూర్‌నగర్‌లో రిజర్వాయర్‌ను ప్రారంభించి నీళ్లు వదులుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎంపీ మల్లారెడ్డి తదితరులు

విద్యుత్ వినియోగం పైపైకి

- తెలంగాణలో భారీగా పెరిగిన తలసరి వాడకం
- రాష్ట్రం ఏర్పడకముందు ఏడాదికి 938 యూనిట్లు
- ఇప్పుడు 1400 యూనిట్లకు పైగా డిమాండు
- కోతల్లేకుండా సరఫరాకు డిస్కంల తంటాలు
- మరో వెయ్యి మెగావాట్లు కొనాలని నిర్ణయం

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ విద్యుత్ తలసరి వినియోగం భారీగా పెరుగుతోంది. రాష్ట్రం ఏర్పడినప్పటితో పోలిస్తే ఇప్పుడు ఏకంగా 613 యూనిట్లు అదనంగా పెరిగిందని ట్రాన్స్‌కో అధ్యయనంలో తేలింది. ఈ పెరుగుదల జాతీయ స్థాయిలో చాలా ఎక్కువ. దేశవ్యాప్తంగా తలసరి వినియోగం 2013-17 మధ్య కాలంలో 914 నుంచి 1,122 యూనిట్లకు చేరింది. అంటే నికరంగా అదనపు పెరుగుదల 208 యూనిట్లు. ఇదే కాలవ్యవధిలో తెలంగాణలో తలసరి వాడకం 938 నుంచి 1,551కి చేరింది. ఈ రాష్ట్రంలో 613 పెరుగుదల నమోదవడం వల్ల జాతీయస్థాయితో పోలిస్తే 3 రెట్లు అధికమని ఇది ఆర్థిక పురోగతికి నిదర్శనమని ట్రాన్స్‌కో తాజాగా ప్రభుత్వానికిచ్చిన నివేదికలో తెలిపింది. వచ్చే అక్టోబరు నుంచి వ్యవసాయానికి రాష్ట్రంలోని అన్నీ జిల్లాలకు రోజంతా (24 గంటలు) కరెంటు సరఫరా చేయనున్నందున తలసరి వాడకం ఈ ఆర్థిక సంవత్సరంలోనే 1600 యూనిట్లు దాటవచ్చని తాజా అంచనా. కొద్ది రాష్ట్రాల్లోనే జాతీయ సగటు కన్నా వాడకం అధికంగా ఉన్నది. దక్షిణ భారతంలో తమిళనాడు తరవాత తెలంగాణనే అగ్రస్థానంలో ఉంది. ఉదాహరణకు మధ్యప్రదేశ్‌లో సేద్యానికి రోజంతా కరెంటు ఇస్తున్నా జాతీయ సగటుకన్నా తక్కువగా 989 యూనిట్ల (మిగతా 2లో)



'మియాపూర్ భూకుంభకోణం'పై కౌంటరు దాఖలు చేయండి

- కేంద్రం, తెలంగాణ ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

2లో

సహకార స్ఫూర్తి.. రైతన్నకు దీప్తి

పంట రుణాల కోసం చెప్పులరిగేలా బ్యాంకుల చుట్టూ తిరగనక్కర్లేదు...
పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పనిలేదు...
నకిలీ విత్తనాల ఊసే ఉండదు...
ఎరువులు, పురుగుల మందుల కోసం ఎక్కడికీ వెళ్లనక్కర్లేదు...
దిగుబడులకు గిట్టుబాటు ధర లేదన్న చింత అసలే ఉండదు!
ఈ సమస్యలన్నింటినీ భుజానకెత్తుకుని రైతును కంటికి రెప్పలా చూసుకుంటోంది కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలంలోని గట్టుదుద్దెనపల్లి విశాల సహకార పరపతి సంఘం. జాతీయ స్థాయిలో ఆదర్శ సంస్థల్లో ఒకటిగా నాబార్డ్ గుర్తింపు పొంది పురోగమిస్తున్న సొసైటీ పనితీరుపై

'ఈనాడు' ప్రత్యేక కథనం 11లో



గట్టుదుద్దెనపల్లి విశాల సహకార సంఘం భవనం

ఇదీ సంగతి!



ఏమాత్రం బుర్రాబుద్ధీ లేనివాళ్లను తెచ్చి సలహా మండలిలో పెట్టుకుందాం సార్. సొంత ఆలోచన ఉన్న ప్రతివాడూ వెళ్లిపోతున్నాడు.

కూలీలకు ఉపాధి.. రైతులకు ఊరట

- నీతి ఆయోగ్ సిఫార్సుల అమలు ఉభయ తారకం
- వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించాలి
- ప్రయోగాత్మకంగా తెలంగాణలో అమలు చేయండి
- రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి
- ఎటూ తేల్చని కేంద్ర ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ప్రస్తుతం వ్యవసాయ కూలీల కొరత తీవ్రంగా ఉంది. కూలీల ధరలు కూడా దాదాపు రెట్టింపయ్యాయి. ఫలితంగా పెట్టుబడి వ్యయం భారమై రైతులు కుదేలవుతున్నారు. అన్నదాతకు ఉపశమనం కలగాలంటే ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడమే పరిష్కారం. నాట్లు, కోతలు వంటి వాటన్నింటికీ ఉపాధి పథకాన్ని వర్తింపజేస్తే రైతులతో పాటు కూలీలు కూడా లబ్ధి పొందుతారు. నీతి ఆయోగ్ ఏడాది క్రితమే ఇలాంటి సిఫార్సులను చేసినా కేంద్రం నాన్చుడు ధోరణి అవలంబిస్తోంది. ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేసే అంశాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయదలచుకొంటే తెలంగాణను ఎంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. తాజాగా మరోసారి విన్నవించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మాత్రం జిల్లా పరిధిలోని ఉపాధి పనుల్లో కనీసం 60శాతం వ్యవసాయ సంబంధిత రంగాలవి ఉండాలని తాజాగా పేర్కొంటూ ఇంకుడు గుంతలు, కందకాల తవ్వకాలు, మొక్కల పెంపకం వంటివాటినే ప్రస్తావించింది. ఇవన్నీ రైతును సంక్షోభం నుంచి గట్టెక్కించలేవు. ఉపాధి హామీకి ఈ ఏడాది తెలంగాణలో పెడుతున్న ఖర్చు రూ.3వేల కోట్లు. ఇది గతేడాదికంటే రూ.470 కోట్లు (మిగతా 2లో)

కూలీలకు 'ఉపాధి'.. రైతులకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువ. ఇలా ఏటా కేంద్ర నిధులు పెరుగుతున్నందున వాటిని మరింత సమర్థంగా వినియోగించుకోవాలనేది నీతి ఆయోగ్ భావన. పేదరికం నిర్మూలనలో భాగంగా 2016లో నీతి ఆయోగ్ చేసిన కొన్ని సూచనలను రాష్ట్రాలు స్వాగతించాయి. పొలం పనుల్లో కూలీలకయ్యే ఖర్చులో రైతు 75శాతాన్ని భరిస్తే మిగతా 25శాతాన్ని ఉపాధి హామీ పథకం ద్వారా సమకూర్చవచ్చని నీతి ఆయోగ్ తన సిఫార్సుల్లో పేర్కొంది. ఇలా చేస్తే రైతుకు కూలీల కొరత రాదు. మరో వైపు కూలీలకూ ఎక్కువ రోజులు పనులు దొరుకుతాయి.

ప్రస్తుతానికి ఇంకుడు గుంతలూ..

రాష్ట్రంలో చేపడుతున్న ఉపాధి పనుల్లో 60-70 శాతం మేర వ్యవసాయ, అనుబంధ రంగాలవేనని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ చెబుతోంది. వీటిపై ఈ ఏడాది రూ.522 కోట్లను వినియోగించింది. పొలాల్లో తవ్వే కుంటల వల్ల కొంత ప్రయోజనం ఉన్నప్పటికీ తెలంగాణలోని కమతం సగటు విస్తీర్ణం కేవలం 2.8 ఎకరాలు కావడం వల్ల కుంటల తవ్వకాలకు రైతులు ఆసక్తి చూపడం లేదు.

తీవ్ర కొరత..

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రస్తుతం వ్యవసాయ కూలీలకు విపరీతమైన కొరత నెలకొంది.



వరంగల్ జిల్లా భీమదేవరపల్లిలో ఇతర గ్రామాల నుంచి వచ్చి వరి నాట్లు వేస్తున్న కూలీలు

ఉపాధి హామీ కింద హరితహారం పనులు చేపడుతుండడంతో ఎక్కువ మంది వాటిలోకి వెళ్లడం, భవన నిర్మాణ పనుల వైపు మళ్లుతుండడం వంటివి ఈ కొరతకు ప్రధాన కారణాలు. వ్యవసాయ పనులు చేసే కూలీల సంఖ్య తగ్గిపోవడంతో వరి నాట్లు, కలుపుతీత వంటివాటికి రేట్లు బాగా పెరిగిపోయాయి. ఉదాహరణకు కరీంనగర్ జిల్లాలో వరి నాట్లకు రోజు కూలీ గతంలో రూ.150-180 ఉండగా ఇప్పుడది రూ.250-300 వరకు ఉంది. పత్తిలో కలుపు తీతకు రూ.200-250 ఇవ్వాల్సి వస్తోంది. కూలీలను ఇతర గ్రామాల నుంచి తీసుకురావడానికి రోజువారీ అయ్యే ఖర్చు రూ.700-1000 కూడా రైతులే భరిస్తున్నారు. కూలీ ఎక్కువగా పొందడానికి స్థానిక కూలీలు ఇతర గ్రామాలకు వెళుతున్నారని వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లికి చెందిన కొందరు రైతులు వాపోయారు. వీటితోపాటు ఎకరం పొలం దున్నడానికి ట్రాక్టర్‌కు రూ.4వేలు, కోతల యంత్రానికి ఇచ్చే రూ.1,500 వంటివన్నీ కూలీ ఖర్చులకు అదనం.

రైతుకు రూ.2,500 మేర లబ్ధి..

నీతి ఆయోగ్ సిఫార్సులు అమల్లోకి వస్తే ఎకరం పొలంలో కూలీలకయ్యే ఖర్చు రూ.10వేలలో 25 శాతం మేర ఉపాధి హామీ ద్వారానే సమకూరుతుంది. అంటే రైతుకు రూ.2,500 మిగులుతాయి. ట్రాక్టర్, కోతల యంత్రాల కిరాయిలకు కూడా పథకం అమలైతే మరింత ప్రయోజనం చేకూరుతుంది.

మాకెంతో మేలు



ఉపాధి హామీ పథకాన్ని సాగుకు అనుసంధానం చేస్తే రైతుకు మేలే. కూలీల కొరత ఉండదు. వారికీ ఎక్కువ రోజులు పనులు దొరుకుతాయి.

–కొత్త భూమయ్య, రైతు, కరీంనగర్ జిల్లా

కనీసం 50 శాతం ఇవ్వాలి



కూలీలకయ్యే ఖర్చులో కనీసం 50 శాతాన్ని ఉపాధి హామీ కింద ప్రభుత్వమే ఇస్తే సాగు వ్యయం తగ్గి రైతుకు అప్పుల భారం తగ్గుతుంది. అనుసంధానంపై నీతి ఆయోగ్ సిఫార్సుతోనైనా కేంద్ర నడుంకట్టాలి.

– పడాల గౌతం, రైతు, వరంగల్ అర్బన్ జిల్లా

7 శాతం వడ్డీతో రైతులకు పంట రుణాలు

ముంబయి: కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు 2017-18లో రైతులకు రాయితీతో కూడిన వడ్డీపై ఒక్కొక్కరికీ రూ.3 లక్షల వరకు స్వల్పకాలిక పంట రుణాలను అందజేయనున్నట్లు ఆర్‌బీఐ బుధవారం వెల్లడించింది. వీటిపై వార్షిక వడ్డీ రేటును 7 శాతంగా నిర్ణయించగా.. సత్వరం రుణాలు తిరిగి చెల్లించేవారికి అది 4శాతానికి తగ్గుతుందని ప్రకటించింది. ఈ వడ్డీ రాయితీ పథకం కింద అవాంతరాలేమీ లేకుండా రైతులు ప్రయోజనాలు పొందేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. ఈమేరకు స్వల్పకాలిక రుణాలకు ఆధార్‌ను తప్పనిసరి చేయాలంటూ బ్యాంకులకు సూచించినట్లు ఆర్‌బీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. అలాగే గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాల్లోని శాఖల ద్వారా రుణాలిచ్చే బ్యాంకులకు 2 శాతం వడ్డీ రాయితీ అందజేయనున్నట్లు వెల్లడించింది. దీన్ని రుణం ఇచ్చిన నాటి నుంచి, రైతులు తిరిగి చెల్లించిన తేదీ వరకు లేదా బ్యాంకులు నిర్దేశించిన గడువు వరకు. ఈ రెండింటిలో ఏది ముందయితే అంతవరకు లెక్కించనున్నట్లు వివరించింది. రైతులు తక్కువ ధరకు పంటను అమ్ముకోకుండా.. గోదాముల్లో పంటలను నిల్వ చేసుకోవడాన్ని ప్రోత్సహించేలా చిన్న, సన్నకారు రైతులకు (కిసాన్ క్రెడిట్ కార్డులపై) వడ్డీ రాయితీని మరో 6 నెలలు పొడిగించుకోవడానికి వీలు కల్పించింది. వీటికి గుర్తింపు పొందిన గోదాముల్లో నిల్వ చేసిన రసీదులు తప్పనిసరి. అలాగే ప్రకృతి విపత్తులకు పంటలు దెబ్బతింటే అలాంటి రైతులకు వారు తీసుకున్న రుణంలో బ్యాంకులు (మొదటి సంవత్సరంలో) 2 శాతం వడ్డీ రాయితీని కల్పిస్తాయి. వీటితో పాటు నిజాయతీపరులైన రైతులకు ప్రయోజనాలు దక్కేలా బ్యాంకులకు తగిన సూచనలు చేసినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. 2017-18 సంవత్సరానికి వడ్డీ రాయితీ పథకాన్ని అమలు చేస్తూ జూన్ ప్రారంభంలో ప్రధాని నేతృత్వంలోని కేబినెట్ ఆమోదించిన సంగతి తెలిసిందే.

ప్రాజెక్టులపై పెద్ద మనసు



బుధవారం దిల్లీలో కేంద్ర మంత్రిమండలి సమావేశం అనంతరం విలేకర్లతో మాట్లాడుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వమే నాబార్డుకు సమకూరుస్తుందని, అందుకయ్యే వడ్డీ భారాన్ని కేంద్రమే భరిస్తుందని చెప్పారు.

2016-17 ఆర్థిక సంవత్సరంలో నాబార్డు దీర్ఘకాల సాగునీటి నిధి కింద రూ.9,086.02 కోట్లు పంపిణీ చేసింది. అందులో పోలవరం ప్రాజెక్టుకు రూ.2,414.16 కోట్లు విడుదల చేసింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో నాబార్డు బాండ్ల రూపంలో రూ.2,187 కోట్లు సమీకరించింది. పూర్తిచేయాలని సంకల్పించిన 99 ప్రాజెక్టుల్లో 18 ప్రాజెక్టులు 2016-17లో పూర్తయినట్లు కేంద్రం వెల్లడించింది. వీటి ద్వారా 14 లక్షల హెక్టార్లకు కొత్తగా సాగునీరు అందనుంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 33 ప్రాజెక్టులను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దానివల్ల 28 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుంది. మిగిలిన ప్రాజెక్టులను 2019 మార్చికల్లా పూర్తిచేసి మొత్తం 76 లక్షల హెక్టార్లకు కొత్తగా సాగునీరు అందించనుంది. ఏఐబీపీ కింద 1995 నుంచి 2016 వరకు ఏటా 5-6 ప్రాజెక్టులు పూర్తిచేస్తే, ఎన్డీయే హయాంలో 2016-17 ఒక్క సంవత్సరంలోనే 18 ప్రాజెక్టులు పూర్తిచేసినట్లు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఉమాభారతి వెల్లడించారు. ప్రస్తుతం రోజుకు వెయ్యి హెక్టార్లకు కొత్తగా సాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని, ఈ ప్రాజెక్టులు పూర్తయితే రోజుకు 3 వేల హెక్టార్లకు సాగు అందించినట్లవుతుందని వివరించారు.

ఏఐబీపీ కింద ఉన్న ఏపీ ప్రాజెక్టులు

ప్రాజెక్టు	కేంద్రం వాటా రూ.కోట్లలో	రాష్ట్రం వాటా రూ.కోట్లలో
గుండ్లకమ్మ	25.65	76.96
మద్దిగెడ్డ (చివరి దశలో ఉంది)	0	0
ముసురుమిల్లి	18.44	13.63
పుష్కరఎత్తిపోతలు	14.98	44.84
తోటపల్లి (చివరి దశలో ఉంది)	0	0
తాటిపూడి	16.62	49.88
తారకరామతీర్థ	67.31	201.93
ఎర్రకాలువ	4.85	2.43
మొత్తం	**147.85**	**389.67**
తెలంగాణలోని ప్రాజెక్టులు		
గొల్లవాగు	9.83	6.55
ఇందిరమ్మ వరద కాలువ	399.62	1,198.88
దేవాదుల	1,244.48	3,733.45
మత్తడివాగు (చివరి దశలో ఉంది)	0	0
పాలెంవాగు	7.41	22.23
పెద్దవాగు	27.70	3.07
నీల్వాయి ప్రాజెక్టు	19.47	58.41
రాళ్లవాగు	3.51	10.55
రంగసముద్రం	432.68	144.22
కొమరంభీం	80.74	30.48
ఎస్ఆర్ఎస్‌పీ స్టేజ్2 (చివరి దశలో ఉంది)	0	0
మొత్తం	**2,225.44**	**5,207.84**

'మియాపూర్ భూకుంభకోణం'పై కౌంటరు దాఖలు చేయండి

ఈనాడు, హైదరాబాద్: మియాపూర్ భూకుంభకోణానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు సీబీఐ, ప్రైవేటు వ్యక్తులకు బుధవారం ఉమ్మడి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. భూకుంభకోణం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను సెప్టెంబరు 13కు వాయిదా వేసింది. మియాపూర్ భూకుంభకోణంలో ప్రముఖుల పాత్ర, దర్యాప్తులో రాజకీయ జోక్యం ఉందని.. అందువల్ల దర్యాప్తును సీబీఐకి అప్పగించాలంటూ రఘునందన్‌రావు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం విదితమే. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ వాదనలు వినిపిస్తూ మియాపూర్ దాటి విస్తరించిన భూకుంభకోణం వ్యవహారంపై అదనపు అఫిడవిట్ దాఖలు చేశానని చెప్పారు. ఇందులో ప్రముఖుల పాత్ర ఉందని తెలిపారు. మొత్తం వ్యవహారం వెలుగులోకి రావాలంటే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ప్రత్యేక సందర్భాల్లో సీబీఐ దర్యాప్తునకు తాము ఆదేశించవచ్చని, దస్త్రాలను పరిశీలించాల్సి ఉందని తెలిపింది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయడానికి గడువు కావాలని అడ్వొకేట్ జనరల్ డి.ప్రకాశ్‌రెడ్డి కోరగా ధర్మాసనం అనుమతించింది. మియాపూర్‌తోపాటు హఫీజ్‌పేట, హైదర్‌గనర్ ప్రాంతాల్లో 'పైగా' భూములను కొట్టేయడానికి ప్రైవేటు వ్యక్తులు అధికారులతో కుమ్మక్కై కుట్రపన్నారని అదనపు అఫిడవిట్‌లో రఘునందన్‌రావు పేర్కొన్నారు.

కీలెరిగి మేలు

(మొదటి పేజీ తరువాయి)

రోగులకు రూ.1,500 కోట్ల మేర డబ్బులు ఆదా కానున్నాయి.

గుండెకు సంబంధించిన స్టెంట్ల ధరలకు కళ్లెం వేసిన తర్వాత, కేంద్రం కృత్రిమ కీళ్ల గరిష్ఠ ధరలనూ స్థిరీకరించాలని నిర్ణయించినట్లు కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ మంత్రి అనంత్‌కుమార్ బుధవారమిక్కడ విలేకరులకు వెల్లడించారు. వైద్య పరికరాల పరిశ్రమను నిరాశ పరచాలన్న ఉద్దేశం లేదని... అన్యాయంగా, అనైతికంగా వాటి విక్రయాలు సాగుతుంటే మాత్రం ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదని ఆయన విస్పష్టం చేశారు.

లక్షలతో వ్యవహారం...

పేదలకు వైద్యం దూరం..

దేశవ్యాప్తంగా దాదాపు 2 కోట్ల మంది కీళ్ల వాతం బాధితులున్నారు. వీరిలో చాలామంది పేదలే. శస్త్రచికిత్సలకు లక్షలాది రూపాయలు అవసరమవుతుండటంతో వైద్యం పొందలేక వీరంతా నరకం అనుభవిస్తున్నారు. ఏటా సుమారు 1.5 లక్షల మంది మాత్రమే కీళ్ల మార్పిడి చికిత్సలు చేయించుకోగలుగుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, 2020 నాటికి ఎక్కువమంది ప్రజలు నడవలేకపోవడానికి కీళ్లవాతం నాలుగో అతిపెద్ద కారణమవుతుందని మంత్రి వివరించారు.

ప్రధాని ప్రకటించిన మరుసటి రోజే...

కీళ్ల శస్త్రచికిత్సల ధరలను తగ్గిస్తామని మంగళవారం పంద్రాగస్టు సందర్భంగా ఎర్రకోట సాక్షిగా మోదీ హామీ ఇచ్చిన మరుసటి రోజే.. కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. నిజానికి, కృత్రిమ కీళ్ల విక్రయాల్లో పలు సంస్థలు ఏకాఎకి 313 శాతం లాభాలు ఆర్జిస్తున్నట్లు ఈ నెలారంభంలోనే జాతీయ ఔషధ ధరల ప్రాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) పేర్కొంది. ప్రభుత్వ తాజా నిర్ణయం నేపథ్యంలో, మోకాలు శస్త్రచికిత్సల్లో 80 శాతం వినియోగించే కోబాల్ట్-క్రోమియం కృత్రిమ కీలు గరిష్ఠ ధరను రూ.54,720గా ఎన్‌పీపీఏ నిర్ణయించింది. దీనిని అంతకుముందు రూ.1,58,324కు విక్రయించేవారు. అంటే, ఈ ధర 65% తగ్గిందన్నమాట!

- ఆక్సిడైజ్డ్ జిర్కోనియం ఔషధంతో కూడిన టైటానియం కృత్రిమ కీలు గరిష్ఠ ధరను రూ.76,600 (69% తక్కువ)గా నిర్ణయించారు. ఇప్పటివరకూ దీని ధర రూ.2,49,251గా ఉండేది.
- కదలికలకు అనువుగా బాగా వంగే రకం కృత్రిమ కీలు ఇప్పటివరకూ రూ.1,81,728 ఉండగా, దానిని 69% తక్కువగా 56,490కి కుదించారు. 17 శాతం శస్త్రచికిత్సల్లో వీటిని వినియోగిస్తున్నారు.
- రెండోసారి శస్త్రచికిత్స చేయించుకునే సమయంలో వాడే పరికరాల ధరలనూ కేంద్రం అదుపులోకి తెచ్చింది. రూ.2,76,869గా ఉన్న ఈ కృత్రిమ కీళ్ల పరికరాలు 59% తక్కువగా రూ.1,13,950కే లభించనున్నాయి.
- ఇన్నాళ్లూ కట్టు లేకుండా రూ.4-9 లక్షల మధ్య అమ్ముడుపోతున్న క్యాన్సర్, ట్యూమర్లకు సంబంధించిన ప్రత్యేక పరికరాల ధరలపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. అత్యధికంగా రూ.1,13,950కు మించి వీటిని విక్రయించరాదని ఎన్‌పీపీఏ వీటి ధరలను కట్టడి చేసింది.

శస్త్రచికిత్సల ధరలనూ తగ్గించాలి: ఏఐఎంఈడీ

కృత్రిమ కీళ్ల ధరలను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల భారతీయ వైద్య పరికరాల తయారీదారుల సమాఖ్య (ఏఐఎంఈడీ) స్వాగతించింది. అయితే, "కేవలం పరికరాల ధరలను తగ్గించడం వల్ల రోగులకు ప్రయోజనం ఉండదు. శస్త్రచికిత్సల వ్యయాన్ని కూడా తగ్గించినప్పుడే ప్రభుత్వాశయం నెరవేరుతుంది" అని సమాఖ్య సమన్వయకర్త రాజీవ్ నాథ్ పేర్కొన్నారు.

విద్యుత్ వినియోగం పైపైకి

(మొదటి పేజీ తరువాయి)

తలసరి వినియోగముంది. కానీ తెలంగాణలో పారిశ్రామిక వినియోగం కూడా గరిష్ఠ స్థాయిలో ఉన్నందున ఇక్కడ వాడకం పెరిగింది. ఇంతకుముందు అధిక వినియోగమున్న రాష్ట్రాల్లో గత మూడేళ్లుగా అదనపు పెరుగుదల పెద్దగా లేదు. ఉదాహరణకు గుజరాత్‌లో 2014-15లో 2105 ఉండగా 2016-17లో 2279కి చేరింది. దేశంలో మరే రాష్ట్రంలో లేనంతగా తెలంగాణలో వినియోగం ఏటా పెరుగుతూ వస్తోంది. రాష్ట్రంలో వ్యవసాయ బోర్లు, పరిశ్రమలకు అధిక వినియోగం ఉండటమే ఇందుకు కారణమని ట్రాన్స్‌కో తెలిపింది. ఇళ్లకు సైతం తెలంగాణ ఏర్పడిన తొలి ఏడాదిలో కోతలుండగా ఇప్పుడు నిరంతరాయంగా సరఫరా చేస్తున్నందున వినియోగం పెరిగింది. తెలంగాణ సగటు వినియోగంలో భారతదేశంలో 9వ స్థానానికి చేరింది. తెలంగాణతో పోలిస్తే 1,551 యూనిట్లకు మించి తలసరి వినియోగమున్న రాష్ట్రాలు 8 మాత్రమే. అత్యధికంగా గోవాలో 2,466 యూనిట్లు వాడుతున్నారు. ఇక కేంద్ర పాలిత ప్రాంతాలను విడిగా చూస్తే ప్రపంచ సగటును మించి భారీగా కరెంటు వాడుతున్నారు. దేశంలోనే అత్యధికంగా దాద్రానగర్-హవేలీ కేంద్ర పాలిత ప్రాంతంలో సాలుకు 15,783 యూనిట్లు వాడేస్తున్నారు. ఇది ప్రపంచంలోనే అత్యధికంగా వాడే కెనడా దేశస్థాయిలో ఉండటం విశేషం.

ప్రపంచ సగటులో మూడోవంతే..

భారతదేశంలో ప్రస్తుతం డిమాండుకు అనుగుణంగా విద్యుత్ అందుబాటులో ఉన్నా ప్రపంచ సగటుకన్నా, పలు దేశాలకన్నా చాలా తక్కువగా తలసరి విద్యుత్తు వినియోగముందని 'కేంద్రీయ విద్యుత్తు మండలి' తాజా నివేదికలో తెలిపింది. 2013-14 నాటికే ప్రపంచ సగటు 3,046 యూనిట్లుండగా అదే ఏడాది భారతదేశ సగటు 957 యూనిట్లే ఉంది. కెనడాలో అత్యధికంగా 15,520 యూనిట్లు వాడుతున్నారు.

ప్రధాన దేశాల్లో 2013-14లో తలసరి విద్యుత్ వినియోగం(యూనిట్లు)

దేశం	ఎంత
కెనడా	15,520
అమెరికా	12,987
ఆస్ట్రేలియా	10,067
జపాన్	7,836
ఫ్రాన్స్	7,382
రష్యా	6,562
బ్రిటన్	5,409
దక్షిణాఫ్రికా	4,328
చైనా	3,766
బ్రెజిల్	2,583
భారత్	957

సేద్యానికి పెరిగిన డిమాండు

గత నెల చివరి నుంచి 3 పాత జిల్లాల పరిధిలో వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్నారు. దీనివల్ల అదనంగా వెయ్యి మెగావాట్ల వరకూ అదనంగా విద్యుత్తు వినియోగం పెరిగింది. ప్రస్తుతం పంటల సాగు విస్తీర్ణం 85 లక్షల ఎకరాలకు చేరింది. ఈ నెలాఖరుకల్లా కోటి ఎకరాలను దాటుతుందని వ్యవసాయశాఖ అంచనా. వర్షాలు పెద్దగా లేనందున కరెంటు వాడకం ఇంకా పెరుగుతుందని విద్యుత్తు పంపిణీ సంస్థలు సిద్ధమవుతున్నాయి. తాజాగా 4 రోజుల క్రితం 9,460 మెగావాట్ల వినియోగమైంది. తెలంగాణ చరిత్రలో ఇదే అత్యధికం. వర్షాలు పడకుంటే.. వచ్చే నెలలో ఏకంగా 10,500 మెగావాట్లకు చేరుతుందని డిస్కంలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా మరో వెయ్యి మెగావాట్లను రానున్న రెండు నెలల కోసం స్వల్పకాలిక ఒప్పందంతో కొనాలని ట్రాన్స్‌కో నిర్ణయించింది. అక్టోబరు నుంచి యాసంగి పంటలకు రోజంతా అన్నీ జిల్లాల్లో కరెంటు సరఫరాకు ఏర్పాటుచేస్తున్నామని, ఇందులో భాగంగానే సెప్టెంబరు, అక్టోబరు నెలలకు 1000 మెగావాట్లను బహిరంగ మార్కెట్‌లో కొనేందుకు టెండర్లు పిలుస్తున్నట్లు ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకరరావు 'ఈనాడు'కు చెప్పారు.

ప్రధాన రాష్ట్రాల్లో ఏడాదికి విద్యుత్తు తలసరి వినియోగం (యూనిట్లు)

రాష్ట్రం	2014–15	2015–16	2016–17
గోవా	1,397	2,738	2,466
గుజరాత్	2,105	2,248	2,279
హరియాణా	1,909	1,936	1,975
పంజాబ్	1,858	1,919	2,028
పుదుచ్చేరి	1,655	1,672	1,784
మహారాష్ట్ర	1,257	1,318	1,307
మధ్యప్రదేశ్	813	929	989
ఛత్తీస్‌గఢ్	1,719	2,022	2,016
రాజస్థాన్	1,123	1,164	1,166
దిల్లీ	1,561	1,557	1,574
తమిళనాడు	1,616	1,688	1,847
ఆంధ్రప్రదేశ్	1,040	1,230	1,319
తెలంగాణ	1,356	1,439	1,551
ఉత్తరప్రదేశ్	502	524	585
బిహార్	203	258	272

తిరస్కరణల్ని తగ్గించేలా ఎంఎన్‌పీలో మార్పులు: ట్రాయ్

దిల్లీ: చరవాణి సంఖ్యను మార్చుకోవాల్సిన అవసరం లేకుండా వేరే నెట్‌వర్క్‌లోకి మారేందుకు వీలు కల్పించే 'మొబైల్ నెంబర్ పోర్టబిలిటీ' (ఎంఎన్‌పీ) నిబంధనల్లో మార్పులు చేయాలని 'భారత టెలికాం నియంత్రణ సంస్థ' (ట్రాయ్) ప్రతిపాదించింది. ఎంఎన్‌పీని వాడుకోదలిచిన వినియోగదారుల అభ్యర్థనలు కొన్ని కారణాలతో తిరస్కరణకు గురవుతున్నాయి. ఈ సంఖ్యను తగ్గించడానికి 'క్లియరింగ్ హౌస్' పాత్రను పెంచాలని ట్రాయ్ భావిస్తోంది. ఈ విభాగం వద్ద వినియోగదారుల వివరాలన్నీ ఉంటాయి. ఒక సంస్థ నుంచి మరో సంస్థలోకి మారాలని భావించే వినియోగదారునికి ముందుగా విశిష్ట బదలాయింపు సంకేతం (యూపీసీ) వస్తుంది. పాత వ్యవస్థకు ఆ వినియోగదారుడు ఎంత బాకీ ఉన్నారు? యూపీసీ ఎప్పటి వరకు చెల్లుతుంది? వంటి కీలక వివరాలు కొత్త నెట్‌వర్క్‌కు తెలియకపోవడం వల్ల ప్రక్రియ పూర్తికావడం లేదు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో సగటున 11.16% అభ్యర్థనలు తిరస్కరణకు గురయ్యాయి. అందువల్ల మొదటి ఆపరేటర్ నుంచే పూర్తి వివరాలు అందేలా చేయాలని ట్రాయ్ ముసాయిదాలో పేర్కొంది. ఇద్దరు ఆపరేటర్లకూ ఎలాంటి ఇబ్బంది ఉండని రీతిలో సమాచారాన్ని చేరవేసే ఏర్పాటు చేయనుంది. ఇలాంటి మార్పులతో ప్రతిపాదించిన ముసాయిదా పత్రంపై ప్రజాభిప్రాయాన్ని ఈ నెల 31 వరకు ట్రాయ్ స్వీకరించనుంది.

భారత్ శక్తిశాలే.. చేయాల్సిందెంతో ఉంది!

అమెరికా నిపుణుల అభిప్రాయం

వాషింగ్టన్: ఏడు దశాబ్దాల స్వాతంత్ర్య సంబరాలు జరుపుకున్న భారత్ ప్రపంచంలో గొప్పశక్తిగా ఎదిగిందనీ, అయినా ఇంకా సుదూర పయనం సాగించాల్సి ఉందని అమెరికా నిపుణులు అభిప్రాయపడ్డారు. భారత్ విజయవంతమైందా, విఫలమైందా అనే చర్చపై అమెరికా అగ్రస్థాయి మేధోసంస్థ..'విదేశీ సంబంధాల మండలి' సభ్యులు అలైసా అయెర్స్ ఫోర్బ్స్ వెబ్‌సైట్‌కు రాసిన కథనంలో.. భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ స్థాయిలో దృఢమైనదనీ, దేశ సైనిక సామర్థ్యం విస్తరణను, ఆధునికీకరణను సాధించినా.. దేశీయంగా ఇంకా చేయాల్సింది చాలా ఉందన్నారు. గత పదేళ్లలో భారత్ ప్రపంచవ్యాప్తంగా విదేశీ, అంతర్జాతీయ ఆర్థిక విధానాల్లో కీలక శక్తిగా ఎదిగిందన్నారు. డెబ్బయ్యేళ్ల భారత్ పౌరులందరి భద్రతకు సంబంధించిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ హామీలు, రాజ్యాంగ ఆకాంక్షల్ని నెరవేర్చాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రపంచ యవనికపై భారత్ స్వరం పెరిగిందన్నారు. మరో నిపుణులు ఫ్రిట్జ్ లాడ్స్ తన కథనంలో.. ఆర్థిక, సైనిక, భౌగోళిక రాజకీయ శక్తిగా భారత్ ఎదగాలనే తన కలల్ని సాకారం చేసుకునే దిశగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముందుకు సాగుతున్నారన్నారు. నోట్ల రద్దుతో ఇక్కట్లు, ప్రభుత్వ పరంగా సంస్థాగత అడ్డంకుల్ని ఎదుర్కొంటున్నా ప్రధాని మోదీ ప్రజల మద్దతును సాధించారన్నారు. కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్‌లో సభ్యులైన మిలన్ వైష్ణవ్ స్పందిస్తూ.. మోదీ వాణిజ్యానికి అనుకూలంగానే వ్యవహరిస్తున్నా మార్కెట్‌కు కాదన్నారు.

కోటి ఎకరాల మాగాణి.. కేసీఆర్ ఆకాంక్ష

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేశారు. షాపూర్‌నగర్‌లో రూ.4.77 కోట్లతో నిర్మించిన 6 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన మంచినీటి రిజర్వాయర్‌ను ప్రారంభించారు. ఏడాదిన్నర క్రితం భూమిపూజ చేసి కొబ్బరికాయ కొట్టిన తనకే రిజర్వాయర్ ప్రారంభోత్సవం చేసే అదృష్టం దక్కిందని కేటీఆర్ అన్నారు. మరో ఆరు నెలల్లో కుత్బుల్లాపూర్‌లో గత ప్రభుత్వాల మాదిరిగా 10, 15 రోజులకు ఒకసారి కాకుండా.. రోజూ తాగునీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లో మంత్రి ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లలో దేశంలో ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అనేక సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేస్తోందన్నారు. గతంలో ఎండాకాలం వచ్చిందంటే నేతలు ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం ముందు బిందెలతో ధర్నాలు చేసేవారని, ఇప్పుడు ప్రతిపక్షాలకు పనిలేకుండా పోయిందన్నారు. ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇచ్చిన తర్వాతే మళ్లీ ఓట్ల కోసం వస్తామని సీఎం కేసీఆర్ అన్న మాట నిలబెట్టుకుంటామన్నారు. నగరంలో లక్షా 50 వేల కొత్త నల్లా కనెక్షన్లు ఇవ్వబోతున్నామన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతున్న నేపథ్యంలో తాగునీటి కోసమే ప్రత్యేకించి రిజర్వాయర్ల నిర్మాణానికి సీఎం పూనుకున్నారన్నారు. వరుసగా మూడేళ్లు వర్షాలు పడకున్నా నగరానికి మంచినీటి ఇబ్బందులు తలెత్తకూడదన్న లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందన్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని, ఇన్నేళ్లు పాలించిన మీరు గుడ్డిగుర్రాల పండ్లు తోమారా.. మూడేళ్లుగా జరుగుతున్న అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నిరాశా నిస్పృహలకులోనై కాంగ్రెస్ నాయకులు రకరకాల మాటలు మాట్లాడుతున్నారని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. మంచి పనులు చేయకపోతే తిరస్కరించే హక్కు, మంచి చేస్తే ఆశీర్వదించే హక్కు కూడా ప్రజలకే ఉంటుందని స్పష్టం చేశారు. నగర



మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ఐఎస్‌ఓ ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న జలమండలి ఎండీ దాన కిశోర్

శివారు ప్రజలకు తాగునీటి సౌకర్యం అందించటానికి తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని షాపూర్‌నగర్‌లో జలమండలి ఎండీ దానకిషోర్‌కు మంత్రి సూచించారు. జలమండలి సావనీర్‌ను విడుదల చేసిన మంత్రి, నాణ్యమైన తాగునీటిని ప్రజలకు అందిస్తున్నందుకు గాను ఐఎస్‌ఓ 9000 ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 2.67 లక్షల ఇళ్ల నిర్మాణం: రాష్ట్రంలో అర్హులైన పేదల కోసం రూ.18 వేల కోట్లతో 2.67 లక్షల రెండు పడక గదుల ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణాలకు నెల రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తవుతుందని, సంవత్సరంలోగా నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణాలకు బస్తీ వాసులు సహకరించి మురికివాడల్లో తమ జాగా ఇస్తే ఏడాదిలోపు వారికి అదే ప్రాంతంలో ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో మంత్రి పి.మహేందర్‌రెడ్డి, ఎంపీలు మల్లారెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్సీలు శంభీపూర్‌రాజు, పి.నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, తీగల కృష్ణారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎం.వి.రెడ్డి పాల్గొన్నారు.

శరవేగంగా కొలువుల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

నియామకాలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈనెల 21న సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో మరోసారి ఇదే అంశంపై సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ సమావేశ వివరాలను ముఖ్యమంత్రికి నివేదిక రూపంలో అందజేశారు. ఇప్పటికే కొన్ని నోటిఫికేషన్లపై కొందరు కోర్టుకు వెళ్లినందున ఈ కేసులకు సంబంధించి న్యాయస్థానంలో సమర్థంగా వాదనలు వినిపిస్తామని నివేదికలో తెలిపారు. నియామకాలను వివాదం చేయాలని కొన్ని శక్తులు యత్నిస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి, తెలంగాణ యువతకు న్యాయం చేస్తుందని ఈ నివేదికలో సీఎస్ సీఎంకు తెలిపారు.

మరఠ్వాడాలో 8 రోజుల్లో 34 మంది రైతుల ఆత్మహత్య

ముంబయి: మహారాష్ట్రలోని మరఠ్వాడా ప్రాంతంలో గత 8 రోజుల వ్యవధిలో 34 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు ఓ ప్రభుత్వ నివేదిక వెల్లడించింది. ఈ ప్రాంతంలో ఈసారి సగటుకన్నా తక్కువ వర్షాలు కురిశాయి. మరఠ్వాడా ప్రాంతంలోని 8 జిల్లాల్లో 34 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు ఔరంగాబాద్ డివిజనల్ కమిషనర్ నివేదించారు. ఒక్కొక్కరి విషయంలో నిర్దిష్ట కారణం ఏమిటనేది తెలియరాలేదు. జనవరి 1 నుంచి ఆగస్టు 15 వరకు మరఠ్వాడా ప్రాంతంలో 580 మంది రైతుల ఆత్మహత్యలు నమోదయ్యాయి. ఇందులో 107 బలవన్మరణాలతో బీడ్ జిల్లా అగ్రస్థానంలో ఉన్నట్లు ఆ నివేదిక తెలిపింది. వర్షాలు లేక ఖరీఫ్ పంటలు కష్టాల్లో ఉన్నట్లు పేర్కొంది.

గ్రహం అనుగ్రహం

17–8–2017 గురువారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
దశమి: ఉ. 11-03 తదుపరి ఏకాదశి
మృగశిర నక్షత్రం: రా. 10-30 తదుపరి ఆర్ద్ర
అమృతఘడియలు: మ. 2-18 నుంచి 3-47 వరకు
వర్జ్యం: ఉ.శే. 6-51 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-59 నుంచి 10-49 వరకు తిరిగి మ. 3-01 నుంచి 3-52 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ. 5-46; సూర్యాస్తమయం: సా. 6-23

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	21.8	32.6
హైదరాబాద్	22.6	31.2
కరీంనగర్	23.0	33.0
సూర్యాపేట	24.0	35.0
మహబూబ్‌నగర్	24.1	33.2
రామగుండం	24.8	32.0
నిజామాబాద్	25.0	30.0
ఖమ్మం	26.0	35.0
హన్మకొండ	26.5	31.0

రాజీవ్ హంతకులను ముందుగా విడుదల చేయలేం

చెన్నై, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హంతకులను ముందుగా విడుదల చేయడం సాధ్యపడదని మద్రాస్ హైకోర్టుకు తమిళనాడు ప్రభుత్వం బుధవారం తెలిపింది. ఈ కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న రాబర్ట్ ఫయాజ్, జయకుమార్‌లు తమను ముందుగా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ మద్రాసు హైకోర్టులో గతంలో వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ కేసు తాజాగా బుధవారం విచారణకు వచ్చింది. జీవిత ఖైదు పడిన వారిపై ఉన్న హత్యానేరం చాలా తీవ్రమైనదని, వారిలో పరివర్తన వచ్చినట్లు సత్ప్రవర్తన కమిటీ అధికారులు కూడా నివేదిక ఇవ్వలేదని, అందువల్ల వారిని ముందుగా విడుదల చేయడం సాధ్యపడదని తమిళనాడు ప్రభుత్వం పేర్కొంది. ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 18కి వాయిదా పడింది. ఖైదీలను ముందుగా విడుదల చేసే అధికారం తమిళనాడు ప్రభుత్వానికి లేదని హైకోర్టుకు గతంలోనే కేంద్ర హోంశాఖ సమాధానమిచ్చింది.

సున్నపురాయి నిక్షేపాలపై అధ్యయనం

- తవ్వకాల ప్రణాళికను కేంద్రానికి పంపిన టీఎస్ఎండీసీ
- ఒడిశా, ఝార్ఖండ్‌లో వచ్చిన రెండు సున్నపురాయి బ్లాక్‌లు
- నిధులు రాగానే అధ్యయనం చేస్తామన్న ఖనిజాభివృద్ధి సంస్థ

ఈనాడు, హైదరాబాద్: ఝార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో సున్నపురాయి నిక్షేపాలపై అధ్యయన ఆమోదం కోసం తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్ఎండీసీ) ఎదురుచూస్తోంది. వీటికి సంబంధించిన ప్రణాళికలను కేంద్ర ప్రభుత్వానికి పంపింది. వాటికి ఆమోదం లభించి, నిధులందగానే క్షేత్రస్థాయిలో అధ్యయనం మొదలుపెట్టనుంది. ఝార్ఖండ్‌లోని పశ్చిమసింగభూం ప్రాంతంలోని జగన్నాథ్‌పూర్, ఒడిశాలో కోరాపూట్ జిల్లాలో ఒక్కో సున్నపురాయి బ్లాక్‌లు ఉన్నాయి. వీటితో పాటు ఖమ్మం జిల్లాలో కాపర్ బ్లాక్ ఉంది. ఈ మూడుచోట్ల అధ్యయనానికి టీఎస్ఎండీసీకి కేంద్రం అనుమతిచ్చింది. ఎంత ఖర్చవుతుందో వివరాలు పంపాలని కోరింది. తవ్వకాలకు ప్రణాళికల్ని టీఎస్ఎండీసీ రూపొందించి, కేంద్ర మైనింగ్‌శాఖ పరిధిలోని జాతీయ ఖనిజ అన్వేషణ్ ట్రస్ట్ (నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్)కు పంపింది.

కేంద్రం నుంచి నిధులందగానే సున్నపురాయి నిక్షేపాల అధ్యయన తవ్వకాలు మొదలుపెడతామని ఓ ఉన్నతాధికారి తెలిపారు. సున్నపురాయి నిల్వలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి, పరిమాణం, నాణ్యత ఎంతన్న విషయాలు తెలుస్తాయని చెప్పారు. క్షేత్రస్థాయిలో సున్నపురాయి స్థితిగతుల్ని టీఎస్ఎండీసీ నేరుగా అధ్యయనం చేస్తుందా? ఏదైనా ఏజెన్సీకి అప్పగిస్తుందా? అన్నది తేలాల్సి ఉంది. అయితే ప్రైవేటు సంస్థవైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది.

అధ్యయనం తర్వాత కేటాయింపు

ఆయా బ్లాకుల్లో అధ్యయనం తర్వాత సున్నపురాయి నిల్వలను బట్టి సిమెంటు పరిశ్రమల ఏర్పాటు జరిగే అవకాశాలున్నాయి. టీఎస్ఎండీసీని తవ్వకాల ఏజెన్సీగా గుర్తించి మూడు బ్లాకుల అధ్యయన బాధ్యతలు అప్పగించిందని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఝార్ఖండ్ బ్లాక్ అధ్యయనానికి రూ.4.64 కోట్లు, ఒడిశా బ్లాక్ అధ్యయనానికి రూ.5.79 కోట్లు ఖర్చవుతుందని అంచనావేసి కేంద్రానికి పంపినట్లు సమాచారం. అధ్యయనం తర్వాత సున్నపురాయి బ్లాక్‌ల కేటాయింపు జరుగుతుందన్నారు. లీజు పద్ధతిలో ప్రైవేటు సంస్థలకు కేటాయిస్తారా? ప్రభుత్వ ఖనిజాభివృద్ధి సంస్థలకిస్తారా.. తేలడానికి సమయం పట్టే అవకాశాలున్నాయి. ప్రభుత్వ ఖనిజాభివృద్ధి సంస్థలకే కేటాయించే అవకాశాలున్నాయన్న నమ్మకంతో టీఎస్ఎండీసీ ఉంది.



రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం మూడో విడత కార్యక్రమాన్ని జులై 12వ తేదీన కరీంనగర్ జిల్లాలోని దిగువ మానేరు జలాశయం వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించి ఒక మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల విద్యార్థులూ పెద్ద సంఖ్యలో పాల్గొని స్థానికంగా సుమారు లక్ష వరకు వివిధ రకాల మొక్కలు నాటారు. ఇటీవల వరకు ఆ ప్రాంతమంతా హరితంతో కళకళలాడింది. మొక్కలు నాటిన ప్రదేశంలో రక్షణ చర్యలను మాత్రం అధికారులు మరిచిపోయారు. ప్రస్తుతం వాటిని మేకలు, పశువులు దర్జాగా మేస్తుండటంతో పచ్చదనం కనుమరుగై.. చాలావరకు మొక్కలు మోడులుగా దర్శనమిస్తున్నాయి.

–ఈనాడు, కరీంనగర్

ప్రయాణికుల అదనపు లగేజిపై డీజీసీఏ ఉత్తర్వు కొట్టివేత

దిల్లీ: ప్రైవేటురంగ విమానయాన సంస్థలు ప్రయాణికుల అదనపు సామాన్లపై కిలోకు రూ.100 చొప్పున రుసుం వసూలు చేసుకునేందుకు వీలుగా 'పౌర విమానయాన డైరెక్టర్ జనరల్' (డీజీసీఏ) 2016 జూన్‌లో జారీ చేసిన ఉత్తర్వులను దిల్లీ హైకోర్టు బుధవారం కొట్టి వేసింది. విమానాల్లో సాధారణంగా 15-20 కిలోల సామాన్లను ఉచితంగా అనుమతిస్తుంటారు. అంతకు మించితే గతంలో రూ.220 నుంచి రూ.350 వసూలు చేసేవారు. దానిని మారుస్తూ డీజీసీఏ ఉత్తర్వులు జారీ చేసింది. 20 కిలోల వరకు కిలోకు రూ.100 చొప్పున, అంతకు పైబడిన బరువుపై ఎంత కావాలంటే అంత వసూలు చేసుకునేందుకు అనుమతించింది. రుసుముల్ని విమానయాన సంస్థలే నిర్ణయించాలనీ, వాటిపై డీజీసీఏకి అధికారం లేదని భారత విమానయాన సంస్థల సమాఖ్య వాదించింది.



'మేడిగడ్డ' పనులను పరిశీలించిన స్మితా సబర్వాల్

మహదేవ్‌పూర్, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ ఆనకట్ట నిర్మాణ పనులను ముఖ్యమంత్రి కార్యాలయ(సీఎంవో) అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్ బుధవారం పరిశీలించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి పంచాయతీ పరిధిలోని మేడిగడ్డ ఆనకట్ట ప్రాంతాన్ని ఆమె సందర్శించారు. నిర్మాణ సంస్థ క్యాంపు కార్యాలయానికి చేరుకొని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు పురోగతి, మేడిగడ్డ ఆనకట్ట నిర్మాణంపై చర్చించారు. ఆ ప్రాంతంలో నిర్మిస్తున్న సీఆర్పీఎఫ్ క్యాంపు పనులను పరిశీలించారు. ఆమె వెంట కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ నల్లా వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. మేడిగడ్డ ప్రాంతానికి సీఎం కార్యాలయ అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్ రాక నేపథ్యంలో.. ఆమె వెనుదిరిగే సమయంలో అడ్డుకోవడానికి సూరారం ప్రాంత రైతులు సిద్ధమయ్యారు. ఈ సమాచారం పోలీసులకు అందడంతో సూరారానికి చేరుకొని.. ఏదైనా సమస్య ఉంటే మేడిగడ్డకు వెళ్లి చెప్పుకోవాలి కానీ అడ్డుకోవడం సరికాదని రైతులకు చెప్పారు. దీంతో కొంత మంది రైతులు మేడిగడ్డకు చేరుకొని భూములు కోల్పోతున్న తమకు మెరుగైన నష్టపరిహారం, ఉపాధి అందించాలని ఆమెను కోరారు.

పనిబారెడు.. వేతనం చారెడు

- గిరిజన మినీ గురుకులాల సిబ్బంది ఆవేదన

తెలంగాణలో మినీగురుకులాలు	29
వాటిలో పని చేస్తున్న సీఆర్టీలు	174
బోధనేతర సిబ్బంది	203

బేల, న్యూస్‌టుడే: గిరిజన మినీగురుకులాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఒప్పంద గురుకుల ఉపాధ్యాయులు (సీఆర్టీలు) అరకొర వేతనాలతో మగ్గుతున్నారు. పదిహేనేళ్లుగా పనిచేస్తున్నా పట్టుమని రూ.పదివేల జీతం కూడా లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిక్షణ పూర్తి చేసిన సీఆర్టీలకు నెలకు రూ.4 వేలు మాత్రమే ఇస్తున్నారు. వంట చేసే వారు, విద్యార్థుల రక్షణ కోసం రేయింబవళ్లు పనిచేసే వారికి (బోధనేతర సిబ్బందికి) కేవలం రూ.2,500 వేతనం మాత్రమే ఇస్తున్నారు. కనీసం ఉపాధి కూలీలకు వచ్చేంత డబ్బులు కూడా వారికి రాకపోవడం గమనార్హం. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన బాలికావిద్యను ప్రోత్సహించేందుకు కేంద్రం 2000 సంవత్సరంలో మినీ గురుకులాలను ప్రారంభించింది. బాలికా అక్షరాస్యత తక్కువగా ఉన్న ఏజెన్సీ గ్రామాలను కలిపి మండలానికి ఒకటి చొప్పున వీటిని ఏర్పాటు చేశారు. స్వాతంత్రం వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో 41 చోట్ల ఏర్పాటు చేశారు. వీటిలో అయిదో తరగతి వరకూ బోధిస్తారు. తెలంగాణ రాష్ట్రంలో మినీ గురుకులాల్లో 2012 నుంచి ఆంగ్లమాధ్యమాన్ని అమలు చేస్తున్నారు. ఏటా ఒకటో తరగతిలో 30 మందికి ప్రవేశం కల్పిస్తారు. చక్కని వసతి, బోధన ఉండటంతో గిరిజన బాలికలను ఇందులో చేర్పించేందుకు పోటీ బాగానే ఉంటోంది. ప్రతి మినీగురుకులంలో చదువు చెప్పేందుకు అయిదుగురు సీఆర్టీలు, ఖాతా నిర్వహణకు ఒకరు, ఆటలు ఆడించేందుకు వ్యాయామోపాధ్యాయురాలు, పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు 24 గంటలూ అందుబాటులో ఉండే ఆరోగ్య కార్యకర్త, వంట, ఇతర ఏర్పాట్ల కోసం అయిదుగురు మహిళలు పనిచేస్తారు.

ప్రతిపాదనలు వెళ్లాయి

– టి.రమేష్, మినీ గురుకులాల ప్రాంతీయ సమన్వయకర్త, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా

మినీగురుకులాల్లో పని చేసే సీఆర్టీలు, బోధనేతర సిబ్బంది వేతనాలు పెంచాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలో వేతనాలు పెరిగే అవకాశం ఉంది.

సుస్మితాసేన్‌కు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు

చెన్నై: నటి సుస్మితాసేన్‌కు మద్రాసు హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విదేశాల నుంచి తెప్పించుకున్న విలాసవంతమైన కారును ఆమె 2008లో చెన్నై పోర్టు నుంచి నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్నారన్న కేసులో సెప్టెంబరు 18లోగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. ఈ కేసుపై ఎగ్మూర్ ఆర్థిక నేరాల కోర్టులో పలుమార్లు జరిగిన విచారణలకు సుస్మితాసేన్ హాజరు కాకపోవడంతో జూన్‌లో సదరు కోర్టు వారెంట్ జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ ఆమె మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు.

ప్రయాణికులపై మత్తు మందు చల్లి దోపిడీ

దిల్లీ: ముంబయి నుంచి దిల్లీ వెళ్తున్న ఆగస్ట్ క్రాంతి రాజధాని ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులు మంగళవారం అర్ధరాత్రి (తెల్లవారితే బుధవారం) దోపిడీకి గురయ్యారు. మధ్యప్రదేశ్‌లోని రత్లాం స్టేషన్ వద్ద వారిపై మత్తుమందు చల్లి దోపిడీకి పాల్పడినట్టు అనుమానాలు ఉన్నాయి. దుండగులు 25 మంది నుంచి సుమారు రూ.10-15 లక్షల సొత్తును అపహరించారు. ఏసీ-2 టెయిర్, ఏసీ-3 టెయిర్ (మొత్తం ఏడు) బోగీల్లో ఈ దొంగతనం జరిగినట్టు రైల్వే వర్గాలు తెలిపాయి. ఏ1, ఏ3, బీ5, బీ6, బీ7, బీ9, బీ10 బోగీల్లో చోరీ జరిగినట్టు వివరించాయి రాజస్థాన్‌లోని కోటకు చేరుకోగానే ప్రయాణికులు మేల్కొని చూడగా వారి ఖాళీ పర్సులు, బ్యాగులు మరుగుదొడ్ల వద్ద కనిపించాయి. నగదుతో పాటు, కొందరి ఐ-ఫోన్లు, ఆధార్ కార్డులు, ఇతర విలువైన పత్రాలు పోయాయి. రైల్వే ఉద్యోగులే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని కొందరు ప్రయాణికులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఆరోపణపై దర్యాప్తు చేస్తామని, ఒక వేళ ఇదే నిజమయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వే మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి.

మహిళా సిబ్బందితో స్టాక్‌హోంకు ఎయిరిండియా

దిల్లీ: విమానయాన సంస్థ ఎయిరిండియా తొలిసారిగా దిల్లీ నుంచి స్వీడన్ రాజధాని స్టాక్‌హోంకు నేరుగా విమానాల్ని ప్రారంభించింది. బోయింగ్ 787ను పూర్తిగా మహిళా సిబ్బందితోనే నడిపించనుంది. ఈ విమానాలు వారానికి మూడురోజులు ప్రయాణిస్తాయి. తొలి విమాన ప్రయాణికుల్లో ఒలింపియన్ గగన్ నారంగ్, క్రికెటర్ హర్భజన్‌సింగ్ ఉన్నారు. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రారంభ కార్యక్రమం జరిగింది.

ఈనాడు

పెనుసంక్షోభంలో ఆరోగ్యరంగం!

ఆకలేస్తే గుక్కపట్టడమే గాని పాపం పుణ్యం ఏ మాత్రం తెలియని పసిగుడ్డులు వాళ్లు. మెదడువాపు వ్యాధి మృత్యుపాశానికి గురై జీవన్మరణ పోరాటం చేస్తున్న లేలేత పాపల్లారు ఉత్తర్ ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ బాబా రాఘవ్‌దాస్ (బీఆర్‌డీ) ప్రభుత్వ వైద్యశాఖల ఆసుపత్రిలో స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు అయిదు రోజుల వ్యవధిలో 60మంది పిల్లలు మృత్యువాత పడిన వైపరీత్యం గుండెల్ని కలచివేసింది. అర్థాంతరంగా ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయినందునే పదుల సంఖ్యలో పిల్లలు పిట్టల్లా రాలిపోయారన్న వార్తాకథనాలతో యావద్దేశం దుఃఖవిచలితమైంది. తరవాత కూడా బీఆర్‌డీ ఆసుపత్రిలో ఆగక మోగుతున్న మరణమృదంగాన్ని తీవ్రంగా పరిగణించిన జాతీయ మానవ హక్కుల సంఘం యూపీ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. ఆ ఘోరకలిపై మీడియా కూపీ లాగిన వాస్తవాలు, ద్విసభ్య దర్యాప్తు సంఘం నివేదికాంశాలు దిగ్భ్రాంతకరంగా ఉన్నాయి. గోరఖ్‌పూర్ బీఆర్‌డీ ఆసుపత్రి చుట్టుపక్కల పరగణాల్లో వర్షాకాలంలో మెదడువాపు వ్యాధి విజృంభణ 1978 నుంచి ఉన్నదే. ఆ ప్రాణాంతక వ్యాధి పాలబడి ఇన్నేళ్లలో వేలమంది మృత్యువాత పడినా పాలన యంత్రాంగానికి చీమైనా కుట్టినట్లు ఉండకపోవడం నివ్వెరపరిచేదే! ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు తొలివారం దాకా 476 మంది రోగులు మెదడువాపు చికిత్స కోసం బీఆర్‌డీ ఆసుపత్రిలో చేరితే- 117మంది మరణించారు. 300 చదరపు కిలోమీటర్ల పరిధిలోని జనావళి ఆరోగ్య సేవలకు పెద్ద దిక్కుగా ఉన్న ఆ ఆసుపత్రి నిర్వహణకు ఆరు కోట్ల రూపాయలు ప్రభుత్వం కేటాయించినా, ఆక్సిజన్ సరఫరాదారులకు బకాయిలైనా చెల్లించకుండా నిధుల్ని మురగబెట్టిన అధికార యంత్రాంగం అలసత్వాన్ని చీత్కరించడానికి నిఘంటువులో మాటలు లేవు; ఉన్నా చాలవు. కొరతల కోమాలో ఉన్న ఆసుపత్రిలో బిడ్డల ఆరోగ్య భారాన్ని దేవుడిపై వేసి దూది కోసం, రక్తం కోసం, మందుల కోసం పరుగులు పెట్టిన అభాగ్యులు- ఇప్పుడు పోస్ట్‌మార్టం కోసమూ ఆరాటపడుతున్న దృశ్యాలకు కళ్లు చెమర్చక మానవు. ఇది గోరఖ్‌పూర్‌కు మాత్రమే పరిమితమైన కథ కాదు, తరతమ భేదాలతో యావద్దేశ వైద్యరంగం వ్యథ!

'ఎవరికి పుట్టిన బిడ్డరా ఎక్కెక్కి ఏడుస్తోంది' అన్నట్లుగా తయారైంది సర్కారీ వైద్యసేవల రంగం దుస్థితి! నలభై మంది రోగులకు ఒక్క వైద్యుడైనా లేని బీఆర్‌డీ ఆసుపత్రిలో, సిబ్బందికి నెలల తరబడి జీతాలు అందవని, పాలనాధికారుల స్థాయిలో ప్రైవేటు ప్రాక్టీసు రూపేణా అవినీతి పుష్కలమని ఈసరికే వెల్లడైంది. ప్రాణాంతక మెదడువాపు వ్యాధి వానకాలంలో తీవ్రంగా ప్రబలడానికి అత్యంత అనుకూలమైన భౌగోళిక స్థితిగతులు ఉత్తర్ ప్రదేశ్ తూర్పుప్రాంతంలో సమృద్ధిగా ఉన్నాయని, టీకాల ద్వారా దాన్ని నివారించే చొరవ కొరవడటంతో దేశవ్యాప్తంగా సంభవిస్తున్నవాటిలో 90 శాతం మరణాలు అక్కడే నమోదవుతున్నాయని గోరఖ్‌పూర్ ఎంపీగా యోగి ఆదిత్యనాథ్ పలుమార్లు లోక్‌సభలో ప్రస్తావించారు. బీఆర్‌డీ ఆసుపత్రిలోని మౌలిక సదుపాయాల పరిమితుల్ని ఏకరువుపెట్టి, ఎయిమ్స్ లాంటి సంస్థనొకదాన్ని నెలకొల్పాల్సిన ఆవశ్యకతపైనా ఎలుగెత్తారు. సంక్షోభ పూర్వాపరాలపట్ల అంతగా సదవగాహనగల ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిత్వంలో కూడా బీఆర్‌డీ ఆసుపత్రికి ప్రాణవాయువులు అందకపోవడం- పసిమొగ్గలు నేలరాలిపోవడానికి కారణమైంది. గత సంవత్సరంతో పోల్చి మరణాల సంఖ్య ఎక్కువ తక్కువల్ని సరిపోల్చుకోవడం కాదు- తమ ఆత్మీయుల ఆయుర్దాయానికి భరోసా దక్కుతుందన్న నమ్మకం ప్రజల్లో కలిగేలా దేశవ్యాప్తంగా ఆరోగ్యసేవల పరిపుష్టీకరణ జరిగి తీరాలి. పోతే తిరిగి తీసుకురాలేనిది ప్రాణం అన్న స్పృహతో వ్యాధి నివారణ, చికిత్సలపై కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టి సారించాలి!

సరైన వైద్యసేవలు అందుబాటులో ఉంటే ప్రాణాంతకంగా పరిణమించని 32 రకాల వ్యాధులు, గాయాల పాలబడి ఏయే దేశాల్లో ఎంతెంతమంది మరణించారన్న పాతికేళ్ల గణాంకాల్ని అంతర్జాతీయ పరిశోధకుల బృందం అధ్యయనం చేసింది. మొన్న మే నెలలో వెలుగుచూసిన ఆ నివేదిక మొత్తం 195 దేశాల్లో వైద్యసేవల అందుబాటు నాణ్యతలపై ఆవిష్కరించిన సూచీలో ఇండియాకు 154వ స్థానం దక్కింది. సంపద ఎంత వృద్ధి చెందినా అనేక దేశాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలు దిగనాసిగా ఉన్నాయన్న అధ్యయనం- అక్కడి నుంచే దిద్దుబాటు మొదలుకావాలని స్పష్టీకరించింది. నిరుడు ఇండియా మానవాభివృద్ధి సూచీలో ఒక స్థానం దిగజారి 131కి చేరడానికి కొరగాని వైద్యసేవలే పుణ్యం కట్టుకొన్నాయి. నివారించదగ్గ వ్యాధుల పాలబడి అయిదేళ్లలోపు పసివాళ్లు 2015లో ప్రపంచవ్యాప్తంగా 59 లక్షల మంది కనుమూయగా, అందులో సగంమంది అభాగ్యులు ఇండియా, నైజీరియా, కాంగో, ఇథియోపియా, పాకిస్థాన్లకు చెందినవారే! అవసరాలకు తగ్గట్లు వైద్యరంగానికి సర్కారీ కేటాయింపులు లేకపోవడంతో, ప్రసవకాల సమస్యలు, న్యుమోనియా, డయేరియా, ఇన్‌ఫెక్షన్ల వంటివి పసివాళ్ల ఉసురు తీసేస్తున్నాయి. దేశవ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రులన్నింటినీ పరిగణనలోకి తీసుకొని, ఒక్కో దానిమీద 61 వేలమంది ఆధారపడి ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యమంత్రి ఇటీవల ప్రకటించారు. కోట్లుపోసి వైద్యసీట్లు కొనుగోలు చేసినవాళ్లు సర్కారీ సేవలకు మొహం చాటేస్తుంటే- ఆసుపత్రులకు అదనంగా ఏడున్నర లక్షల మంది వైద్యులు కావాలన్న అంచనాలను సాధించేదెలా? డాక్టర్లతోపాటు రోగ నిర్ధారణ సేవలు, మందులు, పారామెడికల్ సిబ్బంది కోసమూ ప్రభుత్వాలు గణనీయంగా వ్యయీకరించాల్సిన అవసరం కాదనలేనిది. ఆరోగ్యమే మహాభాగ్యమన్నది ఉత్తుత్తి నానుడి కాదు. పెను సంక్షోభంలో చిక్కుకొన్న వైద్య ఆరోగ్య రంగాన్ని సముద్ధరించే దిశగా విస్తృత కేటాయింపులతో పటిష్ఠ కార్యాచరణ పట్టాలకెక్కనిదే భావి భారత భాగ్యోదయం సాధ్యపడదు!

వరద కష్టం... అంతులేని నష్టం!



డాక్టర్ జి.వి.ఎల్.విజయ్‌కుమార్

దేశవ్యాప్తంగా ఏటా వరదలు, విపత్తులు, ఉప్పెనలు ఏదో ఒక ప్రాంతాన్ని తీవ్రంగా దెబ్బతీస్తూనే ఉన్నాయి. విపత్తు నోరు తెరిచిన ప్రతిసారీ ఆస్తి, ప్రాణ నష్టాలు భారీయెత్తున సంభవిస్తున్నాయి. పోటెత్తుతున్న వరదలవల్ల స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)పై ప్రతికూల ప్రభావం పడుతున్నట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బిహార్, బెంగాల్, ఈశాన్య రాష్ట్రాలు వరద గుప్పిట చిక్కి కొంతకాలంగా విలవిల్లాడుతున్నాయి. సామాజిక, ఆర్థిక జీవనం పూర్తిగా స్తంభించడంతో ఈ ప్రాంతాలు తీవ్ర నష్టం బారినపడ్డాయి. గతంలో ఉత్తరాఖండ్, చెన్నై నగరాలను వరదలు వణికించాయి. విశాఖను హుద్‌హుద్ తుపాను ముంచెత్తింది. ఈ విపత్తులవల్ల వాటిల్లిన నష్టం అంతా ఇంతా కాదు. వైవిధ్యభరిత వాతావరణ పరిస్థితులకు భారత్ నెలవు. మంచుకొండలు కరిగి, నదులు పొంగి ఉత్తరభారతం ఒకవైపు అతలాకుతలమవుతోంది. దక్షిణాదిన రుతుపవన వ్యవస్థ గతితప్పి వానకాలంలోనూ ఎండలు మండుతున్నాయి. అసోం మొదలు రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల వరకు వరదలు పోటెత్తి జనజీవనం అతలాకుతలమవుతోంది. గుజరాత్, అసోంలలో కలిపి వందకుపైగా జనం మృత్యువాత పడ్డారు. పశ్చిమ్ బంగలో పోటెత్తిన వరదలవల్ల పదుల సంఖ్యలో ప్రాణాలు పోయాయి. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. సుమారు వెయ్యిమందిని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ దళాలు రక్షించాయి. ఇటీవల హైదరాబాద్ నగరంలోనూ కుండపోత వర్షాల ఉద్ధృతికి రహదారులు, వీధులన్నీ జలమయమై జనజీవితాన్ని దారుణంగా ప్రభావితం చేశాయి. ఏటికేడు వరదలు తీవ్రమై నగరాలను సైతం ముంచేస్తున్న పరిస్థితుల్లో- ప్రభుత్వం వెలువరించిన జీడీపీ గణాంకాలు అందుకు భిన్నంగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. భారత్‌లో వరదల మూలంగా తలెత్తే నష్టం తీరును విశ్లేషిస్తే- ఏడో దశకంలో నష్టం భారీగా పెరిగి, ఎనిమిదో దశకంనుంచి తగ్గడం మొదలై 2011నాటికి కనీసస్థాయికి చేరినట్లు చెబుతున్నారు. అయితే 1953నుంచి 2013వరకు ప్రకటించిన లెక్కలు వాస్తవికమైనవని, 2013 తర్వాత గణాంకాలు తాత్కాలిక అంచనాలు అని ప్రకటించడం గమనార్హం. ప్రాణనష్టానికి సంబంధించి దేశ విపత్తుల చరిత్రలో ఏడో దశకాన్ని అత్యంత దురదృష్టకరమైనదిగా అభివర్ణించడం వరకూ ప్రభుత్వ గణాంకాలపట్ల ఎలాంటి అభ్యంతరాలూ లేవు. ఏడో దశకంలో ఏడాదికి ప్రాణనష్టం సగటున 1.91లక్షలుగా నమోదైందంటే విపత్తులు సృష్టించిన విధ్వంసం తీవ్రత బోధపడుతుంది. కాగా 2011-16 మధ్యకాలంలో వరద విపత్తులవల్ల దేశంలో ప్రాణనష్టం వార్షిక సగటు 48వేలకు పడిపోయినట్లు సర్కారు లెక్కలు చెబుతోంది. ఇది విశ్వసనీయంగా లేదు. దేశాన్ని పెద్దయెత్తున అతలాకుతలం చేసిన వరద విపత్తులు గడచిన ఆరేళ్లకాలంలోనే ఎక్కువగా సంభవించాయి. ఏడోదశకం వరకూ వరదలవల్ల పంటలు బాగా దెబ్బ తిన్నాయనడంలో సందేహం లేదు. కాబట్టి అప్పటివరకూ మొత్తం నష్టంలో పంటల వాటాయే ఎక్కువ. ఆ తరవాత గృహాలు, ఇతర ప్రజా వసతులు పెద్దయెత్తున నష్టపోయాయి.

ముంచుకొస్తున్న ప్రమాదం

దేశంలో నేడు వరదలు, ఉప్పెనలు, సునామీ వంటి ప్రకృతి విపత్తుల రాకపోకలను పసిగట్టి, జరిగే నష్టాన్ని తగ్గించేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తున్నారు. అయితే ఆశించినస్థాయిలో నష్ట తీవ్రతను తగ్గించలేకపోవడం అతి పెద్ద సమస్య. వరదల మూలంగా సంభవిస్తున్న ఆర్థిక నష్టం దేశాన్ని భయపెడుతోంది. ఈ సమస్య పరిష్కారానికి గట్టి చర్యలతో సిద్ధం కాని పక్షంలో ఏడో దశకం నాటి పరిస్థితులు పునరావృతమయ్యే ప్రమాదం కొట్టిపారేయలేనిది. అత్యంత అధునాతన రాడార్ సాంకేతిక పరిజ్ఞానం, ఉపగ్రహాధారిత సమాచారం సాయంతో వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు విశ్లేషించి పర్యవేక్షించడం, ఆ సమాచారాన్ని నిర్ణీత సమయంలో ప్రజలకు చేరవేయడం, వారిని సంసిద్ధం చేయడంవల్ల ప్రాణ, ఆస్తి నష్టాలను కొంతమేరకు తగ్గించవచ్చు. అత్యాధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, సమాచార వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాక కూడా గుజరాత్, రాజస్థాన్, ముంబయి, హైదరాబాద్ వంటి ప్రాంతాలు వరదల బారినపడి పెద్దయెత్తున నష్టపోతున్నాయి. ఇందుకు ఆయా ప్రాంతాల్లో వరద నీరు బయటికి వెళ్ళే వ్యవస్థలు సరిగా లేకపోవడమే కారణమని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ నిపుణులు పేర్కొంటుండటం గమనార్హం. స్థూల దేశీయోత్పత్తిలో నష్టం వాటా ప్రాతిపదికన 2011 తరవాత అత్యధికంగా అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, అసోం, మేఘాలయ; హిమాచల్ ప్రదేశ్‌లు నష్టపోయాయి. 2011-14 మధ్య జీడీపీలో అత్యధికంగా వార్షిక సగటున అరుణాచల్ ప్రదేశ్ 10శాతం వాటాను నష్టపోయింది. ఈ రాష్ట్రం 2000నాటినుంచే పెద్దయెత్తున వరద నష్టం బారినపడుతోంది. జీడీపీలో వార్షిక సగటు నష్టం వాటా సిక్కింలో 1.7 శాతం, మేఘాలయలో 1.5శాతం కాగా-హిమాచల్ ప్రదేశ్‌లో అది 2011-13 మధ్య 1.8 శాతంగా ఉంది. కొండలు, పర్వత పంక్తుల్లో ఆకస్మికంగా సంభవించే వరదలను ముందస్తుగా అంచనా వేయలేకపోవడం (ఉదాహరణకు ఉత్తరాఖండ్, కశ్మీర్ వరదలు), అక్కడ కొండ చరియలు విరిగిపడే అవకాశం ఎక్కువ కావడంవల్ల నష్టతీవ్రత అధికం! జీడీపీతో పోల్చినప్పుడు వరదలవల్ల తలెత్తే నష్టం వాటా క్రమంగా తగ్గుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నప్పటికీ- క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేరుగా ఉంటున్నాయి. వరద ఉద్ధృతి ఉత్తరాఖండ్‌ను దారుణంగా దెబ్బతీసింది. మహారాష్ట్ర, బెంగళూరు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో వరదలు పోటెత్తాయి. ప్రజాజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. దేశంలో నానాటికీ పట్టణాలు విస్తరిస్తున్నాయి. వాతావరణంలో విపరీత మార్పులూ చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో వరదలు సంభవిస్తే కలిగే నష్టం దారుణంగా ఉంటుందంటూ 2015నాటి 'వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్' అధ్యయనం వెల్లడించింది.



ముప్పును ఎదుర్కొనే ముందస్తు వ్యూహాలేవీ?

విపత్తులు - విపరిణామాలు

కాలం	ప్రాణనష్టం (వార్షిక సగటు)	ఆస్తి నష్టం (జీడీపీలో వాటా శాతంలో)
1953-1960	33,771.9	0.45
1961-1970	50,509.2	0.46
1971-1980	1,91,928.7	0.86
1981-1990	1,21,582.9	0.86
1991-2000	86,830.6	0.33
2001-2010	88,432.9	0.31
2011-2016	48,707.8	0.11

(ఆధారం: కేంద్ర జలసంఘం గణాంకాలు)

భారత్‌లో సగటున ఏడాదికి మూడుకోట్ల ప్రజలు వరదల బారిన పడుతున్నారు. గంగ, బ్రహ్మపుత్ర, సింధు మైదాన ప్రాంతంలో ఏటా వరదల బీభత్సం సర్వసాధారణమైంది. దేశంలో ఏటా వందల సంఖ్యలో వీటివల్ల మృత్యువాత పడుతుండగా- లక్షలాదిమంది ఆశ్రయం కోల్పోతున్నారు. ఏటా వేల హెక్టార్లలో పంట దెబ్బతిని రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. ప్రతి సంవత్సరం కురిసే వర్షపాతంలో సుమారు 75శాతం కేవలం జూన్-సెప్టెంబరు మధ్య కురుస్తోంది. దీనివల్లే వరదలు పోటెత్తుతున్నాయి. దేశంలోని మొత్తం భూభాగంలో 12శాతం అంటే నాలుగు కోట్ల హెక్టార్ల విస్తీర్ణంలోని భూభాగం వరద ముంపు బారినపడే ప్రమాదం ఉంది. అసోం, బిహార్, ఒడిశా, యూపీ, పశ్చిమ బంగ రాష్ట్రాల్లో గడచిన అయిదేళ్లుగావరదలు నిత్యకృత్యమయ్యాయి. వాతావరణ వైపరీత్యాల మూలంగా వరద ముంపు సంభావ్యతలేని ప్రాంతాల్లో సైతం, ఎడారుల్లోనూ వరదలు పోటెత్తుతున్నాయి. రాజస్థాన్‌ను 2006లోనూ, తాజాగానూ వరదలు ముంచెత్తడం గమనించవచ్చు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకునే జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ వ్యూహాత్మకంగా ముందడుగు వేస్తోంది.

కుంగుతున్న వృద్ధి

విపత్తుల నిర్వహణలో స్పందన, సహాయం, పునరావాస కల్పన కీలకమైన దశలు. వరదలను ఎదుర్కోవడానికి సంసిద్ధంగా ఉండటం, నష్టనివారణ చర్యలు ముమ్మరంగా చేపట్టడం తరహా చర్యలతో విపత్తు నిర్వహణ సంస్థ చురుగ్గానే కదులుతోంది. సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అనుసరించి సాగుతోంది. అయినప్పటికీ గడచిన నాలుగైదేళ్లుగా వరదలు దేశంపై విరుచుకుపడి అపార నష్టం కలిగిస్తూనే ఉన్నాయి. పశ్చిమ్ బంగలో ఇటీవల వరదలు పోటెత్తినప్పుడు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థకు చెందిన ప్రతిస్పందక దళాలుచురుగ్గా స్పందించాయి. తక్షణ చర్యల్లో నిమగ్నమై 1267 మంది ప్రాణాలు కాపాడాయి. మొత్తంగా 300 సహాయ పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయగా- 47,000మంది ఆశ్రయం పొందినట్లు ఎన్‌డీఆర్ఎఫ్ ప్రకటించింది. దేశవ్యాప్తంగా వరదలు, ఉప్పెనల సంభావ్యత గల ప్రాంతాల్లో విపత్తు ప్రతిస్పందన దళాలు ముందస్తుగానే మోహరించాలి. తగిన సామగ్రి, సదుపాయాలు కల్పించి అక్కడి ప్రజలను సంసిద్ధపరచాలి. భారత్‌వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో విపత్తులు-వరదలు ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచుతాయి. బడ్జెట్ తీరుతెన్నులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. అభివృద్ధి కార్యకలాపాలపై దాని ప్రభావం పడుతుంది. ఒక భారీ విపత్తు కనబరచే ఆర్థిక, విత్తపరమైన ప్రభావాలనుఅంచనా కట్టడం కష్టం. నష్ట అంచనా సాధ్యమైనంత సత్వరం జరగాలి. అప్పుడే అది దేశ ప్రగతిపై ఎంతమేరకు ప్రభావం చూపింది,అనుసరించాల్సిన వ్యూహం ఏమిటి వంటి వివరాలను పక్కాగా రూపొందించవచ్చు. ప్రభుత్వాలు ఎనిమిదినుంచి పదేళ్ల కాలావధికి వర్తించే విధంగా విత్త ప్రణాళికలు రూపొందించుకుంటే- విపత్తు నిర్వహణ వ్యూహాలను సమర్థంగా అమలు చేయడం సాధ్యమవుతుంది. ప్రకృతి విపత్తుల నష్ట నివారణ దీర్ఘకాలిక పెట్టుబడులతో ముడివడి ఉంది. అభివృద్ధి వ్యూహాలకు తగిన మేరకు కేటాయింపులకు ప్రాధాన్యం కల్పించాలి. అత్యాధునిక వరద హెచ్చరికల వ్యవస్థను వినియోగించాలి. వరద పీడిత ప్రాంతాల్లో గృహ నిర్మాణాలను ఉపరితలంనుంచి మీటరు ఎత్తులో ఉండేలా చేపట్టాలి. బడ్జెట్ కేటాయింపుల్లో వరద రక్షణ చర్యలకు నిధులు పెంచాలి. వరదలను తట్టుకునే విధంగా తరి, చిత్తడి భూముల విస్తీర్ణం పెంచాలి. వరద పీడిత ప్రాంతాల్లో మొక్కలను విస్తృతంగా నాటాలి. నదులను, నదీ ప్రవాహ గమనాలను వాటి మౌలిక స్వరూపాన్ని కాపాడుకోవాలి. నీటి నిల్వ జలాశయాలను విస్తృతంగా నిర్మించాలి. నేల లక్షణాలను బట్టి నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెంచుకోవాలి. ఈ రకంగా ప్రాణ, ఆస్తి నష్టాల తీవ్రతను తగ్గించవచ్చు. విపత్తుల తీవ్రత, వాటివల్లే కలిగే నష్టం ఆర్థిక వ్యవస్థను ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోగల సమర్థతను సంతరించుకున్ననాడు దేశ ఆర్థిక వ్యవస్థ తిరుగులేని వృద్ధిపథంలో నడుస్తుంది.

పరీక్షలంటే భయమేల?



ప్రొఫెసర్ బి.రామకృష్ణారావు

ఒకటో తరగతి నుంచి చదువుకు శ్రీకారం చుట్టే విద్యార్థులు మున్ముందు ఏడు వరకు, ఆపై పదో తరగతి వరకు నిరాటంకంగా సాగిపోయే 'నో డిటెన్షన్' విధానం అనేక సంవత్సరాలుగా అమలులో ఉంది. దీనికి స్వస్తిపలికి కొత్త జాతీయ విద్యావిధానంలో నిలుపుదల (డిటెన్షన్) పద్ధతిని తీసుకురావాలని కేంద్రప్రభుత్వం ప్రతిపాదించింది. కొందరు విద్యావేత్తలు ఈ చర్యను విమర్శిస్తున్నప్పటికీ, దేశవ్యాప్తంగా విద్యారంగానికి చెందిన ఉపాధ్యాయ, అధ్యాపక వర్గాలు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. అయిదు వరకు నో డిటెన్షన్ పద్ధతిలో, ఆపై ఏటా నిలుపుదల విధానం అనుసరించాలని తొలుత కేంద్రం ప్రతిపాదించింది. తరవాత అయిదు, ఎనిమిది, పది తరగతుల వరకే దీన్ని పరిమితం చేసింది. అంటే, ఆ మూడు తరగతుల వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులైతేనే పైతరగతిలోకి విద్యార్థి ప్రవేశిస్తాడన్న మాట. పరీక్షలో తప్పినవారు విద్యాసంవత్సరం కోల్పోకుండా వెన్వెంటనే మరోసారి పరీక్ష నిర్వహిస్తారు. రాష్ట్రాల నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే కేంద్రం ఈ మార్పులకు అంగీకరించింది. ఆ మేరకు 'నిర్బంధ విద్యాహక్కు చట్టం-2009'లో సవరణలు తీసుకురావాలని నిర్ణయించింది. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెడతారు. ఈ విధానాన్ని అమలు చేసే విషయంలో రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛను కేంద్రం ఇస్తోంది.

సత్ఫలితాలివ్వని విధానం

విద్యాహక్కు చట్టం అమలులో ఉన్న ఈ ఏడేళ్లలో 'నో డిటెన్షన్' విధానం సత్ఫలితాలను రాబట్టలేకపోయింది. ఆయా తరగతుల్లో కనీస పరిజ్ఞానం పొందకుండానే విద్యార్థులు పైతరగతులకు చేరుకుంటున్నారు. దీనివల్ల దేశవ్యాప్తంగా ప్రాథమిక విద్య నాణ్యత ప్రమాణాలు బీటలు వారాయన్నది నిష్ఠుర సత్యం. పదో తరగతి పరీక్షల్లో దేశవ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం తక్కువగా నమోదవుతోంది. దిల్లీ ప్రభుత్వం 2016లో నిర్వహించిన అధ్యయనంలో ఆరో తరగతి పుస్తకాలను 74 శాతం పిల్లలు చదవలేకపోయారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణతకు కావాల్సిన కనీస మార్కులు తెచ్చుకోలేకపోయారు. ఏడేళ్ల ముందు నిలుపుదల పద్ధతి ఉన్నప్పుడు 65 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇప్పుడది 50 శాతానికి పతనమైనట్లు విద్యార్థులు సాధించిన మార్కులనుబట్టి గుర్తించారు. నిరుడు తొమ్మిదో తరగతిలో మార్కుల ప్రకారంగా 52 శాతం విద్యార్థులే ఉత్తీర్ణులయ్యారు. అయినా నో డిటెన్షన్ వల్ల అందరూ పదో తరగతిలోకి ప్రవేశించినట్లు సహ చట్టం ద్వారా ఓ న్యాయవాది సేకరించిన సమాచారం స్పష్టీకరించింది. విద్యార్థుల ఉత్తీర్ణతతో సంబంధం లేకపోవడంవల్ల ఉపాధ్యాయుల హాజరు, అంకితభావం, బోధన ప్రమాణాలు సైతం ప్రభావితమయ్యాయి. మార్కులతో నిమిత్తం లేకుండా పై తరగతులకు చేరిపోతుండటం వల్ల చదువుల పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఉదాసీన ధోరణులు ప్రబలుతున్నాయని కేంద్రీయ విద్యా సలహామండలి ఉపసంఘం సమావేశాల్లో అనేక రాష్ట్రాలు ఆందోళన వ్యక్తపరచాయి. నిలుపుదల లేకపోవడంవల్ల పదో తరగతి చేరుకునేసరికి విద్యార్థికి పూడ్చలేని నష్టం వాటిల్లుతోంది. పాఠాలు సరిగ్గా అర్థం కాక అనేకమంది ఒత్తిడికి గురవుతున్నారు. అత్తెసరు మార్కులతోనైనా గట్టెక్కడానికి అడ్డదారులు తొక్కుతున్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేమని గ్రహించినవారు కుంగుబాటుకు గురవుతున్నారు. 2012లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఈ పరిస్థితుల్ని సమీక్షించడానికి గీత భుక్కల్ నేతృత్వంలో అధ్యయన సంఘాన్ని ఏర్పాటు చేసింది. విద్యా ప్రమాణాలు పతనమైపోతున్నందువల్ల నో డిటెన్షన్ పద్ధతిని సమీక్షించాలని ఆ సంఘం సిఫార్సు చేసింది. మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, సిక్కిం, తెలంగాణ రాష్ట్రాలు మినహా మిగిలిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలన్నీ నో డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలని కేంద్రాన్ని కోరాయి.



ప్రాథమిక విద్యావ్యవస్థ క్షాళనే పరిష్కారం

ప్రాథమిక విద్య స్థాయిలో ప్రమాణాలు కోసుకుపోతుండటంతో దాని ప్రభావం ఉన్నత విద్యపై పడుతోంది. దేశంలో 45 శాతానికి పైగా పట్టభద్రులు ఏ ఉద్యోగానికీ పనికిరాని దురవస్థ ఏర్పడింది. నో డిటెన్షన్ విధానం విద్యారంగానికి చేస్తున్న చేటుకు ఇది తిరుగులేని నిదర్శనం. నిలుపుదల పద్ధతిని అమలు చేస్తే బడి మానేసేవారి (డ్రాపవుట్స్) సంఖ్య పెరుగుతుందని కొన్ని రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బడికి దూరమయ్యే చిన్నారులు ఆపై బాల కార్మికులుగా మారిపోతారన్న వాదనను అవి తెరపైకి తెస్తున్నాయి. దేశాభివృద్ధికి నేడు వాసి గల విద్య ఎంతో అవసరం. విద్యార్థి పరీక్షల్లో తప్పినప్పుడే లోపాలు తెలుస్తాయి. ఆ మేరకు అతడిని చక్కదిద్దాలి. తదుపరి పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యేలా తీర్చిదిద్దాలి. ఇక్కడే ఉపాధ్యాయుల ప్రతిభా నైపుణ్యాలు వెలికివస్తాయి. పరీక్షలంటే పిల్లలు భయపడి, ఒత్తిడికి లోనవుతారన్నది కొందరి వాదన. ఇది సరికాదు. బాల్యంలోనే సవాళ్లను ఎదుర్కోగల విధంగా చిన్నారులను తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలి.

అహేతుక వాదన

డిటెన్షన్ విధానం వల్ల ప్రతికూల ఫలితాలు ఉంటాయన్న వాదన తోసిపుచ్చలేనిదే. దీనివల్ల విద్యారంగానికి నష్టంకన్నా దీర్ఘకాలంలో మంచే జరుగుతుంది. జాతి నిర్మాణంలో చదువులది అత్యంత కీలకపాత్ర. వ్యక్తి వికాసానికి సరైన పునాది పడటంలో ప్రాథమిక విద్యదే ప్రధాన భూమిక. భావి జీవితంలో సవాళ్లను దీటుగా ఎదుర్కొనేలా పాఠ్యాంశాలను రూపొందించాలి. పిల్లల సహజ సామర్థ్యాలను ప్రోత్సహించేలా చదువులు సాగాలి. అప్పుడే ఉపాధ్యాయ-విద్యార్థి బంధం బలపడుతుంది. మార్కుల గురించి ఒత్తిళ్లు తీసుకురాకుండా తల్లిదండ్రులూ పిల్లలను పెంచాలి. పిల్లల మానసిక పరిపక్వతలో వస్తున్న మార్పులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గుర్తించి, తగు నిర్ణయాలు తీసుకోవాలి. సమస్యాత్మకమైనవారికి మానసిక శాస్త్ర నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి. ప్రాథమిక విద్యలో ఈ తరహా మార్పులు వచ్చిననాడు పరీక్షల్లో నిలుపుదల పద్ధతి విద్యార్థులకు అసలే మాత్రం సమస్య కాబోదు.

ఏడు, పదో తరగతులకు బదులుగా అయిదు, ఎనిమిది, పదో తరగతుల్లో ఉత్తీర్ణులైతేనే పై తరగతులకు అనుమతించాలన్న ప్రతిపాదనను అమలులోకి తీసుకువచ్చినంత మాత్రాన పరిస్థితులు చక్కబడవు. వ్యవస్థీకృతంగా ప్రభుత్వం అనేక మార్పులు తీసుకురావాలి. నిఘా పర్యవేక్షణలను పెంచాలి. ఉన్నతాధికారులూ అలసత్వాన్ని వీడాలి. విద్యార్థులకు ఆకట్టుకునే పాఠ్య ప్రణాళికలను రూపొందించాలి. ఉపాధ్యాయులపై బోధనేతర పనిభారాన్ని పూర్తిగా పరిహరించాలి. ప్రతి ముప్ఫైమంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ఖాళీలను సత్వరం భర్తీ చేయాలి. అప్పుడు ఒకటో తరగతి నుంచే నిలుపుదల పద్ధతి అమలుచేసినా అభ్యంతరాలు రావు. గతంలో మాసాంతం, త్రైమాసిక, అర్ధసంవత్సర, వార్షిక పరీక్షలు నిర్వహించి చదువుల్లో విద్యార్థుల రాణింపును అంచనా వేసేవారు. ఆ విధానం మళ్ళీ తీసుకురావాలి. వృత్తిపట్ల ఉపాధ్యాయుల అంకితభావం ప్రశ్నార్థకమైన రోజులివి. పెళుసుబారిన ఉపాధ్యాయ-విద్యార్థి సంబంధాలను పునర్ నిర్వచించాలి. వ్యవస్థీకృతంగా ఉపాధ్యాయులను విద్యార్థులు గౌరవించే వాతావరణం తిరిగి నెలకొనాలి. పిల్లల్లో పరీక్షలంటే భయాన్ని పారదోలేలా ఉపాధ్యాయులూ బోధనకు పునరంకితం కావాలి. అప్పుడే ప్రాథమిక విద్య నాణ్యత ప్రమాణాలతో అలరారుతుంది. పరిణతిగల సమర్థులైన భావి భారత పౌరులను తయారుచేసే మహత్తర విద్యావ్యవస్థగా వన్నెలీనుతుంది!

(రచయిత- విశ్రాంత ఆచార్యులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం)

దోబూచులాట

ఒక్కోసారి ఎవరినో చూడగానే, బాగా పరిచయం గల మొహంలా అనిపిస్తుంది. ఎంత ఆలోచించినా- ఎక్కడ, ఎలా తెలుసో వెంటనే గుర్తు రాదు. మనసు ఎంతోసేపు గింజుకుంటుంది.

అది ఎలాంటిదంటే- రేడియోలో మీట తిప్పుతుంటే, ఎక్కడో చక్కని పాట వినవస్తుంది. 'ఇది పాటల వివిధ భారతి' అనుకొంటాం. మళ్లీ ఎప్పుడో కావాలనిపించి, ఎంత వెతికినా ఆ స్టేషన్ తగలదు. మనసు ఉసూరుమంటుంది.

ఇలా ఏదో ఒకానొక సదభిప్రాయంతో సహా, ఓ తీపి జ్ఞాపక శకలం పూర్తిగా రూపు కట్టుకోకుండా కలవరపెడుతుంది. వ్యక్తుల పట్ల ఏర్పడే ఆ సహృదయ మైత్రీభావాన్నే 'జననాంతర సౌహృదం' అంటాడు కవి కాళిదాసు.

ఒక మంచి మనిషి గురించి ప్రసంగించబోయే ముందు రాత్రి, అతణ్ని మానవ ఇతిహాసాల మహా సౌందర్యానికి చెందిన మనోజ్ఞ ప్రతినిధిగా నిరూపించే మహత్తర వాక్యం ఏదో చప్పున స్ఫురిస్తుంది. అందువల్ల అనేకమందికి నిద్ర తేలిపోయి, ఆ వాక్యాన్ని తక్షణం ఎక్కడో ఒకచోట రాసిపెట్టుకునేదాకా మనసు కుదురుగా ఉండదు. రాశాక విశ్రమిస్తే, ఆ తరవాత తృప్తిగా నిద్రలోకి జారుకోవడం సంభవిస్తుంది.

తీరా ప్రసంగ సమయానికి ఆ వాక్యం ఎంతకీ జ్ఞాపకం రాదు. మరపు తటస్థిస్తుంది. ఉపన్యాసం ముగించి వేదిక దిగిపోగానే, ఏదో తరిమినట్లుగా తిరిగి అదే వాక్యం గుర్తుకొస్తుంది. మనసు ఏదో అసంతృప్తికి లోనవుతుంది.

కలల విషయంలోనూ అప్పుడప్పుడు అలా జరుగుతుంటుంది. పీడకలలు వచ్చినప్పుడు తప్ప, తీపి కలలొచ్చినపుడు మనిషికి నిద్ర నుంచి మెలకువ రాదు. ఒకవేళ వస్తే, అది

అంతర్యామి

కలే అనే సంగతి తెలిసొచ్చి మనసుకు కష్టంగా తోస్తుంది. 'అదేదో మరి కాసేపు మెలకువ రాకున్నా బాగుండేది' అనుకుంటాడు మనిషి!

ఇదంతా మనిషికి, మనసుకు; లేదా బుద్ధికి, మనసుకు మధ్య నడిచే ఓ దోబూచులాట.



మాయ మనసు ఇలా మనిషిని, బుద్ధిని ఒక ఆట ఆడిస్తుంది. అది మనిషికన్నా వేరుగా ప్రవర్తిస్తుంది. ఒక్కోసారి ఆత్మ విషయంలోనూ జోక్యం చేసుకొని, చొరవగా చొరబడుతుంది.

స్వప్నంలోనో, ధ్యానంలోనో అరుదుగా ఆత్మకు, పరమాత్మకు అనుసంధానం కుదురుతుంటుంది. అటువంటి మహత్వపూర్ణ క్షణాలు కొన్ని, ప్రతి మనిషి జీవితంలోనూ ఉంటాయి. ఆ మధుర క్షణాల్లో ఆత్మ ఒకానొక బ్రహ్మాకమలపు దివ్య సౌరభాల ఆస్వాదనలో మునిగి తేలుతుంటుంది. పరమాత్మ పరిష్వంగంలో రమిస్తూ ఉంటుంది.

అదే సమయంలో సీతారాముల మధ్యలోకి చుప్పనాతిలా మనసు చొరబడి, సమాధి స్థితిని భగ్నపరుస్తుంది. ఆనందాన్ని పటాపంచలు చేస్తుంది. భావనామయ పావన జగత్తు నుంచి లౌకిక ప్రపంచంలోకి క్షణంలో లాక్కొని వచ్చేస్తుంది. ఆత్రంగా తియ్యని చనుబాలు తాగుతున్న పసివాణ్ని అమ్మ నుంచి వేరు చేసినట్లుగా, ఆత్మ తిరిగి పరమాత్మతో అనుసంధానం కోసం తహతహలాడుతుంది. అంతలోనే మాయలో పడిపోతుంది. ఆ వెంటనే మరిచిపోతుంది.

మనసు ఆటల్ని కట్టడి చేయాలంటే, జ్ఞానం ఒక్కటే ఆయుధం.

రేడియో విషయంలో యాంటెన్నా ఎలాంటిదో, మనసు పట్ల జ్ఞానం అలాంటిది. యాంటెన్నాను సరైన దిశలో స్థిరంగా అమర్చుకోగలిగితే, నిరంతరం మధుర గీతాల్ని ఆలకించే భాగ్యం దక్కుతుంది. మనసు సైతం అంతే!

- ఎర్రాప్రగడ రామకృష్ణ

'ఐకార్' ర్యాంకులతో వ్యవసాయ ప్రవేశాలు!

- వచ్చే ఏడాది నుంచి అనుమతించే యోచన
- జయశంకర్ విశ్వవిద్యాలయ నిర్ణయమే తరువాయి
- ఇప్పటికే 15% సీట్లు భర్తీ...
- మిగిలిన సీట్లకూ అవే ర్యాంకుల వర్తింపు!

ఈనాడు – హైదరాబాద్



జగిత్యాలలోని వ్యవసాయ డిగ్రీ కళాశాల

వ్యవసాయ, ఉద్యాన డిగ్రీ, పీజీ కోర్సుల సీట్ల భర్తీకి జాతీయ స్థాయిలో భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) నిర్వహించే ప్రవేశ పరీక్షల ర్యాంకులను పరిగణనలోకి తీసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం యోచిస్తోంది. ఐకార్ ఎప్పట్నుంచో జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షను నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా 74 వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో వ్యవసాయ, ఉద్యాన కోర్సుల్లో ఐకార్ ర్యాంకర్లకు 15% సీట్లు ఇస్తున్నారు. మిగిలిన 85% సీట్లను మాత్రం ఆయా వర్సిటీలు నిర్వహించే ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తున్నారు. కొన్ని రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాలైతే ఆ 85% సీట్లను కూడా ఐకార్ ర్యాంకుల ఆధారంగానే కేటాయిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఇంటర్ (బైపీసీ) విద్యార్థులకు నిర్వహించే ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా 85% సీట్లను ఇస్తున్నారు. గతంలో ఎంబీబీఎస్ సీట్ల కోసం నిర్వహించే ఎంసెట్ ర్యాంకర్లకే వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య డిగ్రీ సీట్లను తెలుగు రాష్ట్రాల్లో ఇచ్చేవారు. కానీ 'నీట్' ప్రారంభమైన తర్వాత ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల సీట్లకు ఎంసెట్ లేదు. దీంతో కేవలం వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య సీట్లకు ఎంసెట్ ఎందుకనే ప్రశ్న ఈ ఏడాది ఉత్పన్నమైంది. ఐకార్‌తో 15% సీట్లు ఇస్తున్నందున, మిగతా సీట్లనూ అవే ర్యాంకులు పొందిన తెలంగాణ స్థానిక విద్యార్థులతో భర్తీ చేస్తే ఎలా ఉంటుందన్న చర్చ జరుగుతోంది. ఇది అమల్లోకి రావాలంటే ముందుగా జయశంకర్ విశ్వవిద్యాలయ విద్యామండలి ఆమోదించాల్సి ఉంది.

పశువైద్య సీట్లు వీసీఐకి...

పశువైద్య (బీవీఎస్సీ) కోర్సుల్లోనూ 15% సీట్లను జాతీయ స్థాయిలో పశువైద్య మండలి (వీసీఐ) నిర్వహించే ప్రవేశ పరీక్ష ర్యాంకర్లతో భర్తీ చేస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి ఐకార్‌కు వెళ్లడం ఖాయమైతే... పశువైద్య సీట్లను ఎలా భర్తీ చేస్తారో సొంతంగా నిర్ణయం తీసుకోవాలని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయానికి జయశంకర్ వర్సిటీ సూచించే అవకాశముంది. ప్రస్తుతం వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య కోర్సుల్లో 85 శాతం సీట్లకు ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా ఈనెల 28 నుంచి జయశంకర్ వర్సిటీ కౌన్సెలింగ్ నిర్వహించనుంది.

ఎంపీసీ విద్యార్థుల సమస్య కారణంగానే...

'ఐకార్'కు వెళ్లాలనే యోచన వెనుక ఇంటర్మీడియెట్ (ఎంపీసీ) విద్యార్థులకు సీట్లు ఎలా కేటాయించాలనే సమస్యే ప్రధాన కారణమని సమాచారం. ఈ ఏడాది నుంచి వ్యవసాయ, ఉద్యాన డిగ్రీ కోర్సుల్లో చేరడానికి ఎంపీసీ విద్యార్థులను కూడా అనుమతించాలని ఐకార్ ఇప్పటికే ఆదేశాలిచ్చింది. తెలుగు రాష్ట్రాల వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాలు మాత్రం ఆ అవకాశం ఇవ్వలేదు. ఉభయ రాష్ట్రాల్లో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు వేర్వేరుగా 4 ఎంసెట్లు నిర్వహించారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు వ్యవసాయ, ఉద్యాన డిగ్రీల్లో సీటు ఇవ్వాలంటే... ఈ నాలుగు ఎంసెట్లలో దేని ర్యాంకును ప్రాతిపదికగా తీసుకోవాలనే సమస్య ఎదురైంది. దీన్ని అధిగమించలేక ఎంపీసీ విద్యార్థులకు ప్రవేశాల కల్పన విషయమై ఈ ఏడాది ఆలోచించలేదు. ఈ గ్రూపు విద్యార్థులకు ఐకార్ ఆదేశం మేరకు సీట్లు ఇవ్వాలని జయశంకర్ వర్సిటీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అక్కడ ఆమోదం పొందితే... వచ్చే ఏడాది నుంచి ఐకార్ ర్యాంకులు పొందినవారికే సీట్లు కేటాయిస్తే ఎలా ఉంటుందని ఆలోచిస్తున్నారు.

పీజీ కోర్సుల్లో నష్టం...

వ్యవసాయ పీజీ కోర్సుల్లో దేశవ్యాప్తంగా సీట్ల భర్తీకి ఐకార్ మరో పరీక్ష నిర్వహిస్తోంది. తెలంగాణలో వ్యవసాయ, ఉద్యాన డిగ్రీలు చదివేవారు ఈ పరీక్షను పెద్దగా రాయట్లేదు. ఫలితంగా ఉత్తరాది రాష్ట్రాల్లోని ప్రముఖ వ్యవసాయ పరిశోధనా సంస్థల్లో తెలంగాణ విద్యార్థులు సీట్లను చేజార్చుకుంటున్నారు.

మన విద్యార్థులు మరిన్ని సీట్లు పొందాలి

– ప్రవీణ్‌రావు, ఉపకులపతి, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం

ఐకార్ ప్రవేశ పరీక్షలను రాయాలని మన విద్యార్థులను ప్రోత్సహిస్తాం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన డిగ్రీ కోర్సుల్లో 15% కోటా కింద ఉన్న సీట్లకు మన విద్యార్థులు పెద్దగా పోటీ పడట్లేదు. పీజీలోనూ అధిక సీట్లు పొందితే జాతీయ స్థాయి పరిశోధన ఉపకార వేతనాలు అధికంగా వస్తాయి. గతేడాది మేము శ్రద్ధ చూపడం వల్ల కొన్ని మంచి ఫలితాలు వచ్చాయి.



వధూవరులతో సీఎం కేసీఆర్ దంపతులు. చిత్రంలో మంత్రులు జగదీష్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి తదితరులు

విప్ సునీత కుమార్తె వివాహానికి హాజరైన సీఎం కేసీఆర్ దంపతులు

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: హైదరాబాద్ మన్సూరాబాద్ డివిజన్‌లోని కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, మహేందర్‌రెడ్డిల కుమార్తె అంజని వివాహం రామాంతపూర్‌కు చెందిన సురేఖ, మహేందర్‌రెడ్డిల కుమారుడు అక్షయ్‌రెడ్డితో జరిగింది. ఈ వివాహానికి ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులతో పాటు ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, హరీశ్‌రావు, ఈటల రాజేందర్, ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు తదితరులు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు.

జౌళి పార్కులో దక్షిణ కొరియా సంస్థల పెట్టుబడులు

- కేటీఆర్‌తో 'కోఫోటి' ప్రతినిధి బృందం భేటీ
- పార్కుకు విమానయాన సౌకర్యంపై మంత్రి హామీ



బుధవారం హైదరాబాద్ బేగంపేటలోని క్యాంపు కార్యాలయంలో తనను కలిసిన దక్షిణ కొరియా ప్రతినిధులకు జ్ఞాపికను బహూకరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి తదితరులు

ఈనాడు, హైదరాబాద్: వరంగల్ గ్రామీణ జిల్లాలో ప్రారంభించనున్న కాకతీయ అంతర్జాతీయ జౌళి పార్కులో దక్షిణకొరియా సంస్థలు భారీ పెట్టుబడులతో పరిశ్రమలను స్థాపించనున్నాయి. దక్షిణకొరియాకుచెందిన జౌళిపరిశ్రమల సమాఖ్య (కోఫోటి) ఛైర్మన్, యంగ్‌వన్ కార్పొరేషన్ యజమాని కిహాక్ సంగ్ నేతృత్వంలో ప్రతినిధి బృందం బుధవారం తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసింది. రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, చేనేత జౌళిశాఖ కమిషనర్ శైలజారామయ్యర్, టీఎస్ఐఐసీ ఎండీ వెంకటనర్సింహారెడ్డి తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. 2 వేల ఎకరాల్లో ఏర్పాటుచేయనున్న కాకతీయ జౌళిపార్కు ప్రణాళికను, ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, ప్రోత్సాహకాల గురించి తెలిపారు. ఈ పార్కు జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలకు వేదికకానుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రమూ ఇవ్వనన్ని ప్రోత్సాహకాలు ఇస్తామని.. ఆయా సంస్థలు కోరుకున్న విధంగా సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. పార్కులో పరిశ్రమ అవసరాలకోసం కార్మికుల నైపుణ్యాభివృద్ధి శిక్షణాసంస్థను ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. దీనివల్ల మానవవనరులు పుష్కలంగా లభిస్తాయన్నారు. దక్షిణ కొరియా సంస్థలకు ఒకేచోట స్థలాలు కేటాయిస్తామన్నారు.

విమాన సౌకర్యం కావాలి..: ఈ సందర్భంగా కిహాక్‌సంగ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రణాళిక బాగుందని ప్రశంసించారు. జౌళి పార్కుకు అవసరమైన విద్యుత్తు, కార్మికుల లభ్యత, రాయితీల గురించి మంత్రిని అడిగి తెలుసుకున్నారు. వరంగల్‌కు విమానయాన సౌకర్యం ఉందా? అని అడిగారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ. కేంద్రంతో మాట్లాడి త్వరలోనే వరంగల్ మామునూరు నుంచి విమానాల రాకపోకలకు కృషిచేస్తామన్నారు. దక్షిణ కొరియా జౌళి పరిశ్రమల రంగంలో గణనీయమైన ప్రగతిని సాధించిందని, విస్తరణలో భాగంగా తెలంగాణ వైపు దృష్టి సారించామని కిహాక్‌సంగ్ తెలిపారు. త్వరలోనే జౌళి పార్కు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తామని, పరిశ్రమలకు అనువైన వాటిని ఎంపిక చేస్తామని చెప్పారు. దక్షిణ కొరియా సంస్థల నిర్ణయాన్ని కేటీఆర్ స్వాగతించారు. ఆయా సంస్థలకు అన్ని విధాలా సహకరిస్తామన్నారు. మంత్రితో సమావేశం అనంతరం దక్షిణ కొరియా బృందం అధికారులతో సమావేశమైంది.

మైనారిటీలకు నజరానా

- నెలాఖరులోగా పదవుల పంపిణీ
- రాష్ట్రస్థాయి ఛైర్మన్లుగా మరో నలుగురు
- డైరెక్టర్లుగా 120 మందికి అవకాశం
- అన్ని సంస్థల్లోనూ భాగస్వామ్యం
- ఉపముఖ్యమంత్రి, నేతలతో సీఎం కేసీఆర్

ఈనాడు, హైదరాబాద్: తెరాసలోని సీనియర్ మైనారిటీ నేతలు, కార్యకర్తలకు ఈ నెలాఖరులోగా నియమిత పదవులను ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న వారికి, సభ్యత్వ నమోదు పాటు సమర్థంగా, అంకిత భావంతో పనిచేసే వారందరికీ అవకాశం కల్పిస్తామని తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి తన వ్యవసాయక్షేత్రంలో ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ సలీం, ఎమ్మెల్సీలు ఫారుఖ్ హుస్సేన్, ఫరీదుద్దీన్, కార్పొరేషన్ల ఛైర్మన్లు సయ్యద్ అక్బర్, బాక్రి, యూసుఫ్, ఎంఏబేగ్, అలీం, హైదరాబాద్ డిప్యూటీ మేయర్ ఫసియొద్దీన్‌లతో సమావేశమయ్యారు. మంత్రి కేటీఆర్, ఇతర పార్టీ సీనియర్ నేతలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియమిత పదవుల గురించి చర్చించారు. పార్టీ మైనారిటీలకు అన్నింటా ప్రాధాన్యం ఇస్తోందని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, బడ్జెట్‌పరంగా న్యాయం చేస్తున్నామని సీఎం చెప్పారు. వచ్చే ఎన్నికలను పురస్కరించుకొని మైనారిటీలకు రాజకీయంగా బలోపేతం చేస్తామని చెప్పారు. ఇప్పటికే 5 కార్పొరేషన్లు ఇచ్చామని తెలిపారు. త్వరలోనే మైనారిటీ కమిషన్, ఉర్దూ అకాడమీ, హజ్ కమిటీలకు రాష్ట్ర స్థాయి ఛైర్మన్లను నియమిస్తామని చెప్పారు. అనీస్ గుర్బాకు సైతం కమిటీని వేస్తామన్నారు. మైనారిటీ సంస్థలన్నింటిలోనూ డైరెక్టర్లుగా ఆ వర్గం వారినే నియమిస్తామని, ఇవిగాక ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ అవకాశం కల్పిస్తామని తెలిపారు. ప్రతీ పాత జిల్లాకు 12 మంది చొప్పున మొత్తం 120 మంది పేర్లతో ఈనెల 23లోగా తమకు జాబితాను ఇవ్వాలని సీఎం నేతలకు సూచించారు. ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలతో చర్చించి పేర్లను ఖరారు చేయాలన్నారు.

రాష్ట్రనేతలకు బాధ్యతలు

నియమిత పదవులకు అర్హులైన మైనారిటీ నేతలు, కార్యకర్తల ఎంపిక కోసం రాష్ట్ర నేతలకు బాధ్యతలను అప్పగించారు. మెదక్‌కు ఫరీదుద్దీన్, రంగారెడ్డి ఫారుఖ్ హుస్సేన్, కరీంనగర్, ఆదిలాబాద్ అక్బర్, నిజామాబాద్ అలీం, ఖమ్మం బేగ్, మహబూబ్‌నగర్ ముజీబ్, వరంగల్, నల్గొండ యూసుఫ్, హైదరాబాద్ బాక్రి, ఫసియొద్దీన్‌లకు అప్పగించారు. ఈనెల 23న వీరు ఉపముఖ్యమంత్రి ద్వారా జాబితాలను తమకు అందించాలని, 24న వీటిపై చర్చించి 25, 26 తేదీల్లో నియామకాలు జరుపుతామని తెలిపారు. నియమితపదవుల ఎంపికలో అన్నిజాగ్రత్తలు పాటించాలని, అనర్హులకు అవకాశం ఇవ్వరాదని తెలిపారు.

మజ్లిస్‌కు అవకాశం ఇవ్వం

వక్ఫ్‌బోర్డులో మజ్లిస్‌కు అవకాశం ఇవ్వడం వల్ల పాలనపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, నియమిత పదవుల్లో ఆ పార్టీకి అవకాశం ఇవ్వరాదని ఈ సందర్భంగా తెరాస మైనారిటీ నేతలు కోరగా దానికి సీఎం అంగీకరించినట్లు తెలిసింది. పార్టీ తరఫున మంచివారి పేర్లు ఇస్తే ఆ సమస్య ఉండదని తెలిపారు.

ఛైర్మన్లపై అసంతృప్తి

నియమత పదవులు పొందిన ఛైర్మన్లలో కొందరు సరిగా పనిచేయడం లేదని సీఎం అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇప్పటికైనా వారు క్రియాశీలకంగా పనిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో నియమితులైన అధికారులు ఇంకా పనిచేస్తున్నారని, వారు తమకు సహకరించడం లేదని ఫిర్యాదు చేశారు. అలాంటివారిని వెంటనే మారుస్తానని సీఎం హామీ ఇచ్చారు. మైనారిటీలకు కేటాయించిన మొత్తం రూ. 1,250 కోట్ల బడ్జెట్‌లో రూ. 500 కోట్లను మైనారిటీ కార్పొరేషన్లకు ఇస్తామని చెప్పారు.



చేనేత మగ్గంపై కండువాను నేస్తున్న పార్క్ కార్మికుడు

వక్రతుండుడికి పోచంపల్లి తుండు

భూదాన్ పోచంపల్లి, న్యూస్‌టుడే: వినాయక చవితి అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ వినాయకుడే. అక్కడి గణేశుడికి అన్నీ ప్రత్యేకతలే. అందులో ఒక ప్రత్యేకతను భూదాన్ పోచంపల్లి చేనేత పార్క్ సొంతం చేసుకోనుంది. ఇక్కడి కనుముకుల గ్రామంలోని చేనేత పార్క్‌లో మగ్గంపై ఖైరతాబాద్ వినాయకుడికి తుండు (కండువా)ను నేస్తున్నట్లు పార్క్ ఛైర్మన్ కడవేరు దేవేందర్ బుధవారం తెలిపారు. 25 మీటర్ల పొడవు, మీటరు వెడల్పుతో ఏకవస్త్రంగా తయారు చేస్తున్నట్లు చెప్పారు. కండువాపై శివలింగం, ఢమరుకం, త్రిశూలం, లడ్డూ, తామర పుష్పం, ఓంకారం, స్వస్తిక్, శ్రీగణేశ్, జై గణేశ్ అనే ఆకారాలు, అక్షరాలు, పార్క్ గుర్తు ఉంటాయని తెలిపారు. వినాయకచవితినాడు ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సమర్పించనున్నట్లు వెల్లడించారు.

'ఐటీఐఆర్‌పై తెరాస ప్రభుత్వ నిర్లక్ష్యం'

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉన్న ఐటీఐఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్ ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐటీఐఆర్‌పై మంత్రి కేటీఆర్ కేంద్రానికి రాసిన లేఖ చూస్తే కేంద్రంపై ఒత్తిడి పెంచినట్లు లేదని... ప్రజలకు మేం ఏం చెప్పాలని అడిగినట్లుందన్నారు.

దామోదర్‌రెడ్డిని పరామర్శించిన ఉత్తమ్, జానా: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత కె.జానారెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి సహా పలువురు నేతలు బుధవారం పరామర్శించారు.

తప్పు లేకుంటే ఎస్సైని ఎందుకు సస్పెండ్‌చేశారు?

- బాధ్యులైన పోలీసులపై కేసు ఎందుకు నమోదు చేయలేదు
- నేరెళ్ల ఘటనపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్నలు
- బాధితులను జైలుకు తరలించినప్పటి గాయాల పరిస్థితిపై నివేదికివ్వాలని ఆదేశం
- ఘటనను రాజకీయం చేస్తున్నారని ఏఏజీ వాదన

ఈనాడు, హైదరాబాద్: సిరిసిల్ల జిల్లా నేరెళ్ల, రామచంద్రాపురం గ్రామాల్లో లాఠీఛార్జి జరపడంలో పోలీసుల తప్పు లేకపోతే ఎస్సైని ఎందుకు సస్పెండ్ చేశారని తెలంగాణ ప్రభుత్వాన్ని ఉమ్మడి హైకోర్టు ప్రశ్నించింది. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగానే ఎస్సై ఈ చర్యకు పాల్పడినట్లయితే పదోన్నతి కల్పించాలిగానీ సస్పెండ్ ఎందుకు చేయాల్సి వచ్చిందని నిలదీసింది. అసలు సంఘటనకు కారకులెవరు? కేసులో నిందితులెవరు? ఇందులో పోలీసుల పేర్లు చేర్చారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. ఎస్సై సస్పెన్షన్‌కు సంబంధించి నివేదిక సమర్పించాలని కరీంనగర్ రేంజ్ డీఐజీ రవివర్మను, అదేవిధంగా జైలుకు తరలించినపుడు బాధితులకు ఉన్న గాయాలపై నివేదిక ఇవ్వాలని జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. బాధితులు మొదట చికిత్స పొందిన కరీంనగర్ సివిల్ ఆసుపత్రి నుంచీ నివేదిక తెప్పించాలని అదనపు అడ్వొకేట్ జనరల్‌కు సూచించింది. బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు బాధ్యులైన పోలీసులపై కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించింది. నేరెళ్ల గ్రామ దళితులపై దాడి సంఘటనపై సీబీఐ లేదా ప్రత్యేక బృందంతో దర్యాప్తు జరిపించాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, పోలీసులపై చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోరుతూ పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె. ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. వరంగల్ జిల్లా ఎంజీఎం ఆసుపత్రి డాక్టర్ల బృందం బాధితులకు చికిత్స అందించడంతోపాటు గాయాల తీవ్రతపై ఇచ్చిన నివేదికను అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) జె.రామచంద్రరావు సమర్పించగా ఘటనకు సంబంధించిన వివరాల్ని ధర్మాసనం ఆయన్ను అడిగి తెలుసుకుంది. ఏఏజీ సమాధానమిస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా గ్రామస్థులు గుంపుగా చేరి పోలీసులపై దాడికి దిగారని చెప్పారు. గుంపును చెదరగొట్టడంలో భాగంగా ఈ సంఘటన జరిగిందన్నారు. ఓ ఎస్సైని సస్పెండ్ చేశామని, పరిధి దాటి ఆయన వ్యవహరించినందున ఈ చర్య తీసుకున్నట్లు వివరించారు. సంఘటన జరిగిన నెల దాటాక ఈ విషయాన్ని వివాదం చేస్తున్నారని, కోర్టును రాజకీయ వేదికగా వాడుకుంటున్నారని పేర్కొన్నారు. దీని వెనుక రాజకీయం ఉందని, పదేపదే ఎలక్ట్రానిక్ మీడియాతో గ్రామస్థులు మాట్లాడుతున్నారని చెప్పారు. గ్రామస్థులు పోలీసులను కొట్టారని, వారి బాధను ఎవరూ పట్టించుకోలేదనగా ధర్మాసనం జోక్యం చేసుకుంటూ కంటికి కన్ను సిద్ధాంతం సరికాదని వ్యాఖ్యానించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వి.రఘునాథ్ వాదనలు వినిపిస్తూ ప్రతి అంశాన్ని వక్రీకరించి చెబుతున్నారన్నారు. గ్రామస్థులు గాయాలతో ఉండగా కరీంనగర్ ఆసుపత్రి నుంచి జ్వరంతో బాధపడుతున్నట్లు పోలీసులు నివేదిక తీసుకున్నారన్నారు. రెండు వారాలకు పైగా కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందారన్నారు. ఎస్పీ ఈ సంఘటన వెనుక ఉండి బాధితులను తీవ్ర హింసకు గురి చేశారన్నారు. పోలీసులు చట్టాన్ని ఉల్లంఘించారని, వారిపై చర్య తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని, ఎంజీఎం డాక్టర్ల నివేదిక ప్రకారం బాధితులకు ఎలాంటి ప్రాణహాని లేదని స్పష్టమైందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జైలు సూపరింటెండెంట్, సివిల్ ఆసుపత్రుల నుంచి నివేదికలు వచ్చాక తదుపరి విచారణ 30వ తేదీన చేపడతామంటూ వాయిదా వేసింది.

వెంకయ్యనాయుడుకు 21న పౌరసన్మానం

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహణ • సీఎం కేసీఆర్ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడుకు తెలంగాణ ప్రభుత్వం, ప్రజల తరఫున ఈ నెల 21న పౌర సన్మానం జరపాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. రాజ్‌భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అనంతరం వెంకయ్య గౌరవార్థం దిల్‌కుష్ అతిథిగృహంలో విందు జరుగుతుంది.

నిజామాబాద్ కలెక్టర్ హైదరాబాద్‌కు బదిలీ

నిజామాబాద్ కలెక్టర్ యోగితారాణాను హైదరాబాద్ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. ఆమె స్థానంలో అక్కడ ఎవరినీ నియమించలేదు. కొత్త కలెక్టర్ నియామకం జరిగే వరకు ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహించాలని అక్కడి సంయుక్త కలెక్టర్‌ను ఆదేశించారు. రాహుల్ బొజ్జా బదిలీ అనంతరం హైదరాబాద్ కలెక్టర్ పోస్టు ఖాళీగా ఉండగా దానిని యోగితాతో భర్తీ చేశారు.

నిజాయితీతో పని చేస్తే ఏదైనా సాధ్యమే: సీవీ ఆనంద్

నిజాయితీ, నిబద్ధతతో పని చేస్తే ఏదైనా సాధించవచ్చని తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఉత్తమ సేవలు అందించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా బుధవారం కార్యాలయ సిబ్బంది తదితరులు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని, సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం, సాంకేతికతతో మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయన చెప్పారు.

సచివాలయంలో పది మంది అధికారులకు పదోన్నతులు

రాష్ట్ర సచివాలయంలో పది మంది సహాయ కార్యదర్శులకు ఉప కార్యదర్శులుగా పదోన్నతులు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎం.ఎ. రషీద్, బి.రాంజి, కె. శారదాబాయి, టి.గోపాల్‌రావు, జె. అరుణ్‌కుమార్, ఎంవీ పద్మావతి, కేవీ లలిత, జి. లక్ష్మినారాయణ, జి. దేవేందర్‌రావు, బి.ప్రసాద్ ఈజాబితాలో ఉన్నారు.

కశ్మీర్‌లో 12 చోట్ల ఎన్ఐఏ సోదాలు

దిల్లీ, శ్రీనగర్: జమ్ము కశ్మీర్‌లోని 12 చోట్ల జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోదాలు జరిపింది. ఉగ్రవాద, విద్రోహ చర్యలకు నిధులు సమకూరుస్తున్నారన్న ఆరోపణలతో కొంతమంది వేర్పాటువాదులు, ఇతరులపై నమోదు చేసిన కేసుకు సంబంధించి.. శ్రీనగర్, బారాముూలా, హంద్వాడాల్లో ఈ దాడులు చేపట్టినట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. నిందితులతో సంబంధమున్న వ్యక్తులకు చెందిన ప్రాంతాల్లో సోదాలు జరిపినట్లు పేర్కొన్నారు.

ఎవరికి బాధ్యతలు అప్పగించాలో అధిష్ఠానం నిర్ణయిస్తుంది

- కుంతియా మాటలు నమ్మొద్దు: కోమటిరెడ్డి సోదరులు

నల్గొండ పురపాలిక, భువనగిరి టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఎవరికి ఏ బాధ్యతలు అప్పగించాలో అధిష్ఠానం నిర్ణయిస్తుందని కోమటిరెడ్డి సోదరులు అన్నారు. ఇరువురు సోదరులు బుధవారం వేర్వేరుగా విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర కాంగ్రెస్ బాధ్యులు కుంతియా ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నల్గొండ జిల్లా కేంద్రంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణకు ముఖ్యమంత్రిని అయ్యేది ఖాయమని, ఎప్పుడన్నది చెప్పలేనని అన్నారు. కాంగ్రెస్ రథసారథిని మార్చే అవకాశం లేదని కుంతియా చెప్పిన మాటలు నమ్మడానికి ఎవరూ సిద్ధంగా లేరన్నారు. ఆయన మాటలతో ఆందోళనచెందవద్దని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై త్వరలోనే కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీతో చర్చిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలనను అంతం చేసి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావటమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. గడిచిన మూడున్నరేళ్లల్లో తెరాస ప్రభుత్వం 10వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు లక్షఉద్యోగాలు ఇస్తామని సీఎం ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరిలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర వ్యవహారాలఇన్‌ఛార్జిగా 2019 ఎన్నికల వరకు తాను, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉంటారని కుంతియా ఇటీవలి చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి కుంతియాకు అదనపు బాధ్యతలు మాత్రమే అధిష్ఠానం ఇచ్చిందని స్పష్టం చేశారు. కుంతియాకు ఇలాంటి ప్రకటన చేసే అధికారం లేదన్నారు. కోమటిరెడ్డి సోదరుల్లో ఒకరికి పీసీసీ పదవి వరిస్తుందని రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌శ్రేణులు భావించాయని చెప్పారు.

అత్యుత్తమ నగరం మెల్‌బోర్న్

న్యూయార్క్: ప్రపంచంలో జీవించదగ్గ అత్యుత్తమ నగరంగా ఆస్ట్రేలియా రాజధాని మెల్‌బోర్న్ ప్రథమ స్థానం సంపాదించింది. తరువాత స్థానాల్లో వియన్నా (ఆస్ట్రియా), వాంకోవర్ (కెనడా) ఉన్నాయి. మొదటి పది స్థానాల్లో భారత దేశానికి చోటు దక్కలేదు. 140 నగరాలను సర్వే చేసి ఎకానమిస్ట్ ఇంటలిజెన్స్ యూనిట్ రూపొందించిన గ్లోబల్ లివబిలిటీ రిపోర్టులో ఈ విషయం వెల్లడయింది. టొరొంటో(నాలుగు), కల్గేరి (అయిదు), అడిలాయిడ్ (ఆరు), పెర్త్ (ఏడు), ఆక్లాండ్ (ఎనిమిది), హెల్సింకి (తొమ్మిది), హాంబర్గ్ (పది) స్థానాలు పొందాయి. చివరి స్థానాలను పరిశీలిస్తే డమాస్కస్ (140), లాగోస్ (139), ట్రిపోలి (138), ఢాకా (137), కరాచీ (134) స్థానాలు పొందాయి.

కశ్మీర్‌లో స్వాతంత్ర్య నినాదాలు చేసిన వీడియో వైరల్

జమ్మూ: శ్రీనగర్‌లోని లాల్‌చౌక్‌లో స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలు చేసిన ఓ మహిళ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. 45 సెకన్ల ఈ వీడియోలో కశ్మీరీ పండిట్ సునితా అరోరా భద్రతా సిబ్బందిని దాటుకుని, పోలీసులు చుట్టుముట్టినా లాల్‌చౌక్‌లో నినాదాలిచ్చింది. దారితప్పుతున్న యువత సరైన మార్గంలో నడవాలనే సందేశాన్ని అందించడానికి తాను ఈవిధంగా చేసినట్లు చెప్పుకొచ్చింది.

స్తంభాల నిర్మాణంలో లోపాలు!

- 'సారపాక-భద్రాచలం' మధ్య గోదావరిపై రెండో వారధి పనులు
- చర్చనీయాంశంగా మారిన స్తంభం కూల్చివేత

బూర్గంపాడు, భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం-సారపాక మధ్య గోదావరి నదిపై నిర్మిస్తున్న రెండో వారధి పనుల లోపాలపై తీవ్ర చర్చ జరుగుతోంది. తాజాగా ఓ స్తంభం (పిల్లరు) కూల్చివేత చర్చనీయాంశంగా మారింది. జాతీయ రహదారుల విభాగం ఆధ్వర్యంలో రెండున్నరేళ్ల క్రితం వంతెన నిర్మాణానికి టెండర్లు పిలిచారు. రూ.98 కోట్ల పనులను లెస్‌తో రూ.79 కోట్లకు రాజ్‌దీప్ నిర్మాణ సంస్థ దక్కించుకుంది. ఆ తర్వాత రూ.65 కోట్లకే నిర్మాణం పూర్తి చేసేలా ఒప్పందం కుదిరింది. వంతెనను 1.2 కి.మీ. పొడవునా 38 పిల్లర్లతో నిర్మించాల్సి ఉంది. పనుల్లో తీవ్ర జాప్యం కారణంగా ఇప్పటి వరకు ఒక స్తంభం మాత్రమే పూర్తిగా నిర్మించారు. మిగిలినవన్నీ తుది దశకు చేరాయి. ఇటీవల జాతీయ రహదారుల విభాగం పర్యవేక్షణ బృందం స్తంభాల నిర్మాణ తీరును పరిశీలించింది. సారపాక వైపు నుంచి నిర్మిస్తున్న రెండో స్తంభం నిర్మాణంలో లోపం ఉన్నట్లు గుర్తించిన అధికారులు, దాన్ని కూల్చివేసి పునర్నిర్మించాలని నిర్మాణ సంస్థకు తేల్చిచెప్పారు. నిర్మాణంలో ఉన్న మరో రెండు స్తంభాల నాణ్యతపైనా వారు అభ్యంతరాలు తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం రెండో పిల్లరు కూల్చివేత పనులను గుత్త సంస్థ సిబ్బంది చేపట్టారు. పిల్లరు కూల్చివేతపై జాతీయ రహదారుల విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు పద్మనాభరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. పిల్లర్లలో లోపాలను గుర్తించి మేమే కూలగొట్టిస్తున్నామన్నారు. మరో రెండింటి నిర్మాణంలోనూ చిన్న లోపాలున్నట్లు తేలిందన్నారు.



లోపాల కారణంగా కూల్చివేస్తున్న రెండో పిల్లరు

కరవు వస్తే కోలుకోవడం కష్టమే!



వాషింగ్టన్: కరవు పరిస్థితుల నుంచి సంపూర్ణంగా కోలుకోలేకపోవడం ప్రస్తుత శతాబ్దంలో సాధారణ విషయంగా మారనుంది. ఇలాంటి వైపరీత్యం దీర్ఘకాలంగా కొనసాగనుంది. సాధారణ ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగనుండడమే ఇందుకు కారణం. కరవు నుంచి బయటపడడానికి పర్యావరణ వ్యవస్థ ఎంత సమయం తీసుకుంటున్నదానిపైనే దుర్భిక్ష తీవ్రతను అంచనా వేయాల్సి ఉంటుంది. దీనిపై అమెరికాలోని కార్నెగీ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ సైన్స్‌కు చెందిన శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపారు. 20వ శతాబ్దంలో కరవుకు గురయిన ప్రాంతాలు ఎక్కువకాలమైనప్పటికీ, అవి తిరిగి కోలుకోవడానికి తీసుకున్న సమయం కూడా అధికంగా ఉంది. 21వ శతాబ్దంలో అంతకన్నా తీవ్రత కరవు పరిస్థితులు చాలా తరచుగా ఎదురుకానున్నాయి. ఇందుకు పర్యావరణ వ్యవస్థ ఎలా స్పందిస్తున్నదన్న విషయాన్ని గమనించిన తరువాతే భవిష్యత్తు ప్రణాళికను రూపొందించాల్సి ఉంటుంది. కరవు నుంచి బయటపడడానికి పర్యావరణ వ్యవస్థకు దోహదం చేసే అంశాలు ఏమిటన్నదానిపైన ఇంతవరకు సమగ్ర సమాచారం లేదు. రానున్న రోజుల్లో కరవు నుంచి పూర్తిగా కోలుకొనే అవకాశాలు లేవని, పెద్ద ఎత్తున చెట్లు ఎండిపోయే ప్రమాదం ఉందని పరిశోధకులు భావిస్తున్నారు. కరవు నుంచి వృక్ష సంపద కోలుకోలేదని భావించే సమయంలోనే మరో కరవు వచ్చి పడితే ఇక వాటిపై ఆశ వదులుకోవాల్సిందేనని పరిశోధకుడు యుయాన్‌యుయాన్ ఫాంగ్ చెప్పారు. వర్షపాతం బాగుండి, ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటే చెట్లు త్వరగా కోలుకోవచ్చు. ఎండలు మరింత ఎక్కువగా ఉన్నా శీతల వాతావరణం మరింత తక్కువగా ఉన్నా కరవు పరిస్థితులు కొనసాగుతాయి. అమెజాన్, ఇండోనేసియా, అలస్కా, రష్యాలోని తూర్పు ప్రాంతాల్లో ఇలాంటి దుస్థితి కలిగే అవకాశం ఉంది. ఈ పరిశోధనను 'నేచర్' జర్నల్ ప్రచురించింది.



మొక్కల ఆధారిత సరికొత్త పోలియో టీకా




లండన్: మొక్కల్ని ఉపయోగించి సరికొత్త పోలియో టీకాను శాస్త్రవేత్తలు అభివృద్ధి పరిచారు. ఎన్నో ఏళ్లుగా ప్రపంచాన్ని వేధిస్తున్న వైరల్ వ్యాధిపై పోరాటంలో ఇది మరో ముందడుగుగా భావిస్తున్నారు. యూకే నార్విచ్‌లోని జాన్ ఇన్నెస్ సెంటర్ పరిశోధకులు.. మొక్కల్లో పెరిగే వైరస్ తరహాలోనే ఉండే రేణువుల(వీఎల్‌పీ)లను ఉపయోగించి ఈ టీకాను రూపొందించారు. వీఎల్‌పీలను ఉత్పత్తి చేసే సమాచారంతో కూడిన జన్యువులను మొక్కల కణజాలంలో మార్చారు. వీటిని ఇమిడ్చిన మొక్క తన సొంత ప్రొటీన్ వ్యక్తీకరణ ద్వారా భారీ స్థాయిలో ఉత్పత్తి జరుపుతుంది. ప్లాంట్ సైన్స్, ఆనిమల్ వైరాలజీ, స్ట్రక్చరల్ బయాలజీలతో కూడిన ఈ పరిశోధన అద్భుతమైన ఫలితాన్ని ఇచ్చిందని జార్జ్ లోమోనోస్సోఫ్ పేర్కొన్నారు. దీనిని ప్రయోగాల పరీక్షలతోనే ఆపాలని భావించడం లేదన్నారు. మానవ ఆరోగ్యానికి హానికరంగా పరిణమిస్తున్న ముప్పులపై పోరాడేందుకు భారీ స్థాయిలో ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

దంతాల్లో ఇన్‌ఫెక్షన్‌ను పట్టిచ్చే చూయింగ్ గమ్!



బెర్లిన్: దంతవైద్య పరీక్షలకు సంబంధించి ఓ సరికొత్త పద్ధతిని జర్మనీకి చెందిన శాస్త్రవేత్తలు తాజాగా ఆవిష్కరించారు. ఎక్కడైనా దంతక్షయం ఉందా! ఏదైనా ఇన్‌ఫెక్షన్... వాపు ఉందా! అనే విషయాన్ని కేవలం చూయింగ్ గమ్‌ను నమలడం ద్వారా ఇట్టే పట్టేయవచ్చని వారు చెబుతున్నారు. ఈ పరీక్ష నిమిత్తం వారు ఓ ప్రత్యేకమైన చూయింగ్ గమ్‌ను తయారుచేశారు. ఈ చూయింగ్ గమ్‌ను నమలడం ద్వారా ఇన్‌ఫెక్షన్ ఉందా! లేదా! అని కనుక్కోవచ్చు. ఎక్కడైనా ఇన్‌ఫెక్షన్, వాపు వంటివి ఉంటే...నములుతున్న ఈ చూయింగ్ గమ్ కాస్తా..చేదుగా తయారౌతుంది. అదే ఇన్‌ఫెక్షన్‌కు సంకేతంగా గుర్తించి ఆ తర్వాత దంతవైద్య నిపుణుడి వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకోచ్చు. ఇలా చూయింగ్ గమ్‌తో ఎవరికి వారే ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం వల్ల తీవ్రమైన సమస్యలను ముందే అరికట్టవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

మానసిక ఆరోగ్యానికి స్మార్ట్‌ఫోన్ యాప్



వాషింగ్టన్: మధ్య, వృద్ధ వయసు దశల్లో వ్యక్తులు తమ మానసిక ఆరోగ్యాన్ని తామే కాపాడుకునేందుకు పరిశోధకులు సరికొత్త స్మార్ట్‌ఫోన్ యాప్‌ను రూపొందించారు. మానసికంగా ఒత్తిడి ఎదుర్కొంటున్న వారికి ఈ యాప్ మూడు నెలల కాలంలో వివిధ అంశాల్లో పదిసార్లు తరగతులు తీసుకుని తగిన సూచనలిస్తుంది. రిమోటింగ్ విధానం ద్వారా వైద్యులు ఈ యాప్‌ను వీక్షించే అవకాశం ఉంటుంది. వ్యక్తులు ఎలాంటి మానసిక అనారోగ్యంతోనైనా బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తిస్తే వారికి ఏ మందులు వాడాలో సూచిస్తారు. ఈ యాప్ మానసిక రోగులకు ఎంత వరకు ఉపయోగపడగలదో అని అమెరికాలోని డార్ట్‌మౌత్ కళాశాల పరీక్షించింది. తీవ్ర మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న పదిమంది ఈ స్మార్ట్‌ఫోన్ యాప్ వాడటంపట్ల సంతృప్తి వ్యక్తం చేసినట్లు వీరి పరిశీలనలో వెల్లడైంది. సాధారణ సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారూ ఈ యాప్‌ను సులభంగా వాడవచ్చు. మానసికంగా ఒత్తిడి ఎదుర్కొనేవారు ఈ యాప్ ద్వారా వ్యక్తిగతంగా చికిత్సలో పాల్గొంటూ మానసిక అస్వస్థతను దూరం చేసుకునే వీలుంటుందని డార్త్‌మౌత్ కళాశాలకు చెందిన కరేన్ ఫార్చ్యునా తెలిపారు.

రైలు బండి.. నీరుండదండి..!

- ప్రయాణం మధ్యలోనే అయిపోతున్న నీళ్లు
- మల మూత్ర విసర్జనకు తీవ్ర ఇబ్బందులు
- అరకొర నీటితో బోగీల్లో పారిశుద్ధ్య సమస్య
- ప్రయాణికులు ఫిర్యాదులు చేస్తున్నా ఫలితం శూన్యం



ఈనాడు, హైదరాబాద్: రైళ్లలో నీటి నిర్వహణ లోపాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కొన్ని దూరప్రాంత రైళ్లలో ప్రయాణం మొదలైన కొద్ది గంటలకే బోగీల్లో నీళ్లు అయిపోతున్నాయి. మరుగుదొడ్లు, వాష్‌బేసిన్లలో నీరు రాకపోవడంతో ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. మల, మూత్ర విసర్జనకు వెళ్లలేక అనేక తంటాలు పడుతున్నారు. గంటల తరబడి ఎదురుచూపుల తర్వాత వచ్చే పెద్దస్టేషన్‌లో నీళ్లు నింపిన తర్వాత గానీ కష్టాలు తీరడం లేదు.

దేశవ్యాప్తంగా నిత్యం 13,500 రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. సగటున రోజుకు 2.30 కోట్ల మంది ప్రయాణిస్తుంటారు. రైల్లో ప్రయాణికులకు అత్యంత అవసరమైనవి మరుగుదొడ్లు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి బోగీకి నీటి ట్యాంకులు ఉంటాయి. రైలు బయల్దేరేటప్పుడే నీరు నింపుతారు. అయిపోయిన తర్వాత మళ్లీ నింపేందుకుగాను కొన్ని స్టేషన్లలో రైళ్లను 15, 20 నిమిషాల వరకు ఆపుతుంటారు. కానీ, నీటిని నింపే స్టేషన్ల మధ్య కొన్ని మార్గాల్లో ఎక్కువ దూరం ఉండడం, కొన్ని చోట్ల అరకొరగా ఎక్కించడం, మరి కొన్ని చోట్ల జోన్ల మధ్య సమన్వయ లేమి వంటి కారణాలతో ప్రయాణం మధ్యలోనే బోగీల్లో నీళ్లు అయిపోతున్నాయి. ఆ ప్రభావం ప్రయాణికులపై పడుతోంది.

కొన్ని చోట్ల నీటి కొరతతో..

బెంగళూరు నుంచి హైదరాబాద్, విజయవాడ వైపు వెళ్లే రైళ్లలో నీటి సమస్య తరచుగా వస్తున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. గుంతకల్లు స్టేషన్‌లో ప్రయాణికులు పలు మార్లు ఈ విషయంపై ఆందోళన వ్యక్తంచేశారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, ఒకట్రెండు ఇతర రైళ్లలో ఈ సమస్య తరచూ వస్తోందని.. రైలు సౌత్‌వెస్టర్న్ జోన్‌ది కావడంతో నిర్వహణ అంశాల్లో వారిదే బాధ్యతని గుంతకల్లు డివిజన్ అధికారులు చెబుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు.

- ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2 గంటలకు బెంగళూరులో బయల్దేరి రాత్రి 8.15కి గుంతకల్లు చేరుతుంది. ఇక్కడ 15 నిమిషాలు ఆపినా.. నీటి సమస్య వల్ల నింపడం లేదు. నంద్యాల దాటాక వచ్చే దిగువమెట్లలో నీళ్లు నింపుతున్నారు. అర్ధరాత్రి 12.20కి రైలు అక్కడికి వెళుతుంది. అంటే బెంగళూరులో నింపిన నీళ్లతోనే 10 గంటల పాటు ప్రయాణికులు సర్దుకుపోవాల్సిన పరిస్థితి.
- ప్రయాణికుల ఫిర్యాదుల నేపథ్యంలో గుంతకల్లులో రూ.9 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

అక్కడ పట్టించుకునేవారే లేరు..

దిల్లీ నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వైపు వచ్చే రైళ్లలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లోని స్టేషన్లలో నీళ్లు నింపాలి. ఝాన్సీ, నాగ్‌పుర్ స్టేషన్లలో కొన్ని రైళ్లలోనే నింపుతుండగా.. మరికొన్ని స్టేషన్లలో నింపడమే లేదు. దీంతో మార్గమధ్యంలో ప్రయాణికుల కష్టాలు మొదలవుతున్నాయి. తెలంగాణలోని కాజీపేట స్టేషన్‌లోనూ ఆయా రైళ్లకు నీళ్లు నింపడం లేదు. దీంతో అటు సికింద్రాబాద్‌కు, ఇటు విజయవాడ స్టేషన్‌కు వెళ్లేవరకు ప్రయాణికులు ఉగ్గపట్టుకోవాల్సిందే. ధన్‌బాద్, నాగ్‌పుర్ ఎక్స్‌ప్రెస్‌ల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. తమిళనాడు, కేరళ నుంచి తిరుపతి, రేణిగుంటల మీదుగా ఏపీ, తెలంగాణలకు వచ్చే రైళ్లలోనూ నీటి సమస్యలు తప్పడం లేదు.

జనరల్ బోగీల్లోనూ..

పగటి ప్రయాణం ఉండే రైళ్లలోనూ నీటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. 24, 30 గంటలు ఆపైన ప్రయాణించే రైళ్లలో రాత్రి, పగలు అన్న తేడా లేకుండా నీటి సమస్య వస్తోంది. జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి కష్టాలైతే అన్నీఇన్నీ కావు. ఆ బోగీలో 92 మంది ప్రయాణికులు ఉండాలి. కానీ, దాదాపు ప్రతి రైల్లో రెట్టింపు ఉంటారు. ఫలితంగా ఈ బోగీల్లో త్వరగా నీళ్లు అయిపోతున్నాయి. అయినప్పటికీ కొంతమంది ప్రయాణికులు తప్పనిసరై మూత్రవిసర్జనకు వెళుతుండడం వల్ల దుర్వాసనతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

సీడీపీ, ప్రత్యేక అభివృద్ధి నిధులపై ఆడిట్ సంగతేంటి?

తెలంగాణ ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం(సీడీపీ), ప్రత్యేక అభివృద్ధి నిధి కింద ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధుల వినియోగంపై ఆడిట్ జరుగుతోందా? లేదా? అంతర్గత తనిఖీ ఏమైనా ఉందా? తదితర పూర్తి వివరాలను తెలియజేయాలంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని ఉమ్మడి హైకోర్టు వివరణ కోరింది. ఎలాంటి అధికారిక తనిఖీ లేకుండా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు (సీడీపీ నిధులు), మంత్రులకు (ప్రత్యేక అభివృద్ధి నిధి) రూ.700 కోట్ల దాకా కేటాయించారంటూ 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్' కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ప్రభుత్వం విడుదల చేస్తున్న రూ.700 కోట్ల నిధులపై ఎలాంటి ఆడిట్ గానీ, ట్రెజరీ తనిఖీగానీ జరగడంలేదని చెప్పారు. అడ్వొకేట్ జనరల్ డి.ప్రకాశ్‌రెడ్డి సమాధానమిస్తూ.. ఈ నిధుల వినియోగానికి సంబంధించి ప్రజాప్రతినిధులకు సొంత షెడ్యూల్ ఉంటుందని.. నిర్దుష్ట గడువులోగా ఖర్చు పెట్టాలన్న నిబంధన ఉండదన్నారు. నిధుల వినియోగానికి సంబంధించి అంతర్గత తనిఖీ కచ్చితంగా ఉందని వివరించారు. శాఖాపరమైన తనిఖీల గురించి పూర్తి వివరాలు తెలుసుకొని చెబుతానన్నారు. దీంతో ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది.

వర్షాలతో పలు రైళ్ల రద్దు

ఈనాడు, హైదరాబాద్: ఈశాన్య రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. సికింద్రాబాద్ నుంచి, తెలుగు రాష్ట్రాల మీదుగా రాకపోకలు సాగించే పలు రైలు సర్వీసులు 17, 18, 19, 20 తేదీల్లో రద్దయ్యాయి.

అస్తవ్యస్తంగా ఉద్యోగ ప్రకటనలు

- ఖమ్మం నిరుద్యోగ సదస్సులో ఆచార్య కోదండరాం

ఖమ్మం గట్టయ్య సెంటర్, న్యూస్‌టుడే : ఎన్నికల సమయంలో లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన కేసీఆర్ నేడు అస్తవ్యస్తంగా ఉద్యోగ ప్రకటనలు చేస్తూ విద్యార్థుల విలువైన జీవితాన్ని, సమయాన్ని హరించివేస్తున్నారని తెఐకాస ఛైర్మన్ ఆచార్య కోదండరాం ఆరోపించారు. అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ, సింగరేణి, విద్యుత్తు వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నారు. అధిక అవకాశమున్న సేవా, ప్రజా రంగాల్లో నియామకాలు జరగడం లేదన్నారు. 2014 నాటికి రాష్ట్రంలో లక్ష ఉద్యోగ అవకాశాలున్నాయని, ఈ మూడేళ్లలో మరో 47 వేల ఉద్యోగ ఖాళీలు ఏర్పడ్డాయని, కొత్త జిల్లాల ఏర్పాటుతో మరో 10 వేలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజారంగ సంస్థలలో 50 వేల ఖాళీలున్నాయని, రెండు లక్షలకు పైబడి ఖాళీలుంటే ప్రభుత్వం భర్తీ చేస్తామని చెబుతున్నది 27 వేల ఉద్యోగాలేనని, ఇందులో కూడా స్పష్టత లేదన్నారు. ఆర్టీసీలో 35వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెబుతున్నా అది వాస్తవం కాదని కోదండరాం తెలిపారు. ఎస్.ఐ రాత పరీక్షలు జరిగి సంవత్సరం గడుస్తున్నా ఫలితాలెందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. విద్యాశాఖలో ఖాళీలున్నా ఇప్పటి వరకు డీఎస్సీ ప్రకటన ఎందుకు చేయలేదన్నారు. ప్రజాప్రతినిధులు ఏ కాంట్రాక్టులను ఏవిధంగా దక్కించుకోవాలా అని చూస్తున్నారని, ప్రశ్నించే గొంతును నొక్కడం మానుకోవాలని కోదండరాం పేర్కొన్నారు. దసరా తరువాత హైదరాబాదులో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. సభలో సీపీఐ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల నాడు చేసిన హామీలలో ఏ ఒక్కదాన్ని కూడా నెరవేర్చలేదని విమర్శించారు.



ఖమ్మం నిరుద్యోగ సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య కోదండరాం

ఎన్డీ అజ్ఞాత దళం చేతిలో 'దేశం' కార్యకర్త హతం

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: న్యూడెమోక్రసీ(ఎన్డీ) అజ్ఞాత దళం(చంద్రన్న వర్గం) చేతిలో తెదేపా కార్యకర్త హత్యకు గురైన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం పాండురంగాపురం పంచాయతీ నర్సంపేట గ్రామంలో నివాసం ఉంటున్న రాయల భాస్కర్(55)ను దళ కమాండర్ రవి ఆధ్వర్యంలో 20 మంది బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఆయన ఇంటికెళ్లి విచారణ పేరుతో బయటకు పిలిచారు. ఈ క్రమంలో ఆయన పరుగుతీయగా దళసభ్యులు వెంబడించి సుమారు అర కిలోమీటరు దూరంలో ఉన్న జామాయిల్ తోటలో పట్టుకొని చితకబాదారు. అనంతరం గ్రామంలోకి తీసుకెళ్లి గ్రామస్థులందరూ చూస్తుండగానే భాస్కర్‌ను కొట్టారు. స్థానికులు అడ్డుకోవడానికి ప్రయత్నించడంతో వారిని తుపాకులతో బెదిరించారు. క్షతగాత్రుడు దాహమని అర్థిస్తున్నప్పటికీ.. మంచినీరు పోస్తే చంపేస్తామని గ్రామస్థులను బెదిరించి పక్కనున్న గుట్టల్లోకి వెళిపోయారు. వారు వెళ్లిన అయిదు నిమిషాల వ్యవధిలోనే క్షతగాత్రుడు ప్రాణం విడిచాడు. ఎన్డీలో రాయల వర్గం, చంద్రన్న వర్గం అంతర్గత పోరే హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది. భాస్కర్ గతంలో చంద్రన్న వర్గానికి సానుభూతిపరుడు కాగా ప్రస్తుతం రాయల వర్గం వైపు ఉంటున్నాడు.



భాస్కర్(పాతచిత్రం)

తాత్కాలిక ఉద్యోగాలన్నీ క్రమబద్ధీకరించాలి

- సీఎం కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి లేఖ

ఈనాడు, హైదరాబాద్: అటవీ శాఖలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న వారి ఉద్యోగాలన్నింటినీ క్రమబద్ధీకరించాలని.. ఈ ప్రక్రియ చేపట్టడానికి ఏమైనా ఇబ్బందులంటే విద్యుత్ సంస్థల్లో మాదిరిగా వారిని అటవీశాఖలో విలీనం చేయాలని డిమాండు చేస్తూ తెలుగుదేశం తెలంగాణ కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. వీరికి అటవీశాఖలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. వీరి వేతనాల నుంచి మినహాయించుకున్న పీఎఫ్, ఈఎస్‌ఐ సొమ్ము దుర్వినియోగమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని.. దానిని తిరిగి ఉద్యోగుల ఖాతాల్లో వేయాలన్నారు. కాంట్రాక్టు, పొరుగు సేవల ఉద్యోగాలన్నీ క్రమబద్ధీకరిస్తామని కేసీఆర్ ఇచ్చిన హామీని ఇప్పటిదాకా అమలు చేయలేదని పేర్కొన్నారు.

జూన్‌లోగా ఎస్సారెస్పీ రెండో దశ

- యుద్ధప్రాతిపదికన తుపాకుల గూడెం పనులు
- సమీక్షలో మంత్రి హరీశ్‌రావు



ఈనాడు, హైదరాబాద్: శ్రీరాంసాగర్ రెండో దశ ప్రాజెక్టు పనులను 2018 జూన్‌లోగా పూర్తి చేయాలని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. వచ్చే ఏడాది కాళేశ్వరంతో ఎస్సారెస్పీ ఆయకట్టును అనుసంధానం చేస్తున్నందువల్ల ఈ లోపే పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇకపై ప్రతి వారం పనుల పురోగతిని సమీక్షించాలని ఉన్నతాధికారులకు సూచించారు. ఎస్సారెస్పీ రెండో దశ, తుపాకుల గూడెం ప్రాజెక్టులపై బుధవారం జలసౌధలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో ఈఎన్‌సీ మురళీధర్, పరిపాలన విభాగం ఈఎన్‌సీ నాగేందర్‌రావు, వివిధ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. హరీశ్ మాట్లాడుతూ తుపాకుల గూడెం పనులు వేగవంతం చేయాలని, ఇది పూర్తయితేనే పది నెలల పాటు దేవాదుల పంపులు నిరంతరాయంగా పనిచేస్తాయని తెలిపారు. ఆరు లక్షల ఎకరాల స్థిరీకరణ జరుగుతుందన్నారు. ఎస్సారెస్పీ రెండో దశ నుంచి పూర్వ నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని కరవు పీడిత ప్రాంతాల్లో నాలుగు లక్షల ఎకరాలకు నీరందించే పనులు శరవేగంగా సాగాలన్నారు. "2005 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై దృష్టి సారించాం.. రెండో దశ కింద మొత్తం రూ. 1321 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఇప్పటికి 2.25 లక్షల ఎకరాలను స్థిరీకరించాం. మరో 1.75 లక్షల ఎకరాలకు సాగునీరందించాలి. కాకతీయ ప్రధాన కాలువలో లైనింగు దెబ్బతినడం, పూడిక వంటి కారణాలతో వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు సరిగా నీరందడం లేదు. మరమ్మతులను వెంటనే పూర్తి చేసి, అన్నింటిని ఉపయోగంలోకి తీసుకొని రావాలి. పూర్వ నల్గొండ జిల్లాలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ, ఖమ్మం జిల్లాలోని పాలేరు, మధిర, వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట, పాలకుర్తి, డోర్నకల్ నియోజకవర్గాలలోని చివరి ఆయకట్టుకు నీరందుతుంది. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకొని సమస్యలను పరిష్కరించాలి. ఎల్ఎండీకి దిగువ, ఎగువ ప్రాంతాల్లో కాలువల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులుండొద్దు. ఇప్పటి వరకు ఎస్సారెస్పీ నీటిని చూడని భూపాలపల్లి, మహబూబాబాద్, డోర్నకల్ నియోజవకర్గాలకు సాగునీరందించేందుకు కృత నిశ్చయంతో ఉన్నాం" అని హరీశ్‌రావు వివరించారు.

'మాదక ద్రవ్యాల కేసులో డిసెంబరులోగా ఛార్జిషీట్లు'

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల వ్యవహారంలో 11 కేసులు నమోదు చేసి 22 మందిని విచారించామని ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ తెలిపారు. డిసెంబరులోగా విచారణ పూర్తిచేసి ఛార్జిషీట్లు దాఖలు చేస్తామన్నారు. బుధవారం వరంగల్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. డ్రగ్స్ కేసులో విచారణ వేగంగా సాగుతోందని.. నమోదు చేసిన కేసులను బట్టి ఆయా వ్యక్తులకు కొంత గడువు ఇవ్వవలసి ఉందని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 98 శాతం గుడుంబాను నియంత్రించామని, త్వరలోనే వంద శాతం సాధించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గుడుంబా బాధిత కుటుంబాలకు పునరావాసం కల్పించడంలో వరంగల్ గ్రామీణ జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. వరంగల్ అర్బన్, జనగామ జిల్లాలు వందశాతం గుడుంబాను నియంత్రించగలిగాయని వివరించారు.

ఒమన్‌లో మోసపోయి స్వదేశానికి

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: చేసిన పనికి వేతనాలు రాక, ఇబ్బందులు పడుతున్న ఆరుగురు కార్మికులు ఒమన్ దేశం నుంచి బుధవారం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఉపాధి కోసం ఒమన్ వెళ్లామని.. రేయింబవళ్లు కష్టపడినా సంస్థ యజమానులు మాత్రం నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేదని.. కడుపు నిండా తిండి లేక నరకయాతన అనుభవించామని బాధితులు తెలిపారు. ప్రాణం మీదకు వచ్చిన పరిస్థితుల్లో... తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డికి సమాచారమిచ్చామన్నారు. ఆయన ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడటంతో తాము స్వదేశానికి చేరుకున్నామని తెలంగాణలోని వికారాబాద్ జిల్లా వాసి జె.బాబయ్య, నిజామాబాద్ జిల్లాకు చెందిన వి.భూమేష్, ఏపీకి చెందిన లక్ష్మీనారాయణ, తులసీరావు, పురుషోత్తం, గణేష్‌లు వెల్లడించారు. ఒమన్‌కు చెందిన పెట్రోన్ గల్ఫ్ ఎల్ఎల్‌సీ సంస్థ తమను నమ్మించి కష్టాన్ని దోచుకుందని వెల్లడించారు. విమానాశ్రయం నుంచి స్వగ్రామాలకు వెళ్లడానికి సహకరించిన తెలంగాణ వింగ్ కన్వీనర్.గణేష్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



విమానాశ్రయానికి చేరుకున్న కార్మికులు

తెలంగాణ యాసకు పుస్తక రూపం

- నిఘంటువు తయారీకి ప్రణాళిక
- లక్ష పదాల సేకరణ లక్ష్యం
- తెలుగు వర్సిటీ ముమ్మర కసరత్తు
- 28న కమిటీ తొలి సమావేశం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ భాషలో కనుమరుగవుతున్న పదాలు వెలుగులోకి రానున్నాయి. ఘన చరిత్ర ఉన్న తెలంగాణ యాశకు సంబంధించిన నిఘంటువు ఇప్పటివరకు ఒక్కటీ లేదు. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో విరివిగా వాడే ఎన్నో పదాలు వినియోగానికి దూరమవుతున్నాయి. దీన్ని గుర్తించిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణ ప్రజల భాష, యాస చిరకాలం ఉండేలా లక్ష పదాలతో నిఘంటువు తయారీకి శ్రీకారం చుట్టింది.

పదాల అన్వేషణకు కమిటీ

ఇందులో భాగంగా అరుదైన పదాలన్నింటినీ సేకరించి అక్షరబద్ధం చేయాలన్నది ప్రణాళిక. పదాల అన్వేషణకు అమరేశం రాజేశ్వరశర్మ, కట్టా శేఖర్‌రెడ్డి, రవ్వా శ్రీహరి, గంటా చక్రపాణి, డాక్టర్ నలిమెల భాస్కర్‌లతో కమిటీ వేశారు. ఈ కమిటీ ఆయా ప్రాంతాల్లోని భాషా నిపుణులు, రచయితలు, పత్రికా సంపాదకులు తదితరులతో సమావేశమై వారి సూచనలు సలహాలు తీసుకోనుంది. ఆయా రంగాల వారితో విడివిడిగానూ సమావేశాలు నిర్వహించనుంది. ఆగస్టు 28వతేదీ ఉదయం 11 గంటలకు వర్సిటీ ప్రాంగణంలో ఈ కమిటీ తొలి సమావేశం నిర్వహించనున్నారు. పలు రంగాలకు చెందిన నిపుణులతో సమావేశాలు నిర్వహించే విషయమై ఈ కమిటీ చర్చించి, తేదీలను ఖరారు చేయనుంది. తెలంగాణ చరిత్ర, భాషకు సంబంధించిన పలు పుస్తకాలను ఈ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భాషా నిపుణులు అధ్యయనం చేయనున్నారు. ఈ సమావేశానికి కమిటీ సభ్యులతోపాటు..సంగిశెట్టి శ్రీనివాస్, వర్సిటీ వీసీ ఎస్వీ సత్యనారాయణ హాజరుకానున్నారు.

6,040 మందికి పీజీఈసెట్ సీట్ల కేటాయింపు

21 నుంచి చివరి విడత కౌన్సెలింగ్

ఈనాడు, హైదరాబాద్: పీజీఈసెట్ మొదటి విడత సీట్లను ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారులు బుధవారం కేటాయించారు. కన్వీనర్ కోటా కింద ఎంటెక్, ఎంఫార్మసీ, ఆర్కిటెక్చర్ కోర్సుల్లో 7,096 సీట్లుండగా 6,040 మందికి సీట్లు దక్కాయి. మొత్తం 14,168 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవడం గమనార్హం. సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోపు ఫీజు చెల్లించి కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని కన్వీనర్ సమీన్ ఫాతిమా తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. 21వ తేదీ నుంచి చివరి విడత కౌన్సెలింగ్ జరుగుతుంది. గేట్, జీప్యాట్ ర్యాంకర్లకు 21న, ఇతర విద్యార్థులకు 22, 23 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన జరుపుతారు. ఈ నెల 23, 24న వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. సీట్లను 27న కేటాయిస్తారు.

నేటి నుంచి ఎంసెట్ బైపీసీ చివరి విడత కౌన్సెలింగ్

ఈనాడు, హైదరాబాద్: బీఫార్మసీ, ఫార్మా డి, బీటెక్ బయోటెక్నాలజీ కోర్సుల్లో చేరడానికి గురువారం నుంచి చివరి విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల కన్వీనర్ వాణీప్రసాద్ తెలిపారు. 17న ధ్రువపత్రాల పరిశీలన, 17, 18 తేదీల్లో వెబ్ ఆప్షన్ల ప్రక్రియ సాగుతుంది. వారికి ఈ నెల 20న సీట్లు కేటాయిస్తారు.

'పాత జిల్లాల ప్రకారం డీఎస్సీ నిర్వహించాలి'

ఈనాడు, హైదరాబాద్: డీఎస్సీ ప్రకటనను ఉమ్మడి జిల్లాల ప్రకారం జారీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యాశాఖ కమిషనర్, టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ విద్యార్థి సంఘాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వం గెజిట్ ఇవ్వకుండా, ప్రస్తుత ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు బదిలీ చేయకుండా కొత్త జిల్లాల ప్రకారం డీఎస్సీ నిర్వహిస్తే 28 జిల్లాల వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందని సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు.

డిగ్రీ మూడో విడత సీట్ల కేటాయింపుపై అయోమయం

ఈనాడు, హైదరాబాద్: డిగ్రీ మూడో విడత సీట్ల కేటాయింపుపై అయోమయం నెలకొంది. రెండు విడతల సీట్ల కేటాయింపు సజావుగా సాగినా మూడో విడత ఎప్పుడు చేస్తారో తెలియక విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు. వాస్తవానికి ఈనెల 4వ తేదీన సీట్లను కేటాయించాలి. ఆ తర్వాత 7వ తేదీ అని చెప్పి చివరకు ఈనెల 10న కేటాయించారు. అయితే సీట్ల కేటాయింపు సమయంలో సుపరిపాలన కేంద్రం(సీజీజీ) అధికారులు సాంకేతికంగా పొరపాట్లు చేయడంతో అదేరోజు సీట్ల కేటాయింపును నిలిపివేశారు. అప్పటి నుంచి బుధవారం వరకు సీట్లు కేటాయించకపోవడంతో విద్యార్థులు వాటి కోసం ఎదురుచూస్తున్నారు. దీనిపై బుధవారం ఓయూ అధికారులు రంగంలోకి దిగి సీజీజీ అధికారులతో చర్చించారు. ఉన్నత విద్యామండలి వర్గాలు మాత్రం ఒకటి రెండు రోజుల్లో సీట్ల కేటాయింపు చేస్తామని చెబుతున్నాయి.

బడి పిల్లలపై భారం తగ్గించండి

నారాయణగూడ,(హైదరాబాద్) న్యూస్‌టుడే: బడి పిల్లలపై పుస్తకాల భారం తగ్గించాలని, హోంవర్క్ ఒత్తిడిని కట్టడి చేయాలని బాలల హక్కుల సంఘం బుధవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు దాఖలు చేసింది. విచారణకు స్వీకరించిన కమిషన్ అక్టోబరు 31లోపు వివరణ ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. సంఘం అధ్యక్షురాలు అనురాధరావు పిల్లలపై ఎలాంటి ఒత్తిడి ఉంటుందో కమిషన్‌కు వివరించారు.

మంటల్లో జెడ్డా చారిత్రక నగరం

దుబాయ్: జెడ్డాలోని 1400 ఏళ్ల పురాతన నగరంలో ఆరు భవంతులు మంటల్లో చిక్కుకున్నాయి. ఇందులో మూడు భవనాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఇందులో ఎవరూ గాయపడనప్పటికీ, మంటల భయంతో సౌదీ అరేబియా రక్షణ సిబ్బంది 60మందిని బలవంతంగా వారి ఇళ్లనుంచి ఖాళీ చేయించారు. మంటల వ్యాప్తికి కారణం తెలుపనప్పటికీ ఔత్సాహికులు తీసిన వీడియోలో జనాలు వీధుల్లోకి వచ్చి నిలబడినట్లు, చుట్టూ ఉన్న భవనాలకు మంటలు వ్యాపిస్తున్నట్లు వాటి మధ్య శిథిలాలు కూలుతున్నట్లు ఉంది. జెడ్డా పురాతన నగరం 'అల్-బలాద్'గా ప్రసిద్ధి. ఏడవ శతాబ్దంలో మక్కాను చేరుకోవడానికి వ్యాపారం జరపడానికి, వస్తువులను తరలించడానికి ముఖ్యమైన రేవు పట్టణంగా ఉండేది. దీనిని యునెస్కో ప్రపంచ వారసత్వ నగరంగా గుర్తించింది.

వసుంధర

మనసు మాట విందాం!

ఏదైనా పని ప్రారంభిద్దాం అనుకునేప్పుడు ఉండే ఉత్సాహం...మొదలు పెట్టిన రెండు మూడు రోజులకే చల్లారిపోతుంది. దీనికి కారణాలు అనేకం. అది మీరు కోరుకున్న అంచనాలకు తగినట్లుగా లేకపోవడం, లేదా దానిపై మీరు పట్టు తెచ్చుకోలేరనే అపనమ్మకం. కారణాలు ఏవైనా ఓ లక్ష్యం అనుకున్నాక దాన్ని చేరుకోవడానికి వందశాతం ప్రయత్నించాల్సిందే.

- నిరాశకు కారణం ఏదైనా...పదే పదే తలుచుకోవడం వల్ల మరింతగా అందులోకి కూరుకుపోతారు. ఇలా ఎక్కువకాలం కొనసాగితే మానసికంగా కుంగుబాటూ ఎదురుకావొచ్చు. ప్రతికూలతలు ఎదురైనప్పుడు వాటినుంచి ఎలా బయటపడాలో ఆలోచించాలే తప్ప పదే పదే కారణాలు విశ్లేషించొద్దు. పదిమందితో బాధను పంచుకోవడం ద్వారా అవి అదుపులోకి రాకపోవచ్చు. అలాకాకుండా ప్రతి అపజయం కూడా మీకు పాఠం నేర్పుతుందనీ...అలా వేస్తోన్న ప్రతి అడుగూ మిమ్మల్ని విజయానికి దగ్గర చేస్తుందని నమ్మండి. ఆ సానుకూలతే మీకు బలం అవుతుంది.
- ఒకపని చేయాలని తలపెట్టినప్పుడే దాన్ని పూర్తి చేయగల శక్తి సామర్థ్యాలు మీకు ఉన్నాయో లేదో అంచనా వేసుకోండి. ఇది వాస్తవికంగా ఉండాలి తప్ప...అతిగా ఊహించుకోవడం వల్ల మీకే ఇబ్బంది. ఇలాంటప్పుడు బలాలూ, నైపుణ్యాలు పెంచుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడే మీరనుకున్నది సాధ్యమవుతుంది



- ఏదైనా పనిచేయాలనుకోగానే కొందరు వెనక్కి లాగడానికి ప్రయత్నిస్తుంటారు. దీనివల్ల ముందుకు వెళ్లాలా? వెనక్కా అన్న మీమాంసలో పడిపోతుంటారు. ప్రతికూల ఆలోచనలు పెరిగిపోతాయి. ఇలాంటప్పుడు మీ మనసుకే ఓటేయండి. అంతకు ముందే మీరు అలాంటి ప్రతికూల వ్యక్తులను మీ చుట్టూ లేకుండా చూసుకోండి. అప్పుడే అనుకున్నది అనుకున్నట్లు చేయడం సాధ్యం అవుతుంది.

స్లింగ్ బ్యాగుతో సొగసుగా!



ఏ దుస్తులు వేసుకుంటే ఎలాంటి బ్యాగులు ఎంచుకోవాలి? ఏ సందర్భానికి ఏవి నప్పుతాయి ఇలా బోలెడు సందేహాలు మనకు వస్తూ ఉంటాయి. .

- **క్లచ్‌లు:** ధగధగలాడే రాళ్లూ, పూసలూ, ముత్యాలు పొదిగిన చిన్న పర్సు కన్నా కాస్త పెద్దగా ఉంటుందిది. వేడుక ఏదైనా సరే రాత్రిపూట జరిగే పార్టీల్లో మెరిసిపోయేలా వేసుకునే దుస్తులకు సరిజోడీ అనిపిస్తూ కొత్తలుక్‌ని తెచ్చిపెడుతుంది.
- **వాలెట్:** హ్యాండ్‌బ్యాగ్ ఎంత పెద్దది అయినా అలంకరణ వస్తువులూ, ఇతరత్రా అవసరాలూ, డబ్బూ, కార్డులు వంటివి పెట్టుకోవడం కాస్త ఇబ్బందే. ఇలాంటప్పుడు ఓ చిన్న పర్సును ఎంచుకోండి. వీటిల్లో ఫోను పట్టేవీ దొరుకుతున్నాయిప్పుడు. గ్రాఫిక్, డిజిటల్ ప్రింట్లూ, చూడచక్కని రంగులతో కొత్తగానూ వస్తున్నాయి.
- **హ్యాండ్‌బ్యాగ్:** ఆఫీసుకి వెళ్లేప్పుడు బ్యాక్‌ప్యాక్ అంతగా నప్పకపోవచ్చు. అలాంటప్పుడు టోటె తరహాలో హ్యాండు బ్యాగు తప్పనిసరిగా ఉండాల్సిందే. వీటిని భుజాలకు లేదా చేతులతో పట్టుకునేలా ఎంచుకుంటే బాగుంటుంది.
- **స్లింగ్‌బ్యాగ్:** స్టైలిష్‌లుక్‌తో, కొత్తగా కనిపించేలా చేస్తాయివి. వీటిల్లో లెదర్, మెటాలిక్ చెయిన్ వాడొచ్చు. అలానే పొడవు, పొట్టి ...ఇలా వేటిని ఎంచుకున్నా సరే కాలేజీలకే కాదు.. పార్టీలూ, ప్రయాణాలకూ బాగుంటాయి.

నెం.316, భూమి మాల్, సీబీడీ బెల్లాపూర్.. నవీ ముంబయిలోని ఓ హోటల్ చిరునామా ఇది. పేరు 'అదితి కార్నర్'. చిరుతిళ్లూ, మధ్యాహ్న భోజనం ఉంటాయక్కడ. ఇరవై మూడేళ్ల అదితి దాని నిర్వాహకురాలు. అందులో విశేషం ఏముందంటారా? అదితి శారీరక వయసు ఇరవైమూడేళ్లే అయినా.. మానసికంగా తనింకా పదమూడేళ్ల అమ్మాయే! అవును.. అదితి డౌన్స్‌సింద్రోమ్ బాధితురాలు! సాధారణంగా ఈ సమస్య ఉన్నవాళ్లు తమ సొంత పనులు చేసుకోవడమే కష్టం. మరి ఓ హోటల్ నడిపేంత సామర్థ్యం ఎలా వచ్చింది? అదే ఆమెని అడిగితే.. 'మేరే పాస్ మా హై..' అంటుంది. ఇక్కడికి ఆరుకిలోమీటర్ల దూరంలో ఉన్న వాళ్లింటి వైపుగా చేయి చూపిస్తూ!



అదితి బలం అమ్మే!



అదితి వాళ్లింటికి వెళ్లి వాళ్లమ్మని పలకరించడానికి ముందు ఆ హోటల్‌ని తేరిపార చూస్తే మరెన్నో విశేషాలు కనిపించాయి. ముఖ్యంగా గోడలపై అంటించిన ఆంగ్ల వ్యాఖ్యలు..! 'శ్రమ.. జీవితంలో ఆనందానికి మూలం. కానీ ఖాళీ కడుపుతో ఎవరూ ఏ రకంగానూ శ్రమించలేరు. కాబట్టి రండి.. కాస్త తిని పోదురు!' 'ఇక్కడ భోజనంతోపాటూ ప్రేమాభిమానాలనీ వడ్డిస్తాం..!' అనే అర్థం వచ్చే వాక్యాలూ అక్కడికి వచ్చేవారిని కట్టిపడేస్తుంటాయి. 'ఇవన్నీ నువ్వే రాశావా.. అదితీ?' అని అడిగితే 'కాదండీ.. అమ్మ రాసింది!' అంటుంది నిజాయతీగా. నిజానికి ఈ అమ్మాయి ఏ బడికీ వెళ్లలేదు. ఏ పరీక్షా రాసిన అనుభవమూ లేదు. అయినా.. ఈ షాపునకు సంబంధించిన జమా ఖర్చులూ, సరకు నిల్వ వివరాలన్నీ అదితీయే రాస్తుంటుంది. ఆహార పదార్థాలు నిండుకుంటే స్వయంగా తానే వెళ్లి తీసుకొస్తుంది. అంతేకాదు.. ఈ షాపులో పని చేస్తున్న ముగ్గురు సిబ్బంది జీతభత్యాల నిర్వహణా ఆమెదే. అంతేకాదండోయ్! ఈ షాపులో మధ్యాహ్నం 'ఇంటి భోజనం' విక్రయిస్తుంటారు. దాన్నీ అదితీయే వండుతుంది. 'ఇవన్నీ ఎవరు నేర్పించారు నీకు..?' అని అడగడానికి ముందే 'మేరా మా!' అని చెప్పేస్తుంది అదితి.. కాసింత గర్వంగా! ఇవన్నీ ఒకెత్తయితే ప్రతిరోజూ కార్ఘర్ ప్రాంతంలో ఉన్న వాళ్లింటి నుంచి తన హోటలున్న సీబీడీ బెల్లాపూర్‌కి ఒంటరిగానే వస్తుంటుంది. డౌన్స్ సింద్రోమ్ సమస్య ఉన్నవాళ్లు ఇన్ని పనులు చేయడం ఓ అసాధారణమైన విషయం! ఇన్ని అసాధారణ విజయాల వెనుక ఉన్నది ఆమె తల్లి.. రీనా వర్మ.

కన్నీరు దాచుకుని.. రీనా వర్మ ఎంకామ్, ఎంబీఏ చేశారు. పన్నెండేళ్ల కిందటి దాకా ఓ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తూ ఉండేవారు. ఆమెకి అమిత్ వర్మతో పాతికేళ్లకిందట పెళ్లైంది. తర్వాతి రెండేళ్లకి అదితి పుట్టింది. 'పుట్టిన మూడు నెలలకే మాకు అర్థమైపోయింది.. ఈ అమ్మాయికి ఏదో సమస్య ఉందని! మా బావగారు వైద్యుడు. ఆయనే పరీక్షలన్నీ చేశారు. డౌన్స్ సింద్రోమ్ సమస్య ఉందని చెప్పారు. వెయ్యిమందిలో ఒకరికి ఇలా జరుగుతుందట! ఎంత చదువుకున్నదాన్నయినా ఆ నిజాన్ని తట్టుకోలేకపోయాను. పుట్టెడు శోకంలో మునిగిపోయాను. కనీసం తల్లిగా నన్ను గుర్తించలేని పాపని చూసి కన్నీరు మున్నీరయ్యాను. కానీ ఈ నిజాన్ని అంగీకరించడం ఒక్కటే నా ముందున్న మార్గం అని తెలుసుకున్నా. వైద్యుల్ని సంప్రదిస్తూ పాపకి మెల్లగా కూర్చోవడం, నడవడం నేర్పించాను. మొదట అవన్నీ చేయలేక బాగా ఏడ్చేది. 'అయ్యో..! నా చిట్టితల్లిని ఇబ్బంది పెడుతున్నానే' అని కుమిలిపోయేదాన్ని. కానీ పాపలో మార్పు రావాలంటే ఆ మాత్రం కఠినంగా ఉండక తప్పదనిపించింది. అదే చేశాను. రెండేళ్లలోనే పాప నడవడం, నన్నూ, మిగతావారిని గుర్తుపట్టడం మొదలుపెట్టింది..' అని గుర్తు చేసుకుంటారు రీనా. కానీ ఆ ఆనందం ఎక్కువకాలం నిలవలేదు. అదితికి మరో పెద్ద సమస్య ఉందని తేలింది.


అదేమిటంటే.. 'అదితి గుక్కపెట్టి ఏడ్చినప్పుడల్లా ఒళ్లంతా నీలంగా మారేది. ఒక్కోసారి మూర్ఛపోయేది కూడా. ఓసారి సమస్య తీవ్రమై ఆసుపత్రికి తీసుకెళితే గుండెకి రంధ్రాలున్నాయని చెప్పారు. శస్త్రచికిత్స చేయాలన్నారు. చేయించాం. దాన్నుంచి పాప పూర్తిగా కోలుకోవడానికి ఏడాది పట్టింది. ఈలోపు పాత విషయాలన్నీ మర్చిపోయింది! మళ్లీ అన్నీ కొత్తగా నేర్పించడం మొదలుపెట్టాను. ఈసారి కాస్త వేగంగా నేర్చుకుంది. కానీ ఎన్ని నేర్పిస్తున్నా ఒక్కటే అనుకున్నాను. నా కూతురిని అతిగా సంరక్షించకూడదని. ఎందుకంటే ఎంత సున్నితంగా పెంచితే తనకంత ప్రమాదం..! ఇప్పటికీ దాన్నే పాటిస్తున్నా. అదితికి ఎనిమిదేళ్లు వచ్చినప్పుడు బడిలో వేద్దామని అనుకున్నాం కానీ ఎవరూ చేర్చుకోలేదు. కొంతకాలం ప్రత్యేక శిక్షణకీ పంపించాను. అదీ పెద్దగా ఉపయోగపడలేదు. దాంతో అన్నీ నేనే నేర్పడం మొదలుపెట్టాను.. అంకెల నుంచి అక్షరాల దాకా. ఈలోపు అదితికో తమ్ముడు పుట్టాడు. వాడు ఆరేళ్ల నుంచే అదితిని చూసుకోవడం మొదలుపెట్టాడు. అటు అధ్యాపకవృత్తినీ, ఇటు పాపనీ చూసుకోవడం ఇబ్బంది అనిపించి ఉద్యోగానికి రాజీనామా చేశాను. ఆ తరవాత తీరిక దొరికినప్పుడు మావారి సరకు రవాణా వ్యాపారంలో పాలుపంచుకోవడం మొదలుపెట్టాను..' అని చెబుతున్నారు రీనా.

కాల్చుకుంటూ నేర్చుకుంది! 'అదితి బయట ప్రపంచం గురించి తెలుసుకోవడానికీ, తన పని తాను చేసుకోవడానికి చాలా ఏళ్లే పట్టింది' ఈలోపు ఆమెకి ఆసక్తి ఎలా వచ్చిందో తెలియదు కానీ.. వంటలపై మక్కువ పెంచుకుంది. మ్యాగీ చేసి నా నోటికి మొదటి చెంచా అందించిన రోజుని ఇప్పటికీ మరిచిపోలేను! ఆ తర్వాత యూట్యూబ్‌లో చూసి అన్నం వండింది. ఓ రోజు కూర చేస్తున్నప్పుడు చేయి బాగా కాలింది..! ఆమెకి వంటలో ఏర్పడ్డ తొలి గాయం అది. బాగా భయపడిపోయి ఇక నేను వంటలు చేయను! అంటూ ఏడ్చింది. ఆమెకి పదేపదే నచ్చజెప్పి మళ్లీ గరిటె పట్టించా! మళ్లీ చక్కగా వంటలు చేయడం మొదలుపెట్టింది. తన ఆసక్తి చూశాక.. ఓ హోటల్ పెట్టిద్దామనే ఆలోచన వచ్చింది నాకు. మా ఆయనా, మా అబ్బాయి 'అసలిది జరిగే పనేనా?' అన్నారు. 'నేను చేయిస్తాగా..!' అన్నాను. ఈ విషయం మా అమ్మాయితో చెబితే ఎగిరి గంతేసింది. అలా భూమి మాల్‌లో ఖాళీగా ఉన్న షాపు స్థలాన్ని అద్దెకి తీసుకుని 2016 జనవరిలో 'అదితి కార్నర్' పెట్టించా. చిరుతిళ్లతోపాటూ మా అదితి తయారుచేసే మధ్యాహ్న భోజనమే ఇక్కడ స్పెషల్! ఆమెకి నేనూ వంటసాయం చేస్తుంటా..' అంటారు రీనావర్మ. కానీ డౌన్స్ సింద్రోమ్ ఉన్న అమ్మాయి బాహ్య ప్రపంచంలోకి వచ్చి పరాయివాళ్లతో కలిసిపోయి వ్యాపారం చేయడం చిన్న విషయమా? తొలి మూడునెలలు చాలా తబడడింది అదితి!

ఎంత ఎదిగిపోయిందో.. వాళ్లమ్మకి ఫోన్ చేసి ప్రతిదీ అడుగుతుండేదట. కానీ పోనుపోను.. అన్నీ నేర్చుకుంది. ఐదునెలల్లో లాభాలు చూడటం మొదలుపెట్టింది. 'ఆ రోజు మా పాప ఆనందం అంతా ఇంతా కాదు. మా అందరికీ ప్రత్యేకంగా పార్టీ ఇచ్చింది. 'మీ పాపని నమ్మి దండగ పెట్టుబడి పెడుతున్నావు..' అన్నవాళ్లంతా నోరెళ్లబెట్టారు. ఆ ఉత్సాహంతోనే మరో ముగ్గురు సిబ్బందిని నియమించుకుంది అదితి. వాళ్లతో పాటూ ఆమె కూడా హోటల్‌కి సంబంధించిన అన్ని పనులూ చేస్తుంటుంది..!' అంటారు రీనా. ఇప్పటికి ప్రతి రోజూ 80 భోజనాలు సరఫరా చేస్తుంది అదితి. ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు దాకా షాపులోనే ఉంటుంది. ఫోన్‌లలో ఆర్డర్లూ తానే తీసుకుంటుంది. అదితి గురించి పత్రికల్లో రావడం చూసి మా హోటల్‌కి వచ్చేవాళ్ల సంఖ్యా పెరుగుతోంది. నిజానికి ఇక్కడ వినియోగదారుల్ని ఆకట్టుకునేది అదితి తయారుచేసే భోజనమే కాదు! వచ్చినవాళ్లని స్వచ్ఛంగా ఆహ్వానించే ఆమె నవ్వు కూడా!! ఆ కల్మషంలేని నవ్వు వెనుక చూడగలిగితే వాళ్లమ్మ పంచిన నమ్మకం కూడా కనిపిస్తుంటుంది!

- సహకారం : కట్టంగూర్ మల్లేశం, న్యూస్‌టుడే, ముంబయి

బంగారం వెండి



16న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	-------	2,769
వెండి (గ్రా)	-------	42.20

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	-------	-------	29,840	30,100	29,750	29,900	29,400	29,620	29,950	30,060
ఆర్నమెంట్	-------	-------	27,700	28,000	27,590	27,780	27,480	27,690	27,550	27,750
వెండి(కిలో)	-------	-------	40,000	40,500	39,500	40,000	38,700	39,500	40,500	40,500

కలిపి అల్లితే.. కళ

ఎప్పుడూ ఒకేలా జడ వేసుకుంటే కొత్తదనం ఏముంటుంది చెప్పండీ? కాస్త వైవిధ్యంగా, ఆకట్టుకునేలా వేసుకోవడంలోనే మన ప్రత్యేకత కనిపిస్తుంది కదా.. అందుకే ఈసారి రెండు జడల్ని ఒకే దగ్గరకు తీసుకొచ్చి.. ఆకట్టుకునేలా ఎలా వేసుకోవాలో చూద్దాం.

సిగ సింగారం

1 

జుట్టును చిక్కుల్లేకుండా దువ్వి.. మాడుకు కాస్త అడుగున ఎడమవైపు పాయ తీసుకుని జడలా అల్లుకుని రబ్బరుబ్యాండు పెట్టుకోవాలి. ఇదేవిధంగా కుడివైపు కూడా చేయాలి. ఈ రెండు జడలూ తలమధ్యలోకి వచ్చేలా చూసుకోవాలి.



2 

జుట్టుకు ఎడమవైపు సన్నని పాయ తీసుకుని ముందుగా వేసుకున్న జడ అడుగునుంచీ రానిచ్చి... తరవాత కుడివైపు జడపైనుంచీ తెచ్చి పట్టుకోవాలి. ఇప్పుడు కుడివైపు మరో పాయను తీసి ఇందాకటిలానే చేయాలి. అప్పుడు మొదటి పాయ ముడిపడినట్లు అవుతుంది.

3 

ఇలా జడల పక్కన ఉన్న జుట్టు పూర్తయ్యేవరకూ ఎడమ, కుడివైపుల నుంచీ పాయల్ని తీసుకుని.. ఒకసారి అడుగు నుంచీ... మరోసారి పైనుంచీ ఇవతలకు తీయాలి. తరవాత మిగిలిన జుట్టును కలిపి రబ్బరుబ్యాండు పెట్టుకుంటే సరిపోతుంది.



ఈ అలంకరణకి సంబంధించిన వీడియోను www.eenadu.netలోని వసుంధర విభాగంలో చూడొచ్చు.

కేతా శోభారాణి
కేశాలంకరణ నిపుణురాలు

దానధర్మాలకో ట్రస్ట్.. ఎలా ఏర్పాటుచేయాలి?



జి. వరలక్ష్మి
న్యాయవాది

? నేను కేంద్ర విద్యాశాఖలో ఉద్యోగం చేసి పదేళ్లకిందట విరామం పొందాను. నా చిన్నప్పుడే అమ్మానాన్న చనిపోతే.. స్వయంకృషితో ఎదిగాను. నాకు నలుగురు అక్కలూ, నలుగురన్నలూ ఉన్నారు. వాళ్లుకానీ, వాళ్ల పిల్లలుకానీ నాకెప్పుడూ ఏ సాయమూ చేసిందిలేదు. నా 42 ఏళ్ల సంపాదనతో హైదరాబాద్‌లో ఓ ఇల్లు కొని అందులోనే ఉంటూ వచ్చాను. నాలుగునెలల కిందట దాన్ని అమ్మి.. ఓ వృద్ధాశ్రమంలోకి వచ్చాను. ఇల్లు అమ్మగా వచ్చిన సొమ్ముని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో పెట్టాను. దానికి మా తమ్ముడు నామినీ. రక్తసంబంధంతో నాకు దగ్గరైనవాడు వాడొక్కడే కాబట్టి అలా చేశాను. కానీ అతను కొంతకాలంగా అప్రయోజకుడయ్యాడు. నాకు బద్ధశత్రువుగా మారాడు. నామినీగా అతని పేరుని తీసివేయాలని అనుకుంటున్నా. అంతేకాదు.. ఆ డబ్బుతో ఓ ట్రస్ట్ ఏర్పాటుచేయాలన్నది నా ఆశయం. ఆ ట్రస్ట్ నా తదనంతరం కొన్ని ధర్మకార్యాలు నెరవేర్చాలి. తెలుగురాష్ట్రాల్లోని బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, ఇప్పుడు నేనుంటున్న వృద్ధాశ్రమంలో అమ్మానాన్న పేరుతో ఓ కాటేజీ, తిథిదే అన్నదానం/కాశీ అన్నదానానికి విరాళం.. ఇవన్నీ చేపట్టాలి. అలాంటి ట్రస్ట్ ఏర్పాటుచేయాలంటే విధివిధానాలేమిటీ? ఇందుకోసం నమ్మకస్తుల్ని ఎలా వెతికి పట్టుకోవాలి? - ఓ సోదరి

✔ ఎంత సంపాదించినా ఇంకా కోట్లు మూటగట్టుకుని మునిమనవళ్లకూ ఇచ్చిపోదామనే వాళ్లమధ్య.. మీ డబ్బుతో నాలుగు మంచి కార్యాలు జరగాలని కోరుకుంటున్న మీకు నా జోహార్లు! స్వయంకృషితో జీవితాంతం మీరు శ్రమించి సంపాదించికున్న ఈ ఆస్తి మీ స్వార్జితం. దానిపై పూర్తిహక్కులు మీవే. ఎవరికైనా దానం ఇవ్వొచ్చు. 'దానం' అని ఎందుకు అంటున్నానంటే మీరు బతికి ఉండగా ఇచ్చే దేన్నైనా చట్టం 'గిఫ్ట్' కిందే చూస్తుంది. మరణానంతరం ఫలానావాళ్లకే ఆస్తి చెందాలని రాసివ్వడం 'విల్' అంటారు. ముందు మీరు ఓ ట్రస్ట్ డీడ్ రాసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత బ్యాంకులో ఈ ట్రస్ట్ కోసం ఓ ఖాతా ప్రారంభించండి. అందులో ఇతర బ్యాంకుల్లో ఉన్న డబ్బంతా వేయండి. దాన్నే ట్రస్ట్‌కి సంబందించిన ఫండ్‌గా పరిగణిస్తారు. మీ నిధులతో ప్రారంభమైన ఈ ట్రస్ట్‌కి మీరు 'ఆథర్' అవుతారు. మీ ఆశయాల సాధనని చేపట్టే మిగతావాళ్లందర్నీ ట్రస్టీలు లేదా అథారిటీ ఆఫ్ ట్రస్ట్ అని పిలుస్తారు. ఇందుకోసం బాధ్యతాయుతంగా నడుచుకోగల, పద్దెనిమిదేళ్లు దాటినవాళ్లు ఎవర్నైనా మీరు ఎంపికచేసుకోవచ్చు. ట్రస్ట్ ద్వారా లబ్ధిపొందేవాళ్లందర్నీ 'బెనిఫిషరీస్' అని అంటారు. ఇవన్నీ ఇంత వివరంగా ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే.. ఆథర్‌గా మీ వివరాలు, ట్రస్టీలుగా మిగతావారి పేర్లూ, బెనిఫిషరీస్ ఎవరెవరు వంటి వివరాలన్నీ ఇందాక చెప్పిన 'ట్రస్ట్ డీడ్'లో రాసి రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది కాబట్టి! ముఖ్యంగా బెనిఫిషరీస్ వివరాలూ, వాళ్లకి మీరు కేటాయించాలనుకుంటున్న నిధుల వివరాలూ చాలా స్పష్టంగా ఉండాలి. ఉదాహరణకి మీరు బాలికల పాఠశాల కోసం నిధులు కేటాయిస్తుంటే, దాని అడ్రెస్, మీరు అందించాలనుకుంటున్న సొమ్ము, దాన్నెలా వినియోగిస్తారు వంటివన్నీ నిర్దిష్టంగా రాసుకోవాలి. ఇలా ఏర్పాటైనదాన్ని పబ్లిక్ ట్రస్ట్ లేదా చారిటబుల్ ట్రస్ట్ అని పిలుస్తారు. మీరు బతికుండగానే ఇవన్నీ జరగాలి అనుకుంటే.. మీరు కేవలం ఆథర్‌గా కాకుండా మీ ఆశయాల్ని నెరవేర్చే ట్రస్టీల్లో ఒకరిగా ఉండటం మంచిది. మీ ట్రస్ట్ మీరు కోరుకున్న ధర్మకార్యక్రమాలన్నీ నెరవేర్చగానే దాన్ని అచేతనం (ఇనాక్టివ్) చేయొచ్చు. మీ కార్యక్రమాలు ఇంకెవరికైనా నచ్చి వాళ్లు నిధులిస్తానని ముందుకొస్తే మీ పనులు ఎంత కాలమైనా కొనసాగించొచ్చు. ట్రస్ట్ ఇంతకాలం మాత్రమే ఉండాలని నియమం ఏదీ లేదు! మీరు బతికి ఉన్నప్పుడు కాకుండా మరణానంతరమే ఇవన్నీ జరగాలనుకుంటే అందులోనూ నేను ఇందాక చెప్పిన ప్రతి వివరాలూ ఉండితీరాలి. దాన్నప్పుడు 'విల్ కమ్ ట్రస్ట్' అని పిలుస్తారు!! ఇక మీ తమ్ముడి నామినీ విషయంలో పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదు. బ్యాంకుకి వెళ్లి అతని పేరుని తీసేయాలంటూ ఓ దరఖాస్తు ఇస్తే సరిపోతుంది.

అంత భారం మోయగలరా?

పిల్లలు అబద్ధాలాడితే మనకి ఇట్టే తెలిసిపోతుంటుంది. 'ఇప్పుడే ఇన్ని అబద్ధాలాడతావా?' అని కోపంతో ఊగిపోతుంటాం కూడా. కానీ వాళ్లలా అబద్ధాలాడటానికి కారణం మీరేనని ఎప్పుడైనా ఊహించారా? మనం ఒప్పుకోకపోయినా అదే నిజం. ఎందుకంటే..

ఓ చిన్నారి మీతో అబద్ధం ఆడుతోందంటే.. ఎన్నో విషయాలు దాస్తోందంటే.. కారణం ఆమెకి మీరు నిజం చెప్పే స్వేచ్ఛని ఇవ్వలేకపోవడమే! తన ఓటమినో, తప్పుల్నో మీ దగ్గర చెబితే కోపగించుకుంటారనో, శిక్షిస్తారనో భయపడటమే ఇందుకు మూలం. ముందు దాన్ని తొలగించండి. వాళ్లు ఏది చెప్పినా మీరు వింటారనే నమ్మకం కలిగించండి. తప్పు చేసినప్పుడు తిట్టడం కాకుండా దాన్నెలా అధిగమించొచ్చో మీరు చెప్పగలరనే విశ్వాసం వాళ్లకివ్వండి.

- టీవీ అతిగా చూడటం, స్మార్ట్‌ఫోన్‌కి అతుక్కుపోవడం నిజంగా దురలవాట్లే. వాటి విషయంలో మీరు కొన్ని నియమాలు పెట్టాల్సిందే. కానీ ఆ నియమాలపై మరీ పంతంపట్టకండి. అతి క్రమశిక్షణ పేరుతో వాళ్లకిష్టమైనవాటిని దూరం చేయకండి. అలా చేస్తే.. వాళ్లు వాటిని చూడటానికి వేరే దార్లు వెతుక్కుంటారు. ఇంకేముంది? ఆ చిన్న వయసులో అనవసరమైన దాపరికాలు నేర్చుకోవడం మొదలుపెడతారు.
- క్రమశిక్షణ లేకపోవడం ఎంత చెడుచేస్తుందో.. అతి క్రమశిక్షణ అంతకంటే ఎక్కువ ప్రతికూలంగా పరిణమిస్తుంది. వాళ్లని మీకంటే కోపిష్టిగా, క్రూరంగా తయారుచేస్తుంది. లేదా అతిభయస్థులుగా మారుస్తుంది. ఇవన్నీ టీనేజీలో బయటపడతాయి. క్రమశిక్షణ అన్నది వాహనానికుండే ఓ బ్రేక్‌లాంటిదే. వాహనానికి అది ముఖ్యమే కానీ.. ఎప్పుడూ బ్రేక్‌లే వేస్తుంటే బండి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు కదా!!



అందంగా ఆరోగ్యంగా..

మనం అందంగా ఉండాలనుకుంటే ముందుగా ఆరోగ్యంగా ఉండాలి. ఆరోగ్యవంతుల చర్మం కాంతిమంతంగా ప్రకాశిస్తుంది. ఇది పైపై మెరుగులతో రాదు. మరి? ఇవి చూడండి..



మనం తీసుకునే ఆహార పదార్థాల వల్లే మనం ఆరోగ్యంగా ఉంటాం. అది మన మోములో ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా మనకు సరిపడా నీళ్లను తాగాలి. రోజుకు కనీసం ఎనిమిది గ్లాసుల నీళ్లు తీసుకోవాలి. వేపుళ్లూ, బేకరీ పదార్థాలకూ దూరంగా ఉంటూ తాజా కూరగాయలూ, పండ్లూ మన రోజూవారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలి.

- మీరు వాడే సబ్బులూ, ఫేస్‌వాష్‌లూ ఎక్కువ గాఢత లేకుండా చూసుకోవాలి. ఇవి చర్మాన్ని శుభ్రపరచాలే తప్ప హాని చేయకూడదు. అందుకే నాణ్యమైన, మన్నికైన ఉత్పత్తులే ఎంచుకోండి.
- చర్మం నిర్జీవంగా మారడానికి ఓ ప్రధాన కారణం.. మేకప్ తీయకుండా అలాగే నిద్రపోవడం. దానివల్ల చర్మగ్రంథులు మూసుకుపోతాయి. అందుకే ఎంత రాత్రయినా సరే మేకప్ తీసి మాయిశ్చరైజర్ రాసుకుని పడుకోవాలి.

సెన్సెక్స్ ▲322 **31771**

నిఫ్టీ ▲103 **9897**

రూపాయి 64.15 ▼ (ఒక అమెరికా డాలరుకు) 03 పైసలు

బంగారం 28,805 ▼ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 215

వెండి 38,255 ▲ ముంబయిలో కిలో రూ.లలో 555

ముడి చమురు 50.53 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	22,025	+26
నాస్‌డాక్	6,345	+11
నిక్కీ 225 (జపాన్)	19,729	−24
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,279	−16
షాంఘై(చైనా)	3,247	−05
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,433	+49
డాక్స్ (జర్మనీ)	12,264	+87

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.47	67.80
పౌండ్ స్టెర్లింగ్	75.24	87.26
యూరో	68.63	79.60
జపనీస్ యెన్/100	52.83	61.27
ఆస్ట్రేలియా డాలరు	45.79	52.98
సింగపూర్ డాలరు	42.76	50.64
థాయ్ బాత్/100	175.50	209.89
బ్రెహెయిన్ దీనార్	158.43	181.47
కువైట్ దీనార్	175.94	219.17
సౌదీ రియాల్	15.43	18.29
యూఏఈ దిర్హమ్	15.91	18.60
మలేషియా రింగిట్	13.32	16.38
చైనీస్ యువాన్	6.80	11.03



బుధవారం నిఫ్టీ కదలికలు



నిఫ్టీ @ 11100

జనవరి కల్లా చేరే అవకాశం: ఎడెల్‌వైజ్ సెక్యూరిటీస్

దిల్లీ: వచ్చే ఏడాది జనవరి కల్లా నిఫ్టీ 11,100 పాయింట్లను చేరుతుందని ఎడెల్‌వైజ్ సెక్యూరిటీస్ అంచనా వేసింది. 'ప్రస్తుతం భారత ఈక్విటీ మార్కెట్లు చరిత్రాత్మక సగటును మించి చలిస్తున్నాయి. వచ్చే మూడేళ్లలోనూ అధిక స్థాయిలో కొనసాగే అవకాశం ఉంద'ని తన నివేదికలో పేర్కొంది. వర్ధమాన, అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే సంస్కరణల పరంగా భారత్ మరింత దూకుడుతో ముందుకు వెళుతోందని తెలిపింది. సరఫరా వైపు నుంచి కూడా వ్యవస్థీకృత మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొంది. ఈక్విటీ మార్కెట్లలోకి దేశీయ పెట్టుబడులు భారీ మొత్తంలో తరలి రావడం కలిసొస్తోందని వెల్లడించింది. 'ప్రస్తుతం భారత వృద్ధి చరిత్రలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పాత్ర స్తబ్దుగానే ఉండొచ్చు. ఈ పరిణామం ఆర్థిక వ్యవస్థ, మార్కెట్‌పై అంతర్జాతీయ ఒడుదొడుకుల ప్రభావం పడకుండా ఉండేందుకు దోహదం చేస్తుంద'ని వివరించింది.

మరో పెన్నీ షేర్ల జాబితా!

250 కంపెనీలుండే అవకాశం

దిల్లీ: మనీలాండరింగ్/ పన్ను ఎగవేతకు ఉపయోగ పడుతున్నాయనే అనుమానాలున్న పెన్నీ షేర్ల జాబితా మరోటి సిద్ధం చేసే పనిలో ఆదాయపు పన్ను విభాగం ఉందని సమాచారం. మార్కెట్ ఆపరేటర్లపై నిర్వహించిన దర్యాప్తులో వెల్లడైన వివరాల ఆధారంగా ఈ జాబితాను రూపొందిస్తోంది. పెన్నీ షేర్లు అతి తక్కువ విలువ కలిగి ఉంటాయి. ఆదాయపు పన్ను వర్గాల ప్రకారం ఆదాయ వెల్లడి పథకం సమయంలో ఇలాంటి పెన్నీ షేర్లలో రూ.5,000 కోట్లకు పైగా పెట్టామని ట్రేడర్లు వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో 84 పెన్నీ షేర్లతో ఐటీ విభాగం తొలి జాబితా రూపొందించింది. తాజా జాబితాలో 250 కంపెనీ పేర్లు ఉండొచ్చని సమాచారం. గత మూడేళ్ల నుంచి ఇలాంటి షేర్లను గుర్తించే పనిలో సెబీ, ఐటీ విభాగం ఉన్నాయి.

బ్యాంకులకు ఒత్తిడి తగ్గనుంది

● వాటా కొనుగోలు ఇక సులువు ● ఓపెన్ ఆఫర్ ఇవ్వనవసరం లేదు: సెబీ

దిల్లీ

మొండి బకాయిలతో సతమతమవుతున్న కంపెనీల్లో వాటా కొనుగోలు చేయడానికి, రుణాలిచ్చిన బ్యాంకులకు వర్తించే నిబంధనలను సెబీ సడలించింది. వాటాదార్లకు ఓపెన్ ఆఫర్ చేయడం నుంచి వాటిని మినహాయింపు నిచ్చింది. ఈ సడలింపునకు కొన్ని షరతులు విధించింది. అందులో ఒకటి వాటాదార్ల అనుమతి. ఇంతకీ సెబీ ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నట్లు? అందుకు కారణం లేకపోలేదు. ఇప్పటికే బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.8 లక్షల కోట్లకు పైగా మొండి బకాయిలు పేరుకుపోయాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే సెబీ తాజా నిర్ణయం వెలువడింది.

బకాయిల ఒత్తిడిలో ఉండి, ఎక్స్ఛేంజీల్లో నమోదైన కంపెనీల పునర్నిర్మాణానికి వర్తించే నిబంధనలను;



దివాలా స్మృతి కింద అనుమతించిన పరిష్కార పథకాలకు వర్తించే నిబంధనలను సడలిస్తున్నట్లు సెబీ ఒక నోటిఫికేషన్‌లో ప్రకటించింది. ఈ నిర్ణయం కారణంగా నమోదిత కంపెనీలు తిరిగి పుంజుకునేందుకు వీలవుతుంది. అటు వాటాదార్లకు.. ఇటు బ్యాంకులకు కూడా ప్రయోజనం కలగజేస్తుంది. వ్యూహాత్మక రుణ పునర్నిర్మాణ(ఎస్‌డీఆర్) పథకం కింద నమోదిత కంపెనీ(ఒత్తిడిలో ఉన్నవి)ల్లో బ్యాంకులు పునర్నిర్మాణాన్ని చేపట్టడానికి చేయవలసిన ప్రిఫరెన్షియల్ ఇష్యూ, ఓపెన్ ఆఫర్‌ల నుంచి సడలింపు లభించినట్లే.

ఇదీ నేపథ్యం

ఒత్తిడిలో ఉన్న కంపెనీలకు చెందిన ఆస్తులను బ్యాంకులు కొన్న తర్వాత కొత్త మదుపర్లకు వాటిని విక్రయిద్దామంటే.. సమస్యలు ఎదురవుతున్నాయని.. కొత్త మదుపర్లు ఓపెన్ ఆఫర్ చేయాల్సి వస్తోందని సెబీ దృష్టికి వచ్చింది. ఇలాంటి ఆఫర్ల వల్ల కంపెనీలో పెట్టుబడులు పెట్టేందుకు అందుబాటులో ఉన్న నిధులు హరించుకుపోతున్నాయి. ఈ విషయాలన్నిటినీ పరిగణనలోకి తీసుకున్న సెబీ కొత్త మదుపర్ల కోసం నిబంధనల్లో సడలింపులు ఇచ్చింది. ఇతర పునర్నిర్మాణ పథకాల కింద కూడా బ్యాంకర్లకు ఈ సడలింపులను వర్తింపజేసింది.

గ్రాన్యూల్స్ యూనిట్‌కు ఎఫ్‌డీఏ ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: గ్రాన్యూల్స్ ఇండియా తయారీ యూనిట్‌కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్‌ఎఫ్‌డీఏ) పచ్చజెండా ఊపింది. హైదరాబాద్ సమీపంలోని గాగిల్లాపూర్ తయారీ యూనిట్‌కు యూఎస్‌ఎఫ్‌డీఏ ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ నివేదిక (ఈఐఆర్) జారీ చేసిందని గ్రాన్యూల్స్ ఇండియా తెలిపింది. ఈ యూనిట్‌లో కంపెనీ ఫినిష్డ్ డోసేజీలను (ఎఫ్‌డీ), ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్ ఇంటర్మీడియేట్ల (పీఎఫ్‌ఐ)ను తయారు చేస్తోంది. 2016 అక్టోబరులో యూఎస్‌ఎఫ్‌డీఏ తనిఖీ చేసిందని, ఏ లోపం లేదని ధ్రువీకరించిందని గ్రాన్యూల్స్ ఇండియా పేర్కొంది.

మరో 2 కంపెనీల పిటిషన్లపై నేడు శాట్ విచారణ

దిల్లీ: అనుమానిత డొల్ల కంపెనీల కేసుకు సంబంధించి మరో రెండు కంపెనీల పిటిషన్లపై నేడు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (శాట్) విచారణ చేపట్టనుంది. ఈ నెల ప్రారంభంలో 331 అనుమానిత డొల్లకంపెనీల జాబితాను సెబీ విడుదల చేయగా, వీటి షేర్ల ట్రేడింగ్‌పై పరిమితులు విధించిన సంగతి తెలిసిందే. సెబీ ఆంక్షలను సవాలు చేస్తూ కంపెనీలు శాట్‌ను ఆశ్రయిస్తున్నాయి. తాజాగా హిట్‌కిట్ గ్లోబల్ సొల్యూషన్స్, శ్యాంకో ఇండస్ట్రీస్ కూడా పిటిషన్‌లు దాఖలు చేశాయి. వీటిపైనే ఈ రోజు శాట్ విచారణ చేపట్టనుంది. గత వారం ఎనిమిది కంపెనీలు శాట్‌ను ఆశ్రయించగా.. వాటి షేర్ల ట్రేడింగ్‌పై ఆంక్షలను ఎత్తివేసింది. ఇందులో పార్శ్వనాథ్ డెవలపర్స్, జేకుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లాంటి కంపెనీలున్నాయి.

సీఎస్ఐ హైదరాబాద్ ఛైర్మన్‌గా మోహన్ రాయుడు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్‌గా ఇన్ఫర్మాటిక్స్ ఇండియా డైరెక్టర్ కె.మోహన్ రాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఎంటర్‌ప్రైజ్ సిస్టమ్స్ డిజైన్, కన్సల్టింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో ఆయనకు 38 సంవత్సరాల అనుభవం ఉంది. కంప్యూటర్స్ రంగంలో దేశంలోనే ఇది అతిపెద్ద సొసైటీ. దీన్ని 1965లో హైదరాబాద్‌లో స్థాపించారు. ప్రస్తుతం 76 చాప్టర్లు, 1.2 లక్షల మంది సభ్యులు ఇందులో ఉన్నారు.

సినర్జీస్ డూరే దివాలా ప్రణాళికకు ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: విశాఖపట్నానికి చెందిన సినర్జీస్ డూరే ఆటోమోటివ్ (ఎస్‌డీఏఎల్) దివాలా పరిష్కార ప్రణాళికకు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ హైదరాబాద్ బెంచ్ ఆమోదం తెలిపింది. సినర్జీస్ డూరే అల్యూమినియం అలాయ్ చక్రాలు తయారు చేసి, కార్ల తయారీ కంపెనీలకు సరఫరా చేస్తోంది. ఈ సంస్థ అప్పుల్లో కూరుకుపోయింది. దివాలా స్మృతి 2016 కింద ఆమోదం పొందిన తొలి దివాలా పరిష్కార ప్రణాళిక ఇదే. ఈ ప్రకారం సినర్జీస్ కాస్టింగ్స్ (ఎస్‌సీఎల్)లో సినర్జీస్ డూరే విలీనమవుతుంది. ఈ ఏడాది జనవరి 23న ఎస్‌డీఏఎల్ దాఖలు చేసిన దివాలా పరిష్కార పిటిషన్‌ను ఎన్‌సీఎల్‌టీ, హైదరాబాద్ బెంచ్ స్వీకరించింది. కంపెనీ రుణదాతలకు రూ.972.15 కోట్లు బకాయి పడింది. ఇందులో సినర్జీస్ కాస్టింగ్స్‌కు రూ.89.26 కోట్లు చెల్లించాలి. ఆల్‌కెమిస్ట్ ఏఆర్‌సీకి రూ.122.06 కోట్లు, ఎడిల్‌వైజ్ ఏఆర్‌సీకి రూ.86.92 కోట్లు, మిలీనియమ్ ఫైనాన్స్‌కు రూ.673.91 కోట్లు బకాయి పడింది. దివాలా పరిష్కార ప్రణాళికను రుణదాతలతో సంప్రదించి దివాలా పరిష్కార నిపుణురాలు (ఐఆర్‌పీ) మమతా బినానీ తయారు చేశారు. సినర్జీస్-డూరేను సినర్జీస్ కాస్టింగ్‌లో విలీనం చేయడమేకాక రుణదాతలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను పునర్వ్యవస్థీకరిస్తారు.

మార్కెట్ కబుర్లు

- రిలయన్స్ నావెల్ అండ్ ఇంజినీరింగ్‌గా పేరు మార్చుకోవడానికి **రిలయన్స్ డిఫెన్స్ అండ్ ఇంజినీరింగ్(ఆర్‌డీఈఎల్)** ఆగస్టు 22న వాటాదార్ల అనుమతిని కోరనుంది.
- రొమ్ము కేన్సర్ చికిత్సకు ఉపయోగించే ట్రాత్సుజుమాబ్, న్యూట్రోపీనియా చికిత్సకు వినియోగించే పెగ్‌ఫిల్గ్రాస్టిమ్‌ల మార్కెటింగ్‌ను కోరుతూ చేసిన దరఖాస్తులు ఉపసంహరించుకోవాలని **బయోకాన్‌**ను యూరోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ కోరినట్లు తెలుస్తోంది.
- బైబ్యాక్ ఆఫర్ అనంతరం **ఇంజినీర్స్ ఇండియా**లో ప్రభుత్వం వాటా 57.02% నుంచి 54.17 శాతానికి పరిమితమైంది.
- పుణెకు చెందిన **టేస్టీ బైట్ ఈటబుల్స్‌**ను పూర్తిగా కొనుగోలు చేసే ప్రక్రియలో భాగంగా ప్రజల నుంచి 25.77 శాతం వాటాను కొనుగోలు చేయడం కోసం **మార్స్ ఫుడ్** ఓపెన్ ఆఫర్‌ను ప్రకటించింది.
- **అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్** ఆగస్టు 22న ప్రారంభమయ్యే తన పబ్లిక్ ఇష్యూకు ధరల శ్రేణిని రూ.171-175గా నిర్ణయించింది. 24న ముగిసే ఈ ఇష్యూ కింద 72.5 లక్షల షేర్లను తాజాగా జారీ చేయనుంది.
- **కరూర్ వైశ్యా బ్యాంక్‌**కు ఎండీ, సీఈఓగా పి.ఆర్. శేషాద్రిని నియమించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆమోదం తెలిపింది.
- **రామ్‌కో సిమెంట్స్** 25 లక్షల షేర్లను తిరిగి కొనుగోలు చేసింది. ఇందుకు ఒక్కో షేరుకు రూ.670.80 చొప్పున రూ.167.70 కోట్లు వెచ్చించింది.
- ఫ్లాట్ల కోసం పెట్టుబడి పెట్టిన వారికి, నిధులు తిరిగి ఇచ్చే కేసు విషయంలో 3 నెలల బెయిల్ కోరుతూ **యునిటెక్** యజమాని సంజయ్ చంద్ర సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

కొనుగోళ్ల కళ

సమీక్ష

● సెన్సెక్స్‌కు నెలలోనే అత్యధిక లాభం

● రాణించిన ఎఫ్‌ఎమ్‌సీజీ షేర్లు

వరుసగా రెండో రోజూ సూచీలు రాణించాయి. మధ్యాహ్నం తరవాత ఎఫ్‌ఎమ్‌సీజీ, బ్యాంకింగ్ సహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్ నెలలోనే అత్యధిక లాభాన్ని నమోదు చేసింది. అమెరికా, ఉత్తర కొరియాల మధ్య ఉద్రిక్తతలు కొంత మేర సర్దుమణగడం ఇందుకు కలిసొచ్చింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా కదలాడటం మన మార్కెట్లపై ప్రభావం చూపింది. ఆసియా షేర్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి.

నిఫ్టీ మళ్లీ 9900కు: సెన్సెక్స్ ఉదయం 31,556.24 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. అనంతరం నష్టాల్లోకి జారుకున్న సూచీ ఒడుదొడుకులు ఎదుర్కొంది. మధ్యాహ్నం అనంతరం లాభాల్లోకి వచ్చిన సెన్సెక్స్.. ఒకానొకదశలో 31,805.99 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. చివరకు 321.86 పాయింట్ల లాభంతో 31,770.89 దగ్గర స్థిరపడింది. ఆగస్టు 9 తర్వాత సూచీకిదే గరిష్ఠ ముగింపు. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 9,900 మైలురాయి అధిగమించింది. చివరకు 103.15 పాయింట్లు పెరిగి 9,897.30 వద్ద ముగిసింది.

బయోకాన్ డీలా: కంపెనీకు చెందిన ఔషధ తయారీ కేంద్రాన్ని ఐరోపా నియంత్రణ సంస్థ ఈఎంఏ మళ్లీ తనిఖీ చేయనున్న నేపథ్యంలో బయోకాన్ షేర్లు కుదేలయ్యాయి. ఒకానొకదశలో 8.14 శాతం కుప్పకూలిన షేరు.. చివరకు 5.86 శాతం నష్టంతో రూ.328.80 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 19 లాభాలతో ముగిశాయి. టాటా మోటార్స్ 3.57%, సిప్లా 3.54%, ఐటీసీ 3.01%, హిందుస్థాన్ యునిలీవర్ 3%, సన్‌ఫార్మా 2.69%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.94%, ఎస్‌బీఐ 1.74%, హీరో మోటోకార్ప్ 1.62%, యాక్సిస్ బ్యాంక్ 1.60%, హెచ్‌డీఎఫ్‌సీ 1.58%, టాటా స్టీల్ 1.37%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.28%లు రాణించిన వాటిలో ఉన్నాయి. ఎన్‌టీపీసీ అత్యధికంగా 1.05% నష్టపోయింది. ఏషియన్ పెయింట్స్ (1.01%), పవర్ గ్రిడ్ (0.81%), కోల్ ఇండియా (0.67%) చొప్పున నష్టపోయాయి.

నేటి మార్కెట్

నేడు సూచీలు స్వల్ప శ్రేణిలో కదలాడొచ్చు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సంకేతాలు అందిపుచ్చుకోవచ్చని డీలర్లు అంటున్నారు. అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ జులై సమావేశ నిర్ణయాలు కీలకం కానున్నాయి. వడ్డీ రేట్ల పెంపు వేగంగా ఉంటే, మన మార్కెట్లు తిరిగి నష్టాలు చవిచూడొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆగస్టు 1-2 తేదీల్లో జరిగిన ఆర్‌బీఐ పరపతి విధాన కమిటీ సమావేశ నిర్ణయాలు సైతం సూచీలపై ప్రభావం చూపొచ్చు. రంగాల వారీగా చూస్తే.. ఎఫ్‌ఎమ్‌సీజీ, వాహన, లోహ, బ్యాంకింగ్ రంగాల్లో కొనుగోళ్లు కొనసాగొచ్చని, మౌలిక, ఇంధన సంస్థలు బలహీనపడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కంపెనీల టేకోవర్ నిబంధనలను సెబీ సడలించిన నేపథ్యంలో బ్యాంకింగ్ షేర్లు రాణించొచ్చు. త్రైమాసిక ఫలితాలు వెలువరించనున్న ఆల్కలీ అమైన్స్, డిష్ టీవీ, ఎరిస్ లైఫ్‌సైన్సెస్, సోమానీ సిరామిక్స్ షేర్లపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. నిఫ్టీకి తదుపరి సవాల్ 9960 పాయింట్లు, 10000 పాయింట్ల వద్ద ఎదురు కావొచ్చని, 9820- 9850 పాయింట్ల వద్ద మద్దతు లభించొచ్చని సాంకేతిక విశ్లేషకులు భావిస్తున్నారు.

టెక్ మహీంద్రా



రూ.402.20 వద్ద ప్రారంభమై రూ.400- 425.90 మధ్య కదలాడి, క్రితం ముగింపు రూ.402.20తో పోలిస్తే రూ.17.75 (4.41%) లాభంతో రూ.419.95 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 54,07,314.

ఏషియన్ పెయింట్స్



రూ.1154.35 వద్ద మొదలై రూ.1129- 1155.30 మధ్య చలించి, క్రితం ముగింపు రూ.1154తో పోలిస్తే రూ.12.70 (1.10%) నష్టంతో రూ.1141.30 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 8,57,454 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

హీరో మోటోకార్ప్	4044.00
హెరిటేజ్ ఫుడ్స్	1354.05
బాటా ఇండియా	675.30
టైటన్ కంపెనీ	638.30
టాటా స్టీల్	632.65
ఫ్యూచర్ రిటైల్	496.80
పీసీ జువెలర్	349.00
పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ	230.70

52 వారాల కనిష్ఠం (రూ.లలో)

ఆర్‌పీజీ లైఫ్‌సైన్సెస్	296.70
మగధ్ షుగర్	210.70
పెన్నార్ ఇంజినీర్డ్ బిల్డింగ్	89.90

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
16/08	5,400	6,490	−1,090	3,570	2,233	1,337
14/08	3,231	4,870	−1,639	3,653	2,033	1,619
11/08	4,120	6,063	−1,943	5,086	3,069	2,017
10/08	4,385	5,556	−1171	4,085	3,263	822
09/08	3,238	4,080	−842	2,886	2,333	553

16వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా(ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	362
బెంగళూరు	380	చెన్నై	397
17న		చిత్తూరు	390
విజయవాడ/గోదావరి	359	నమక్కల్	384

ఎన్ఎస్ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1811.20 (1784.80) 378840
ADANI PORT & 397.55 (396.20) 2644234
AMBUJA CEMEN 270.05 (265.10) 1804763
ASIAN PAINTS 1141.30 (1154.00) 857454
AUROBIND PHA 713.90 (714.50) 1698422
AXIS BANK LT 499.50 (491.75) 5958229
BAJAJ AUTO L 2849.20 (2831.60) 129201
BANK OFBAROD 147.15 (142.25) 25054671
BHARTI AIRTE 407.75 (408.55) 3768547
BHARTI INFRA 382.90 (379.85) 1986044
BOSCH LTD 22309.90 (22138.10) 29738
BPCL 483.95 (478.35) 3202080
CIPLA 590.45 (570.05) 1838012
COAL INDIA L 237.95 (238.15) 7864893
DR. REDDYS 2005.25 (2002.05) 662136
EICHER MOTOR 30617.00 (30385.60) 39164
GAIL 371.20 (372.50) 2785422
HCL TECH 864.50 (860.10) 1125005
HDFC 1741.75 (1713.95) 3357599
HDFC BANK 1781.25 (1757.20) 1106708
HERO MOTOCOR 4022.10 (3957.05) 475186
HINDALCO IND 233.60 (229.15) 10236544
HINDUSTAN UN 1186.35 (1155.70) 1366648
ICICI BANK 294.95 (291.80) 8605873
INDIABULLS H 1209.10 (1175.75) 1778177
INDIAN OIL 422.30 (419.45) 3852377
INDUSINDBANK 1647.20 (1624.70) 952709
INFOSYS LTD 975.20 (981.45) 3089040
ITC 279.20 (271.25) 18692336
KOTAK MAHIND 1000.55 (982.60) 3147277
LARSEN & TOU 1142.25 (1146.90) 2143899
LUPIN 961.00 (966.85) 1973545
M&M 1371.20 (1355.75) 744908
MARUTI SUZIK 7701.15 (7608.45) 488766
NTPC LTD 170.10 (171.75) 5757929
ONGC 160.95 (161.70) 6213088
POWER GRID C 220.70 (222.75) 2937370
RELIANCE IND 1566.10 (1573.05) 3103394
SBI 283.10 (278.20) 21074533
SUN PHARMA 485.70 (471.80) 7588306
TATA CONSULT 2492.35 (2469.40) 686670
TATA MOT DVR 231.60 (226.45) 1735121
TATA MOTORS 389.25 (375.40) 11019760
TATA POWER 82.05 (79.55) 11428360
TATA STEEL L 631.20 (623.75) 7330341
TECH MAHINDR 419.95 (402.20) 5407314
ULTRATECH 3941.30 (3960.50) 204377
VEDANTA LIMI 297.20 (289.15) 10533440
WIPRO 289.95 (288.50) 2011284
YES BANK LTD 1761.85 (1778.50) 3744611
ZEE ENTERTAI 518.70 (517.20) 1654668

నిఫ్టీ నెక్ట్స్ 50

ABB 1357.60 (1349.95) 47424
ASHOK LEYLAN 104.75 (104.75) 10846570
BAJAJ FINANC 1721.35 (1710.90) 705754
BAJAJ FINSER 5356.80 (5222.05) 224358
BEL 175.30 (176.25) 1899867
BHEL 129.95 (126.45) 4813226
BRITANNIA 4299.95 (4160.00) 294698
CADILA HEALT 483.25 (485.05) 708832
COLGATE PALM 1066.80 (1047.10) 158759
CONTAINER 1230.40 (1170.05) 793455
CUMMINS INDI 921.00 (886.80) 259570
DABUR INDIA 309.05 (307.10) 920951
DIVIS LAB 657.25 (639.05) 781871
DLF LIMITED 180.80 (181.65) 14106982
EMAMI LIMITE 1124.55 (1113.25) 93104
GLAXOSMI CON 5344.15 (5366.30) 2198
GLAXOSMI PHA 2381.55 (2402.75) 11416
GLENMARK PHA 621.60 (629.80) 1223973
GODREJ CONSU 921.90 (917.45) 730081
HAVELLS INDI 464.65 (476.10) 1532195
HINDUSTAN ZI 290.90 (281.00) 2175340
HPCL 436.40 (438.60) 3339664
ICICI PRU LI 434.85 (433.05) 527448
IDEA CELLULR 86.95 (86.30) 5457158
INTERGLOBE A 1313.20 (1284.95) 1162299
JSW STEEL LT 237.75 (232.35) 4106721
LIC HOUS.FIN 659.55 (657.20) 2709789
MARICO LIMIT 315.95 (318.35) 1454928
MCDOWELL 2548.45 (2474.95) 214620
MOTHERSON 331.75 (323.55) 3155231
NHPC LTD 31.10 (31.15) 3155001
NMDC LTD 121.15 (120.95) 2614358
OIL INDIA 286.45 (280.05) 358896
ORACLE FIN S 3562.75 (3591.10) 11764
P&G HYG&HEAL 8191.85 (8131.55) 1630
PETRONET LNG 229.60 (217.40) 9606276
PIDILITE IND 817.90 (812.80) 302585
PIRAMAL ENTE 2748.85 (2759.55) 200956
PNB 147.55 (143.20) 8003091
POWER FIN CO 118.50 (119.00) 4413072
RURAL ELEC C 164.15 (166.85) 4600403
SAIL 59.25 (58.05) 6459649
SHREE CEMENT 17494.10 (17544.15) 15220
SHRIRAM TRAN 978.10 (973.40) 452812
SIEMENS 1308.55 (1289.15) 156094
SUN TV LTD 748.45 (750.70) 714027
TITAN IND 627.70 (630.40) 2075867
TORRENT PHAR 1323.95 (1220.20) 504711
UNITED BREWE 808.65 (797.45) 153191
UPL LIMITED 852.10 (858.45) 1197405

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 163.15 (163.95) 387498
ADANI ENTERP 115.20 (116.65) 6940295
ADANI POWER 29.55 (28.60) 9643033
ALL BANK 66.90 (65.20) 2328865
AMARA RAJA 813.00 (811.25) 346165
ANANT RAJIND 54.60 (53.65) 722401
ANDHRA BANK 51.15 (49.95) 2812745
APOLLO HOSPI 1159.45 (1191.25) 478904
APOLLO TYRES 272.70 (262.90) 4475188
APTECH 218.90 (211.05) 583319
BAJAJ ELECT. 315.45 (304.75) 172277
BAJAJ HIND 15.20 (15.20) 4344870
BAJAJ HOLDIN 2584.25 (2555.70) 99761
BALAJI TELE 158.60 (154.35) 375165
BALLARPUR IN 14.90 (14.90) 593711
BALRAMPUR CH 167.15 (169.30) 1234196
BANK OF MAHA 27.00 (26.65) 77356
BANK OFINDIA 147.05 (144.95) 5354114
BATA INDIA 673.50 (659.75) 1249114
BGR ENERGY S 132.90 (128.75) 57573
BHARAT FORGE 1187.30 (1180.80) 745273
BHUSHAN STEE 73.25 (65.65) 4037615
BIOCON LTD 328.40 (349.30) 10810055
BOMBAY DYE 76.00 (74.85) 841476
CANARA BANK 336.85 (330.30) 2236174
CEAT LIMITED 1712.30 (1698.10) 889605
CENTRAL BANK 74.65 (77.05) 647159
CHAMBAL FERT 140.45 (137.65) 976057
CHENNAI PETR 390.75 (378.05) 1218652
CITY UNIBANK 158.30 (156.10) 223905
CORPO BANK 45.95 (45.95) 302775
COX & KINGS 266.05 (270.05) 154951
D B REALTY L 37.00 (36.70) 423475
DELTA CORP L 169.75 (167.95) 2410726
DENA BANK 31.25 (31.25) 644790
DHANALAKBANK 34.90 (34.95) 921847
EDELWEISS CA 248.35 (239.80) 3110270
EDUCOMP SOLU 8.35 (8.20) 109014
EID PARRY 322.90 (308.95) 200321
EIH 130.80 (130.30) 42886
ESSAR SHIPPI 26.30 (24.15) 74010
ESTER INDUST 32.35 (31.55) 22542
EXIDE INDUST 206.95 (207.95) 1656928
FEDERAL BANK 110.15 (108.80) 5493859
FINOLEX CABL 527.30 (510.40) 235615
G E SHIP LTD 377.00 (382.00) 41371
GAMMON INDIA 8.75 (8.75) 299895
GAMMON INFRA 3.95 (3.95) 1663402
GATI LIMITED 112.90 (109.10) 295955
GAYATRI PROJ 164.05 (161.15) 210675
GITANJALIGEM 62.70 (61.65) 799025
GMR INFRASTR 16.50 (16.05) 22701775
GODREJ IND 610.95 (576.30) 713943
GRASIM IND 1106.50 (1108.65) 1163191
GUJ ALK&CHEM 393.70 (389.20) 37522
HCL INFOSYS 44.65 (43.35) 1050578
HEXA TECH 264.45 (263.50) 909405
HIMACHAL FUT 15.85 (15.85) 2470662
HINDU MOTORS 7.90 (7.65) 292904
HOUSING DEV 62.60 (63.05) 27492581
IDBI 53.25 (52.30) 5462764
IDFC 56.75 (54.70) 8179989
IFCI 23.05 (23.00) 7100298
IL&FS TRANS 79.40 (78.05) 392076
IND SWIFTLAB 34.35 (34.15) 20049
INDBULLS REL 230.00 (227.75) 7732352
INDIA CEM 185.00 (184.45) 3271321
INDIAN BANK 295.30 (293.90) 1230227
INDO RAMA SY 28.10 (28.15) 64029
INDRAPRASTHA 1274.35 (1295.65) 548009
IND-SWIFTLTD 8.10 (8.15) 36680
INGERSOLL-R 806.45 (795.10) 8261
IOB 22.75 (22.65) 591653
IPCA LAB 416.95 (417.60) 228456
IRB INFRA DE 212.10 (208.90) 1541510
J&K BANK 81.25 (75.20) 532425
JAI CORP 75.05 (71.95) 429564
JAIN IRRIGAT 94.95 (95.25) 7606433
JAYPEE INFRA 17.95 (17.10) 24496145
JAYSHREE TEA 104.75 (102.75) 261510
JET AIRWAYS 587.05 (564.70) 2490425
JINDAL SAW 93.45 (92.55) 570992
JINDAL STEEL 138.40 (136.65) 13003612
JK LAKSHMI C 418.55 (421.20) 32432
JK PAPER LIM 92.20 (90.80) 811562
JM FINANCIAL 124.65 (120.40) 435182
JP ASSOCIATS 23.90 (22.95) 134175944
JSW ENERGY L 64.60 (64.20) 13846685
JUBILANT FOO 1392.90 (1370.70) 2174134
JUBILANT ORG 697.95 (678.25) 254866

ఘనం (+)

నిఫ్టీ	16న	మార్పు %
TECH MAHINDRA	419.95	4.41
TATA MOTORS	389.25	3.69
CIPLA	590.45	3.58
BANK OF BARODA	147.15	3.44
TATA POWER	82.05	3.14
SUN PHARMA	485.70	2.95
ITC	279.20	2.93

గ్రహణం (-)

నిఫ్టీ	16న	మార్పు %
ASIAN PAINTS	1141.30	-1.10
NTPC	170.10	-0.96
YES BANK	1761.85	-0.94
POWER GRID CORP.	220.70	-0.92
INFOSYS	975.20	-0.64
LUPIN	961.00	-0.61
ULTRATECH CEM	3941.30	-0.48

JYOTHY LABS 381.55 (380.25) 24745
KARNATA BANK 145.65 (142.70) 1843078
KEC INTL LTD 286.55 (286.00) 404200
KOLTE PATIL 166.85 (162.00) 193979
KPIT CUMMINS 112.70 (111.65) 421199
L&TFIN.HOLD 176.50 (172.20) 5370263
LAK VIL BANK 177.50 (170.90) 892731
M & M FINANC 424.20 (425.15) 1547785
MANAPPURAM G 90.30 (88.55) 5181240
MMTC LIMITED 56.45 (55.45) 341805
MPHASIS LTD 585.60 (591.10) 36492
MRPL 124.45 (121.10) 2058579
MTNL 18.60 (17.90) 1205576
NCC LIMITED 87.55 (86.25) 1579339
NETWORK18 FI 53.40 (51.55) 503592
NEULAND LAB 1278.95 (1286.65) 3148
NIIT LTD 91.35 (86.75) 762141
NIIT TECHNOL 490.85 (485.70) 295394
OMAXE LTD 200.95 (203.95) 424883
ONMOBILE GLO 60.80 (60.15) 190295
ORIENT PAPER 97.50 (94.80) 257630
ORIENTALBANK 124.00 (118.60) 3281831
PARSVNATH DE 20.00 (21.45) 2495790
PATEL ENGG 71.55 (71.15) 302491
PFIZER 1787.25 (1799.25) 10717
POLARIS SOFT 240.80 (235.25) 48741
POWERTRADING 115.90 (113.25) 1842425
PRAJ IND 71.50 (66.75) 722665
PRISM CEMENT 112.65 (112.20) 60178
PROVOGUE (IN 4.10 (4.05) 74630
PUNJ LLOYD 19.85 (19.30) 1084507
PUNJAB & SIN 49.15 (48.60) 62646
PURAVANKARA 72.20 (70.05) 92909
PVP VENTURES 4.90 (4.80) 81446
PVR LIMITED 1329.20 (1288.00) 363066
RADICO KHAIT 161.50 (144.30) 2273167
RAJ OIL MILL 1.30 (1.35) 74246
RAJESH EXPOR 718.85 (709.35) 817719
RALLIS INDIA 225.95 (229.90) 238046
RAMCO IND 232.00 (232.85) 79999
RAMCO SYS 358.20 (360.90) 26575
RAMKY INFRA 80.40 (81.65) 134997
RAYMOND 738.55 (731.45) 321891
RELIANCE CAP 791.20 (774.20) 4192133
RELIANCE COM 23.35 (24.10) 24419101
RELIANCE INF 494.35 (489.55) 2104952
RELIANCE POW 40.65 (40.00) 4439909
ROLTA INDIA 54.75 (53.50) 761949
SAGAR CEMENT 816.65 (825.25) 827
SAREGAMA 374.40 (375.60) 132174
SHANTHI GEAR 131.30 (133.65) 32060
SHIPPNG CORP 84.40 (83.10) 639131
SHREE RENUKA 16.70 (16.70) 1740099
SINTEX IND 33.95 (31.75) 48271754
SOBHA DEVELO 394.65 (380.15) 210889
SOUTHINDBANK 28.00 (27.20) 10937442
STERLITE TEC 226.70 (219.85) 1018588
SUJANA METAL 1.70 (1.70) 42162
SUN PHARMA 369.55 (335.10) 1281558
SUND FASTNER 385.40 (386.55) 89047
SUZLON ENERG 17.50 (17.40) 63981631
SYND. BANK 64.70 (63.35) 2003442
TATA CHEM 601.10 (592.00) 366767
TATA COFFEE 132.65 (125.85) 1791284
TATA COMMUN 628.55 (628.40) 1219867
TATA GLOBAL 193.85 (178.75) 29191015
TATA METALIK 668.25 (653.85) 137118
TATA TELESER 6.80 (6.75) 868449
THE INDIAN H 125.95 (125.05) 209026
TORRENT POWE 211.10 (203.05) 3546280
TRIVENI ENGG 93.85 (91.35) 1997460
TTK PRESTIGE 6260.60 (6280.10) 1042
TV TODAY NET 244.45 (245.75) 46006
TV18 BROADCA 36.75 (36.35) 2153683
TVS MOTOR 585.30 (553.85) 2147466
UCO BANK 30.35 (30.10) 354314
UNION BANK 133.25 (128.25) 5140083
UNITECH 8.05 (7.90) 24682536
UNITED BANK 18.55 (18.25) 444011
USHA MARTIN 19.60 (19.95) 632515
VADILAL INDU 844.90 (849.20) 26140
VENKYS 2126.30 (1976.40) 540172
V-GUARD IND 178.60 (181.25) 628337
VIJAYA BANK 67.85 (66.95) 867451
VIP 196.10 (195.45) 254014
VOLTAS 542.50 (554.20) 1450555
ZEE LEARN LI 42.40 (41.30) 126779
ZUARI GLOBAL 118.95 (122.25) 14516
ZYDUS WELLNE 867.40 (863.80) 2618

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 802.70 (807.50) 1471
AMAR RAJA BA 813.35 (810.65) 23537
ANDHRA BANK 51.20 (49.95) 186573
ANDHRA CEMEN 8.95 (9.11) 27626
ANDHRA PAPER 299.60 (293.45) 2241
ANDHRA PETRO 27.65 (28.30) 26452
ANDHRA SUGAR 325.45 (328.40) 3452
ANJANI PORTL 204.55 (207.75) 1485
ASTRA MICROW 126 (123.75) 17475
AUROBINDO PH 714.20 (715.15) 146087
AVANTEL SOFT 220 (211.25) 3941
AVANTI FEEDS 1941.05 (1901.10) 45327
AVON ORG 4.93 (4.92) 12929
BALAJI AMIN 313.65 (313.05) 3160
BARTRONICS 14 (14.15) 18469
BHAGYA NAG 23.10 (21.15) 14676
BN RATHI SEC 32.50 (32.45) 1967
BRILLIANT SE 7.16 (7.27) 67445
CAMBRIDGE TE 68 (67.05) 8025
COMBAT DRUGS 11.71 (11.71) 2640
CONT COFFEE 279 (278.70) 3144
COROMAN FERT 448.40 (425.50) 27332
CYIENT LIMIT 499.85 (492.20) 2947
DECCAN CEMEN 1133 (1120.30) 945
DIVI'S LAB 656.40 (639) 95877
DR REDDY 1998.80 (2001.75) 62361
FOUR SOFT 91.75 (88.75) 1876
GATI CORPN 112.90 (109.20) 94694
GAYATRI PROJ 164.60 (160.60) 25391
GMR INFRASTR 16.40 (16.10) 7829443
GOLDST INFRA 118.25 (112.65) 6795
GRANULES (I) 126.55 (116.45) 681839
GVK POWER 12.76 (12.55) 1998553
HBL NIFE POW 45.70 (44.90) 29971
HERITAGE FOO 1335.45 (1261.25) 13833
IDL INDUSTRS 521.45 (519.60) 3685
IVRCL INFRAS 5.23 (5.24) 355868
KAKATIYA CEM 343.45 (342.05) 4892
KAVERI SEED 563.05 (535.05) 146736
KCP LTD 102.30 (101.65) 9891
KNR CONSTRUC 220.60 (220.35) 17406
LANCO INDUS 363.55 (358.95) 18132
LANCO INFRAT 0.87 (0.91) 7163999
LAURUS LABS 548.55 (547.50) 3061
MADHUCON PRO 28.90 (27.55) 19387
MIC ELECTRON 7.39 (7.24) 26644
MOLDTK PLA 282.95 (277.45) 2790
NAGARJAGRICH 36.05 (32.10) 32362
NATCO PHARMA 765.70 (739.30) 124735
NAVA BH VENT 127.95 (127.85) 33897
NCC 87.75 (86.25) 367445
NCL IND 221.75 (209.75) 45426
NEHA INTER 5.37 (5.47) 43146
NETTLINX 100.85 (102.95) 16817
NEULAND LAB 1279.80 (1285.90) 302
NIHAR INFO 15.60 (15.10) 1572
NILE 583.45 (585.40) 11351
PANKAJ POLY 12.02 (11.50) 7705
PANYAM CEMEN 62.15 (59.15) 6397
PENNER IND 56.70 (53.25) 455486
PHYTOCHEM I 44.75 (50.75) 54462
PITTI LAMIN 51.85 (50.35) 1762
POKARNA 1229.35 (1231.45) 1393
PRISM CEMENT 112.50 (112.15) 11747
PRUDENTL PHA 3.94 (4.04) 102077
RAIN INDUSTR 126.75 (120.15) 355905
SAMKRG PIST 264.50 (254.10) 7391
SATVAH. ISPA 38.15 (38.20) 2735
SMS PHARMA 71.95 (72) 5572
SPHERE GLOBA 50.30 (49.60) 353
SREE RAYAL A 29.05 (26.90) 343201
STEEL EXCHAN 83.95 (83) 106138
SUJANA METAL 1.74 (1.76) 33389
SUJANA TOWER 4.32 (4.25) 2350
SUJANA UNIVE 1 (1.02) 80070
SURYALAKSH.C 101.70 (100.70) 819
SUVEN PHARMA 157.55 (160.20) 43159
TAJ GVK HOTE 160.15 (160.95) 762
TANLA 32.20 (31.85) 43984
TERA SOFTWAR 66 (67.05) 9233
VICEROY HOTE 17 (16.55) 25627
VIMTA LABS 133.35 (129.85) 2658
VISAKA IND 510.30 (511.50) 22824
VISTA PHARMA 28.40 (27.05) 171513
VIVIMED LABS 104 (101.55) 84736
YBRANT DIGIT 6.77 (6.92) 135007
ZENTECH 50.90 (49.45) 8161

బ్యాంకులు రుణ రేట్లు తగ్గించాలి

● కీలక రేట్ల కోత ప్రయోజనాలు బదిలీ చేయాలి

● ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్



ముంబయి: రిజర్వ్ బ్యాంక్ కీలక రేట్లలో కోత విధించినప్పటికీ.. ఆ ప్రయోజనాలను బ్యాంకులు వినియోగదార్లకు బదిలీ చేస్తేనే.. ద్రవ్యోల్బణేతర వృద్ధి సాధ్యమవుతుందని ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అభిప్రాయపడ్డారు. ఈనెల 1-2 తేదీల్లో జరిగిన పరపతి విధాన కమిటీ (ఎమ్‌పీసీ) సమావేశ వివరాలను ఆర్‌బీఐ బుధవారం బయటకు వెల్లడించింది. దీని ప్రకారం..

గవర్నర్ ఆధ్వర్యంలోని ఆరుగురు సభ్యుల కమిటీలో నలుగురు పావు శాతం మేర రెపో రేటు కోతకు మద్దతు పలకగా.. బయటి సభ్యుడైన (ఐఐఎమ్ అహ్మదాబాద్ ప్రొఫెసర్) రవీంద్ర హెచ్ ఢొలాకియా అర శాతం మేర తగ్గించాలని సలహానిచ్చారు. ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ దేవవ్రత పాత్ర యథాపూర్వ స్థితి మంచిదని సూచించారు. మెజారిటీ సభ్యుల నిర్ణయం ప్రకారం.. ఆర్‌బీఐ పావు శాతం మేర రేట్ల కోత విధించింది. ఆహార ధరలు చాలా తక్కువ స్థాయిలో ఉండడం అసాధారణమైన విషయమే. ఎప్పుడైనా ఇవి పెరగవచ్చు. విధాన రేట్లను బదిలీ చేయడం ద్వారానే ద్రవ్యోల్బణేతర వృద్ధి సాధించవచ్చు. ఇప్పటికీ బ్యాంకులు రుణ రేట్లను తగ్గించడానికి ఇంకా అవకాశం ఉంది' అని ఉర్జిత్ అభిప్రాయపడ్డారు. ఒత్తిడిలో ఉన్న ఆస్తులు పెరిగిపోతుండడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో రుణ వృద్ధి కూడా తక్కువగానే ఉందన్నారు. బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లను ప్రక్షాళిస్తేనే రుణ గిరాకీ, కంపెనీల పెట్టుబడుల ప్రణాళికలకు ఊతం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

స్వచ్ఛత 22 క్యారెట్లు మించితే

పసిడి ఆభరణాల ఎగుమతి నిషేధం



దిల్లీ: బంగారం అక్రమ రవాణా నిరోధానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు ప్రారంభించింది. స్వచ్ఛత 22 క్యారెట్లకు మించిన పసిడి ఆభరణాలు, పతకాలు, కడ్డీలు, వస్తువుల వంటి వాటి ఎగుమతులను నిషేధించింది. ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి పార్కులు, బయో, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కుల వంటివి కూడా వీటిని ఎగుమతి చేయడానికి లేదు. అంటే 8-22 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన పసిడితో తయారయ్యే ఆభరణాలు, ఉత్పత్తులను మాత్రమే ఎగుమతి చేయొచ్చని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిబంధనలు పాటించే సంస్థలకు మాత్రమే ప్రోత్సాహకాలు లభిస్తాయని తెలిపింది. 22 క్యారెట్ల స్వచ్ఛతకు మించిన పసిడి ఆభరణాలు, వస్తువులకు అంతర్జాతీయ విపణిలో అంతగా గిరాకీ లేనందున, ఎగుమతులపై ప్రభావం పడదని భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) అభిప్రాయపడింది. మేలిమి బంగారాన్ని అక్రమంగా ఎగుమతి చేసి, మళ్లీ దిగుమతి చేసుకోవడాన్ని నిరోధించేందుకే ప్రభుత్వం ఈ చర్య తీసుకుందని భావిస్తున్నారు.

నిరుద్యోగ సమాచార మార్పిడికి బీఎస్ఈ, పీహెచ్‌డీ చాంబర్ ఒప్పందం

దిల్లీ: నిరుద్యోగ సమాచారం, భారత వినియోగదారుల సెంటిమెంట్‌కు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ), పరిశ్రమ సంఘం పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పీహెచ్‌డీసీసీఐ) ఒప్పందం కుదుర్చుకున్నాయి. పీహెచ్‌డీసీసీఐ తమ వెబ్‌సైట్‌లో ఈ సమాచారాన్ని ప్రదర్శిస్తుంది. పీహెచ్‌డీసీసీఐ విద్యార్థులు, శిక్షణా సిబ్బంది, బీఎస్ఈ శిక్షణా కేంద్రాలు తమ పరిశోధనా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోనున్నాయని బీఎస్ఈ ఎండీ, సీఈఓ ఆశిష్‌కుమార్ చౌహాన్ వెల్లడించారు. విద్యార్థులతో పాటు పరిశోధనా అభ్యర్థులకు ఇది ఉపయోగపడుతుందని అన్నారు. తమ సభ్యులు మరిన్ని అనలిటిక్స్, సామాజిక- ఆర్థిక సంకేతాలు అందిపుచ్చుకోగలరని పీహెచ్‌డీసీసీఐ అధ్యక్షుడు గోపాల్ జీవారాజికా తెలిపారు.

వ్యూహాత్మక వాటాల విక్రయానికి అత్యున్నత సంఘం

కేంద్ర మంత్రి మండలి నిర్ణయం

దిల్లీ: పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వరంగ సంస్థల్లో వ్యూహాత్మక వాటాల విక్రయానికి అత్యున్నత స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి మండలి నిర్ణయించింది. ప్రత్యామ్నాయ యంత్రాంగం (ఏఎం)గా పిలిచే ఈ సంఘంలో ఆర్థికశాఖ, రవాణా-రహదారులు, పరిపాలనశాఖల మంత్రులు సభ్యులుగా ఉంటారు. నియమ-నిబంధనలు రూపొందించడం నుంచి బిడ్లు ఆహ్వానించే వరకు అంతా ఈ సంఘమే చూసుకోనుంది. ఆర్థిక వ్యవహారాలు పరిశీలించే కేంద్ర మంత్రి మండలి సంఘం తీసుకునే నిర్ణయాల అమలులో ఏమైనా సమస్యలు తలెత్తితే, వాటిపై ఎప్పటికప్పుడు విధానపరమైన చర్యలు తీసుకునే అధికారాన్ని మంత్రి మండలి కార్యదర్శి నేతృత్వంలోని కార్యదర్శుల బృందానికి అప్పగించనున్నారని పభుత్వం వెల్లడించింది. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.72,500 కోట్లు సమీకరించాలని బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించింది. మైనారిటీ వాటాలు విక్రయించడం ద్వారా రూ.46,500 కోట్లు, వ్యూహాత్మక వాటాల అమ్మకం ద్వారా రూ.15,000 కోట్లు, ప్రభుత్వరంగ బీమా సంస్థలను మార్కెట్లలో నమోదు చేయడం ద్వారా రూ.11,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

యెస్ బ్యాంక్ పొదుపు ఖాతాలపై వడ్డీ రేట్ల తగ్గింపు

దిల్లీ: పొదుపు (సేవింగ్స్) ఖాతాల్లోని నగదు నిల్వలపై వడ్డీ రేట్లను ప్రైవేట్ రంగ యెస్ బ్యాంక్ తగ్గించింది. రూ.లక్ష లోపు నిధులుంటే వడ్డీని 1% తగ్గించి, 5% ఇస్తామని తెలిపారు. రూ.లక్ష - కోటి లోపు డిపాజిట్లపై ఇచ్చే 6 శాతం వడ్డీ కొనసాగించనున్నట్లు తెలిపింది. రూ.కోటి కంటే అధిక మొత్తం ఉంటే, వడ్డీని 6.5% నుంచి 6.25 శాతానికి తగ్గించింది. కొత్త రేట్లు సెప్టెంబరు 1 నుంచి అమల్లోకి వస్తాయని యెస్ బ్యాంక్ వెల్లడించింది.

ఈనాడు బిజినెస్

కెనడా, చైనా, ఐరోపా దేశాల రసాయనాలపై దిగుమతి నిరోధక సుంకం!

దిల్లీ: కెనడా, చైనా, ఐరోపా దేశాల నుంచి దిగుమతి అవుతున్న రసాయనాలపై ప్రభుత్వం దిగుమతి నిరోధక సుంకాన్ని విధించే అవకాశం ఉంది. రంగులు, ఔషధాల్లో ఉపయోగించే ఈ రసాయనాలపై టన్నుకు సుమారు రూ.1,100 నుంచి రూ.7,600 వరకు సుంకం విధించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న సోడియం క్లోరేట్ రసాయనం వల్ల దేశీయ సంస్థలు నష్టపోతున్నాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ యాంటీ డంపింగ్ అలైడ్ డ్యూటీస్(డీజీఏడీ) గుర్తించింది.

ప్రమాణం చేయండి.. ప్రమాణాలున్నాయా?

● స్మార్ట్ ఫోన్లలో డేటా భద్రమేనా ● ఈ నెల 28లోపు వివరణ ఇవ్వండి ● తయారీ సంస్థలకు ప్రభుత్వ ఆదేశం

● సాఫ్ట్‌వేర్, యాప్‌లపై నిశిత పరిశీలన ● నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 కోట్ల వరకు జరిమానా



దిల్లీ

స్మార్ట్ ఫోన్.. ఇప్పుడు మన జీవితంలో ఇదొక భాగం. చేతిలో ఇది ఉంటే ఎన్నో అవసరాలు చిటికెలో తీరిపోతాయి. క్షణాల్లో సమస్త సమాచారాన్ని తెలుసుకోవచ్చు. ఏం కొన్నా.. ఏం తిన్నా 'స్మార్ట్'గా బిల్లులు చెల్లించొచ్చు. మరి ఇంత కీలకమైన ఫోన్లలో వినియోగదార్లకు సంబంధించిన వివరాలు (డేటా) సురక్షితమేనా..? ఆ డేటాను భద్రంగా ఉంచేందుకు ఫోన్ల తయారీ సంస్థలు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నాయి.. ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబట్టే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది.

21 సంస్థలకు తాఖీదులు..

సైబర్ దాడుల నుంచి భద్రత కల్పిస్తూనే, ప్రజల వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉండేలా ఎటువంటి విధానాలు అవలంబిస్తున్నారో వెల్లడించాల్సిందిగా ఎలక్ట్రానిక్స్, సమాచార-సాంకేతికశాఖ ఆదేశాలు జారీ చేసింది. సవివరంగా రాతపూర్వకంగా సమాధానం ఇచ్చేందుకు ఫోన్ల తయారీ సంస్థలకు ఈ నెల 28 వరకు గడువు ఇచ్చింది. ఈమేరకు 21 విదేశీ, స్వదేశీ సంస్థలకు తాఖీదులు పంపింది. ఇందులో వివో, ఒపో, షియామీ, జియోనీ వంటి చైనా బ్రాండ్లతో పాటు శాంసంగ్, యాపిల్, బ్లాక్‌బెర్రీ వంటివీ ఉన్నాయి. అవి ఇచ్చే వివరణల ఆధారంగా తనిఖీలు, ఆడిట్ నిర్వహించనున్నట్లు సమాచార-సాంకేతిక (ఐటీ) శాఖ ఉన్నతాధికారి వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులు, ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ప్రతినిధులతో ఐటీశాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ తాజాగా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

రహస్యంగా చేరవేస్తున్నాయా..?

స్మార్ట్ ఫోన్ కొనుగోలు చేసినప్పుడు అందులో ముందుగానే నిక్షిప్తం చేసిన (ప్రీలోడెడ్) కొన్ని సాఫ్ట్‌వేర్‌లు, యాప్‌లు ఉండటం పరిపాటే. వీటిని ఫోన్ నుంచి తొలగించడం వీలు కాదు. ఇటువంటి యాప్‌లు, సాఫ్ట్‌వేర్‌లు రహస్యంగా వినియోగదార్ల సమాచారాన్ని, ఇతర దేశాలకు చేరవేసే అవకాశం ఉంటుంది. అంతే కాకుండా చైనా సంస్థలు డేటాను నిక్షిప్తం చేసే సర్వర్లను తమ దేశంలో కలిగి ఉన్నాయి. వీటిలోన మన వినియోగదార్లకు సంబంధించిన ఫోను నెంబర్లు, సందేశాలు, చిత్రాలు తస్కరణకు గురవుతున్నాయి. దీనివల్ల కోట్లాది వినియోగదార్ల ఆర్థిక భదత్రకు పెను ముప్పు వాటిల్లుతుంది. అందుకే తొలివిడతగా ప్రభుత్వం వీటిపై నిఘా పెట్టనుంది. అలాగే చైనా నుంచి ఇబ్బడి ముబ్బడిగా దిగుమతవుతున్న ఎలక్ట్రానిక్-ఐటీ వస్తువులు, ఉపకరణాలను కూడా పరిశీలించనుంది.

కఠిన చర్యలు..

సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పరంగా అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలుపాటించకపోతే ఐటీ చట్టంలోని 43(ఏ) నిబంధన కింద కఠిన చర్యలు తీసుకోనున్నారు. నిబంధనల ఉల్లంఘనల తీవ్రత ఆధారంగా జరిమానాలు విధిస్తారు. కొన్ని సందర్భాలలో దాదాపు రూ.5 కోట్లు జరిమానా విధించే అవకాశం ఉంది. ఒక స్మార్ట్‌ఫోన్‌కు సంబంధించి హార్డ్‌వేర్, ఆపరేటింగ్ సిస్టం, యాప్‌లు, నెట్‌వర్కింగ్ కమ్యూనికేషన్స్, డేటా ఎన్‌క్రిప్షన్ వంటి విభాగాల్లో భద్రతను ప్రభుత్వం సమీక్షిస్తుంది. అయితే దేశ భద్రతను దృష్టిలో ఉంచుకొనే ఫోన్లను తయారు చేస్తున్నట్లు ఇండియన్ సెల్యులార్ అసోషియేషన్ చెబుతోంది.

ఇప్పుడే ఎందుకు..?

నేటి ప్రపంచానికి డేటానే ఇంధనం. ఒక ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, అభివృద్ధికి కూడా ఊతమిచ్చే డేటాను తస్కరించేందుకు సైబర్ నేరగాళ్లు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. వైరస్‌లను ప్రవేశపెట్టడం, డేటాను తస్కరించడం వంటి చర్యలతో ఆర్థికంగా దెబ్బతీసేందుకు శత్రు దేశాలు ప్రయత్నిస్తుంటాయి. ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ ఇండియా పథకంతో ఆన్‌లైన్ కార్యకలాపాలు గణనీయంగా పెరుగుతున్నాయి. మన స్మార్ట్ ఫోన్ల విపణిలో అత్యధిక వాటా విదేశీ సంస్థలదే. చైనా నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫోన్లు కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. ఇటీవల కాలంలో మన సరిహద్దుల వద్ద ఆ దేశం దుందుడుకుగా వ్యవహరిస్తున్న తీరు పట్ల ప్రభుత్వం ఆందోళనగా ఉంది. ఈ నేపథ్యంలో తలెత్తే ఎటువంటి పరిణామాలనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది.

సాధారణ బీమాలోకి మరిన్ని కంపెనీలు

● ఆకర్షణీయంగా పెరుగుతున్న విపణి ● 2016-17 ప్రీమియం ఆదాయం రూ.1.27 లక్షల కోట్లు

● ఏటా 15 లక్షల పాలసీలు ● పబ్లిక్ ఇష్యూలతో మరింత పారదర్శకత ● జీఎస్‌టీ భారమే

ఈనాడు - హైదరాబాద్

ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి.. అయినా దేశంలో సాధారణ బీమా విస్తృతి తక్కువగానే ఉంది. ఈ నేపథ్యంలోనే ఆరోగ్య బీమాపై యువత ఆసక్తి చూపుతుండటం, పెరుగుతున్న వాహన విక్రయాలు.. సాధారణ బీమా వృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఈ రంగంలో గత రెండు, మూడేళ్లుగా ప్రీమియం ఆదాయం 15-16 శాతం వృద్ధి చెందగా, గత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 32 శాతం వృద్ధిరేటు నమోదైంది. సాధారణ బీమా పరిశ్రమ ప్రీమియం ఆదాయం (2016-17) రూ.1.27 లక్షల కోట్లకు చేరిందని, ఇందుకు ప్రధాన కారణాల్లో పంటల బీమా విస్తరించడం ఒకటని కోటక్ మహీంద్రా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ మహేశ్ బాల సుబ్రమణియన్ తెలిపారు. సాధారణ బీమాలో వాహన బీమాదే సింహ భాగం. గత ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగంలో రూ.50,000 కోట్లకు పైగా ప్రీమియం వసూలైంది. ఏటా పరిశ్రమ 15 లక్షల పాలసీలను చేస్తోంది. వచ్చే రెండు మూడేళ్లపాటు పరిశ్రమలో 15-16 శాతం వృద్ధిరేటు కొనసాగనుంది. ప్రీమియం ఆదాయం రూ.2-2.5 లక్షల కోట్లకు చేరగలదని అంచనా. వాహన, ఆరోగ్య బీమాతో పాటు పంటలు, అగ్ని ప్రమాదాలు, సముద్ర మార్గంలో సరకు రవాణా వంటి అనేకం సాధారణ బీమా కిందకు వస్తాయి. ప్రస్తుతం 29 కంపెనీలు దేశంలో సాధారణ బీమా పాలసీలు అందిస్తున్నాయి. ఆకర్షణీయ అవకాశాలను దృష్టిపెట్టుకుని వచ్చే 4-5 నెలల్లో మరో 3-4 సాధారణ బీమా కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి.



కోటక్ మహీంద్రా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఎండీ, సీఈఓ మహేశ్ బాల సుబ్రమణియన్

ఐపీఓకు 3-4 కంపెనీలు: న్యూ ఇండియా ఎస్యూరెన్స్, ఐసీఐసీఐ లాంబార్డ్, జనరల్ ఇన్సూరెన్స్ సహా 3-4 కంపెనీలు ఏడాది పబ్లిక్ ఇష్యూకు వచ్చే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందువల్ల జవాబుదారీతనం పెరుగుతుందని, పరిశ్రమలో మరింత పారదర్శకత వస్తుందని మహేశ్ అభిప్రాయపడ్డారు. దీంతోపాటు పెట్టుబడులు పెట్టిన మదుపర్లకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. కంపెనీలు ఎప్పటికప్పుడు సమాచారం అందించడం వల్ల, సాధారణ బీమాపై అవగాహన పెరుగుతుంది. పరిశ్రమకు కొత్త ప్రామాణికాలు వస్తాయి. జీఎస్‌టీలో సాధారణ బీమాపై 18 శాతం పన్ను విధించారు. గతంలో ఇది 15 శాతం ఉండేది. దీని వల్ల ప్రీమియంలు స్వల్పంగా పెరగడానికి అవకాశం ఉందని తెలిపారు.

రూ.200 కోట్ల ప్రీమియం లక్ష్యం

అన్ని రకాల ఫైనాన్షియల్ సేవలు నిర్వహిస్తున్న కోటక్ మహీంద్రా సాధారణ బీమా రంగంలోకీ ఏడాది క్రితం అడుగు పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3 లక్షల పాలసీల విక్రయంపై రూ.200 కోట్ల ప్రీమియం సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కోటక్ మహీంద్రా జనరల్ ఇన్సూరెన్స్ గత ఆర్థిక సంవత్సరంలో లక్ష పాలసీలు విక్రయించి, రూ.83 కోట్ల ప్రీమియం రాబట్టింది. వాహన, వైద్య పాలసీలతో పాటు సైబర్ దాడుల వంటి రిస్కులను కవర్ చేసే ప్రత్యేక (స్పెషాలిటీ) పాలసీలను త్వరలో మార్కెట్‌లోకి తీసుకురానున్నట్లు కంపెనీ ఎండీ తెలిపారు. కోటక్ మహీంద్రా బ్యాంకుతో బ్యాంకెష్యూరెన్స్ ఒప్పందం ద్వారా పాలసీలు విక్రయిస్తున్నామని, మరిన్ని బ్యాంకులతో ఇలాంటి ఒప్పందానికి చర్చలు జరుగుతున్నాయని వివరించారు. క్లెయిమ్‌ల పరిష్కార సమయాన్ని మరింతగా తగ్గించడానికి డిజిటలైజేషన్‌పై కంపెనీ దృష్టి కేంద్రీకరిస్తోందన్నారు.

జీతం ఎక్కువిస్తే వచ్చేస్తా

● నైపుణ్య మెరుగు, వృద్ధి అవకాశాలకూ ప్రాధాన్యం

● వృత్తి నిపుణుల తీరుపై లింక్డ్‌ఇన్ సర్వే



ముంబయి: ఇప్పుడు లభిస్తున్న వేతనం కంటే ఎక్కువ ఇస్తామంటే, పాత కొలువుకు టాటా చెప్పేసి, కొత్త ఉద్యోగం బాట పట్టేందుకే వృత్తి నిపుణులు సిద్ధంగా ఉంటున్నారు. వారు ఉద్యోగం మారేందుకు ప్రధాన కారణం అధిక వేతనాలేనని ఒక సర్వే తెలిపింది. నైపుణ్యాన్ని మరింత మెరుగుపరచుకునే వీలుండటం, వృత్తిపరంగా వృద్ధికి అధిక అవకాశం ఉండటం లాంటివీ కొత్త ఉద్యోగం వైపు వారిని అడుగులు వేసేలా చేస్తున్నాయట. 'ఇన్‌సైడ్ ద మైండ్ ఆఫ్ టుడేస్ క్యాండిడేట్స్' పేరుతో లింక్డ్‌ఇన్ నిర్వహించిన సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. సర్వేలో భారత్‌కు చెందిన 539 మంది వృత్తి నిపుణులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఇలా..

- ✦ కొత్త ఉద్యోగావకాశాల గురించి వినేందుకు ఆసక్తి చూపుతామని 91% మంది చెప్పారు. గతేడాది 90% మంది ఇలానే తెలిపారు. అంటే వృత్తి నిపుణుల్లో ఎక్కువ మంది కొత్త ఉద్యోగావకాశాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు.
- ✦ ఇంటర్వ్యూ సమయంలో వేతనం ఏ శ్రేణిలో ఉండొచ్చనే విషయాన్ని తెలుసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తామని 37 శాతం మంది వెల్లడించారు.
- ✦ వ్యక్తిగత, వృత్తిగత అవసరాలు రెండూ తీరే విధంగా ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవాలని అనుకుంటున్నామని 55 శాతం మంది తెలిపారు
- ✦ కొత్త ఉద్యోగంలో బాధ్యతలతో పాటు ప్రోత్సాహకాలు, ప్రయోజనాలు ఎలా ఉంటాయో తెలుసుకునేందుకు 52 శాతం మంది ఆసక్తి చూపారు.
- ✦ ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యే ముందు కంపెనీ వెబ్‌సైట్‌లు పరిశీలిస్తామని 49 శాతం మంది చెప్పారు. 47 శాతం మంది సెర్చ్ ఇంజిన్‌లను ఉపయోగించుకుంటామని తెలిపారు. ప్రొఫెషనల్ నెట్‌వర్క్స్, ఆ సంస్థ ఉద్యోగుల ద్వారా సమాచారం తెలుసుకుంటామని 35 శాతం మంది పేర్కొన్నారు.
- ✦ కంపెనీల గురించి తెలుసుకునేందుకు, ఉద్యోగాల విషయంలో అప్రమత్తంగా ఉండేందుకు సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుంటున్నామని 63 శాతం మంది తెలిపారు.
- ✦ ఇంటర్వ్యూ సమయంలో కంపెనీ ఉన్నత యాజమాన్య బృందంతో మాట్లాడటం వల్ల సంస్థపై సానుకూల దృక్పథం ఏర్పడుతుందని 45 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- ✦ ఇంటర్వ్యూకు వెళ్లేముందు పని ప్రాంతాన్ని సందర్శించేందుకు ప్రాధాన్యం ఇస్తామని 54 శాతం మంది తెలిపారు. దీనివల్ల కంపెనీ సంస్కృతీ, సాంప్రదాయాలపై అవగాహన ఏర్పడుతుందని చెప్పారు.
- ✦ నైపుణ్యాన్ని తీర్చిదిద్దుకునేందుకు వీలుంటే కంపెనీలో కొనసాగుతామని 62 శాతం మంది తెలిపారు. వృత్తి, వ్యక్తిగత జీవితానికి మధ్య సమతుల్యం ఉంటే ఉద్యోగాన్ని విడిచిపెట్టమని 42% మంది చెప్పారు. కంపెనీ భవిష్యత్ ఆశావహంగా ఉంటే అదే ఉద్యోగంలో కొనసాగుతామని 37% మంది వెల్లడించారు.

అంతర్జాతీయ బ్రాండ్.. మా లక్ష్యం

● 'భారత్‌లో తయారీ' అంటే కూర్పు కాదు

● పూర్తిస్థాయి తయారీ మా లక్ష్యం

● ఈ ఏడాది 7-8 ఉత్పత్తులు

● స్మార్ట్‌రాన్ ఛైర్మన్ మహేశ్ లింగారెడ్డి

ఈనాడు - హైదరాబాద్

"భారత్‌లో తయారీ' అంటే.. చైనా కంపెనీలు ఇక్కడకు వచ్చి విడి పరికరాలు కూర్పు (అసెంబ్లింగ్) చేయడం కాదు. దాని వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. పూర్తిస్థాయి తయారీ ఇక్కడ జరిగితేనే సార్థకత. ఎంతో క్లిష్టమైన సాంకేతిక పరిజ్ఞానాల్లో నైపుణ్యాలున్నా, భారత్ గట్టిగా ఒక ఉత్పత్తి కూడా రూపొందించలేకపోతోంది. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఒక్క ఉత్పత్తి బ్రాండ్ కూడా భారత్‌కు లేదు' అన్నారు స్మార్ట్‌రాన్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ మహేశ్ లింగారెడ్డి. హైదరాబాద్‌కు చెందిన అంకుర కంపెనీ స్మార్ట్‌రాన్, ఉత్పత్తులను డిజైన్ చేసి, తయారు చేసి అంతర్జాతీయ విపణిలోకి విడుదల చేస్తోంది. 'ట్రాన్ ఎక్స్' సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్ సృష్టించి, దానిపై ఉత్పత్తులను డిజైన్ చేస్తోంది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌ను మిళితం చేసి మరింత సౌకర్యాలు కలిగిన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురావాలని సంస్థ భావిస్తోంది. స్మార్ట్ ఫోన్ తయారీలో వందల సంఖ్యలో విడిభాగాలు వినియోగిస్తారు. ఈ విడిభాగాలు, సొల్యూషన్లను అభివృద్ధి చేసే అంకుర కంపెనీలను తమ గొడుగు కిందకు తెచ్చుకునేందుకు వాటిలో పెట్టుబడులు కూడా పెడుతోంది.



ప్రముఖ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ ఈ కంపెనీలో పెట్టుబడులు పెట్టడమే కాదు, ప్రచారం కూడా చేస్తున్నారు. భారత్ తరఫున అంతర్జాతీయ బ్రాండ్ సృష్టించాలన్నది తమ లక్ష్యమని లింగారెడ్డి 'ఈనాడు'కు తెలిపారు. ఐబీఎం, గూగుల్, యాపిల్ వంటి కంపెనీలు నిరంతర పరిశోధన, మేధో సంపత్తి హక్కుల ద్వారా ప్రపంచ స్థాయి ఉత్పత్తి కంపెనీలుగా ఎదిగాయని, అటువంటి కంపెనీలు భారత్‌కు కూడా ఉండాలని అభిప్రాయపడ్డారు. 'మొదట్లో చైనా తయారీపై, భారత్ సేవలపై దృష్టి కేంద్రీకరించాయి. కేవలం తయారీపైనే కొనసాగితే అంతర్జాతీయ మార్కెట్‌లో ఎంతో కాలం నిలవలేమన్న సత్యాన్ని చైనా, అక్కడి కంపెనీలు గుర్తించాయి. అందుకే సరికొత్త ఉత్పత్తులను తీసుకురావడంపై పెట్టుబడులు పెట్టి, విజయం సాధిస్తున్నాయ'ని మహేశ్ అన్నారు. దేశంలో పెట్టుబడుల వ్యవస్థ (ఎకో సిస్టమ్) సరిగా లేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రిస్క్ స్వీకరించి మేధో సంపత్తి హక్కులు, ఉత్పత్తులను డిజైన్ చేసే స్మార్ట్‌రాన్ లాంటి కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడానికి చాలా మంది మదుపర్లు సాహసించడం లేదని, కంపెనీకి సగటు ప్రతిఫలం 10 శాతం ఉంటే.. అంతకుంటే ఎక్కువగా వడ్డీలు చెల్లించి నిధులు సమకూర్చుకునే పరిస్థితులు ఉన్నాయన్నారు.

50 మేధో సంపత్తి హక్కులకు దరఖాస్తు..

మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లతోపాటు స్మార్ట్ బ్యాండ్లు, వేరబుల్స్ వంటి అనేక ఉత్పత్తులను విడుదల చేయాలని స్మార్ట్‌రాన్ యోచిస్తోంది. ఇప్పటి వరకూ 50 మేధో సంపత్తి హక్కులకు దరఖాస్తు చేసింది. ఇప్పటికే 2-3 అంకురాల్లో పెట్టుబడులు పెట్టిన స్మార్ట్‌రాన్ దాదాపు రెండేళ్ల కాలంలో (ప్రారంభించిన నాటి నుంచి) రూ.200 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.200 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీర్ఘకాల ప్రణాళికలో భాగంగా అయిదేళ్లలో రూ.1,500 కోట్ల పెట్టుబడులు పెట్టాలని భావిస్తోంది. ఇతర అంకుర కంపెనీలు స్మార్ట్‌రాన్ ప్లాట్‌ఫామ్ (ట్రాన్ ఎక్స్)పై ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి వాటితో చేతులు కలుపుతోంది. ఇప్పటి వరకు 2 స్మార్ట్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్ విడుదల చేసిన స్మార్ట్‌రాన్ వచ్చే ఏడాది కాలంలో 7-8 ఉత్పత్తులను కంపెనీ ప్రవేశపెట్టనుంది. స్మార్ట్ బ్యాండ్, మరిన్ని లాప్‌టాప్‌లు, స్మార్ట్ స్విచ్‌లు, ఎలక్ట్రికల్ సైకిల్ వంటి ఉత్పత్తులు వీటిలో ఉంటాయని మహేశ్ తెలిపారు. అంకుర కంపెనీలకు బ్యాక్ ఎండ్ సొల్యూషన్ అందించడం ద్వారా వచ్చే అయిదారేళ్లలో అనేక కొత్త ఉత్పత్తులను తీసుకువస్తామన్నారు.

బాలీవుడ్‌లో అగ్రకథానాయకుల చిత్రాలకు దీటుగా కథాబలమున్న చిన్న చిత్రాలూ విరివిగా తెరకెక్కుతుంటాయి. ఆకట్టుకునేలా ఉంటే చాలు... తారాగణం ఎవరన్నది పట్టించుకోకుండా ప్రేక్షకులు అక్కున చేర్చుకుంటారు. ఆ నమ్మకంతోనే తెరకెక్కిన చిత్రం 'బరేలీ కీ బర్ఫీ'. యువ తారలు ఆయుష్మాన్ ఖురానా, రాజ్‌కుమార్ రావ్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. దర్శకురాలు అశ్విని అయ్యర్ తివారీ తెరకెక్కించింది. ఫ్రెంచ్ నవల 'ఇంగ్రిడియంట్స్ ఆఫ్ లవ్' ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఆ చిత్ర విశేషాలివీ.

బిట్టీ... ఓ బర్ఫీ లాంటి అమ్మాయి!

అశ్విని అయ్యర్ 'నీల్ బాట్టీ సన్నాట్టా' చిత్రంతో దర్శకురాలిగా మారింది. మొదటి అడుగులోనే ఉత్తమ తొలి చిత్ర దర్శకురాలిగా ఫిలింఫేర్ పురస్కారంతో పాటు ప్రేక్షకుల మెప్పు కూడా పొందింది. ఇప్పుడు రెండో చిత్రంగా 'బరేలీ కీ బర్ఫీ' తెరకెక్కించింది. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రానికి అశ్విని భర్త 'దంగల్' దర్శకుడు నితేష్ తివారీ రచయితగా వ్యవహరించడం గమనార్హం. ఫ్రెంచ్ నవల 'ఇంగ్రిడియంట్స్ ఆఫ్ లవ్' కథాంశానికి స్వదేశీ నేటివిటీని చేర్చి ఈ చిత్ర కథను రూపొందించారు. 'విక్కీ డోనర్', 'దమ్‌లగాకే హైసా' లాంటి విజయవంతమైన చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఆయుష్మాన్ ఖురానా, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలకు చిరునామాగా నిలిచిన రాజ్‌కుమార్ రావ్ కథానాయకులుగా నటించడం చిత్రంపై ఆసక్తిని పెంచింది. వీరికితోడు కృతి సనన్ అందం, అభినయం కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని చిత్ర బృందం చెబుతోంది.



జాతీయ పురస్కార గ్రహీతలతో

ఈ చిత్రం కోసం ఇద్దరు జాతీయ పురస్కార విజేతలు పనిచేశారు. 'షాహిద్'లో నటనకుగానూ జాతీయ పురస్కారం అందుకున్న రాజ్‌కుమార్ రావ్ ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించాడు. ఇక ఈ చిత్ర రచయిత నితేష్ తివారీ తెరకెక్కించిన 'చిల్లర్‌పార్టీ' ఉత్తమ బాలల చిత్రంగా జాతీయ పురస్కారం గెలుచుకుంది.

కథేంటి

ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో ఉండే హుషారైన అమ్మాయి బిట్టీ (కృతి సనన్). బ్రేక్ డ్యాన్సులన్నా, ఇంగ్లిష్ సినిమాలన్నా, అప్పుడప్పుడు దమ్ముకొట్టడమన్నా తనకిష్టం. తన ఇష్టాలను ఎలాంటి భయం లేకుండా ఓపెన్‌గా చెప్పేస్తుంటుంది. దీంతో పెళ్లి చూపులకు వచ్చిన అబ్బాయిలు జడుసుకుని పారిపోతుంటారు. చిన్న వ్యాపారం చేసుకునే చిరాగ్ దూబే (ఆయుష్మాన్) అనే కుర్రాడికి బిట్టీ నచ్చుతుంది. ఆమెను ప్రేమలో దింపి పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. అయితే పెళ్లిచూపుల గోల భరించలేక ఇల్లు వదిలి పారిపోతున్న బిట్టీకి బస్టాండ్‌లో 'బరేలీ కీ బర్ఫీ' అనే నవల కనపడుతుంది. అందులోని కథానాయిక పాత్ర అలవాట్లన్నీ అచ్చం తనలాగే ఉండటం ఆమెను ఆశ్చర్యపరుస్తుంది. ఎలాగైనా ఆ నవల రచయితను కలుసుకోవాలని ఆశపడుతుంది. అందుకు చిరాగ్ సహాయం కోరుతుంది. ఇంతకీ ఆ రచయిత ఎవరు? అతణ్ని బిట్టీ కలుసుకోగలిగిందా? బిట్టీ ప్రేమ కోసం చిరాగ్ ఎలాంటి ప్లాన్ వేశాడు? వీరి కథకు, ప్రీతమ్ విద్రోహి(రాజ్‌కుమార్ రావ్)కి సంబంధమేంటి? అనే విషయాలు తెరపై చూడాలి.

ఈనాడు సినిమా

చిరు సందడి మొదలైంది


చిరంజీవి, సురేందర్‌రెడ్డి, రామ్ చరణ్

'ఖైదీ నంబర్ 150'తో తన అభిమానుల్ని అలరించారు చిరంజీవి. ఆ తరవాత 151వ చిత్రానికి సంబంధించిన పనుల్లో పడిపోయారు. స్వాతంత్ర్య సమరయోధుడు 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' కథతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారన్న ప్రచారం జరిగినా ఇంతవరకూ అందుకు సంబంధించిన సమాచారం ఏదీ బయటకు రాలేదు. అభిమానుల నిరీక్షణకు తెరదించుతూ తన తదుపరి చిత్రాన్ని పట్టాలెక్కించేశారు చిరు. బుధవారం హైదరాబాద్‌లో చిరంజీవి 151వ చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. చిరంజీవి, సురేఖ, పరుచూరి వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ, అల్లు అరవింద్, రామ్ చరణ్ సంయుక్తంగా దర్శకుడు సురేందర్‌రెడ్డికి స్క్రిప్టుని అందించారు. ఈ చిత్రాన్ని కొణిదెల ప్రొడక్షన్స్ సంస్థపై రామ్ చరణ్ నిర్మిస్తున్నారు

పుట్టిన రోజు కానుక: ఈనెల 22న చిరు పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ సినిమా టైటిల్ లోగోతో కూడిన మోషన్ పోస్టర్‌ని ఆవిష్కరించనున్నారు. ఈ చిత్రానికి 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' అనే టైటిల్ పరిశీలిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లోనూ విడుదల చేస్తారు కాబట్టి, ఈ మూడు భాషల్లోనూ సులువుగా చేరేలా మరో టైటిల్ కూడా ఆలోచించారని, ఈ రెండింటిలో ఏదో ఒకటి ఖరారు చేస్తారని సమాచారం. మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలోనే ప్రకటిస్తారు. ఈ చిత్రానికి రచన: పరుచూరి బ్రదర్స్, సంభాషణలు: బుర్రా సాయిమాధవ్.

కరుణాకరన్ కథ నాకు రాసిపెట్టుంది!


కె.ఎస్.రామారావు, సాయిధరమ్ తేజ్, ఎ.కరుణాకరన్

సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. ఎ.కరుణాకరన్ దర్శకుడు. కె.ఎస్.రామారావు, కె.ఎ.వల్లభ నిర్మాతలు. బుధవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో చిత్రం ప్రారంభమైంది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ "ప్రేమకథతో తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఆద్యంతం సరదాగా సాగుతూ అందరికీ ఆహ్లాదాన్ని పంచేలా ఉంటుంది. తేజ్‌తో కలిసి సినిమా చేయడం గురించి ఆత్రుతగా ఎదురు చూస్తున్నా" అన్నారు. సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ "నేను, కె.ఎస్.రామారావుగారు కలిసి సినిమా చేయాలని ఎప్పట్నుంచో ప్రయత్నాలు చేస్తున్నాం. సరైన కథ కుదర్లేదు. ఎవరు ఏ కథ చేయాలనేది ముందే రాసి పెట్టి ఉంటుందని చెబుతుంటారు. అలా కరుణాకరన్‌గారి కథ నా కోసం రాసి పెట్టి ఉంది. ఆయనతో సినిమా చేస్తానని అసలు ఊహించలేదు. అలా కుదిరిందంతే. కరుణాకరన్‌గారు నాకు చిన్నప్పట్నుంచీ తెలుసు. నాకు మరో మామయ్య ఆయన. ఈ కథ చెబుతున్నప్పుడే చాలా ఆస్వాదించా. చిత్రీకరణని అంతకు మించి ఆస్వాదిస్తాననే నమ్మకం నాకుంది. ఎన్నో మంచి చిత్రాలు తీసిన కె.ఎస్.రామారావుగారి నిర్మాణంలో సినిమా చేస్తుండడం ఆనందంగా ఉంది. నేటితరంతోనూ ఆయన సినిమాలు తీస్తున్నారంటే ఆయన ఆలోచనలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. తప్పకుండా ఈ చిత్రం మా అందరికీ మంచి ఫలితాన్నిస్తుంది" అన్నారు.

45వ చిత్రం: క్రియేటివ్ కమర్షియల్స్ సంస్థ అధినేత కె.ఎస్.రామారావుది చిత్ర పరిశ్రమలో యాభయ్యేళ్ల ప్రయాణం. నిర్మాతగా ఆయన 35 ఏళ్లుగా కొనసాగుతున్నారు. చిరంజీవితో 'అభిలాష', 'ఛాలెంజ్', 'రాక్షసుడు', 'మరణమృదంగం', 'స్టూవర్టుపురం పోలీస్‌స్టేషన్', వెంకటేష్‌తో 'చంటి', 'వాసు', నాగార్జునతో 'క్రిమినల్', రాజశేఖర్‌తో 'అంగరక్షకుడు', ఎన్టీఆర్‌తో 'దమ్ము', ప్రభాస్‌తో 'బుజ్జిగాడు', శర్వానంద్‌తో 'మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు' తదితర విజయవంతమైన చిత్రాలు చేశారు. 'మాతృదేవోభవ', 'ముత్యమంత ముద్దు', 'ఆర్తనాదం', 'పుణ్యస్త్రీ' తదితర ఉత్తమ చిత్రాలు కూడా ఆయన నిర్మించినవే. నిర్మాతగా 45వ చిత్రాన్ని ఇప్పుడు సాయిధరమ్ తేజ్‌తో చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "సాయిధరమ్ తేజ్‌తో సినిమా అంటే మా కుటుంబంలోని ఓ యువతారతో సినిమా చేస్తున్నట్టు ఉంది. నా 45వ సినిమా తేజుతో కుదరడం ఆనందంగా ఉంది. నాకు, మా దర్శకుడు కరుణాకరన్‌కి ప్రేమకథలంటే ఇష్టం. మా కలయికలో మరో మంచి ప్రేమకథ ప్రేక్షకుల ముందుకొస్తుందని కచ్చితంగా చెబుతా. ఈ సినిమా ప్రారంభం కావడానికి, ఈ కలయిక కుదరడానికి సాయిధరమ్ తేజ్ కృషి ఎక్కువగా ఉంది. కరుణాకరన్ చెప్పిన కథ విని, 'మీ దర్శకుడు తయారు చేసిన ఈ కథని మీరు నిర్మిస్తే బాగుంటుంద'ని స్క్రిప్టుని నా దగ్గరికి తీసుకొచ్చాడు. 'వాసు' తర్వాత కరుణాకరన్‌తో ఈ సినిమా చేస్తున్నా. సంగీత చర్చలు మొదలయ్యాయి. దర్శకుడు చెప్పిన కథ విని స్ఫూర్తి పొందిన సంగీత దర్శకుడు గోపీసుందర్ ఇప్పటికే రెండు మంచి బాణీల్ని సిద్ధం చేశారు. తపన కలిగిన ఓ మంచి బృందం కలిసింది కాబట్టి తప్పకుండా గుర్తుండిపోయే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. విజయదశమి రోజున చిత్రీకరణ ప్రారంభమవుతుంది. ఏప్రిల్ నెలాఖరున చిత్రాన్ని విడుదల చేస్తాం" అన్నారు. ఈ చిత్రానికి కూర్పు: ఎస్.ఆర్.శేఖర్, కళ: సాహి సురేష్, మాటలు: డార్లింగ్ స్వామి, ఛాయాగ్రాహకుడు ఆండ్రూ

'సవ్యసాచి'గా నాగచైతన్య



'ప్రేమమ్' తర్వాత నాగచైతన్య, చందు మొండేటి కలిసి మరో చిత్రం చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ నిర్మిస్తున్న ఆ చిత్రానికి 'సవ్యసాచి' అనే పేరును ఖరారు చేశారు. పేరుతో కూడిన ముందస్తు పోస్టర్‌ని బుధవారం విడుదల చేసింది చిత్ర బృందం. నిర్మాతలు మాట్లాడుతూ "యాక్షన్ ప్రధానంగా సాగే చిత్రమిది. ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచేలా కథ, కథనాలుంటాయి. కథానాయకుడి పాత్రకి తగ్గట్టుగా 'సవ్యసాచి' పేరును నిర్ణయించాం. దర్శకుడు చందు మొండేటి ఆ పాత్రని తీర్చిదిద్దిన విధానం చాలా బాగుంది. 'ప్రేమమ్' తర్వాత నాగచైతన్య- చందు కలయికలో వస్తున్న సినిమా కావడంతో మంచి అంచనాలున్నాయి. సెప్టెంబరులో చిత్రీకరణ మొదలవుతుంది. త్వరలోనే చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాల్ని వెల్లడిస్తాం" అన్నారు.

ఎప్పటికప్పుడు తప్పుని తప్పని
చెప్పక తప్పదుగా
పచ్చని పైరుకు పట్టిన చీడను
తుంచక తప్పదుగా
నీతికి చితిబెట్టే చేతికి
నిప్పంటే చెబుతాం
నెత్తురు చితిబెట్టే
కత్తికి నొప్పిని చూపెడతాం
గీతం: లోకాస్సమాస్తా...
చిత్రం: యువ సేన
రచన: సిరివెన్నెల సీతారామశాస్త్రి
- పంపినవారు: ఎం. అప్పాజీకృష్ణ, బెంగళూరు

గీతోపదేశం

తెలీదు.. రాదు.. చేతకాదు



"ప్రపంచంలో అన్ని విషయాలూ తెలియాలని నిబంధన ఏం లేదు. చాలా విషయాల్లో నాకు కనీస పరిజ్ఞానం లేదు. కానీ నేర్చుకోవడానికి మాత్రం నేనెప్పుడూ మొహమాటపడను" అంటోంది తమన్నా. "ప్రపంచం ఓ విజ్ఞాన భాండాగారం. తెలీని సంగతులు చాలానే ఉంటాయి. అంతెందుకు.. సినిమాకి సంబంధించిన కొన్ని విషయాల్లో నా పరిజ్ఞానం అంతంత మాత్రమే. దాన్ని ఒప్పుకోవడానికి నాకు అహం అడ్డురాదు. అయితే 'రాదు.. చేతకాదు' అని మాత్రం అనుకోను. తెలియనివి నేర్చుకోవడం, అందులో పట్టు సాధించడం కూడా గొప్ప విషయమే. నిజానికి అందులోనే ఎక్కువ సంతోషం ఉంటుంది. సినిమాకి సంబంధించిన అన్ని కళలూ ఇంతకు ముందు నాకు తెలీవు. మెల్లిమెల్లిగా ఒకొక్క విషయంపైనా అవగాహన పెంచుకొంటున్నా. అది నా వృత్తికి, అందులో నా పనితనానికీ మేలు చేస్తుంది" అంటోంది తమన్నా.

మేడ మీద ఏం చేస్తున్నాడు?


అల్లరి నరేష్, నిఖిల విమల్

అల్లరి నరేష్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'మేడ మీద అబ్బాయి'. నిఖిల విమల్ కథానాయిక. జి.ప్రజిత్ దర్శకత్వం వహించారు. బొప్పన చంద్రశేఖర్ నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. వచ్చే నెల మొదటి వారంలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "దర్శకుడు కావాలని కలలుకనే కుర్రాడి కథ ఇది. ఈ కథకు 'మేడ మీద అబ్బాయి' అని టైటిల్ ఎందుకు పెట్టామో సినిమా చూస్తే తెలుస్తుంది. నరేష్ శైలిలోనే వినోదాత్మకంగా సాగుతూ, ఉత్కంఠ రేకెత్తిస్తుంది. ఇటీవల విడుదల చేసిన టీజర్‌కి మంచి స్పందన వచ్చింది. షాన్ రెహమాన్ అందించిన స్వరాలు, నేపథ్య సంగీతం ప్రధాన ఆకర్షణ" అన్నారు. అవసరాల శ్రీనివాస్, జయప్రకాష్, తులసి, సుధ, మధునందన్, 'జబర్దస్త్' ఆది తదితరులు నటించారు.

నీడ పోయిందా?


ఆనంద్ రవి, కోమలి

జేబులో పర్సు పోయిందనో లేదంటే ఇంట్లో సొమ్ములో, బైకో కనిపించడంలేదనో పోలీసులను ఆశ్రయించేవాళ్లని చూస్తుంటాం. కానీ ఒక వ్యక్తి తన నీడ పోయిందంటూ ఫిర్యాదు చేశాడు. ఎప్పుడూ మనతో పాటే ఉంటూ మనల్నే వెంటాడే మన నీడని మాయం చేయడం ఎవరికైనా ఎలా సాధ్యం? అదే ప్రశ్న పోలీసుల్నీ వేధించింది. ఆ ఫిర్యాదుని అందుకొన్న పోలీసులు ఏం చేశారు? తదితర విషయాలు తెలియాలంటే మా చిత్రం చూడాల్సిందే అంటున్నారు ఆనంద్ రవి. ఆయన కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'నెపోలియన్'. కోమలి, రవివర్మ ప్రధాన పాత్రధారులు. భోగేంద్ర గుప్త మడుపల్లి నిర్మాత. బుధవారం హైదరాబాద్‌లో నిర్మాత కె.ఎల్.దామోదర్‌ప్రసాద్, కథానాయకుడు సందీప్‌కిషన్ ట్రైలర్‌ని విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "ఒక కొత్త కాన్సెప్ట్‌తో సాగే చిత్రమిది. మొదట ఈ కథతో చాలామందిని కలిశా. నీడపోయింది అనే అంశం చుట్టూ సాగే కథ అనగానే... ఇది లఘు చిత్రమా? అని అడిగేవారు. అందరి మనసుల్నీ తాకేలా ఉంటుందీ సినిమా" అన్నారు. ఆనంద్ రవి ఒక మంచి సినిమాని తీశాడని చెప్పారు నిర్మాత. సందీప్‌కిషన్ మాట్లాడుతూ "ఆనంద్ రవి రాసే కథలన్నీ బాగుంటాయి. ఇదివరకటి కథలతో పోలిస్తే 'నెపోలియన్' మరో ఎత్తు అనుకొంటున్నా" అన్నారు. ప్రేక్షకుల్ని మెప్పించే ఓ మంచి సినిమాగా 'నెపోలియన్' నిలుస్తుందని చెప్పారు దామోదర్ ప్రసాద్. కార్యక్రమంలో బి.ఎ.రాజు, లక్ష్మీభూపాల్, మార్గల్ డేవిడ్, సిద్ధార్థ్ సదాశివుని, కోమలి తదితరులు పాల్గొన్నారు.


ప్రపంచంలో అన్నింటికంటే గొప్ప విషయం...
మోసం చేసిన వాణ్ని సైతం వదిలేయడం!
చిత్రం: చిత్రాంగద
- పంపినవారు: రామిజిన్ని ప్రశాంతి రామకృష్ణ, విజయనగరం

ఐదోసారి జేమ్స్‌బాండ్‌గా క్రెగ్


డేనియల్ క్రెగ్

హాలీవుడ్ నుంచి ఎన్ని చిత్రాలొచ్చినా జేమ్స్‌బాండ్ చిత్రాలకున్న ఆదరణ వేరు. జేమ్స్‌బాండ్ సిరీస్‌లో ఎన్నో చిత్రాలొచ్చాయి. ఎంతోమంది బాండ్‌లుగా అలరించారు. 'క్యాసినో రాయల్', 'క్వాంటమ్ ఆఫ్ సొలేస్', 'స్కైఫాల్', 'స్పెక్టర్'... ఈ నాలుగు బాండ్ చిత్రాల్లోనూ తనదైన స్టైల్‌తో నటించి మెప్పించాడు డేనియల్ క్రెగ్. ఈ చిత్రం తర్వాత ఇకపై బాండ్ చిత్రాల్లో నటించనని ఒక సందర్భంలో చెప్పి అభిమానుల్ని నిరాశపరిచాడు. జేమ్స్‌బాండ్ 25వ చిత్రాన్ని నిర్మించనున్నట్లు ఇప్పటికే ప్రకటించాయి మెట్రో గోల్డ్ వైన్ మేయర్, ఎవోన్ ప్రొడక్షన్స్ సంస్థలు. కానీ బాండ్ ఎవరనేది ప్రకటించలేదు. తాజాగా ఈ చిత్రంలో బాండ్‌గా నటించేది తనే అని డేనియల్ క్రెగ్ ప్రకటించాడు. ఇటీవల 'ది లేట్ షో విత్ స్టీఫెన్ కోల్‌బెర్ట్' టీవీ షోలో పాల్గొన్నాడు డేనియల్ క్రెగ్. ఇందులో షో హోస్ట్ కోల్‌బెర్ట్ "మీరు మళ్లీ ఏజెంట్ 007 కనిపిస్తారా?"అని అడిగితే 'అవును' అని సమాధానం చెప్పాడు క్రెగ్. కొన్ని నెలల్లోనే బాండ్‌గా మళ్లీ కనిపించనున్నట్లు చెప్పాడు క్రెగ్. "ప్రస్తుతం ఈ సినిమా గురించి చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే మిగలిన విషయాలు వెల్లడవుతాయ"ని ఆయన అన్నాడు. 'ఇకపై బాండ్‌గా నటించను' అని గతంలో చెప్పిన దానికి స్పందిస్తూ "అదొక పిచ్చి సమాధానం" అని చెప్పాడు డేనియల్.

'టెర్మినేటర్' ఎలా పుట్టాడో తెలుసా..!


జేమ్స్ కామెరూన్

'టెర్మినేటర్'.... వేల కోట్ల రూపాయలు వసూళ్లు కురిపించిన సినిమా. ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగర్‌కు తిరుగులేని స్టార్‌డమ్ తెచ్చిపెట్టిన చిత్రం. ఇంత గొప్ప 'టెర్మినేటర్' ఎలా పుట్టాడో తెలుసా? అర్ధరాత్రి వచ్చిన ఓ పీడకల నుంచి 'టెర్మినేటర్' ఆలోచన వచ్చినట్లు ఆ చిత్ర దర్శకుడు జేమ్స్ కామెరూన్ చెప్పారు. "ఓ రోజు నాకు భగభగమండే మంటల్లోంచి అస్థిపంజరం లేస్తున్నట్లు భయంకరమైన కలొచ్చింది. ఆ దృశ్యం అలా నా మెదడులో ముద్రించుకుపోయింది. దాన్ని ఆధారం చేసుకునే 'టెర్మినేటర్' కథ డెవలప్ చేశాన"ని చెప్పారు కామెరూన్. 'అవతార్'కు కూడా కలలే ఆధారం అంటున్నారు కామెరూన్. "అవతార్'కు నా కాలేజ్ రోజుల్లోనే బీజం పడింది. అప్పట్లో నాకు తరచుగా కలల్లో దట్టమైన అడవులు కనిపించేవి. ఆ దృశ్యాలనే ఆ తర్వాత 'అవతార్'లో వెండితెరపై ఆవిష్కరించా" అన్నారు కామెరూన్. ప్రస్తుతం 'అవతార్'కు నాలుగు సీక్వెల్స్ రూపొందించే సన్నాహాల్లో బిజీగా ఉన్నారాయన.

సహకార స్ఫూర్తి... రైతన్నకు దీప్తి

- పంట రుణాలు, పెట్టుబడులకు ఊతం
- తక్కువ వడ్డీ.. లాభాల్లో పయనం
- కంప్యూటరీకరణతో ప్రతిపైసాకూ జవాబుదారీ
- నిత్యం సభ్యులకు సేవ
- ఆదర్శంగా గట్టుదుద్దెనపల్లి సహకార సంఘం

ఈనాడు – హైదరాబాద్, కరీంనగర్

అన్నదాతకు అనుక్షణం సేవలందిస్తూ, లాభాలు గడిస్తూ, సభ్యులకు వాటిని పంచే స్థితికి చేరుకుని సహకార స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది కరీంనగర్ జిల్లా, మానకొండూరు మండలంలోని గట్టుదుద్దెనపల్లి విశాల సహకార పరపతి సంఘం. జాతీయ స్థాయిలో ఆదర్శ సంస్థల్లో ఒకటిగా నాబార్డ్ గుర్తింపు కూడా సొంతం చేసుకుంది. వ్యవసాయ అవసరాలకు రుణాలివ్వడంలో ఈ సంఘం ముందుంది. ఏటా ఖరీఫ్, రబీల్లో పెట్టుబడులకు ఇబ్బంది లేకుండా అన్నదాతలకు అప్పులిస్తోంది. ప్రస్తుత ఖరీఫ్‌లో రూ.5 కోట్ల పంట రుణాలివ్వాలని లక్ష్యం పెట్టుకుని, ఇప్పటికే రూ.3.7 కోట్లు అందించింది. వ్యవసాయ దీర్ఘకాలిక రుణాలను రూ.41 లక్షలకుపైగా ఇచ్చింది. ఇతర వ్యవసాయ అవసరాలకు ప్రతి రైతుకు ఎకరాకు రూ.10 వేల చొప్పున గరిష్ఠంగా రూ.50 వేల వరకూ అదనంగా సాయం అందిస్తోంది. ఈ మొత్తంపై 15% వడ్డీ వసూలు చేస్తోంది.

దీర్ఘకాలిక రుణాలకు ప్రాధాన్యం

ఏటా రూ.కోటి దాకా ఇక్కడ దీర్ఘకాలిక రుణాలిస్తున్నారు. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిన నేపథ్యంలో, వ్యవసాయ రుణాలకు వడ్డీ లేదంటూ జాప్యమైనా.. ఒక్క పైసా కూడా రైతుల నుంచి వడ్డీని వసూలు చేయలేదు. పైగా, సర్దుబాటు చేసి కొత్త రుణాలివ్వడం విశేషం. రుణమాఫీ ద్వారా సహకార సంఘానికి రూ.4.32 కోట్లు వచ్చింది.

అన్నింటికీ అందుబాటులో రుణం

ప్రైవేటు సంస్థల నుంచి భారీ వడ్డీలకు వాహనాలు కొనుగోలుచేసి ఇబ్బంది పడుతున్న సభ్యులకు సొసైటీ అండగా నిలుస్తోంది. సహకార సంఘం ఆ రుణాలను తీర్చడానికి తక్కువ వడ్డీకే ఆర్థికంగా తోడ్పడుతోంది. సభ్యులు ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసుకునేందుకు రుణాలు అందిస్తుండటం గమనార్హం. 25% లబ్ధిదారుడు చెల్లిస్తే, 75% రుణాన్ని ఇస్తున్నారు. మూడేళ్లలో ఈ రుణాన్ని తీర్చాల్సి ఉంటుంది. వడ్డీ 15 శాతం. మూడు గ్రామాల్లో యువత ఉపాధి కోసం వరికోత యంత్రాలకు రుణాలు ఇచ్చారు. 70 మందికి ముర్రా రుణాలను ఇవ్వగా, పాడి ఆవుల నిమిత్తం 60 మందికి అప్పులిచ్చారు. వరికోత యంత్రాలకు 48 మందికి, 20కి పైగా ట్రాక్టర్లు, 350కి పైగా ద్విచక్ర వాహనాల కొనుగోలుకు ఆర్థిక సాయం అందజేశారు. తాజాగా ప్రభుత్వ ఉద్యోగులకూ రుణాలు అందజేస్తున్నారు. బావుల తవ్వకం, విద్యుత్ మోటార్ల కొనుగోలుతోపాటు... మోటార్ల మరమ్మతులకు కూడా రుణాలిస్తుండటం విశేషం! సభ్యులు కూడా నిర్ణీత గడువులోగా రుణాలను చెల్లిస్తూ నిబద్ధత చూపుతున్నారు.

సొంతంగా నాణ్యమైన విత్తనాలు

సంఘానికి చెందిన సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా నాణ్యమైన విత్తనాలను అందిస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో వ్యవసాయ పరిశోధన కేంద్రాల నుంచి ఫౌండేషన్ సీడ్‌ను తెప్పించి, ప్రాసెస్ చేసి తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. కల్తీలేని విత్తనాలను, ఎరువులు, మందులు ఇస్తున్నారు. గట్టుదుద్దెనపల్లి, పోలంపల్లి, మల్లాపూర్ గ్రామాల్లోని రైతులకే కాకుండా, ఇతర గ్రామాలవారికీ నాణ్యమైన విత్తనాలను విక్రయిస్తారు.

ధాన్యం కొని... బియ్యంగా మార్చి...

మూడు గ్రామాల్లో పండే వరి ధాన్యాన్ని మొత్తం సహకార సంఘమే కొనుగోలు చేస్తోంది. గతేడాది వరికి కనీస మద్దతు ధర రూ.1,510 కాగా, ఈ సంఘం క్వింటాలుకు రూ.1,850 చొప్పున 4 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. బ్రీడర్ సీడ్‌కు రూ.1,930 చెల్లించింది. ఈ ధాన్యాన్ని సొంత మిల్లుల్లో బియ్యంగా మార్చి కిలో రూ.388 విక్రయిస్తున్నారు.

పూర్తి పారదర్శకత

కోట్ల రూపాయల లావాదేవీలు నిర్వహిస్తూ, ప్రతి పైసాకూ ఈ సహకార సంఘం జవాబుదారీగా వ్యవహరిస్తోంది. పెట్రోలు బంకులో అమ్మకాలు.. బియ్యం, ఎరువులు, సిమెంట్, విత్తనాల విక్రయం, వేబ్రిడ్జిలో తూకం.. ఇలా ఎక్కడ రూపాయి లావాదేవీ జరిగినా, స్వల్పంగా గుర్తించగలిగే సాంకేతిక ఈ సంఘం సొంతం. బ్యాంకులో ఏ రోజుకారోజు రుణాలు, డిపాజిట్లు, వసూళ్లు, చెల్లింపులన్నీ సాయంత్రం ఆరింటికి లెక్క తేలిపోతాయి. తెలంగాణ ప్రభుత్వం సహకార సంఘాల కంప్యూటరీకరణకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఇంటిగ్రేటెడ్ ఇన్ఫో సంస్థ ద్వారా పూర్తిస్థాయి కంప్యూటరీకరణ చేశారు. గట్టుదుద్దెనపల్లి నుంచి హైదరాబాద్ వరకూ సహకారశాఖ రిజిస్ట్రార్ సహా బాధ్యులెవరైనా రోజూ ఈ సంఘం లావాదేవీలను తనిఖీ చేసుకోవచ్చు. రుణాలు, విత్తనాలు, ఎరువులు, డిపాజిట్లు, అకౌంట్స్ విభాగాలు... నిర్మాణ కమిటీ, డీజిల్ పంపు నిర్వహణ ఇలా ఉప కమిటీలు ఏర్పాటు చేసుకుని సంఘాన్ని సమర్థంగా నిర్వహిస్తున్నారు.



సంఘం ఆధ్వర్యంలోని గిడ్డంగులు

గట్టుదుద్దెనపల్లి సహకారం సంఘం చిత్రం ఇది

- మొత్తం సభ్యులు: 1921
- సభ్యుల మూల ధనం: రూ.85.67 లక్షలు
- డిపాజిట్లు: రూ.10.77 కోట్లు
- వ్యాపార టర్నోవర్: రూ.26.81 కోట్లు
- లాభం: రూ.40.25 లక్షలు
- ఉద్యోగులు: 40 మంది, అంతా 3గ్రామాల వారే

కావలసినంత పెట్టుబడి అందించడమే లక్ష్యం



1959లో ఎ.వి.రమణారావు సహకార పరపతి సంఘాన్ని ఏర్పాటుచేశారు. సభ్యులకు వ్యవసాయం, ఇతర అవసరాలకు తక్కువ వడ్డీకే అవసరమైనంత రుణం అందించడం మా లక్ష్యం. పంట రుణాలు కాకుండా ఇతర రుణాలకు 15% వడ్డీ తీసుకుంటున్నాం. భవిష్యత్తులో దీన్ని తగ్గిస్తాం. ఏ అవసరమైనా సంఘం రుణం ఇచ్చి ఆదుకుంటుంది. అత్యవసరమై ఆస్పత్రికి వెళ్లాలంటే, ఏ అర్ధరాత్రి అయినా రూ.20 వేలు తీసుకోవచ్చు. సౌర విద్యుత్ కేంద్రం నెలకొల్పడం, ఫంక్షన్‌హాలు నిర్మాణంపై దృష్టి సారించాం. సంఘం నిబద్ధత చూసి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ గిడ్డంగుల నిర్మాణానికి రాయితీతో రుణం ఇచ్చింది. సకాలంలో రుణాలు చెల్లించేవారికి ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. ఇఫ్కో, క్రిభ్‌కో వంటి సంస్థల నుంచి నేరుగా ఎరువులు తెప్పించి విక్రయిస్తున్నాం. నోట్ల రద్దు సమయంలోనూ నగదు కొరవ లేకుండా చూశాం. త్వరలో మినీ ఏటీఎంలను ప్రారంభిస్తాం. సహకార సంఘంలో అందరికీ ఉన్నాయి. సభ్యులకు గ్రూపు ఇన్సూరెన్స్, వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేస్తున్నాం. సభ్యులు చనిపోతే అంతిమ యాత్ర ఖర్చులకు రూ.5 వేలు ఇస్తున్నాం. విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్నాం.

- బుడిగె కొండయ్య, అధ్యక్షుడు, గట్టుదుద్దెనపల్లి సహకారం సంఘం



గట్టుదుద్దెనపల్లి విశాల సహకార పరపతి సంఘం పాలకమండలి సభ్యులు

నౌకాదళం మహిళాధికారుల ప్రపంచ ప్రదక్షిణ

- ప్రధానిని కలిసిన అధికారులు
- ఏపీ, తెలంగాణ నుంచి ఒక్కొక్కరు

దిల్లీ: ప్రపంచ ప్రదక్షిణ చేపట్టనున్న భారత నౌకాదళానికి చెందిన ఆరుగురు మహిళా అధికారులు బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిశారు. దేశ బలాబలాల్నీ, సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటాలని ఈ సందర్భంగా ప్రధాని వారికి సూచించారు. మొత్తం మహిళా సిబ్బందితో ఐఎన్ఎస్‌వీ తరిణి నౌక ద్వారా చేపట్టే 'నావికా సాగర్ పరిక్రమ'గా వ్యవహరిస్తున్న యాత్ర ఈనెలలో గోవా నుంచి ప్రారంభమై, వచ్చే ఏడాది మార్చిలో ముగుస్తుందని ప్రధానమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ యాత్ర ఐదంచెల్లో జరుగనుంది. ఫ్రెమాంటిల్(ఆస్ట్రేలియా), లిటిల్‌టన్(న్యూజిలాండ్), పోర్ట్ స్టాన్లీ(ఫాక్‌లాండ్స్), కేప్‌టౌన్(దక్షిణాఫ్రికా) ఓడరేవుల్లో ఆగనుంది. దేశీయంగా తయారుచేసిన 55 అడుగుల ఐఎన్ఎస్‌వీ తరిణిని ఈ ఏడాదే నౌకాదళంలో చేర్చారు. లెఫ్టినెంట్ కమాండర్ వర్తికాజోషి నేతృత్వంలో లెఫ్టినెంట్ కమాండర్లు ప్రతిభా జమ్వాల్, పి.స్వాతి, లెఫ్టినెంట్లు విజయాదేవి, బి.ఐశ్వర్య, పాయల్‌గుప్తా పాల్గొననున్నారు. నౌకలో ప్రపంచయాత్ర చేపట్టనున్న ప్రతిభావంతులైన ఆరుగురు మహిళా నౌకా దళాధికారులను కలిశాననీ, భారత్ నుంచి మొత్తం మహిళా అధికారులతోనే చేపట్టే తొలి యాత్ర ఇదేననీ, వారికి శుభాకాంక్షలని ప్రధాని ట్వీట్ చేశారు. వారితో కలిసి దిగిన చిత్రాల్నీ ట్విటర్‌లో ఉంచారు. ఈ సందర్భంగా నౌకా దళాధికారులు యాత్రకు సంబంధించిన అంశాలను ప్రధానికి వివరించారు. యాత్ర పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటానని ప్రధాని మోదీ వారితో పేర్కొన్నారు. నౌకా దళాధికారుల్లో ఏపీకి చెందిన స్వాతి, తెలంగాణకు చెందిన ఐశ్వర్య కూడా ఉన్నారు.



ప్రధానితో లెఫ్టినెంట్ కమాండర్లు ఐశ్వర్య, స్వాతి

మత్తులో 3 శాతం యువత!

- హైదరాబాద్‌లో 15-30 ఏళ్ల వారిపై ఆబ్కారీ శాఖ అంచనా

ఈనాడు, హైదరాబాద్: రాజధాని హైదరాబాద్‌లో 15 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో మూడు శాతం వరకూ ఏదో ఒక రకమైన మత్తు మందులకు అలవాటు పడి ఉండొచ్చని ఆబ్కారీ అధికారులు భావిస్తున్నారు. దీనిపై కచ్చితమైన గణాంకాలు ఎవరివద్దా లేకపోయినప్పటికీ తాజా పరిణామాల నేపథ్యంలో వారు ఈ అంచనాకు రాగలిగారు. మరింత లోతుగా అధ్యయనం చేస్తున్నారు. మత్తుమందుల వాడకానికి సంబంధించి కెల్విన్ ఘటన మలుపు తిప్పింది. హైదరాబాద్‌లో పాఠశాల విద్యార్థులను సైతం ఈ ముఠా లక్ష్యంగా చేసుకున్న ఉదంతం బయటపడటం తీవ్ర చర్చకు దారితీసింది. కెల్విన్ ముఠా ద్వారా మత్తుమందులు కొనుగోలు చేస్తున్నారన్న అనుమానంపైనే ఆబ్కారీ అధికారులు దాదాపు వెయ్యిమందికి నోటీసులు పంపారు. 26 పాఠశాలలు, 27 ఇంజినీరింగ్ కళాశాలలకు కూడా నోటీసులిచ్చారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న 23 మందిని అరెస్టు చేశారు. దీంతో అసలు ఎంతమంది మత్తు మందులు వాడుతున్నారన్న ప్రశ్న తలెత్తింది. దీనిపై కొంత అధ్యయనం చేసిన అధికారులు ఓ అంచనాకు వచ్చారు.

పెరిగిన వాడకం రేటు: ఈ మధ్యకాలంలో హైదరాబాద్‌లో మత్తుమందుల వాడకం రేటు భారీగా పెరిగినట్లు గుర్తించారు. పంజాబ్, దిల్లీ, బెంగళూరులతో పోల్చితే సంఖ్యాపరంగా ఇక్కడ తక్కువగానే ఉన్నప్పటికీ పెరుగుదల రేటు మాత్రం ఎక్కువగానే ఉన్నట్లు భావిస్తున్నారు. ముఖ్యంగా అమ్మకందారులు తమ ఖాతాదారులను పెంచుకునేందుకు రకరకాల పద్ధతులు అనుసరిస్తున్నట్లు గుర్తించారు.

స్థాయిని బట్టి వాడకం: అధికారిక లెక్కల ప్రకారం మొత్తం 111 పదార్థాలను మత్తుమందులుగా నిర్ధారించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో రూ.2కు దొరికే నిద్ర మాత్ర దగ్గర నుంచి ఒక్కో డోసు రూ.3 వేలు చేసే ఎల్.ఎస్.డి. వరకూ ఉన్నాయని వారు వివరిస్తున్నారు. వీధి బాలలు ఎక్కువగా దగ్గు మందు, వైట్నర్, గోళ్లరంగు తొలగించే ద్రావణం వంటివాటిని వాడుతుంటారని, ఇంజినీరింగ్ విద్యార్థులు గంజాయి వంటి వాటికి ప్రాధాన్యం ఇస్తున్నారని అధికారులు చెబుతున్నారు. వారివారి ఆర్థిక స్థితిని బట్టి అందుబాటులో ఉన్న మత్తుమందులు కొనుగోలు చేస్తున్నారని.. దీన్ని బట్టి చూస్తే యువకుల్లో మూడు శాతం వరకూ ఏదో ఒక రకమైన మత్తుమందుకు అలవాటు పడుతున్నట్లు చెప్పవచ్చునేది అధికారుల అంచనా.



కొంతలో కొంత..: రకరకాల మత్తుమందులు వాడేవారి సంఖ్య పెరుగుతున్నా వారిలో చాలా మంది కొద్దిరోజుల్లోనే వాటిని మానేస్తున్నారన్న విషయాన్ని కూడా అధికారులు గుర్తించారు. ముఖ్యంగా దగ్గు మందు, గంజాయి, ఇంజెక్షన్ల రూపంలో తీసుకునే మత్తుమందులు వాడేవారిలో చాలా మంది కొద్దిరోజుల్లోనే వీటిని మానేయగలుగుతున్నారని, వీటికి పూర్తిగా బానిసలయ్యే వారి సంఖ్య కాస్త తక్కువగానే ఉండటం కొంత ఉపశమనమని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయినప్పటికీ ఈ రుగ్మతను అడ్డుకునేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాల్సిందేనంటున్నారు.

బాలుడు బాగున్నాడు

- బోరుబావి నుంచి చిన్నారిని రక్షించేందుకు విశేష కృషి

గుంటూరు, అమరావతి, ఈనాడు: గుంటూరు జిల్లా ఉమ్మడివరంలో బోరు బావి నుంచి ప్రాణాలతో బయటపడ్డ రెండేళ్ల బాలుడు చంద్రశేఖర్ ఆరోగ్యం క్షేమంగా ఉంది. ఎంతో ఉత్కంఠ మధ్య మంగళవారం అర్ధరాత్రి దాటాక 2.40 గంటల సమయాన వెలికి తీశాక గుంటూరు సర్వజనాసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బుధవారం ఉదయం ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి వైద్యుల బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎక్స్‌రే, సీటీస్కాన్ వంటి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించారు. కాలు వద్ద వాపు కనిపించడంతో ఆర్థో విభాగం వైద్యుల సలహా కూడా తీసుకున్నారు. బోరుబావిలో పది గంటలకు పైగా ఉన్నందున ప్రాణవాయువు అవసరమైన మేర అందక మెదడుపై ఏదైనా ప్రభావం ఉంటుందేమో అన్న కోణంలోనూ ఆలోచిస్తున్నారు. ఆ బాలుడికి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి పూర్తి స్వస్థత చేకూరిన తర్వాతనే ఆసుపత్రి నుంచి పంపుతామని సూపరింటెండెంట్ రాజునాయుడు తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఆసుపత్రికి వెళ్లి ఆ బాలుడికి అందుతున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు తాను జీజీహెచ్‌కు వచ్చినట్లు తెలిపారు.



బోరు బావి నుంచి బయటపడ్డ చంద్రశేఖర్

అధికారుల తీరు భేష్: చంద్రబాబు

'ఆంధ్రప్రదేశ్ పోలీసులకు ఏదీ అసాధ్యం కాదు.. ఏదైనా సాధ్యమే అని నిరూపించాలి. మీ సాధన, తీసుకునే నిర్ణయాలు, సమయస్ఫూర్తి ఉన్నతాశయాలను సాధించేందుకు ఉపయోగపడుతుంది. గుంటూరు జిల్లాలోని బోరుబావిలో పడిన బాలుడ్ని రక్షించే క్రమంలో అధికారులు స్పందించిన తీరు భేష్. ఎస్పీ, కలెక్టర్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని 11 గంటలపాటు కృషి చేసి బాలుడ్ని కాపాడారు. గతంలో ఇలా బోరు బావుల్లో పడిన వారిని ప్రాణాలతో రక్షించడంలో చాలా మంది విఫలమయ్యారు. వారు విఫలమయ్యారు కదా! మేం కూడా ఏం చేయలేమనుకుంటే ఏదీ సాధ్యం కాదు. వినూత్నంగా ఆలోచించారు కనకే బాలుడ్ని కాపాడారు. ఇలా ప్రతి ఒక్కరూ అవకాశాలను అందిపుచ్చుకోవాలి. యూనిఫాం వేశామా! బ్లూబుక్‌ను అనుసరించమా! అన్నట్లు ఉంటే ఫలితాలు కూడా అలాగే ఉంటాయి. అలా కాక వినూత్నంగా ఆలోచించాలి' అంటూ అమరావతిలో ఏపీ పోలీసు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం చంద్రబాబు మాట్లాడారు.

భేషుగ్గా పనిచేసిన ఎన్డీఆర్ఎఫ్

- ఉమ్మడివరంలో బోరు బావి ఘటనలో శాస్త్రీయ వ్యూహంతో సత్ఫలితం
- కొత్త పాఠాలు నేర్పిన సహాయక చర్యలు
- బృందాల పనులకు ఆటంకం కలిగించకపోవడం ఎంతో ముఖ్యం

ఈనాడు – అమరావతి

గుంటూరు జిల్లా ఉమ్మడివరంలో బోరు బావిలోపడ్డ బాలుణ్ని కాపాడి జాతీయ విపత్తు నిర్వహణ బలగాలు (ఎన్డీఆర్ఎఫ్) అందరి ప్రశంసలు అందుకున్నాయి. గత కొన్నేళ్లలో బోరు బావిలో పడ్డ చిన్నారులు ప్రాణాలతో బయటపడిన దాఖలాలు లేవు. ఉమ్మడివరంలో చిన్నారి చంద్రశేఖర్‌ను కాపాడటంలో ఈ బలగాలు అనుసరించిన వ్యూహం మంచి ఫలితాన్నిచ్చింది. ప్రభుత్వ యంత్రాంగం చేసిన ఏర్పాట్లు కీలక భూమిక పోషించాయి. కొన్ని నెలల కిందట రంగారెడ్డి జిల్లా ఇక్కారెడ్డిగూడెంలో బోరు బావిలోపడ్డ 16 నెలల చిన్నారిని 60 గంటలపాటు శ్రమించినా కాపాడలేకపోయారు.

ఇక్కారెడ్డిగూడెంలో...

- చిన్నారి 40 అడుగుల లోతులో పడిపోయింది. అధికారులకు సమాచారమిచ్చి సహాయక బృందాలు వచ్చేలోగా పాపను రక్షించే ప్రయత్నంలో స్థానికులు పలు చర్యలు చేపట్టారు. మోటారును పైకిలాగే క్రమంలో చిన్నారి జారి మరింత లోతుకుపడిపోయింది.
- ఎన్డీఆర్ఎఫ్ బృందాలు విక్టిమ్ లొకేటింగ్ కెమెరా (వీఎల్‌సీ) ద్వారా పరిశీలిస్తే దాదాపు 100 అడుగుల్లో ఉన్నట్లు తేలింది. ఆ చిన్నారిపై మట్టి పెళ్లలు, రాళ్లు కూడా పడిపోయాయి.
- చుట్టూ ఉన్న మట్టి జారిపడటం కూడా ప్రమాదకరంగా మారింది.

ఉమ్మడివరంలో...

- చంద్రశేఖర్ బోరు బావిలోపడగానే అధికారులకు సమాచారమిచ్చారు. కలెక్టర్, ఎస్పీలు వ్యూహాత్మకంగా జేసీబీతో బోరుబావి చుట్టూ తవ్వించారు. ఈలోగా మంగళగిరి నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు తరలివచ్చాయి. వీఎల్‌సీ ద్వారా పరిశీలించి బాలుడిని గుర్తించారు.
- 15 నుంచి 18 అడుగుల మధ్య ఉన్నట్టు తేలింది. బాలుడు పడిపోయిన దగ్గర రాయితోపాటు చెట్టు వేర్లు కూడా ఉన్న విషయాన్ని గుర్తించారు. 22 అడుగుల లోతుకు వెళ్లి అక్కడి నుంచి పై దిశగా రంధ్రం చేయాలని నిర్ణయించారు. జేసీబీతో 15 అడుగుల వరకూ తవ్వగలిగారు. ఈ క్రమంలో తగిలిన రాయిని ముక్కముక్కలుగా చేసేందుకు 5 గంటల సమయంపట్టింది. ఆ తరవాత ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక దళాల దగ్గర ఉన్న ప్రత్యేక యంత్ర పరికరాలతో తవ్వకాలు చేపట్టారు. ఓ దశలో రోబోటిక్ చేయి కూడా ఉపయోగించాలని భావించారు.
- బాలుడు పడిన ప్రదేశాన్ని స్పష్టంగా గుర్తించేందుకు సొరంగం చేసుకుంటూ కిందకు వెళ్లిన సిబ్బంది... నేలపై బోరుబావిని పరిశీలిస్తున్న వాళ్లకు ఫోకస్ లైట్ ద్వారా సమాచారం ఇవ్వాలని... అలాగే నేల మీద ఉన్నవాళ్లు అందుకు ప్రతిగా మరో ఫోకస్ లైట్‌తో సొరంగం చేసుకుంటూ లోపలికి వెళ్లిన వారికి సంకేతం ఇవ్వాలని వ్యూహం పన్నారు.
- బాలుడు ఉన్న ప్రదేశం కంటే నాలుగైదు అడుగులు కిందకు వెళ్లి ఒక చెక్క పెట్టారు. బాలుడు పొరపాటున జారినా కిందకుపోకుండా ఆ ఏర్పాటు చేశారు. ఆ తరవాత బాలుడు సురక్షితంగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది చేతుల్లోపడ్డాడు.

ఈ అనుభవం ఏం చెబుతోందంటే...

ఘటన జరిగిన తరవాత చుట్టుపక్కలవాళ్లు తక్షణమే అధికార యంత్రాంగానికి సమాచారమివ్వాలనీ, ఈలోగా సరైన వ్యూహం లేకుండా బోరుబావి దగ్గర తవ్వకాలు చేయొద్దని ఉమ్మడివరంలో సహాయక చర్యల్లో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సూచిస్తున్నారు. "శాస్త్రీయమైన వ్యూహం లేకుండా తవ్వితే మట్టిపెళ్లలు, రాళ్లు లోపల ఉన్న చిన్నారిపైపడి చనిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మాకు ఏ విపత్తులో సాంకేతిక పరికరాలు ఎలా ఉపయోగించాలో తెలుసు. అందుకు అవసరమైన సాధనసంపత్తి ఉంది. వినియోగించడంలో శాస్త్రీయమైన వ్యూహాలు కూడా ఉంటాయి. మరో ముఖ్యాంశం ఏమంటే సహాయ చర్యలు చేపట్టే సమయంలో స్థానికులు సిబ్బందిని గందరగోళానికి గురి చేయకూడదు. వారికి సాయం అందిస్తే సరిపోతుంది" అని సూచించారు.

విఎల్ కెమెరా ఇలా పనిచేస్తుంది..

బోరుబావి ఘటన లాంటి ప్రమాదాలప్పుడు సహాయక చర్యలో విక్టిమ్ లొకేటింగ్ కెమెరా సిబ్బందికి ఎంతో సహాయపడుతుంది. ఇందులో పలు రకాలున్నాయి. ఇలాంటి బోరుబావి ఘటనల్లో వాడే కెమెరా కేబుల్‌తో కూడి ఉంటుంది. ఆ కేబుల్‌కే చిన్న ఫోకస్ లైట్ కూడా ఉంటుంది. ఈ లైట్ వేసి లోపలకు కేబుల్ వదిలి పరిశీలిస్తారు. అందులో ఉన్న కెమెరా ద్వారా బోరుబావి లోపల ఉన్న పరిస్థితిని పరిశీలించడంతోపాటు ఎంత లోతులో ఉన్నది కూడా తెలుసుకొంటారు.

'ప్రభుత్వ ఆధ్వర్యంలో 22 నుంచి రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాలు'

ఈనాడు, హైదరాబాద్: రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి జయంతిని పురస్కరించుకొని 22 నుంచి రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. అత్యాధునిక వసతులతో కూడిన విద్యా సంస్థను ఏర్పాటు చేసేందుకుగాను ఆర్‌బీవీఆర్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీకి రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలో పది ఎకరాల స్థలం కేటాయించడంతో పాటు రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. అక్కడ హాస్టల్ కాంప్లెక్స్, ఇతర భవనాల నిర్మాణానికి ఈ నెల 22న ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేస్తారన్నారు.

ముందు రూ.100 కోట్లు జమచేయండి

- అగ్రిగోల్డ్‌ను స్వాధీనం చేసుకుంటామన్న సంస్థకు స్పష్టంచేసిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: 'మీ సదుద్దేశాన్ని నిరూపించుకోవడానికి ముందుగా రూ.100 కోట్లు జమచేయండి' అంటూ అగ్రిగోల్డ్ కంపెనీని స్వాధీనం చేసుకునేందుకు ముందుకొచ్చిన ఓ సంస్థకు హైకోర్టు స్పష్టంచేసింది. సొమ్ము జమచేసిన తర్వాతే స్వాధీన ప్రక్రియకు గడువిస్తామని పేర్కొంది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ ఎస్వీ భట్‌ల ధర్మాసనం బుధవారం ఈ మేరకు స్పష్టంచేసింది. తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది. గత విచారణలో ఓ సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది రఘురాం వాదనలు వినిపిస్తూ.. అగ్రిగోల్డ్‌ను స్వాధీనం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బుధవారం జరిగిన విచారణలో ధర్మాసనం స్పందిస్తూ.. 32 లక్షల మంది డిపాజిటర్లు సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారని వ్యాఖ్యానించింది. అగ్రిగోల్డ్ ఆస్తులు, అప్పులు మదింపు చేశాక ఆ సంస్థ స్వాధీనం చేసుకోవచ్చు, చేసుకోకపోవచ్చునని తెలిపింది. ఈ నేపథ్యంలో సదుద్దేశాన్ని రుజువు చేసుకోవడానికి రూ.100 కోట్లు జమచేయాలని స్పష్టంచేసింది. మరోవైపు వేలంలో విక్రయించిన ధర కన్నా ఎక్కువ సొమ్ము చెల్లించే వారుంటే తీసుకురావాలని అగ్రిగోల్డ్ తరఫు న్యాయవాదికి సూచించింది. విఫలమైతే గరిష్ఠ ధరకు వేలం పాడిన బిడ్డర్లకు ఆ ఆస్తులను ఖరారు చేస్తామని తేల్చిచెప్పింది.



జన్మాష్టమిని పురస్కరించుకుని బుధవారం అహ్మదాబాద్‌లో ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్న యువకులు

ప్రమాదాల నివారణకు ఏం చేశారు?

ఈనాడు, హైదరాబాద్: బోరు బావులను నిర్లక్ష్యంగా వదిలేస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని తెలంగాణ పంచాయతీరాజ్, రెవెన్యూ, హోంశాఖలను హైకోర్టు ఆదేశించింది. ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యల వివరాల్ని సమర్పించాలని పేర్కొంది. ఎన్ని బోరు బావులకు అనుమతులు ఇచ్చారు? అందులో ఎన్ని వినియోగంలో ఉన్నాయి? ఎన్ని నిరుపయోగంగా మారాయి? తదితర వివరాలన్నీ మీ దగ్గర ఉండాలి కదా అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మీది కాదా? అని అడిగింది. చేవెళ్ల సమీపంలోని ఇక్కారెడ్డిగూడ వద్ద నిరుపయోగ బోరుబావిలో పడి ఇటీవల ఓ చిన్నారి మృతి చెందిన ఘటనకు సంబంధించి ఆ బోరు బావి యజమానిపై కేసు నమోదు చేసి వదిలేస్తే ఎలా? అని న్యాయస్థానం ప్రశ్నించింది. ప్రస్తుతం ఆ కేసు దర్యాప్తులో పురోగతి వివరాల్ని తమ ముందుంచాలని పోలీసుల్ని ఆదేశించింది. విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది.

నిరుపయోగ బోరుబావులతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నిలువరించే దిశగా సుప్రీంకోర్టు మార్గదర్శకాల్ని అమలు చేసేలా తెలంగాణ సర్కారును ఆదేశించాలని అభ్యర్థిస్తూ న్యాయవాది బుద్దారపు ప్రకాష్ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం.. తాము కోరిన వివరాల్ని సక్రమంగా సమర్పించకపోవడంతో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి హాజరుకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో బుధవారం విచారణకు రెవెన్యూ ముఖ్య కార్యదర్శి బీఆర్ మీనా హాజరయ్యారు. కోర్టుకు వివరాలు సమర్పించారు. తదుపరి విచారణకు హాజరు నుంచి మినహాయింపు పొందారు.

బుధవారం జరిగిన విచారణలో ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సమాచార లోపం వల్ల వివరాలు సమర్పించడంలో పొరపాటు జరిగిందన్నారు. ఎండాకాలంలో బోరుబావికి బిగించిన యంత్రాన్ని తొలగిస్తున్నారని.. వర్షాకాలంలో భూగర్భ నీటిమట్టం పెరిగాక మళ్లీ యంత్రాన్ని బిగించి ఆ బోరుబావుల్ని వినియోగిస్తున్నారన్నారు. కొన్నిచోట్ల నీరు పడకపోవడంతో శాశ్వతంగా వదిలేస్తున్నారని చెప్పారు. బోరుబావుల్ని నిరుపయోగంగా వదిలేసినవారిపై అధికారులు ఏం చర్యలు తీసుకున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యల వివరాలు సమర్పించాలని స్పష్టంచేసింది.

గుంటూరు జిల్లాలో ప్రమాదంపై ఆరా: గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మిడివరం గ్రామంలోని బోరుబావిలో బాలుడు పడ్డ ప్రమాదంపై ధర్మాసనం ఆరా తీసింది. అందుకు పిటిషనర్ తరఫు న్యాయవాది బదులిస్తూ అదృష్టవశాత్తు ఆ పిల్లాడ్ని సురక్షితంగా బయటకు తీశారన్నారు.

ప్రతి విగ్రహానికి జియోట్యాగింగ్

హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాలకు సాంకేతిక భద్రత

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాలకు పోలీసు యంత్రాంగం సరికొత్త పద్ధతిలో సాంకేతిక భద్రతను ఏర్పాటు చేస్తోంది. ప్రతి గణేశ్ విగ్రహానికి జియోట్యాగ్ చేసి సంబంధిత ఠాణా గస్తీ వాహనాలకు, కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేయనున్నారు. తద్వారా కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచే గణేశ్ మండపాల్లో ఏం జరుగుతోందో పోలీసు ఉన్నతాధికారులు వీక్షించే సదుపాయం కలగనుంది. ఉత్సవాలకు హైదరాబాద్ పోలీసులతోపాటు అదనంగా 15 వేలు - 18 వేల మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రాల నుంచి బందోబస్తుకు రానున్నారు. ఊరేగింపు ప్రధాన మార్గం నుంచి హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జన వేదికల వరకూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని ప్రధాన ప్రాంతాలలో భారీ ఎల్‌సీడీ తెరలను ఏర్పాటుచేసి ప్రత్యక్ష ప్రసారం చేయాలని నిర్ణయించారు. సుమారు 900 సీసీ కెమెరాలను తాత్కాలికంగా ఉపయోగిస్తున్నారు. 24 గంటల వ్యవధిలోనే ప్రక్రియను పూర్తిచేసేందుకు ట్యాంక్‌బండ్‌పై ఉన్న బతుకమ్మకుంటలోనూ నిమజ్జనం నిర్వహించనున్నామని మధ్య మండలం డీసీపీ జోయల్ డేవిస్ తెలిపారు.

ఈనాడు

టైమ్ సరిపోలేదు... లేకపోతే కచ్చితంగా నీ పని చేసేవాణ్ని! నీ పెళ్లికి వద్దామనే అనుకున్నా... ఈ లోగా వేరే పని పడి అటు వెళ్లిపోయా! రోజులో 24 గంటలు సరిపోవడం లేదు... ఇంకో రెండు గంటలుంటే బాగుండు!

మీరూ ఎప్పుడో ఒకసారి ఇలా అనే ఉంటారు. పని ఒత్తిడి ఒక కారణమైతే... ఉన్న సమయాన్ని ప్రణాళికబద్ధంగా వినియోగించుకోకపోవడం మరో కారణం. మీకున్న సమయానికి తగ్గట్టుగా పక్కా ప్రణాళిక వేసుకుంటే ఈ ఇబ్బంది నుంచి తప్పించుకోవచ్చు. మీ స్మార్ట్‌ఫోన్ ద్వారానే ఈ పనిని చేసేయొచ్చు. దానికి ఉపయోగపడే కొన్ని ఆప్స్, వెబ్‌సైట్లు ఇవీ!

సమయాన్ని సర్దుకుందామా!



ఎంత సమయం?

ఏ పని ఎప్పుడు చేయాలి అని చెప్పడానికే కాదు, ఆ పని ఎంతసేపటిలో చేశామో తెలుసుకోవడానికీ కొన్ని ఆప్‌లు, వెబ్‌సైట్లున్నాయి. toggl వాటిలో ఒకటి. ఓ పని ప్రారంభించినప్పుడు ఇందులో నమోదు చేసుకొని టైమ్ స్టార్ట్ బటన్‌ను క్లిక్ చేయాలి. పని పూర్తయ్యాక దాన్ని స్టాప్ చేయాలి. ప్రతి పనికి ఇలా చేసుకుంటూ పోతే... ఒక రోజులో దేనికి ఎంత సమయం కేటాయించారనేది గ్రాఫ్ రూపంలో తెలుసుకోవచ్చు. రిపోర్ట్స్ విభాగంలోకి వెళ్లి వారం, నెల రోజుల వివరాలు కూడా పొందొచ్చు.

ప్రాధాన్యాలు ఇచ్చి...

చిన్నతనంలో అర్జెంటుగా చేయాల్సిన పనుల్ని ఎరుపు రంగు పెన్నుతో రాసుకునేవాళ్లం. ఆ తర్వాత చేయాల్సిన వాటికి నీలి రంగు పెన్ వాడేవాళ్లం. todoist ఆప్‌లోనూ ఇలాంటి ఆప్షన్ ఉంది. ఇందులో టాస్క్‌లు నమోదు చేసుకునేటప్పుడు ప్రోజెక్ట్ ఆప్షన్ వస్తుంది. అందులో పర్సనల్, షాపింగ్ లాంటివి ఉంటాయి. వాటితోపాటు మీరు మరికొన్నింటిని జోడించొచ్చు కూడా. ఇందులో ఒక వారం రోజులపాటు చేయాల్సిన పనుల్ని.. ఒకేసారి నమోదు చేసుకునే ఆప్షన్ ఉంది.

వరుసలో చూడాలంటే...

ఫలానా రోజు, ఫలానా సమయానికి ఎక్కడున్నావ్... ఏం చేస్తున్నావ్... అంటే సమాధానం చెప్పడానికి కాస్త సమయం పడుతుంది. ఆ పని చేయడానికి ఎంత సమయం పట్టింది అంటే చెప్పడం ఇంకా కష్టం. మీ మొబైల్‌లో Timetune ఆప్ ఉంటే ఇది చాలా సులభం. ఇందులో మీరు చేస్తున్న, చేయాల్సిన పనుల్ని నమోదు చేసుకుంటే టైమ్ ప్రకారం ఒక వరుసలో కనిపిస్తాయి. దాని వల్ల ఎప్పుడు ఏం చేశామనేది సులభంగా తెలిసిపోతుంది.

నలుగురు కలసి...

'ఈ రోజు ఈ పనులన్నీ పూర్తి చేయాలి... రేపు చేయాల్సిన పనులివి' అంటూ ఆఫీసులో ఉన్నతాధికారి సహోద్యోగులకు మెసేజ్ లేదా వాట్సాప్‌లో సందేశాలు పంపిస్తుంటారు. దానికి బదులు ప్లానింగ్ ఆప్‌లో వాటిని నమోదు చేస్తే సరిపోతుంది. అతని మొబైల్‌లోని ఆప్‌లో నమోదు చేస్తే ఉద్యోగులకు ఎలా తెలుస్తుంది అంటారా? ఆయన నమోదు చేయాల్సింది Trello ఆప్‌లో. ఇందులో ఉన్న బోర్డ్స్ ఆప్షన్ ద్వారా ఓ బోర్డును రూపొందించి, దాన్ని యాక్సెస్ చేసే సౌకర్యాన్ని సహోద్యోగులకు ఇవ్వొచ్చు. వాళ్లు ఆ ఆప్‌లో లాగిన్ అయ్యి ఆ బోర్డును యాక్సెస్ చేయొచ్చు.

నాలుగు ముక్కల్లో...

మీకు ప్లానింగ్ ఆప్‌లో రాసుకునేంత పెద్ద పనులేమీ లేవా? నాలుగు ముక్కల్లో రాసుకుంటే సరిపోతుందా? అయితే weekis.com వెబ్‌సైట్‌లోకి వెళ్లి ప్రాథమిక సమాచారమిచ్చి ఖాతా ప్రారంభించండి. వెబ్‌సైట్ ఓపెన్ చేయగానే రోజుల పేరుతో ఏడు డబ్బాలు కనిపిస్తాయి. అందులో మీరు మీ అపాయింట్‌మెంట్ లేదా పనుల్ని నమోదు చేసుకోవచ్చు. ఒక రోజు నమోదు చేసుకున్న పనిని వేరే రోజుకు మార్చుకోవడమూ సులభమే. ఆ మేటర్‌ను సెలెక్ట్ చేసి వేరే రోజు బాక్స్‌లోకి డ్రాగ్ అండ్ డ్రాప్ చేయాలి.

ఎవరేం చేస్తున్నారు?

'నీకు ఆ పని చేయమని చాలాసేపటి క్రితం చెప్పాను... ఎంతవరకు వచ్చింది... అసలు ప్రారంభించావా?' ఆఫీసులో ఇలా అడిగే సందర్భాలు చాలానే. meiste rtask ఆప్ వాడితే ఈ పరిస్థితి రాదు. ఇందులో ఖాతా తెరిచి, మెయిల్ ఐడీతో మీ సహోద్యోగులను యాడ్ చేసుకోవాలి. అందులోని 'ఓపెన్' ట్యాబ్‌లో టాస్క్ యాడ్ చేసి, ఒకరికి అసైన్ చేయాలి. ఆ వ్యక్తి పని ప్రారంభించాక ఆ టాస్క్‌ను 'ఇన్ ప్రోగ్రెస్' ట్యాబ్‌లోకి తీసుకుంటారు. పూర్తయ్యాక 'డన్' ట్యాబ్‌లోకి తీసుకొస్తారు. అలా అప్పగించిన పని ఎంతదాకా వచ్చిందో తెలుసుకోవచ్చు.

ఒకే దగ్గర.. ఒక వారం

ఓ వారం మీ ప్లానింగ్ అంతా ఒకేసారి తెర మీద కనిపిస్తే బాగుంటుంది కదా. week-plan ఆప్‌తో ఈ పని చేయొచ్చు. జీమెయిల్ ఐడీతో ఆప్‌లో లాగిన్ అయ్యి మీ ప్రణాళికను రాసి పెట్టుకోవచ్చు. ఇందులో 'రోల్స్' అనే ఉంటుంది. టాస్క్/అపాయింట్‌మెంట్‌ను నోట్ చేసినప్పుడు ఏ రోల్ ఎంచుకోవాలి అని అడుగుతుంది. ఆఫీసుకు సంబంధించిన పని అయితే జాబ్ అని, వ్యక్తిగత విషయమైతే పర్సనల్ అని నోట్ చేసుకోవాలి. దాని వల్ల టాస్క్‌ల వర్గీకరణ సులభమవుతుంది. ఈ సర్వీసులను వెబ్‌సైట్ ద్వారా కూడా పొందొచ్చు.

రంగుల్లో కనిపిస్తే...

ఈ రోజు పూర్తి చేయాల్సినవి ఇవి, ఈ వారంలో పూర్తి చేయాల్సినవి ఇవి, ఈ పనులు ఎప్పుడో చేసేయాలి, ఇంకా పూర్తవ్వలేదు... ఇలా చేయాల్సిన పనుల గురించి వివరంగా చెప్పేవాళ్లుంటే బాగుంటుంది కదా. అయితే gqueues ఆప్ డౌన్‌లోడ్ చేసుకోండి. ఇంచుమించు జీమెయిల్ శైలిలో ఉండే ఈ ఆప్‌లో 'స్మార్ట్ క్యూస్' సదుపాయం ఉంది. అందులో ఒక్కో రకం పనులకు ఒక్కో రంగు ఆపాదించి ఉంటుంది. ఉదాహరణకు వారంలో పూర్తి చేయాల్సిన పనులు నారింజ రంగు ట్యాబ్‌లో కనిపిస్తాయి. ఇందులో చేయాల్సిన పనులు రాసుకోవడమే కాదు... భవిష్యత్తులో చూడాలనుకుంటున్న ప్రాంతాలనూ నమోదు చేసుకోవచ్చు.


దేని కోసం ఎంత?

పక్కాగా ప్రణాళిక వేసుకోవాలంటే... రోజూ దేని కోసం ఎంత సమయాన్ని కేటాయిస్తున్నామో తెలియాలి. సాధారణంగా అంతర్జాలంలో సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ షాపింగ్, వినోద రంగ వార్తలు చదవడానికి మూములుగా ఎక్కువ సమయం కేటాయిస్తుంటారు. మరి మీరు దేనికి ఎంత కేటాయిస్తున్నారో తెలియాలంటే www.rescuetime.com వెబ్‌సైట్‌లోకి వెళ్లండి. అందులో ఖాతా ప్రారంభించాక మీరు ఎక్కువగా చూస్తున్న వెబ్‌సైట్ల వివరాలు అడుగుతుంది. ఆ సమాచారం ఇచ్చిన తర్వాత మీరు రోజూ వాటి కోసం ఎంత సమయం వెచ్చిస్తున్నారనే వివరాలు తెలుస్తాయి.

ఆ సమయానికి...


'రేపు రాత్రి 10 గంటల కల్లా కాల్ చేస్తా...' మీరూ మీ స్నేహితులకు ఇలానే చెప్పి మరచిపోయుంటారు కదా!. ఇలాంటి వాటినీ టైమ్ మేనేజ్‌మెంట్ ఆప్స్‌లో నమోదు చేసుకొని పెట్టుకోవచ్చు. Any.do లాంటి ఆప్‌తో ఈ పని చేయొచ్చు. ఇందులో టాస్క్ క్రియేట్ చేసుకునే బటన్‌ను క్లిక్ చేస్తే కాల్, చెక్, గెట్, బై, సెండ్ అంటూ కొన్ని ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిలో మీకు కావల్సినదాన్ని ఎంచుకొని టాస్క్ క్రియేట్ చేసి, సమయాన్ని ఇవ్వాలి. అప్పుడు ఆ టైమ్‌కి మీకు నోటిఫికేషన్ వస్తుంది.

'ఫోన్' తేలియాడుతుంది



ఫేస్‌బుక్ మెసెంజర్‌లో ఓ మెసేజ్ రాగానే... ఒక చిన్న గుండ్రపు లోగో మొబైల్ స్క్రీన్ మీదకు వచ్చి చేరుతుంది. అది మెసెంజర్‌కు షార్ట్‌కట్‌లా పని చేస్తుంది. ఇప్పుడు ఫోన్ ఆప్‌కి కూడా ఇలాంటి ఆప్షన్ రాబోతోంది. గూగుల్ ఫోన్ ఆప్ ద్వారా కాల్ చేసి.. మినిమైజ్ చేస్తే స్క్రీన్ మీద ఓ ఫ్లోటింగ్ బటన్ కనిపిస్తుంది. అందులో కాల్ డిస్‌కనెక్ట్, మ్యూట్, స్పీకర్ ఆప్షన్లు ఉంటాయి. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా కొందరికి ఈ ఆప్షన్ అందుబాటులో ఉంది.

జిఫ్‌లు కావాలా నాయనా



మీ ఫొటోలతో మీరే జిఫ్‌లు తయారు చేసుకోండి అంటూ కొన్ని రోజులు క్రితం మెసేజింగ్ ఆప్ ఆలోలో ఓ ఆప్షన్ అందించింది గూగుల్. ఇప్పుడు ఏకంగా దీని కోసం ఓ ఆప్‌ను విడుదల చేసింది. Motion Stills పేరుతో ఇటీవల విడుదల చేసిన ఆప్‌లో తక్కువ నిడివితో వీడియో చిత్రీకరించొచ్చు. ఆ తర్వాత దాన్ని వీడియో, జిఫ్‌గా మార్చుకొని సామాజిక అనుసంధాన వేదికల్లో షేర్ చేసుకోవచ్చు. జిఫ్‌ల కోసం రకరకాల వెబ్‌సైట్లు, ఆప్‌లు ఇన్‌స్టాల్ చేసుకోకుండా దీని ద్వారా మీకు నచ్చినట్లు జిఫ్‌లు రూపొందించొచ్చు.

★ https:///goo.gl/odhvNt

మీరూ... మీ విమానం

చుట్టూ చీకటి... ఎక్కడో దూరంలో చిన్న వెలుగు... మధ్యలో ఓ విమానం!

ఇలాంటి పరిస్థితుల్లో ఆ విమానాన్ని నడపాలని ఉందా? అయితే Loner గేమ్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి. అనవసర రొదలు, భారీ గ్రాఫిక్స్, బులెట్ల వర్షం లాంటి కమర్షియల్ హంగులు లేకుండా ఈ ఆటను రూపొందించారు. ఆట ఓపెన్ చేసిన తర్వాత ఎగిరిపోవడానికి ఓ విమానం సిద్ధంగా ఉంటుంది. వెలుగును వెతుక్కుంటూ, మధ్యలో వచ్చే అడ్డంకుల్ని ఒడుపుగా దాటుకొంటూ వెళ్లాలి. అలా ఎంత వేగంగా, ఎంత ఎక్కువ దూరం ప్రయాణిస్తే అన్ని ఎక్కువ పాయింట్లు వస్తాయి. ఈ ఆటకు మీరు సిద్ధమైతే ఈ లింక్‌లో https:///goo.gl/7B9dm2 గేమ్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి.



స్క్వేర్ కెమెరాతో

స్మార్ట్‌ఫోన్ కెమెరాతో ఫొటోలు తీసుకొని తర్వాత వాటిని కొలేజ్ ఆప్‌తో కలుపుకోవడం తెలిసిందే. ఇప్పుడు ఆ ఆప్ అవసరం లేకుండా మొబైలే ఆ పని చేయబోతోంది. ఈ ఆప్షన్‌తో ఎల్‌జీ క్యూ 6 అనే మొబైల్‌ను కొరియాలో లాంచ్ చేసింది. ఇందులో స్క్వేర్ కెమెరా ఆప్షన్ ఉంది. దీంతో ఒకేసారి రెండు ఫొటోలు క్లిక్ చేసి కలుపుకోవచ్చు. గ్రూపు ఫొటోలు తీసుకోవడానికి ఇది బాగుంటుంది. మల్టీ టాస్కర్స్‌కు అనువుగా ఈ మొబైల్ స్క్రీన్‌ను రెండు స్క్వేర్ విండోస్‌గా మార్చుకునే సదుపాయమూ కల్పించారు.



సరాహ... భద్రం సుమా!

ఎంత ప్రాణమిత్రుడైనా... అతడి మీద అభిప్రాయం చెప్పడానికి లేదా 'నువ్వు చేసింది తప్పు' అని అనడానికి మొహమాటం అడ్డొస్తుంది. గతంలో ఇలాంటి విషయాల్ని ఆకాశరామన్న పేరుతో ఉత్తరాలు రాసేవాళ్లు. సాంకేతిక యుగంలో ఈ పని చేయడానికి ఓ యాప్ అందుబాటులో ఉంది. అదే **Sarahah**. దీంతో మీ మనసులోని మాటను ఎలాంటి బెరుకు లేకుండా అవతలి వ్యక్తికి మెసేజ్ పెట్టేయొచ్చు. ఎవరు పంపారు, ఎలా పంపారు అనేది అందుకున్న వ్యక్తికి తెలియదు. అంతా బాగున్నా.. ఇది కొంత మందిని ఇబ్బందులకూ గురి చేస్తోంది. ఆకాశరామన్న ఉత్తరాల వల్ల కొన్ని ఇబ్బందులున్నట్లే... సరాహ వల్ల కూడా ఎదురవుతున్నాయి.



మీ పేరు, మెయిల్ ఐడీ, మొబైల్ నెంబరు లాంటి ప్రాథమిక వివరాలు ఇచ్చి ఈ ఆప్‌ను ఓపెన్ చేయాలి. ఆ తర్వాత యూజర్ నేమ్ క్రియేట్ చేసుకోవాలి. దాని ఆధారంగానే మీకు మెసేజ్‌లు పంపొచ్చు. మీరు ఎవరికైనా మెసేజ్ పంపాలంటే ఆప్‌లోని సెర్చ్ ట్యాబ్‌లోకి వెళ్లండి. అక్కడ అవతలి వ్యక్తి యూజర్ నేమ్‌తో సెర్చ్ చేసి ఓపెన్ చేయ్యండి. అక్కడ కేవలం సందేశం రాసే బాక్స్ మాత్రమే ఉంటుంది. అవతలి వ్యక్తి సమాచారమేదీ అందులో కనిపించదు. అలాగే ఆ సందేశం మీ నుంచి వెళ్లిందనే విషయమూ అవతలి వ్యక్తికి తెలియదు.

ఆలోచన...

దుబాయికి చెందిన జైన్ అలాబ్దిన్ తౌఫిక్ అనే యువకుడు ఈ ఆప్ తయారు చేశాడు. సరాహ అంటే అరబిక్ భాషలో నిజాయతీ అని అర్థం. ఎదుటి వ్యక్తి గురించి నిజాయతీగా మనసులోని మాట చెప్పండి అనే ఉద్దేశంలో దీన్ని రూపొందించాడు. రెండు నెలల క్రితమే ఈ ఆప్ ప్లేస్టోర్‌లో అందుబాటులోకి వచ్చినా మన దేశంలో ఈ నెలలోనే ఎక్కువగా ప్రాచుర్యం పొందింది. ఇప్పుడు గూగుల్ ప్లేస్టోర్‌లో ట్రెండింగ్‌లో ఉంది. వెబ్‌సైట్ రూపంలోనూ ఈ సర్వీసులున్నాయి.

జరుగుతున్నది...

'మీ గురించి మీరు తెలుసుకోండి' అనే నినాదంతో వచ్చిన ఈ ఆప్ ఇప్పుడు బెదిరింపు సందేశాలకు నెలవైంది. ఈ ఆప్ ద్వారా కొందరు మంచి సందేశాలు పంపిస్తున్నా... ఇంకొందరు బెదిరింపు ధోరణికి దిగుతున్నారని తెలుస్తోంది. ఈ విషయాన్ని కొందరు సామాజిక అనుసంధాన వేదికల్లో పంచుకుంటున్నారు. ఇప్పటికే కొందరు ఫిర్యాదులు చేశారు. మరోవైపు ఈ ఆప్‌కు ఇచ్చిన డేటా ఎంత వరకు భద్రంగా ఉంటుందనేదీ తెలియడం లేదు. లాగిన్ కోసం ఇచ్చే మెయిల్ ఐడీ, మొబైల్ నెంబరు లాంటివి అగంతుకుల చేతిలో పడితే చాలా కష్టం. కాబట్టి సరాహతో జర భద్రంగా ఉండండి.

అవసరాలు తీర్చాల్సిన ఆప్‌లు... ప్రాణాల మీదకు తీసుకొస్తున్నాయి! ఆటవిడుపు కోసం వాడే ఆప్‌లు... ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయి! సమాచారమిచ్చే వెబ్‌సైట్‌లు... యువత ఉసురు తీస్తున్నాయి! అసలు... అవేంటి! వాటితో వస్తున్న నష్టమేంటి? వాటి మాయలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో చూద్దాం!

చంపేస్తోంది... బ్లూ వేల్

రోజూ ఉదయాన్నే 4:20కి నిద్ర లేవు... మేడ మీదకి వెళ్లి చీకట్లో కూర్చో... చేతి మీద కత్తితో తిమింగలం బొమ్మ గియ్యి... పెదవిని బ్లేడుతో కత్తిరించుకో... రైలు పట్టాల మీద పడుకో... ఆఖరిగా ఆత్మహత్య చేసుకో...! ఇదేం శిక్షలు అనుకుంటున్నారా? ఇవి శిక్షలు కావు... ఆటలో చేయాల్సిన టాస్క్‌లు! ప్రపంచాన్ని ఓ కుదుపు కుదిపేస్తున్న 'బ్లూ వేల్' గేమ్‌లోని టాస్క్‌లు ఇవీ. వినోదం కోసం ఆటలాడే యువత.. ప్రాణాలు తీసుకునేలా ప్రోత్సహిస్తోందీ ఆట. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా ఈ ఆట వల్ల 130 మందికిపైగా మృత్యువాత పడ్డారు. మన దేశంలో 5 కేసులు నమోదయ్యాయి.

ఓ గేమ్ ఓపెన్ చేస్తే... 50 రోజులపాటు అది చెప్పిన పనులు తూ.చ. తప్పకుండా చేయాలి. ఆఖరుగా ఆత్మహత్య చేసుకోవాలి. లేకపోతే మీరు ఆటలో ఓడిపోయినట్లు. ఇదీ 'బ్లూ వేల్' ఆట ఆడే విధానం. ఆటను ఆటగా తీసుకోకుండా యువత టాస్క్‌లో చెప్పిన పనులు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. గేమ్ ఓపెన్ చేసిన తర్వాత ఖాతా ప్రారంభించాక ఆట అడ్మిన్ (ఇందులో క్యూరేటర్ అంటారు). ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, గూగుల్ ద్వారా కొన్ని టాస్క్‌లు పంపిస్తారు. వాటిని గేమ్ ఆడే వ్యక్తి చేసి అడ్మిన్‌కు పంపించాలి. నిర్ణీత టాస్క్ పూర్తి కాకపోతే ఓడిపోయినట్లే. టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేసిన వాళ్లు ఆ విషయాన్ని ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా అందరికీ తెలియజేస్తున్నారు. వాటిని చూసి మనం కూడా టాస్క్ పూర్తి చేయాలనే పోటీతో మిగిలిన ఆటగాళ్లు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఆట వల్ల మృత్యువాత పడుతున్న వాళ్లలో 10 నుంచి 20 ఏళ్ల వయసున్న కుర్రాళ్లే ఎక్కువగా కనిపిస్తున్నారు. తెగించి సాహసాలు చేయాలన్న కుతూహలం, ప్రమాదాలపై విచక్షణ లేకపోవటం లాంటివి వీరిని ఈ ఆట వైపు పురిగొల్పుతున్నాయంటున్నారు నిపుణులు.

> నేను సమాజాన్ని ప్రక్షాళన చేస్తున్నా. సమాజాని కడిగేయడానికే ఈ ఆట ప్రారంభించాను. ఇందులో పాల్గొనేవారందరూ వ్యర్థ జీవులతో (బయోలాజికల్ వేస్ట్) సమానం.

అని ఫిలిప్ ఓ ఇంటర్వ్యూలో అన్నాడు. ఆ తర్వాత అతనికి మూడేళ్ల జైలు శిక్ష విధించి రష్యాలోని ఓ జైలులో ఉంచారు.

2013లో ప్రారంభమైన ఆట... ఇటీవల కాలంలో బాగా ఊపందుకొంది. మన దేశంలో రెండు నెలల నుంచి బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అన్ని టాస్క్‌లు పూర్తి చేయాలనే ఉద్దేశంలో అంధేరీ, ఇండోర్, షోలాపూర్, వెస్ట్ మిద్నాపూర్, తిరువనంతపురంలో కొందరు యువకులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఆటను ఫిలిప్ బుడైకిన్ అనే 22 ఏళ్ల రష్యన్ యువకుడు రూపొందించాడు. ఆట ప్రారంభించిన తొలినాళ్లలో ఆయనే సూచనలు సలహాలు ఇచ్చేవాడు. ఫిలిప్‌ను అరెస్ట్ చేశాక ఇప్పుడు టాస్క్‌లు ఇస్తోంది ఎవరో తెలియడం లేదు.

ఈ ఆటకు సంబంధించిన లింక్స్‌ను బ్లాక్ చేయమని ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్ తదితర సామాజిక అనుసంధాన వేదికలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇంకా వీటిలో ఈ హ్యాష్‌ట్యాగ్‌లు కనిపిస్తున్నాయి. ఈ ఆటలో టాస్క్‌లు ఇవే అంటూ కచ్చితంగా జాబితా ఎక్కడా లేదు. #bluewhalechallenge, #curatorfindme #i_am_whale act లాంటి హ్యాష్ ట్యాగ్‌లతో క్యూరేటర్ నుంచి సూచనలు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితి రాకుండా "పిల్లల నడవడికపై నిఘా పెట్టాలి. ఒక్కరే చీకట్లో కూర్చోవడం, అనుమానాస్పదంగా ఉండే సంగీతం వినడం, విచిత్రమైన వీడియోలు చూడటం లాంటి పనులు చేస్తుంటే ఆరా తీయాలి" అని మానసిక వికాస నిపుణులు సూచిస్తున్నారు.

> "మీ పిల్లల స్మార్ట్‌ఫోన్, అంతర్జాలం వినియోగంపై ఓ కన్నేయండి. ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో వాళ్లు షేర్ చేస్తున్న అంశాలను పరిశీలించండి. వాళ్ల మనసులోని భావాలను స్వతంత్రంగా మీతో పంచుకోగలిగే స్వేచ్ఛనివ్వండి. ఈ చొరవ లేకనే కొందరు పిల్లలు వాళ్ల మనోభావాల్ని వ్యక్తీకరించడానికి సామాజిక అనుసంధాన వేదికల్ని వినియోగిస్తున్నారు. దూరంగా కూర్చొని ఏడవడం, బాధపడటం లాంటివి చేస్తుంటే వాళ్లతో మాట్లాడి విషయం తెలుసుకోండి"
>
> – సీహెచ్ఏఎస్ మూర్తి, జాయింట్ డైరెక్టర్, సీడాక్

మెట్రో రైల్‌లో 'ప్రైవేట్' తప్పనిసరి

ఈనాడు – దిల్లీ

కేంద్ర ప్రభుత్వం సరికొత్త మెట్రో రైల్ విధానానికి ఆమోదముద్ర వేసింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇక మీదట మెట్రోరైల్ ప్రాజెక్టుల కింద కేంద్ర ప్రభుత్వ సాయం పొందాలంటే ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యం (పీపీపీ) తప్పనిసరిగా ఉండాలన్న నిబంధన విధించారు. ప్రైవేటు వారికి మొత్తం ప్రాజెక్టును కానీ, లేదంటే అందులో కొన్ని విభాగాలను కానీ అప్పగించడానికి కొత్త విధానంలో వెసులుబాటు కల్పించారు. ఉదాహరణకు టికెట్ల విక్రయం, నిర్వహణ సేవలను ప్రైవేటు వారికి అప్పగించే అవకాశం ఉంటుంది. ప్రైవేటు వారికి అప్పగించడానికి అవకాశం ఉన్న విభాగాలన్నింటినీ ప్రతిపాదనల్లో విడివిడిగా చేసి చూపాల్సి ఉంటుంది.

అనుసంధాన రవాణా వ్యవస్థ ఉండాలి: దూర ప్రాంతాల్లో ఉన్న వారు ప్రస్తుతం మెట్రోరైలు సేవలను తగినస్థాయిలో ఉపయోగించుకోలేకపోతున్నారు. అందువల్ల రైలు ప్రాజెక్టుకు అటూ, ఇటు 5 కిలోమీటర్ల దూరం వరకు ఉన్న ప్రయాణికులను మెట్రోస్టేషన్లకు తీసుకురావడానికి రవాణాసౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకయ్యే పెట్టుబడి వివరాలను ప్రతిపాదనల్లో పొందుపరచాలి.

అతి తక్కువ ఖర్చు మార్గాన్ని ఎంచుకోవాలి: ప్రజారవాణా కోసం అతి తక్కువ ఖర్చుతో కూడిన వ్యవస్థను ఎంచుకోవాలన్న షరతు విధించింది. మెట్రోరైలుకు ప్రత్యామ్నాయంగా బీఆర్‌టీఎస్, లైట్ రైల్, ట్రామ్‌వేస్, రీజినల్ రైల్‌ప్రాజెక్టుల్లో ఏది తక్కువ ఖర్చులో పూర్తయి, ఎక్కువ అవసరాలు తీర్చగలుగుతుందో విశ్లేషణాత్మకంగా చెప్పాలి.

అర్బన్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ: మెట్రో రైల్ ప్రాజెక్టులు కావాలనుకుంటున్న, ఇప్పటికే ఉన్న రాష్ట్రాలు తప్పనిసరిగా ఏడాదిలోగా అర్బన్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ ఏర్పాటు చేయాలి. ఒక టికెట్‌తో అందుబాటులో ఉన్న అన్ని రవాణా సాధనాలనూ ఉపయోగించుకొనేందుకు ఈ ఏర్పాటు తప్పనిసరి.

మూడో పార్టీ ద్వారా అంచనా: వచ్చిన ప్రతిపాదనలను సూక్ష్మస్థాయిలో పరిశీలించేందుకు కేంద్రం మూడో పార్టీ ద్వారా మదింపు వేస్తుంది.

ఆదాయం 14% ఉండాలి: ఇప్పటివరకూ మెట్రోరైల్ ప్రాజెక్టుకు అనుమతివ్వాలంటే పెట్టుబడిపై వార్షిక ఆదాయం (రేట్ ఆఫ్ రిటర్న్) 8% ఉంటే సరిపోయేది. ఇక మీదట 14% ఉంటేనే అనుమతి ఇస్తారు. కేవలం ఆదాయాన్నే కాకుండా ఉద్యోగావకాశాల కల్పన, వాతావరణ కాలుష్యం తగ్గింపు తదితర అంశాలను కూడా రేట్ ఆఫ్ రిటర్న్ లెక్కింపులో పరిగణనలోకి తీసుకుంటారు. కార్పొరేట్ బాండ్ల జారీ ద్వారా తక్కువ వడ్డీకే ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలి. టికెట్ ఛార్జీల ధరల నిర్ధారణ కోసం శాశ్వత అథారిటీ కూడా రాష్ట్రాలే సొంతంగా ఏర్పాటు చేసుకోవచ్చు

ఆదాయ సామర్థ్యం ఎంత?: మెట్రో ప్రాజెక్టుల ద్వారా స్టేషన్లలో వాణిజ్యఅవకాశాలకు ఎంతమేర అవకాశం ఉంది? పట్టణ భూముల్లో అభివృద్ధికి ఇంకా ఏమైనా అవకాశం ఉందా? ప్రకటనల ద్వారా ఆదాయం పెంచుకోవడానికి ఎంతమేర అవకాశం ఉంది? స్థలాలు అద్దెకివ్వడానికి ఎంత వరకు అవకాశం ఉన్నదీ స్పష్టంగా చెప్పాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టును రవాణా ఆధారిత అభివృద్ధి (ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్) అన్న కోణంలో చేపట్టాల్సి ఉంటుంది.

కేంద్ర సాయానికి మూడు పద్ధతులు

కేంద్రం నుంచి ఆర్థికసాయం పొందాలంటే మూడు ప్రత్యామ్నాయాల్లో ఏదో ఒకదానిని రాష్ట్రాలు ఎంచుకోవాల్సి ఉంటుంది.

1. పీపీపీ విధానం... దీని కింద కేంద్ర ఆర్థికశాఖ వయబిలిటీ గ్యాప్ ఫండ్ సమకూరుస్తుంది. నష్టాలు రాకుండా నిధులు ఇస్తుంది.
2. కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్... దీని కింద ప్రాజెక్టు వ్యయంలో 10% మొత్తాన్ని ఒకే సారి కేంద్రం ఇస్తుంది.
3. 50:50 భాగస్వామ్యం.... దీని కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భారం పంచుకుంటాయి. ఈ మూడింటి కిందా ప్రైవేటు భాగస్వామ్యం తప్పనిసరి.

ఈశాన్య రాష్ట్రాలకు పన్ను మినహాయింపు కాలం పెంపు

ఈశాన్య, హిమాలయ ప్రాంత రాష్ట్రాల్లోని పరిశ్రమలకు ఇచ్చే పన్ను రాయితీలను 2027 మార్చి 31వరకు పెంచారు. జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటికీ ఈ రాయితీలు కొనసాగుతాయి. చెల్లించిన పన్నులు వాపసు పొందడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు, జమ్ము-కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే గతంలో పదేళ్ల పాటు ఎక్సయిజ్ సుంకంలో మినహాయింపు ఉండేది. జీఎస్టీ చట్టం ప్రకారం మినహాయింపులకు అవకాశం లేనప్పటికీ, చెల్లించిన ప్రత్యక్ష నగదు బదిలీ విధానం కింద పన్నును వాపసు చేయవచ్చన్న నిబంధన ఆధారంగా ఈ ప్రత్యేక సౌకర్యం కల్పించారు. ఈ కారణంగా 4,284 పరిశ్రమలు లబ్ధిపొందనున్నాయి. ఇందుకోసం రూ.27,413 కోట్లు కేటాయించనున్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ఆరు వారాల్లో ప్రకటిస్తారు.

మాధ్యమిక, ఉన్నత విద్యకు ఒకే మూల నిధి

మాధ్యమిక, ఉన్నత విద్యకు ఒకే మూల నిధి (కార్పస్ ఫండ్) ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. మాధ్యమిక విద్య సెస్, ఉన్నత విద్య సెస్ రూపంలో వసూలయిన సొమ్మును ఇందులో జమ చేస్తారు. మాధ్యమిక్ అండ్ ఉచ్చతర్ శిక్షా కోశ్ (ఎంయుఎస్‌కే- ముస్క్) పేరుతో మానవ అభివృద్ధి వనరుల శాఖ దీన్ని నిర్వహిస్తుంది. ఈ నిధులు మురిగిపోవడం ఉండదు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు పూర్తయిన తరువాతే వీటిని ఖర్చు చేస్తారు.

కోస్టుగార్డుకు రూ.32,000 కోట్లు

సముద్ర జలాల్లో కాపలాకాసే కోస్టుగార్డు బలోపేతానికి రూ.32,000 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం ఈ సంస్థ కింద 130 నౌకలు, 52 నిఘా నౌకలు, 60కిపైగా విమానాలు/హెలికాప్టర్లు ఉన్నాయి. 2020నాటికి 175 నౌకలు, 110 విమానాలు/హెలికాప్టర్లు హెలికాప్టర్లు ఉండేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. దీని అమలు కోసం ఈ కేటాయింపులు జరిపారు.

ఏపీ నిట్‌కు నాలుగు పోస్టుల మంజూరు

ఆంధ్రప్రదేశ్‌లోని నిట్‌కు నాలుగు పోస్టులు మంజూరయ్యాయి. ఒక డైరెక్టర్, రిజిస్ట్రార్, లైబ్రేరియన్, ప్రిన్సిపల్ స్టుడెంట్స్ యాక్టివిటీ అండ్ స్పోర్ట్సు (ఎస్ఏఎస్) ఆఫీసర్ పోస్టులకు ఆమోదం తెలిపింది.

విదేశీ ఒప్పందానికి ఆమోదం

మేధో హక్కుల సంపదపై భారత్-స్వీడన్ మధ్య కుదిరిన ఒప్పందానికి ఆమోదం తెలిపింది.

దమ్ముంటే 370 అధికరణాన్ని రద్దు చేయండి: శివసేన

ముంబయి: కేంద్రానికి దమ్ముంటే- జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తున్న 370 రాజ్యాంగ అధికరణాన్ని రద్దు చేయాలని శివసేన డిమాండ్ చేసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగిస్తూ కశ్మీర్ గురించి చేసిన ప్రస్తావనను శివసేన విమర్శించింది. ప్రధాని మాటలు కార్యరూపం దాల్చాలంటే, కశ్మీర్‌ను దేశవ్యాప్త ప్రజలు సందర్శించి- అక్కడి ప్రజల్ని అక్కున చేర్చుకోవాలంటే ముందుగా ఆర్టికల్-370ని రద్దుచేయాలంది. ఈ మేరకు పార్టీ అధికార పత్రిక 'సామ్నా'లో సంపాదకీయం వెలువరించింది. ప్రధానికి ఇప్పుడు వచ్చిన ఆలోచన ఇంతకు ముందు ఎవరికీ ఎందుకు రాలేదో చాలా ఆశ్చర్యకరంగా ఉందని వ్యాఖ్యానించింది. మతం పేరిట హింసకు పాల్పడడం ముస్లింలనే కాకుండా హిందువుల్నీ భయభ్రాంతుల్ని చేస్తోందని తెలిపింది. 'గోరక్షణ పేరుతో కొంతమంది హిందువులు కూడా హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారు. వారిని హెచ్చరించి ఊరుకున్నంత మాత్రాన సరిపోదు. వందేమాతరాన్ని ఆలపించడానికి నిరాకరించినవారిపై ఉన్నంత కఠినంగా, జీఎస్టీ అమలుకు ఉన్నంత పట్టుదలగా ఇలాంటి వారిపై ప్రభుత్వం ఎందుకు వ్యవహరించడం లేదు?' అని ప్రశ్నించింది.

నిఖా రద్దు కేసులో ఎన్ఐఏ దర్యాప్తు: సుప్రీంకోర్టు



దిల్లీ: తన నిఖాను రద్దు చేస్తూ కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పులోని అంశాలపై ఓ ముస్లిం వ్యక్తి లేవనెత్తిన అభ్యంతరాల మీద దర్యాప్తు చేయాల్సిందిగా 'జాతీయ దర్యాప్తు సంస్థ'ను (ఎన్ఐఏ) సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ దర్యాప్తును సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆర్.వి.రవీంద్రన్ పర్యవేక్షిస్తారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం ప్రకటించింది. ఇస్లాం మతం స్వీకరించిన హిందూ మహిళతో గత డిసెంబరులో తనకు జరిగిన వివాహాన్ని 'లవ్ జిహాద్' ఘటనగా కేరళ హైకోర్టు పేర్కొని, దానిని రద్దు చేయడంపై ఆ రాష్ట్రానికి చెందిన షఫీన్ జహాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇది మన దేశంలో మహిళల స్వాతంత్ర్యానికే అవమానకరమని ఆయన పేర్కొన్నారు. అలాంటి కేసులపై దర్యాప్తు జరపాలని కేరళ పోలీసుల్ని హైకోర్టు ఆదేశించింది. ఈ ఘటన ఒక చిన్న ప్రాంతానికే పరిమితమా, లేదా విస్తృతమైనదా అనేది తేలాలంటే ఒక తటస్థ సంస్థ అవసరం కాబట్టి ఎన్ఐఏకి దర్యాప్తు బాధ్యతల్ని అప్పగిస్తున్నట్లు తెలిపింది. విచారణను పూర్తిచేసి నివేదికను తమకు సమర్పించాలని ఎన్ఐఏను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ నివేదికను, కేరళ పోలీసుల సమాచారాన్ని, కక్షిదారుడు పెళ్లాడిన మహిళ నుంచి వివరాలను తీసుకున్నమీదట తీర్పు వెలువరిస్తామని తెలిపింది. మత మార్పిళ్లకు, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద వ్యాప్తికి ఒక పథకం ప్రకారం కుట్ర జరుగుతోందని ఈ కేసులోని మహిళ తండ్రి అశోకన్ గతంలో ఆరోపించారు.

1984 అల్లర్ల కేసుల రద్దుపై పర్యవేక్షణ సంఘం

సిక్కులకు వ్యతిరేకంగా 1984లో చోటు చేసుకున్న అల్లర్లకు సంబంధించి 199కేసుల్ని మూసివేస్తూ 'ప్రత్యేక దర్యాప్తు బృందం'(సిట్) తీసుకున్న నిర్ణయాన్ని సమీక్షించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దీనికోసం ఇద్దరు విశ్రాంత న్యాయమూర్తులతో ఒక సంఘాన్ని నియమిస్తున్నట్లు జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం ప్రకటించింది. కొత్తగా మరో 42 కేసుల్ని మూసివేయాలన్న సిట్ నిర్ణయాన్నీ పరిశీలించాల్సిందిగా ద్విసభ్య సంఘానికి సూచించింది. 3 నెలల్లోగా నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను నవంబరు 28కి వాయిదా వేసింది. మూసివేసిన 199 కేసులకు సంబంధించిన దస్త్రాలను తమ ముందు ఉంచాల్సిందిగా సుప్రీంకోర్టు ఈఏడాది మార్చి 24న కేంద్రాన్ని ఆదేశించింది.

బాలికలకు ఐఐటీ దారి చూపుతున్న 'ఉడాన్'

135 మంది జేఈఈలో ఉత్తీర్ణత

దిల్లీ: ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో బాలికలు ప్రవేశం పొందేందుకు అమలుచేస్తున్న 'ఉడాన్' పథకం కింద ఈఏడాది 135 మంది జేఈఈ ప్రధాన పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. బాలురతో సమానంగా బాలికలు ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే లక్ష్యంతో ఈ పథకం కింద - సీబీఎస్ఈ వారికి అనేక విధాలుగా ప్రోత్సాహం అందిస్తోంది. 'నవ్య భారత్' లక్ష్యంతో రూపొందించిన ఈ పథకానికి గాను విద్యార్హతల్లో గణితం, సైన్సుల్లో 80 శాతం, మొత్తంగా 70 శాతం మార్కులు సాధించిన బాలికలను ఎంపిక చేస్తారు. వారంతా ఐఐటీల్లో ప్రవేశం పొందేందుకు అవసరమైన శిక్షణ, సహకారం, పుస్తకాలు వంటివి సీబీఎస్ఈ ఉచితంగా అందిస్తోంది. 60 నగరాల్లో ఆన్‌లైన్ తరగతులను నిర్వహించడంతో పాటు, సహాయక కేంద్రాలను కూడా ఏర్పాటు చేసింది. దీనికి అనుగుణంగా ఐఐటీల్లో బాలికలకు 20 శాతం అదనపు కోటాను కూడా ప్రభుత్వం గత ఏప్రిల్‌లో ఆమోదించింది. ట్యాబ్‌లు, చరవాణిల ద్వారా స్టడీ మెటీరియల్‌ను అందించి.. సులువుగా చదువుకునేలా ఏర్పాట్లు చేసినట్లు సీబీఎస్ఈ ఛైర్మన్ ఆర్.కె.చతుర్వేది తెలిపారు.

రాహుల్‌పై సన్నగిల్లుతున్న విశ్వాసం!

- కాంగ్రెస్‌లో పునరుత్తేజానికి సిద్ధమవుతున్న అహ్మద్ వర్గం
- యువనేతతో కలిసిరాని ఇతర విపక్షాలు
- మోదీకి దీటైన నేతగా సోనియాగాంధీవైపే మొగ్గు

ఈనాడు, దిల్లీ: కాంగ్రెస్‌లో రాహుల్‌గాంధీపై విశ్వాసం సన్నగిల్లుతోందా? ఆ పార్టీ మిత్రపక్షాలదీ అదే మాటా? తాజాపరిణామాలు చెబుతున్నదిదే. గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ నేత అహ్మద్‌పటేల్ విజయం సాధించడంతో ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్ అహ్మదాబాద్‌లో సెప్టెంబర్ 1న తలపెట్టిన సత్యాగ్రహ ర్యాలీకి ప్రధాన విపక్ష నేతలందరినీ ఆహ్వానించింది. ఆహ్వానాల్ని పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీయే పంపారు. ఆహ్వానాలతోపాటు సోనియా రాజకీయ కార్యదర్శి అహ్మద్‌పటేల్ వ్యక్తిగతంగా ఫోన్ కూడా చేసి మాట్లాడారు. ఈ పరిణామాల్లో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రమేయం ఎక్కడా కనిపించకపోవడం విశేషం. ఈ ర్యాలీకి ముందు ఈనెల 27న పట్నాలో ఆర్జేడీ అధ్యక్షులు లాలూయాదవ్ నిర్వహించే భాజపా వ్యతిరేక ర్యాలీలో విపక్షాలు కలవనున్నాయి. ఈ ర్యాలీకి హాజరయ్యేందుకు వీలుకాకపోతే.. ప్రియాంకాగాంధీని పంపాల్సిందిగా సోనియాను లాలూప్రసాద్ కోరినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. భాజపా వ్యతిరేక ర్యాలీకి రాహుల్ హాజరవ్వడాన్ని లాలూ ఇష్టపడటం లేదని తెలుస్తోంది. మొత్తానికి రాహుల్‌పై స్వపక్షానికీ, విపక్షాలకు విశ్వాసం సన్నగిల్లినట్లు ఈ రెండు ఉదంతాలూ సూచిస్తున్నాయని చెబుతున్నారు. అంతకుముందు తృణమూల్ చీఫ్ మమతాబెనర్జీ, బీఎస్పీ చీఫ్ మాయావతి సైతం రాహుల్‌కన్నా సోనియాతో కలిసి పనిచేసేందుకే మొగ్గుచూపుతున్నట్లు స్పష్టమైన సంకేతాలిచ్చారు. 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో తమ ప్రత్యర్థి ఎస్పీతో కాంగ్రెస్ జట్టుకట్టడంపై మాయావతి యువనేతనే నిందించారు. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో తమ ప్రత్యర్థి సీపీఎంతో కాంగ్రెస్ కలవడంపై మమత రాహుల్‌పై గుర్రుగా ఉన్నారు. ఈ పరిణామాలన్నీ విపక్షాలు రాహుల్‌ను విశ్వసించడం లేదని స్పష్టంచేస్తున్నాయి. 2016లో భుజం గాయమైనప్పటి నుంచి దిల్లీ బయట జరిగే రాజకీయ కార్యక్రమాలకు సోనియా దూరంగా ఉంటున్నా.. 2013 తర్వాత కాంగ్రెస్‌లో నిర్ణయాధికారం రాహుల్‌గాంధీకే అప్పగించినా. . 2019 సాధారణ ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ ముఖచిత్రంగా రాహుల్‌ను కాకుండా సోనియానే విపక్షాలు కోరుకుంటున్నట్లు తెలుస్తోంది.

సొంత పార్టీలోనూ అవే పరిస్థితులు..

విపక్షాల అభ్యంతరాలెలా ఉన్నా.. సొంత పార్టీలోనే రాహుల్‌గాంధీని అందరూ ఏకపక్షంగా ఆమోదించడం లేదనే అభిప్రాయాలున్నాయి. 2014లో ఓడిపోయిన తర్వాత కాంగ్రెస్‌కు వరసగా ఓటములే ఎదురవుతుండటం, రాహుల్ సుదీర్ఘ విదేశీ ప్రయాణాలు, నిర్ణయాలు తీసుకోవడంలో కాలహరణం వంటివన్నీ కారణంగా చెబుతున్నారు. ఇటీవల జైరాంరమేష్ రాహుల్ పనితీరును ప్రశ్నించడం గమనార్హం. మధ్యప్రదేశ్‌లో రైతుల ఉద్యమం విషయంలో పార్టీ అకస్మాత్తుగా వైదొలగడంపై కాంగ్రెస్ నేతలు మౌనంగా యువనేతపైనే నిందమోపుతున్నారు.

యువనేతలు.. పాతతరం ఢీ

2013లో జైపూర్ సదస్సు నుంచే కాంగ్రెస్‌లోని యువనేతలు రాహుల్ నేతృత్వంలో అహ్మద్‌పటేల్ ప్రాతినిధ్యం వహిస్తున్న పాతతరాన్ని ఢీకొట్టేందుకు యత్నిస్తున్నారు. ఇందులో జ్యోతిరాదిత్యసింధియా, సచిన్‌పైలట్, రణదీప్‌సింగ్ సూర్జేవాలా, గౌరవ్‌గొగోయి, దీపేంద్రసింగ్ హుడా వంటి యువనేతలున్నారు. అయితే.. రాజ్యసభ ఎన్నికల్లో అహ్మద్ గెలుపు వీరికి తీవ్రవిఘాతంగా మారినట్లు తెలుస్తోంది. అహ్మద్ గెలుపు తర్వాత రాహుల్ అభినందనలూ తెలుపకపోవడం గమనార్హం. ఇరువర్గాల మధ్య సంబంధాలు బెడిసికొట్టాయనేందుకిది తార్కాణంగా భావిస్తున్నారు. రాహుల్ ఆధ్వర్యంలో యువనేతలు కీలక బాధ్యతలు చేపడుతున్నా అనుభవలేమి వారి ప్రవర్తనలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వారి సలహాతోనే డోక్లాం సంక్షోభంపై రాహుల్ రహస్యంగా చైనా దూతను కలిసినట్లు తెలుస్తోంది. ఈ రహస్య సమావేశం వివరాలు బయటపడినప్పుడు యువనేతలు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారనీ, అదే పాతతరం నేతలు సమర్థించుకుంటూ గట్టిగా వాదించారని పార్టీ నేత ఒకరు పేర్కొన్నారు. ఈ పరిణామం తర్వాత అహ్మద్‌పటేల్‌కు సన్నిహితులుగా పేర్కొనే సీనియర్ నేతలు రాహుల్ సలహా కమిటీలో చేరినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలన్నింటితో యువనేతలంతా సీనియర్ల నీడలో పనిచేయాల్సిందే అనే సందేశాన్ని అహ్మద్‌పటేల్ వెలువరించినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. రాహుల్ అశక్తత విషయంలో సోనియా కూడా నిస్సహాయంగా మిగిలిపోయినట్లు తెలుస్తోంది.

మోదీ హయాంలో విదేశాంగ విధానం ధ్వంసం

- గోరఖ్‌పూర్ దుర్ఘటనపై పెదవి విప్పరేం?
- ప్రధానిపై రాహుల్ గాంధీ విమర్శలు

ఈనాడు, బెంగళూరు: దేశ ప్రయోజనాలకు మేలు చేసేలా యూపీఏ ప్రభుత్వం రూపొందించిన విదేశాంగ విధానాన్ని ప్రధాని మోదీ మూడు నెలల్లో విధ్వంసం చేశారని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. తద్వారా దేశం చుట్టూ శత్రువుల్ని కొని తెచ్చారని ఆక్షేపించారు. "భారత్‌కు చిరకాల మిత్రుడైన రష్యా ఇప్పుడు పాక్‌కు మారణాయుధాల్ని సరఫరా చేస్తుండటం మోదీ విదేశాంగ విధానానికి నిదర్శనం"అని వ్యాఖ్యానించారు. కర్ణాటక ప్రభుత్వం బెంగళూరులో పేదలకు తక్కువ ధరకు అల్పాహారం, భోజనాన్ని అందించే ఇందిరా క్యాంటీన్లను బుధవారం ఇక్కడ లాంఛనంగా ప్రారంభించిన తర్వాత జరిగిన బహిరంగ సభలో రాహుల్ ప్రసంగించారు. "జమ్ము-కశ్మీర్‌లో మేం శాంతిభద్రతలు నెలకొల్పాం. లక్షల మంది



బెంగళూరులో ప్రారంభించిన ఇందిరాక్యాంటీన్‌లో అల్పాహారం రుచి చూస్తున్న రాహుల్, ముఖ్యమంత్రి సిద్దరామయ్య తదితరులు

మళ్లీ బ్యాంకు లావాదేవీలు చేసుకునేలా చూశాం. వ్యాపారం పరిఢవిల్లింది. మోదీ హయాంలో ఇదంతా కుప్పకూలింది. అశాంతి, అల్లర్లు చెలరేగాయి. పాక్ అక్కడ ఆటలాడేందుకు తగిన వేదిక లభించినట్లయింది.

మా హయాంలో పాక్, చైనాలే: మా ప్రభుత్వ హయాంలో కేవలం పాక్, చైనాలే మనకు శత్రుదేశాలు. ఇప్పుడు వాటి జాబితాలో నేపాల్, శ్రీలంక కూడా చేరాయి. చైనా అధ్యక్షుడు మనదేశాన్ని సందర్శించినపుడు మోదీ ఆయన్ను గట్టిగా ఆలింగనం చేసుకున్న రోజే మన భూభాగంలోకి చైనా సేనాలు చొచ్చుకు వచ్చాయి. భూటాన్‌తో భారత్ కుదుర్చుకున్న ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం ఆ దేశం ఆక్రమణకు గురైతే మన దేశం కాపాడాలి. ఇప్పుడు చైనా సైనికులు ఆ దేశంలో తిష్ట వేసినట్లు స్వయంగా మోదీయే చెబుతున్నారు. ఎందుకు చేతులు ముడుచుకుకూర్చున్నారు? ఒప్పందాన్ని అటక ఎక్కించినట్లేనా? ప్రతి దానికీ ప్రతిస్పందించే మోదీ గోరఖ్‌పూర్ ఆస్పత్రి దుర్ఘటనపై ఎందుకు పెదవి విప్పలేదు. ఇందిరా క్యాంటీన్లతో బెంగళూరు నగరంలో పేదలు ఆకలితో అలమటించాల్సిన దుస్థితి తప్పుతుంది" అని రాహుల్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

ఉపాధ్యాయురాలికి నిప్పంటించి పరారీ

బెంగళూరు, న్యూస్‌టుడే: బెంగళూరు మహానగర శివారు మాగడి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం తరగతిగదిలో పాఠం చెబుతున్న సునంద(45) అనే ఉపాధ్యాయురాలిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి తెగబడ్డారు. ఒక్కసారిగా తరగతి గదిలోకి చొరబడిన ఆగంతకులు ఆమెపై పెట్రోలు పోసి నిప్పంటించి పరారయ్యారు. విద్యార్థులు, ఇతర సిబ్బంది తక్షణమే స్పందించి మంటల్ని ఆర్పారు. చికిత్స కోసం వెంటనే ఆమెను సుకందకట్టెలోని ఆసుపత్రిలో చేర్పించారు. ఆమెకు 50శాతం శరీరం కాలిందని వైద్యాధికారి గంగాధర్ తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రంప్ వ్యాఖ్యలపై కొనసాగుతున్న నిరసన

- సలహా మండలి పదవికి మరొకరి రాజీనామా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడి సలహా మండలి పదవికి మరో కంపెనీ అధిపతి రాజీనామా చేశారు. వర్జీనియాలోని ఛార్లెట్స్‌విల్లేలో శ్వేత జాతీయులు చేసిన దాడికి అనుకూలంగా ట్రంప్ వ్యాఖ్యానించారన్న అసంతృప్తితో ఏఎఫ్‌ఎల్-సీఐఓ అధ్యక్షుడు రిచర్డ్ ట్రుమ్కా రాజీనామా చేశారు. 'ద్వేషాన్ని, దేశీయ ఉగ్రవాదాన్ని సమర్థించే అధ్యక్షుడు ఉన్న కౌన్సిల్‌లో మేము కూర్చోలేమం'టూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ అల్లర్లపై తొలుత స్పందించిన ట్రంప్ 'ఇందుకు చాలా మందిని నిందించాలి. ఒక్క విద్వేష వర్గాన్నే కాదు' అంటూ వ్యాఖ్యానించారు. ఇందుకు నిరసనగా ఇప్పటి వరకు అధ్యక్షుని సలహా మండలిగా ఉన్న మాన్యుఫ్యాక్చరింగ్ కౌన్సిల్ పదవులకు మెర్క్, అండర్ ఆర్మోర్, ఇంటెల్ సంస్థల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, అలయెన్స్ సంస్థ అధ్యక్షుడు రాజీనామాలు చేశారు.

ప్రజల దృష్టిని ఆకర్షించడానికే..: ట్రంప్

పారిశ్రామికవేత్తల రాజీనామాలను ట్రంప్ తేలిగ్గా తీసుకున్నారు. 'వారు విదేశాల్లో సరకులు ఉత్పత్తి చేస్తున్నారు. ఇబ్బంది ఉండకూడదనే పదవులను విడిచిపెడుతున్నారు. ప్రజల దృష్టిని ఆకర్షించడానికే ఇలా చేస్తున్నారు. పదవులు చేపట్టడానికి ఇంకా చాలా మంది సీఈవోలు ఉన్నారు. ఆర్థిక ప్రగతి సాధిస్తే జాతి విభజన అంటూ ఉండద'ని ట్వీట్ చేశారు.

అమెజాన్‌పై విరుచుకుపడ్డ ట్రంప్: చిల్లర వర్తకంలో ప్రపంచస్థాయి ప్రాముఖ్యం పొందిన అమెజాన్.కామ్‌పై ట్రంప్ ట్విట్టర్లో విమర్శలు చేశారు. స్థానికుల ఉద్యోగావకాశాలు పోయేలా వ్యవహరిస్తోందంటూ విరుచుకుపడ్డారు. ఈ ప్రకటన వెలువడగానే ఆ కంపెనీ షేరు ధర 978 డాలర్ల నుంచి 0.5 శాతం మేర పడిపోయింది. అయితే దీన్ని అమెజాన్ ఖండించింది. ఈ నెలలోనే అమెరికా వ్యాప్తంగా 50 వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు తెలిపింది.

భారతీయ అమెరికన్ల సేవలు అమూల్యం

ట్రంప్ స్వాతంత్ర్య దినోత్సవ సందేశం

వాషింగ్టన్/న్యూయార్క్: భారత్-అమెరికాలు సుదీర్ఘకాలంగా ప్రజాస్వామ్య విలువలు, పరస్పర భద్రతల కోసం గౌరవప్రదమైన బంధాన్ని కొనసాగిస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా షికాగోలో నిర్వహించిన ఇండియా డే పరేడ్ సందర్భంగా ట్రంప్ సందేశం పంపించారు. "భారత్ అద్భుత ఉత్సవాలను జరుపుకొంటున్న వేళ.. మన దేశాన్ని ఈ స్థాయికి తీసుకురావడానికి పనిచేసిన హిందువులు, భారతీయ అమెరికన్లను సగర్వంగా గుర్తిద్దాం. వారి అమూల్య సేవలకు కృతజ్ఞతలు. విలువైన మన భాగస్వామ్యం మరింత కాంతులీనుతుంది. భవిష్యత్తు తరాల కోసం ఈ గొప్ప సహకారాన్ని కొనసాగిద్దాం." అని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు దాదాపు 30 వేల మంది హాజరు కాగా ఇల్లినోయిస్ గవర్నర్ బ్రూస్ రౌనర్ ప్రసంగించారు. భారత్-అమెరికా భాగస్వామ్యం పరిఢవిల్లాలని టెక్సాస్, ఇండియానా, ఒల్సాన్‌కు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధులు ఆకాంక్షించారు.



స్విట్జర్లాండ్‌లోని సెయింట్ గాలిన్‌లో 3600 టన్నుల బరువు గల ఈ భవంతిని బుధవారం పక్కకు తరలించారు. గంటకు 4 మీటర్ల చొప్పున 20 మీటర్ల వరకు పక్కకు తీసుకెళ్లారు. ఒక సామాజిక భవనం కోసం దీనిని అక్కడి నుంచి జరిపించారు

నల్లధనం అంకెలపై గందరగోళమేదీ లేదు: జైట్లీ

దిల్లీ: పెద్దనోట్ల రద్దు అనంతరం వెలికితీసిన నల్లధనం గణాంకాలపై గందరగోళం ఏమీలేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. వాటికి ఆధారాలేమిటో వివరించారు. ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో రూ. 1.75 లక్షల కోట్ల నల్లధనం వెలికితీసినట్లు వెల్లడించిన నేపథ్యంలో ఆ వివరాలపై జైట్లీ స్పష్టతనిచ్చారు. లెక్కల్లో చూపని నగదు, వనరులకు మించిన ఆదాయం తదితర వ్యవహారాలపై చేపట్టిన దర్యాప్తులు, ఇచ్చిన నోటీసులు.. సీబీడీటీతో పాటు రెవెన్యూశాఖకు అందిన సమాధానాల ఆధారంగానే ఈ గణాంకాలుంటాయని వివరణ ఇచ్చారు. ప్రధాని చెప్పిన అంకెలకు ఆర్‌బీఐ నివేదిక ఆధారం కాదని స్పష్టం చేశారు. ఎంత నగదు జమయింది? లెక్కల్లో చూపని మొత్తం ఎంత? ఆదాయ వనరులకు పొంతన లేకుండా ఎంతమంది జమ చేశారు? ఎంతమందికి నోటీసులు వెళ్లాయి? వాటిద్వారా ఎంత మొత్తంలో రాబట్టారు? వంటి వివరాల ఆధారంగానే నల్లధనం అంచనాలుంటాయని తెలిపారు

మధ్యప్రదేశ్ పురపాలక ఎన్నికల్లో భాజపా హవా

భోపాల్: మధ్యప్రదేశ్ పురపాలక సంస్థల ఎన్నికల్లో అధికార భాజపా సత్తా చాటింది. ఆ పార్టీ 25 పురపాలక సంఘాల్లో విజయం సాధించగా.. ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్‌కు 15 దక్కాయి. 3 చోట్ల స్వతంత్రులు విజయం సాధించారు. ప్రజా విశ్వాసం భాజపావైపే ఉందని ఈ ఎన్నికలు రుజువు చేశాయని ఆ పార్టీ రాష్ట్ర ప్రతినిధి రజనీష్ అగర్వాల్ పేర్కొన్నారు. గతంలో కంటే 6 పురపాలక సంఘాలు అదనంగా గెలుచుకున్నామంటూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధి కేకే మిశ్రా హర్షం వ్యక్తం చేశారు.

'ఆ సీరియల్‌ను రాత్రి పదింటికి ప్రసారం చేయండి'

సోనీ ఛానెల్‌కు బీసీసీసీ ఆదేశం

దిల్లీ: సోనీ టీవీఛానెల్‌లో ప్రసారమయ్యే 'పెహ్రెదార్ పియా కి' సీరియల్‌ను రాత్రి పది గంటల సమయంలో ప్రసారం చేయాలని ప్రసారమాధ్యమాల సంబంధిత విషయాల ఫిర్యాదుల మండలి (బీసీసీసీ) ఆదేశించింది. అంతేకాకుండా సీరియల్‌తో పాటే బాల్యవివాహాలను ప్రోత్సహించడం లేదు, కేవలం కల్పితమంటూ కింద స్క్రోలింగ్ ఇవ్వాలని సూచించింది. గత నెలలో మొదలైన ఈ సీరియల్‌లో రతన్ (అఫాన్‌ఖాన్) అనే తొమ్మిదేళ్ల బాలుడు, 18 ఏళ్ల దివ్య (తేజస్వీ ప్రకాశ్)ని పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. రాత్రి 9 గంటల సమయంలో ప్రసారం అయ్యే ఈ ధారావాహిక బాల్యవివాహాలను ప్రోత్సహించేలా ఉందంటూ, దీనిపై చర్యలు తీసుకోవాలంటూ మండలికి ఫిర్యాదులు వచ్చాయని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లోనూ నిరసనలు వెల్లువెత్తాయి. ధారావాహికను నిషేధించాలని సమాచార ప్రసారాలశాఖ మంత్రి స్మృతి ఇరానీని అభ్యర్థిస్తూ ఛేంజ్.ఆర్గ్ వెబ్‌సైట్‌లో ఉంచిన పిటిషన్‌పై లక్షమందికిపైగా ప్రజలు సంతకాలు చేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించాలంటూ మంత్రిత్వశాఖ బీసీసీసీకి పంపించింది. దీనిపై నూతన అధ్యక్షుడు విక్రమ్‌జిత్ సేన్ అధ్యక్షతన సమావేశమైన మండలి ఈ నిర్ణయం తీసుకుంది.

అత్యధికులు లైక్ చేసిన ట్వీట్‌గా ఒబామా సందేశం

వాషింగ్టన్: గత కొన్ని రోజులుగా అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న జాత్యహంకార నిరసనల నేపథ్యంలో ఆ దేశ మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా చేసిన ట్వీట్ రికార్డులు సృష్టిస్తోంది. రంగు లేదా మతం ఆధారంగా వ్యక్తులపై కలిగే వివక్ష పుట్టుకతోనే కలగదంటూ గత శనివారం ఆయన చేసిన ట్వీట్‌ను 28లక్షల మంది లైక్ కొట్టారు. దీన్ని అత్యధికులు లైక్ చేసిన ట్వీట్‌గా ట్విట్టర్ ప్రకటించింది. అంతకన్నా ముందు ఇంగ్లాండ్‌లోని మాంచెస్టర్‌లో ఉగ్రదాడి సందర్భంగా పాప్‌గాయని అరియానా గ్రాండీ చేసిన ట్వీట్ తొలి స్థానంలో ఉండేది. దాదాపు 12 లక్షల మంది ఒబామా ట్వీట్‌ను రీట్వీట్ చేశారు. ఎక్కువ మంది రీట్వీట్ చేసిన ఐదో ట్వీట్‌గా దీనిని ఆ సంస్థ పేర్కొంది.

ప్రసార భారతి నిర్ణయంపై త్రిపురలో వివాదం

అగర్తల: స్వాతంత్ర్య దినోత్సవానికి ముందురోజు త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ చేసిన ప్రసంగాన్ని ప్రసారం చేయడానికి ప్రసార భారతి నిరాకరించడంపై వివాదం నెలకొంది. దీనిని సీపీఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఆయన ప్రసంగం స్వాతంత్ర్య దిన ప్రమాణాలకు విరుద్ధంగా- రాజకీయంగా ఉందనీ, దానిని సవరించాల్సిందిగా కోరినా ఆయన ఇష్టపడలేదనీ అధికారులు చెబుతున్నారు. ముందుగా రికార్డు చేసిన ఆరు నిమిషాల ప్రసంగంలో మోదీ సర్కారుపై విమర్శలు ఉన్నాయి.

రోదసీకి చేరిన తొలి సూపర్ కంప్యూటర్

మియామి: స్పేస్ ఎక్స్ సంస్థకు చెందిన మానవరహిత రవాణా వ్యోమనౌక డ్రాగన్ మొట్టమొదటి సూపర్ కంప్యూటర్‌ను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేర్చింది. 2900 కిలోల బరువైన ఈ నౌక బుధవారం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం చేరుకున్నట్లు నాసా శాస్త్రవేత్త నిర్ధారించారు. సోమవారం ఫ్లోరిడాలోని కేప్‌కెనవారాల్ నుంచి ఈ వ్యోమనౌక ప్రయోగం విజయవంతంగా జరిగింది. ఇప్పటికే రోదసీలో ఉన్న వ్యోమగాములకు ఈ నౌక ఆహారం, ప్రత్యేక దుస్తులను కూడా మోసుకెళ్లింది. ఇది స్పేస్ ఎక్స్‌కు సంబంధించిన 12వ అంతరిక్ష ప్రయోగం. అంతరిక్ష కేంద్రానికి చేరిన సూపర్ కంప్యూటర్‌ను హ్యూలెట్ ప్యాకార్డ్ సంస్థ రూపొందించింది. దీన్నే స్పేస్ బర్న్ కంప్యూటర్ అని కూడా అంటారు. ఈ సూపర్ కంప్యూటర్ అంతరిక్షంలో ప్రతికూల వాతావరణంలో కూడా పనిచేయగలదా లేదా అన్నది పరిశోధకులు ఇప్పుడు పరీక్షించనున్నారు.

నైజీరియాలో ఆత్మాహుతి దాడి

28 మంది మృతి, 82 మందికి గాయాలు

కానో: ఈశాన్య నైజీరియాలోని మందరారి నగరంలో మంగళవారం ముగ్గురు మహిళా మానవబాంబులు ఓ శరణార్థ శిబిరం ముందు తమను తాము పేల్చివేసుకున్నారు. ఈ ఘటనలో 28 మంది మృతిచెందగా మరో 82 మంది గాయపడ్డారు. మహిళలవద్ద పేలుడు పదార్థాలను చూసిన ప్రజలు దుకాణాలను మూసివేసేందుకు యత్నిస్తుండగా బాంబులతో ఉన్న మహిళలు ఒక్కసారిగా తమను తాము పేల్చుకున్నారు. ఈశాన్య నైజీరియా బోకోహరమ్ జిహాదిస్టు గ్రూపునకు అనుకూల ప్రదేశం. ఈ ఉగ్రవాద గ్రూపు ఇక్కడ తరచూ కాల్పులు, బాంబుల దాడి, అపహరణ లాంటి ఘటనలకు పాల్పడుతుంటుంది. 2009లో తిరుగుబాటు పేరుతో దాదాపు 20వేల మందిని పొట్టన పెట్టుకుంది.



బుధవారం చెన్నైలో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన అనంతరం గోపాలపురంలోని నివాసానికి చేరుకున్న డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి

నేలపై వాయువేగంతో...

★ రాబోతోంది 'హైపర్‌లూప్' ప్రయాణం! ★ సఫలమవుతున్న ప్రయోగాలు ★ శాస్త్రవేత్తల్లో పెరుగుతున్న విశ్వాసం

విమానం ఎక్కితే ఆకాశంలో గరిష్ఠంగా 1000 కిలోమీటర్ల వేగంతో వెళ్లవచ్చు. భూమ్మీద ఏ బుల్లెట్ ట్రైన్‌లో ప్రయాణించినా గరిష్ఠంగా మహా అయితే గంటకు 600 కిలోమీటర్ల వేగంతో మాత్రమే వెళ్లగలం.


భూమి పెద్ద అయస్కాంతమని తెలుసు కదా.. ఆ అయస్కాంత శక్తిని ఉపయోగించుకుని భూగర్భంలోంచి వాయువేగంతో ప్రయాణించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురాగలిగితే ఎలా ఉంటుంది? ఇక్కడే శాస్త్రవేత్తలు తమ మేధస్సుకు పదును పెట్టారు. ఆ క్రమంలో తళుక్కున మెరిసిన ఆలోచనే 'హైపర్‌లూప్'. ట్యూబ్ వంటి మార్గంలో అయస్కాంతశక్తి ఆధారంగా పాతాళమార్గంలో ప్రయాణించే పద్ధతిని కనిపెట్టడంలో నిమగ్నమయ్యారు శాస్త్రవేత్తలు. భవిష్యత్తు తరాలు ప్రయాణించే తీరును విశేషంగా ప్రభావితం చేసే ఈ పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. వచ్చే దశాబ్దకాలంలోనే ఈ కొత్త తరహా ప్రయాణ సాధనం ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశం లేకపోలేదు. సంపన్న పారిశ్రామికవేత్త, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ న్యూయార్క్ నుంచి వాషింగ్టన్ డీసీ మధ్య 226 మైళ్ల దూరాన్ని 29 నిమిషాల వ్యవధిలో వెళ్లేవిధంగా భూమి లోపల హైపర్‌లూప్ మార్గాన్ని నిర్మించటానికి కసరత్తు ప్రారంభించడంతో ఒక్కసారిగా దీనిపై అంచనాలు పెరిగిపోయాయి.

అది ఎలాన్ మస్క్ ఆలోచనే....

తక్కువ వాయు పీడనం ఉండే ట్యూబ్‌లో విద్యుత్తు అయస్కాంత శక్తి ద్వారా రైలు పెట్టె వంటి ఒక పాడ్‌లో ప్రయాణికులు లేదా సరకు ఎంతో వేగంగా ప్రయాణం చేయవచ్చనే ఆలోచన టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌కు వచ్చింది. 2013లో క్యూబా వెళ్తూ తనతో ప్రయాణిస్తున్న ప్రముఖ పారిశ్రామికవేత్త షెర్విన్ పిష్వెర్‌తో ఈ ఆలోచనను పంచుకున్నారు. ఆ తర్వాత ఎలాన్ మస్క్ 'హైపర్‌లూప్ ఆల్ఫా' అనే పేరుతో ఒక శ్వేతపత్రాన్ని కూడా తీసుకువచ్చారు. ఈ ఆలోచనను ముందుగా కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు నడుంకట్టిన ఘనత మాత్రం షెర్విన్ పిష్వెర్ కు దక్కుతుంది.

హైపర్‌లూప్ వన్ ఏర్పాటు

అనుకున్నదే తడవుగా అమెరికాలోని లాస్‌ఏంజెలెస్ కేంద్రంగా హైపర్‌లూప్ వన్ అనే సంస్థను షెర్విన్ ఏర్పాటు చేశారు. తర్వాత అది హైపర్‌లూప్ టెక్నాలజీస్ అయింది. దీన్లో ఎలాన్ మస్క్ భాగస్వామ్యం లేదు. ఈ సంస్థ 160 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.1100 కోట్లు) నిధులు సమీకరించి ప్రయోగాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా లాస్‌వేగాస్‌లో 500 మీటర్ల పొడవైన హైపర్‌లూప్ వన్ ట్యూబ్‌ను నిర్మించింది. 2016లో తొలిసారిగా నిర్వహించిన ప్రయోగాత్మక ప్రయాణంలో హైపర్‌లూప్ పాడ్ 136 మైళ్ల వేగాన్ని నమోదు చేసింది. రెండోదశ ప్రయోగాలను గత నెల 29న నిర్వహించారు. ఈ సారి గరిష్ఠంగా 192 మైళ్ల వేగాన్ని నమోదు చేయగలిగారు. కానీ 750 మైళ్ల వేగాన్ని అందుకోవాలనే లక్ష్యం ఇంకా సుదూరంగానే ఉంది. దీని కోసం ప్రయోగాలు, అభివృద్ధి ప్రక్రియ కొనసాగుతున్నాయి.



హైపర్‌లూప్ మార్గం

భూ ఉపరితలం మీదైనా...

హైపర్‌లూప్ మార్గాన్ని భూమి లోపల అండర్‌గ్రౌండ్‌లోనే నిర్మించాల్సిన అవసరం లేదు. భూ ఉపరితలం మీద అయినా ఏర్పాటు చేయవచ్చు. మెట్రో రైలు మార్గాలు నిర్మించినట్లుగా తక్కువ ఎత్తులో పిల్లర్లు వేసి వాటిపై ట్యూబ్ మాదిరిగా హైపర్‌లూప్ మార్గాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కాకపోతే జనసమ్మర్దం కల నగరాల్లో ఇది సాధ్యం కాదు కాబట్టి భూమి లోపలి పొరల్లో అండర్‌గ్రౌండ్‌లో హైపర్‌లూప్ మార్గాన్ని నిర్మించాల్సి వస్తుంది. ఏదేమైనా ఈ నూతన రవాణా పద్ధతికి అనువైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఉపకరణాలు, యంత్రసామగ్రిని రూపొందించే పనిలో ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రవేత్తలు తలమునకలుగా ఉన్నారు. ఈ కసరత్తు ఇటీవల కాలంలో వేగం పుంజుకుంటోంది. అంచనాల కంటే ముందుగానే ఈ సరికొత్త రవాణా విధానం ప్రజలకు అందుబాటులోకి వచ్చినా ఆశ్చర్యపడవలసిన పనిలేదు.

226 మైళ్ల దూరం.. 29 నిమిషాలే ప్రయాణం!

ఇంతకాలం ఆలోచనకే పరిమితమైన ఎలాన్ మస్క్ ఇప్పుడు స్వయానా తాను కూడా రంగంలోకి దిగి హైపర్‌లూప్ మార్గాన్ని నిర్మించటానికి పూనుకున్నారు. అమెరికాలోని రెండు ప్రధాన నగరాలైన న్యూయార్క్ నుంచి వాషింగ్టన్ డీసీ మధ్య దూరం 226 మైళ్లు. కార్లో వెళ్తే 5 గంటల సమయం పడుతుంది. అత్యంత వేగంగా వెళ్లే రైలు ఎక్కినా 3 గంటల ప్రయాణం తప్పదు. కానీ 29 నిమిషాల వ్యవధిలో వెళ్లగలిగితే అదొక అద్భుతం అవుతుంది. ఆ అద్భుతాన్ని సాధించాలనే లక్ష్యంతో రెండు నగరాలను కలుపుతూ సొరంగం తవ్వి హైపర్‌లూప్ మార్గాన్ని నిర్మించాలని అనుకుంటున్నారు టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్. ఇంత పొడవైన సొరంగ నిర్మాణంలో ఎదురయ్యే సవాళ్ల మాటేమిటని... అందరూ చర్చించుకుంటున్నారు.

- కొన్ని వందల మైళ్ల దూరం భూమి లోపల సొరంగం తవ్వి దాన్లో వేగంగా ప్రయాణించేందుకు అనువైన మార్గాన్ని నిర్మిస్తానని ఎవరైనా అంటే, దాన్నొక కల్పిత గాథ.. అనుకొని కొట్టివేయటం ఖాయం. కానీ ఆ పని చేస్తానంటోంది ఎలాన్ మస్క్ కాబట్టి ఆసక్తి పెరిగిపోయింది.
- సొరంగ మార్గాన్ని ఆవిష్కరించే నిమిత్తం నిపుణులైన సలహాదార్లను ఎంచుకొని బోరింగ్ కంపెనీ అనే పేరుతో ఒక కొత్త సంస్థను ఏర్పాటు చేశారు. అంతేగాక సూపర్ ఎస్కవేటర్స్ అనే సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకున్నాడు.
- సొరంగ మార్గాన్ని తవ్వేందుకు వీలుకల్పించే 14 అడుగుల వ్యాసం కల అతిపెద్ద బోరింగ్ యంత్రాన్ని సమకూర్చుకున్నారు. కెనడా సంస్థ అయిన లోవట్ తయారు చేసిన ఈ యంత్రాన్ని శాన్‌ఫ్రాన్సిస్కో, ఇండియానాపొలిస్‌లో భారీ సొరంగాల తవ్వకంలో వినియోగించారు.
- ఎలాన్ మస్క్‌కు చెందిన 'స్పేస్ ఎక్స్' కార్యాలయానికి చేరిన ఈ యంత్రాన్ని సొరంగ తవ్వకం నిమిత్తం సిద్ధం చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా అక్కడే కొంత సొరంగ మార్గాన్ని తవ్వబోతున్నారు.
- సొరంగం తవ్వటం ఒక దశ మాత్రమే. ఆ తర్వాత దాన్లో 'హైపర్‌లూప్ సిస్టమ్' ఏర్పాటు చేయాల్సి వస్తుంది. దీన్లో అత్యంత వేగంగా ప్రయాణించే రైలు బోగీ వంటి పాడ్‌లు (ప్యాసింజర్ క్యాప్సూల్స్) ఉంటాయి. వీటి ద్వారా న్యూయార్క్, వాషింగ్టన్ డీసీ మధ్య దూరాన్ని 29 నిమిషాల వ్యవధికి తగ్గించాలనేది ఎలాన్ మస్క్ ఆలోచన.

ఎంతో క్లిష్టమైన పని

అమెరికా, కెనడా దేశాల్లో ప్రస్తుతం 60 పైగా టన్నెలింగ్ ప్రాజెక్టులు డిజైన్ దశలో ఉన్నాయి. సొరంగాల తవ్వకం పెద్ద పని. పని మొదలు పెట్టిన తర్వాత ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు ఎదురవుతాయి. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని నమ్ముకుంటే న్యూయార్క్ నుంచి వాషింగ్టన్ డీసీ మధ్య సొరంగం తవ్వటానికి నూరేళ్లు పడుతుంది. అందువల్ల కొత్త పద్ధతులను, అధునాతన యంత్రాలను ఆవిష్కరించాల్సి వస్తుంది. అసలు ప్రత్యేకత అంతా సొరంగాన్ని తవ్వే యంత్రం (టన్నెల్ బోరింగ్ మెషీన్) మీదే ఆధారపడి ఉంటుంది. పెద్ద యంత్రాన్ని ఆశ్రయిస్తే అది ఒక మైలులో పదోవంతు దూరాన్ని తవ్వటానికి వారంరోజులు పడుతుంది. వాషింగ్టన్ డీసీలో నీటి సరఫరా వ్యవస్థ కోసం మూడు టన్నెల్ బోరింగ్ యంత్రాలు ఉపయోగించారు. వీటితో నాలుగున్నర మైళ్ల సొరంగ మార్గాన్ని తవ్వటానికి రెండేళ్లు పట్టింది. సొరంగ మార్గాల నిర్మాణంతో పోల్చితే భూమి మీద రహదారి నిర్మాణం లేదా పైప్‌లైన్ ఏర్పాటు, ఎలివేటెడ్ కారిడార్ వ్యవస్థ ఆవిష్కరణ సులువైన పనులు. ఖర్చు కూడా తక్కువ. సొరంగాల తవ్వకంలో సమీపంలోని కొన్ని భవనాల పునాదులు కదిలిపోవచ్చు. మధ్య నీటి మడుగులు ఎదురుకావచ్చు. ఇలా ఎన్నో సమస్యలు ఎదుర్కోవాలి.




టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్

- ఈనాడు ప్రత్యేక విభాగం

వేర్వేరు దేశాల్లో...

- అభివృద్ధి ప్రక్రియ ఇంకా పూర్తికానసప్పటికీ ఇటువంటి నూతన ప్రయాణ సాధనం ఒకటి సాధ్యమే అనే విశ్వాసం శాస్త్రవేత్తల్లో కనిపిస్తోంది. అందుకే వివిధ దేశాల్లో ఔత్సాహిక పారిశ్రామివేత్తలు 'హైపర్‌లూప్' మార్గాన్ని నిర్మించే లక్ష్యంతో ప్రభుత్వాలతో సంప్రదింపులు సాగిస్తున్నారు.
- అమెరికాతో పాటు యూకే, ఫిన్లాండ్, స్వీడన్, నెదర్లాండ్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లలో ఇటువంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి.
- అబూ దాబీ నుంచి దుబాయ్ మధ్య 100 మైళ్ల దూరాన్ని 12 నిమిషాల వ్యవధిలో చేరుకునేలా హైపర్‌లూప్ మార్గాన్ని నిర్మించే దిశగా హైపర్‌లూప్ వన్ ఆలోచన చేస్తోంది.
- మనదేశంలో కొందరు ఔత్సాహికులు ఒక బృందంగా ఏర్పడి ఎలాన్ మస్క్ ఆలోచనకు కార్యరూపం ఇచ్చే పనిలో నిమగ్నమయ్యారు. హైపర్‌లూప్ ఇండియా అనే పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వంతో సంప్రదింపులు సాగిస్తున్నారు.



- హైపర్‌లూప్ పరిజ్ఞానం 2021 నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని ఇప్పటి వరకూ శాస్త్రవేత్తల్లో ఉన్న విశ్వాసం. అది ప్రజలను ఆకర్షించగలిగితే ప్రపంచ వ్యాప్తంగా రవాణా రంగంలో సరికొత్త విప్లవం అవుతుంది.

హిజ్‌బుల్ ముజాహిదీన్ 'విదేశీ ఉగ్రవాద సంస్థ'

ముద్ర వేసిన అమెరికా ● పాక్‌కు శరాఘాతం

వాషింగ్టన్: కశ్మీర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హిజ్‌బుల్ ముజాహిదీన్‌ను 'విదేశీ ఉగ్రవాద సంస్థ'గా అమెరికా పేర్కొంది. ఆ సంస్థ అధిపతి సయ్యద్ సలాహుద్దీన్ (పాకిస్థాన్)ను రెండు నెలల క్రితం అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవలికాలంలో కశ్మీర్‌లో పెచ్చుమీరుతున్న ఉగ్రవాదకార్యకలాపాల నేపథ్యంలో బుధవారం విధించిన ముద్ర అనేక రూపాల్లో ఆంక్షలకు దారి తీయనుంది. 1989లో ఏర్పాటైన హిజ్‌బుల్-కశ్మీర్‌లో పెద్దఉగ్రవాద సంస్థల్లో ఒకటి. జమ్ముకశ్మీర్‌లో అనేక దాడులకు తమదే బాధ్యత అని ఇదివరకు ఆ సంస్థ ప్రకటించుకొంది.

ఆంక్షలతో ఉపయోగాలేమిటంటే...: ఉగ్రవాద దాడుల్ని నిర్వహించడానికి అవసరమైన ఆర్థిక వనరుల్ని సమీకరించుకోకుండా అడ్డుకునేందుకు ఆంక్షలు ఉపయోగపడనున్నాయని అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది.

- హిజ్‌బుల్ సంస్థ ఆస్తుల్ని, ఇతరత్రా ఆర్థిక ప్రయోజనాల్ని అమెరికా న్యాయవ్యవస్థ పరిధికి లోబడి నిషేధిస్తారు.
- ఆ సంస్థతో అమెరికా పౌరులెవ్వరూ ఎలాంటి లావాదేవీ చేయడానికి వీలుండదు.
- ఆంక్షల కారణంగా హిజ్‌బుల్‌పై చట్టపరమైన సంస్థలు చర్యలు చేపట్టడానికి వీలుంటుంది.
- హిజ్‌బుల్ ముజాహిదీన్‌ను "కశ్మీరీ ప్రజల వాణి"గా పేర్కొంటున్న పాకిస్థాన్‌కు అమెరికా నిర్ణయం శరాఘాతమే.

పాక్‌లో మత స్వేచ్ఛపై దాడి

వాషింగ్టన్: పాకిస్థాన్‌లో మతస్వేచ్ఛ.. దాడికి గురవుతోందని అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ పేర్కొన్నారు. కొత్త ప్రధాన మంత్రి హయాంలోనైనా భిన్న మతాల మధ్య సామరస్యం వెల్లివిరుస్తుందనీ, మతపరంగా అల్పసంఖ్యాకులైనవారి హక్కుల్ని ప్రభుత్వం కాపాడుతుందనీ ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మత స్వేచ్ఛపై 2016 వార్షిక నివేదికను మంగళవారం ఆయన విడుదల చేశారు. పాకిస్థాన్ 'అహ్మదీయ ముస్లిం'లను చిన్నచూపు చూస్తోందనీ, వారిని ముస్లింలుగా గుర్తించడానికి నిరాకరిస్తోందనీ పేర్కొన్నారు. పాక్‌లో గత ఏడాది సాయుధమూకలు హింసను ప్రజ్వరిల్లజేశాయనిచెప్పారు. ఇటుకలతయారీ, వ్యవసాయ పనుల్లో క్రైస్తవులు, హిందువులు కట్టుబానిసలుగామారుతున్నా వారిని పరిరక్షించడంలో ప్రభుత్వం విఫలమయిందని నివేదిక పేర్కొంది. హిందువులు, సిక్కుల వివాహాలను నమోదు చేయడంలో చట్టమైన అనిశ్చితి కారణంగా వారికి వారసత్వపరమైన అనేక సమస్యలు ఎదురవుతున్నాయనీ, ఓటు హక్కు/ పాస్‌పోర్ట్ వంటివి లభించడం లేదని వివరించింది.

జమ్ము ఎదురుకాల్పుల్లో ఉగ్రవాద కమాండర్ మృతి

శ్రీనగర్: లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన స్వయం ప్రకటిత కమాండర్ అయూబ్ లెల్హారి బుధవారం భద్రత దళాల ఎదురు కాల్పుల్లో హతమయ్యాడు. పుల్వామా జిల్లాలోని కాకపోరాలో ఉగ్రవాదుల కదలికలు ఉన్నట్లు తెలియడంతో గాలింపు చర్యలు చేపట్టారు. దానిలో భాగంగా కాల్పులు చోటు చేసుకున్నాయి.

భారత సంతతి బాల మేధావి!

లండన్: భారత సంతతి బాలుడు ఓ బ్రిటీష్ టెలివిజన్ ఛానెల్ నిర్వహించిన పోటీలో అన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పి బాలమేధావి అనిపించుకున్నాడు. ఇప్పటివరకు అత్యంత ప్రజ్ఞాపాటవాలు కలిగిన శాస్త్రవేత్తలు ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్‌ల కంటే తెలివైన వాడా! అనేలా అందర్నీ అబ్బురపరచాడు. బ్రిటీష్ టెలివిజన్ ఛానెల్-4 ఎనిమిది నుంచి 12 సంవత్సరాల వయసు గల 20మంది పిల్లలకు 'బాల మేధావి' పోటీ నిర్వహించింది. ఈ పోటీలో పాల్గొన్న భారత మూలాలు ఉన్న రాహుల్ అనే బాలుడు సమయ నిర్దేశిత మొదటి రౌండ్‌లో 14 ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పి ఔరా అనిపించాడు. అయితే చివరి ప్రశ్నకు మాత్రం సమయం సరిపోలేదు. పదాలు, ఉచ్ఛారణ తదితర విభాగాల్లో అన్నింటికీ చక్కగా జవాబు చెప్పాడు. 162 ప్రజ్ఞాలబ్ధిని నమోదు చేసిన ఈ బాలుడు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్తల సొసైటీ మెన్సా క్లబ్‌లో సభ్యత్వం పొందవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఈ బాలుడికి ఏ శాస్త్రవేత్తా ఈ ప్రజ్ఞాపరీక్ష నిర్వహించి ఫలితాలు నమోదు చేయలేదు. ఉత్తర కొరియా-అమెరికా మధ్య నెలకొన్న ప్రతిష్ఠంభన తొలగించి రాహుల్ శాంతి నెలకొల్పగలడని ట్విట్టర్ వేదికగా ఓ వ్యక్తి హాస్యం పండించాడు. బాలుడి తండ్రి ఐటీ మేనేజర్, తల్లి ఫార్మాసిస్టు.

భారత మూలాలున్న వ్యక్తిపై బ్యాట్‌తో దాడి

మెల్‌బోర్న్: న్యూజిలాండ్‌లోని ఆక్‌లాండ్ నగరంలో భారత మూలాలున్న వ్యక్తి(25) ఒకరిని గుర్తుతెలియని వ్యక్తులు బేస్‌బాల్ బ్యాట్‌తో తీవ్రంగా చితకబాదారు. టకానని రోడ్డులోని ఓ నడకదారిపై తీవ్ర గాయాలతో పడి ఉన్న ఆ వ్యక్తిని పోలీసులు ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉందని సీనియర్ పోలీసు అధికారి కరేన్ బ్రైట్ తెలిపారు. బాధిత వ్యక్తి బూడిద రంగు చొక్కా, నీలి రంగు ప్యాంటుతో ఉన్నాడని అతణ్ని గుర్తుపట్టేందుకు స్థానికులు సహకరించాలని వారు కోరారు.

పుదుచ్చేరి- హైదరాబాద్ విమాన సర్వీసుల పునరుద్ధరణ

పుదుచ్చేరి: మూడేళ్ల తర్వాత పుదుచ్చేరి నుంచి హైదరాబాద్‌కు విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. తొలి సర్వీసును సీఎం వి.నారాయణస్వామి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఉడాన్ పథకంలో భాగంగా విమాన సర్వీసులు నడిపేందుకు స్పైస్‌జెట్ ముందుకు వచ్చిందని తెలిపారు. పుదుచ్చేరి నుంచి హైదరాబాద్, విజయవాడ నగరాలకు స్పైస్ జెట్ నిత్యం విమానాలను నడపనుంది.

బీహార్ ప్యాకేజీపై నీతీశ్ ఆశలు

దిల్లీ: బిహార్‌లో వివిధ అభివృద్ధి పథకాల అమలుకు ఈనెలాఖరులో ప్రధాని మోదీతో జరగనున్న సమావేశంలో ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ రూ.2.75 లక్షల కోట్ల కేంద్ర సాయాన్ని కోరనున్నారని జేడీ(యు) నేత కే.సీ.త్యాగి బుధవారం ఇక్కడ తెలిపారు. ఈనెల 11న ఇరువురి మధ్య జరిగిన సమావేశంలో నీతీశ్ మోదీకి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల గురించి వివరించారని చెప్పారు. భాజపాతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ప్రజల అంచనాలు పెరిగాయని, అభివృద్ధి పనులు ఊపందుకుంటాయని వారు భావిస్తున్నట్లు నీతీశ్ ప్రధానికి తెలియజేశారన్నారు.

బీఆర్‌డీ ఆసుపత్రిలో మరో ఐదుగురు చిన్నారుల మృతి

గోరఖ్‌పూర్(యూపీ): ఇటీవల ఆక్సిజన్ కొరతతో పెద్ద సంఖ్యలో చిన్నారులు మృతి చెందిన ఇక్కడి బీఆర్‌డీ వైద్యకళాశాల ఆసుపత్రిలో మెదడువాపు వ్యాధితో తాజాగా అయిదుగురు పిల్లలు మరణించారు. మంగళవారం నుంచీ ఈ మరణాలు సంభవించినట్లు అధికారులు బుధవారం నాడిక్కడ వెల్లడించారు. మంగళ, బుధవారాల్లో మెదడువాపుతో బాధపడుతూ తాజాగా 14 మంది ఆసుపత్రిలో చేరారు.

ఐఐడీఎల్‌లో నాయకత్వ పటిమపై పీజీ కోర్సు!

ముంబయి: నాయకత్వ పటిమ, రాజకీయాలు, పరిపాలనా అంశాల్లో 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమాక్రాటిక్ లీడర్‌షిప్ (ఐఐడీఎల్)' ప్రవేశపెట్టిన ప్రత్యేక పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు మొదలయ్యాయి. రాజకీయాలు, ప్రజాసంబంధ వ్యవహారాలను కెరీర్‌గా మలచుకోవాలనుకునే వారికి అవసరమైన నైపుణ్యాలను అందచేయడమే ఈ కోర్సుల లక్ష్యమని ఐఐడీఎల్ తెలిపింది. 9 నెలల వ్యవధి ఉండే ఈ పీజీ కోర్సులో ప్రవేశానికి సుమారు 450 దరఖాస్తులు రాగా... 32 మందిని ఎంపిక చేశారు. ఐఐడీఎల్‌ను భాజపా ఉపాధ్యక్షుడు, రాజ్యసభ ఉపాధ్యక్షుడు వినయ్ సహస్రబుద్ధే స్థాపించారు.

వారిని మింగిందీ 'బ్లూవేల్' భూతమే

- కేరళలో గతంలోనూ ఈ తరహా ఆత్మహత్యలు
- ఊహించని తల్లిదండ్రులు, పోలీసులు
- తాజా ఉదంతాలతో వెలుగులోకి...

కన్నూర్(కేరళ): అంతర్జాల క్రీడ బ్లూవేల్ కారణంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డ విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ ఆటపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించినా, గతంలో ఊహించిన దాని కన్నా ఎక్కువ మందే మృత్యువాతపడినట్లు తాజా ఉదంతాలు వెల్లడిస్తున్నాయి. కేరళ రాష్ట్రంలో కొన్ని నెలల క్రితం ఏ కారణం లేకుండా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు తాజాగా వెల్లడిస్తున్న విషయాలు ఈ వాదనను నిరూపిస్తున్నాయి. తమ కుమారుడు సావంత్(22) గత జులైలో ఆత్మహత్య చేసుకోవడానికి కారణం బ్లూవేల్ ఆటేనని అతని తల్లి స్థానిక వార్తా ఛానల్‌తో పేర్కొన్నారు. ఆత్మహత్యకు ముందు వింతగా ప్రవర్తించాడని తెలిపారు. కొన్ని నెలల పాటు రాత్రి వేళ కంప్యూటరు, చరవాణిలో ఆటలు ఆడేవాడని చెప్పారు. తొలుత చేతి మీద బ్లేడుతో కోసుకున్న సమయంలో, ఒత్తిడి వల్లే అలా చేసి ఉంటాడని భావించినట్లు ఆమె తెలిపారు. కౌన్సెలింగ్ ఇచ్చినా ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. సావంత్ కళాశాలకు వెళుతున్నట్లు చెప్పి, ధాలాస్సెరీ బీచ్ బ్రిడ్జి అంచున కూర్చోవడాన్ని అతని బంధువొకరు కనిపెట్టారు. దీనిపై సన్నిహితులతో ఉన్న బంధం చెడిపోవడం కారణంగానే అలా ప్రవర్తిస్తున్నాడని ధాలాస్సెరీ పోలీసులు అతని బంధువులకు తెలిపారు. చివరగా సావంత్ తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గత జులైలో తమ 16 ఏళ్ల కుమారుడి ఆత్మహత్యకు బ్లూవేల్ క్రీడే కారణమని తిరువనంతపురానికి చెందిన మరో మృతుని తల్లి బుధవారం ఓ మళయాళ టీవీ ఛానల్‌కు చెప్పారు. తన కుమారుడు గతేడాది నవంబరులోనే బ్లూవేల్ క్రీడను ఆడడం ప్రారంభించాడని ఆమె తెలిపారు. ఆటలో భాగంగా ఆత్మహత్య చేసుకోవడం లేదా ఒకరిని హత్య చేయడం ఉంటుందని తొలుత చెప్పినప్పుడు ఆడకూడదని హెచ్చరించినట్లు వివరించారు. ఓసారి ఈత రానప్పటికీ నదిలో దూకాడని చెప్పారు. ఆత్మహత్యకు ముందు ఆటను చరవాణి నుంచి తొలగించాడని తెలిపారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఇద్దరి వాంగ్మూలాన్ని నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఆ రాష్ట్ర పోలీస్ ఐజీ మనోజ్ అబ్రహం దీనిపై స్పందిస్తూ.. ఎంతమంది క్రీడను డౌన్‌లోడ్ చేసుకున్నారో తెలియదని, విచారణ జరుపుతున్నామన్నారు. కేరళలో బ్లూవేల్ కారణంగా ఎంతమంది ఆత్మహత్య చేసుకున్నారన్న దానిపై ఆయన స్పష్టతనివ్వలేదు.

తొలగించకపోతే కఠిన చర్యలు: కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్

దిల్లీ: ప్రాణాంతకంగా మారిన అంతర్జాల క్రీడ బ్లూవేల్‌ను అనుసంధానించే లింక్‌లను సామాజిక మాధ్యమాలు తొలగించని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఎంతో మంది ఈ ఆట కారణంగా ఆత్మహత్యకు పాల్పడుతున్నారని, దీనిపై ఇప్పటికే అనేక అభ్యంతరాలు వచ్చాయని కేంద్ర ఐటీ, న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ ఆటను తక్షణమే తొలగించాల్సిందిగా అంతర్జాల ఆధారిత సామాజిక మాధ్యమాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. యువత ఆత్మహత్యలకు ప్రేరేపించడం ఏ మాత్రం ఆమోదయోగ్యనీయం కాదని స్పష్టం చేశారు. బ్లూవేల్ ఆటను నిర్వాహకులు వ్యాప్తి చేసేందుకు సామాజిక మాధ్యమాలను వేదికగా వాడుకుంటున్నారని అన్నారు.



లద్దాఖ్‌లోకి మా సైన్యం చొరబాటు విషయం తెలియదు: చైనా

బీజింగ్: లద్దాఖ్‌లోకి చొరబడేందుకు తమ సైన్యం యత్నించినట్లుగా తమ వద్ద సమాచారమేమీ లేదని చైనా పేర్కొంది. సరిహద్దుల వెంబడి శాంతికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపింది. ప్యాంగాంగ్ సరస్సు సమీపంలో మంగళవారం లద్దాఖ్‌లోకి చైనా సైనికులు చొరబడేందుకు రెండు సార్లు యత్నించగా భారత జవాన్లు నిలువరించారు. రెండు వర్గాల మధ్య రాళ్లదాడి జరిగి కొంతమందికి గాయాలయ్యాయి. ఈ వార్తలు తమ దృష్టికి వచ్చాయని.. అయితే తమ వద్ద అలాంటి సమాచారమేమీ లేదని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ అన్నారు. వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ)కు తమ వైపునే ఎప్పుడూ గస్తీ నిర్వహిస్తుంటామని తెలిపారు. ఎల్‌ఏసీ, ఇతర ఒడంబడికలకు కట్టుబడి ఉండాలని భారత్‌ను కూడా కోరారు. డోక్లాం అంశం గురించి ప్రస్తావిస్తూ అక్రమంగా తమ భూభాగంలోకి చొరబడిన భారత సైన్యం తిరిగి వెనక్కివెళ్లాలని.. అర్థవంతమైన చర్చలకు అప్పుడే అవకాశముంటుందని అన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలను పెంపొందించేందుకు భారత్, అమెరికా మంత్రుల స్థాయిలో చర్చలు చేపట్టాలని నిర్ణయించుకోవడం.. ఆ ప్రాంత అభివృద్ధికి దోహదం చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు చున్యింగ్ పేర్కొన్నారు. ఇటు దౌత్యమార్గాల్లో డోక్లాం వివాదాన్ని పరిష్కరించుకునే విషయంపై సంప్రదింపులు జరుగుతున్నట్లు చైనా అంగీకరించింది. మరోవైపు లెహ్‌లోని చుషుల్ ప్రాంతంలో భారత్, చైనా సైనికాధికారుల మధ్య బుధవారం సమావేశం జరిగింది. లద్దాఖ్‌లో సరిహద్దుల వద్ద శాంతి, సుస్థిరతను కొనసాగించడంపై అధికారులు చర్చించారు. ఇటు వివాదాలను పరిష్కరించుకునేందుకు భారత్, చైనా ప్రత్యక్ష చర్చలు చేపట్టాలని తాము కోరుకుంటున్నట్లు అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి తెలిపారు.

2019కి పూర్తి ఎల్‌ఈడీ వెలుగుల దేశంగా భారత్: గోయెల్

దిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న 54,500కు పైగా పెట్రోల్ బంకుల్లో ఇకపై ఎల్‌ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్లు లభించనున్నాయి. ఇందుకోసం చమురు సంస్థలు ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియంలతో ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ (ఈఈఎస్ఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి పీయూష్ గోయెల్ మాట్లాడుతూ.. 2019 నాటికి దేశంలో పూర్తిగా ఎల్‌ఈడీ దీపాలనే వినియోగించే అవకాశం ఉందని, తద్వారా ప్రపంచంలోనే ఈ ఘనత సాధించిన మొదటి దేశంగా భారత్ నిలుస్తుందని పేర్కొన్నారు. తొలుత దిల్లీలోని పెట్రోల్ బంకుల్లో, తర్వాత ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్రల్లో సరఫరా ప్రారంభిస్తారు. అనంతరం దశలవారీగా దేశవ్యాప్తంగా వీటి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. పెట్రోల్ బంకుల్లో ఐటీ శాఖకు చెందిన సాధారణ సేవా కేంద్రాలు త్వరలో ప్రారంభమవుతాయని కేంద్ర చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తెలిపారు.

రాజీనామాకు ఏడాది ముందే సీనియర్ పైలట్లు నోటీసివ్వాలి!

దిల్లీ: ఉద్యోగం మారదలచుకున్న సీనియర్ పైలట్లు ఏడాది ముందుగా అందుకు సంబంధించి నోటీసు ఇవ్వాలంటూ 'డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్' (డీజీసీఏ) తాజాగా పేర్కొంది. ఈ మేరకు సవరించిన నిబంధనలను బుధవారం ప్రకటించింది. ఇప్పటిదాకా ఈ నోటీసు కాల వ్యవధి ఆరునెలలగా ఉన్న విషయం గమనార్హం. తాజా నిబంధన తక్షణమే అమల్లోకి వస్తుందని డీజీసీఏ తెలిపింది. ఇప్పుడిక విమాన సంస్థల్లో పనిచేస్తున్న కమాండర్లయితే ఏడాది...కో-పైలట్లయితే ఆరునెలల ముందు నోటీసు ఇవ్వాలని స్పష్టం చేసింది.

మత్తుమందులపై పోరాటంలో 32 మంది కాల్చివేత

మనీలా: ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డ్యుటెర్టే మత్తుమందులపై ప్రకటించిన యుద్ధంలో భాగంగా పోలీసులు ఒక్కరోజే 32 మందిని కాల్చేశారు. మత్తుమందులకు వ్యతిరేకంగా దేశ రాజధాని మనీలాలోని ఉత్తర ప్రావిన్స్ బులాకన్‌లో నిర్వహించిన సోదాలు, దాడుల సందర్భంగా ఈ ఘటన జరిగింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు నిర్వహించిన సోదాల్లో 109 మంది చిన్న నేరస్థులు, వీధుల్లో మత్తుమందులు అమ్మే దళారులను అరెస్టు చేసి డజన్లకొద్దీ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ప్రాంతీయ పోలీసు అధికారి రోమియో కారామట్ తెలిపారు. 'బులాకన్‌లో నిర్వహించిన భారీ దాడుల్లో 32 మంది చనిపోయారు. ఇలాగే రోజుకు 32 మందిని చంపండి' అని డ్యుటెర్టే తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో 49 మత్తు వ్యతిరేక దాడులు నిర్వహించగా, 20 ఎన్‌కౌంటర్లు జరిపినట్లు కారామట్ తెలిపారు. ఇప్పటి వరకు బులాకన్‌లో నిర్వహించిన దాడుల్లో 425 మంది చనిపోగా 4000 మంది నేరస్థులను అరెస్టు చేశామన్నారు.

పతాకం విచ్చుకోలేదని జెండాస్తంభం ఎక్కిన బాలుడు

గోవాలో వైరల్‌గా మారిన వీడియో

పనాజీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా విచ్చుకోవడం లేదని ఓ విద్యార్థి స్తంభాన్ని ఎక్కి చిక్కుముడి విప్పిన వీడియో ఒకటి గోవాలో వైరల్‌గా మారింది. గోవాలోని కోల్వా గ్రామంలో సర్పంచి సహా గ్రామ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించి జాతీయ గీతం పాడాల్సి ఉంది. అందరు చుట్టూ చేరారు. జెండా ఆవిష్కరిస్తున్న సమయంలో పతాకం విచ్చుకోలేదు. దీంతో ఓ ప్రాథమిక స్థాయి విద్యార్థి జెండా స్తంభాన్ని ఎక్కి చిక్కుముడి విప్పాడు. ఇదంతా ఎవరో వీడియో తీశారు. ప్రస్తుతం ఆ దృశ్యాలు వైరల్‌గా మారాయి. పతాకం ఎంతసేపైనా విచ్చుకోకపోవడంతో అలాచేయాల్సి వచ్చిందని అందులో జాతీయ జెండాను కించపరిచే విషయమేమీ లేదని సదరు గ్రామ సర్పంచి ఆంథోని ఫెర్నాండ్స్ తెలిపారు.

అంచనాలకు మించి ఆహార ధాన్యాల దిగుబడులు

దిల్లీ: గత జూన్‌తో ముగిసిన 2016-17 పంట సంవత్సరంలో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 27.56 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తయినట్టు బుధవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంచనా వేసిన దానికన్నా 20.30 లక్షల టన్నులు అధికంగా దిగుబడి వచ్చినట్టు పేర్కొంది. వరి, గోధుమలు, తృణ ధాన్యాలు, పప్పుధాన్యాల దిగుబడులు పెరిగినట్టు వివరించింది. 2015-16 (జులై-జూన్)లో 25.17 కోట్ల టన్నుల దిగుబడి వచ్చింది. 2013-14లో వచ్చిన 26.50 కోట్ల టన్నుల దిగుబడే ఇంతవరకు రికార్డు. వరి దిగుబడులు 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు, గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, తృణ ధాన్యాలు 3.85 కోట్ల టన్నుల నుంచి 4.41 కోట్ల టన్నులు, పప్పు ధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగింది. కంది, మినప పప్పుల దిగుబడులు చాలా బాగుండడం గమనార్హం. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది.



బుధవారం దిల్లీలో ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నోబెల్ బహుమతి గ్రహీత కైలాశ్ సత్యార్థి

ఛాంపియన్



యువీ, రైనా ఫెయిల్!

- యో- యో పరీక్షలో అత్తెసరు మార్కులు
- కోహ్లి, జడేజా, పాండే ఫస్ట్

యువరాజ్, రైనా ఫెయిల్.. కోహ్లి, జడేజా, పాండే ఫస్ట్! ఏంటిది? ఫెయిలేంటి.. ఫస్ట్ ఏంటి? క్రికెటర్లకు పరీక్షలేంటి? అని ఆశ్చర్యపోతున్నారా! నిజమే.. క్రికెటర్లకు పరీక్షే. కాకపోతే ఆటలో కాదు ఫిట్‌నెస్‌లో! టీమ్‌ఇండియా ఆటగాళ్ల ఫిట్‌నెస్ నిర్ధరించే ఈ కొత్త తరహా పరీక్ష పేరు.. యో-యో!

దిల్లీ

శ్రీలంకతో వన్డే సిరీస్‌కు భారత జట్టులో యువరాజ్‌కు చోటు దక్కకపోవడంపై పెద్ద చర్చే నడుస్తోంది ప్రస్తుతం! ఐతే యువీపై వేటుకు కొంతమేర యో-యో పరీక్ష కూడా కారణమన్నది భారత జట్టు వర్గాల సమాచారం. ఈ ఫిట్‌నెస్ పరీక్షలో యువీ ఫెయిలైనట్లు చెబుతున్నారు. యో-యో పరీక్షలో 19.5, అంతకంటే ఎక్కువ పాయింట్లు సాధించిన ఆటగాళ్లు ఫిట్‌నెస్‌తో ఉన్నట్లు లెక్క. కెప్టెన్ కోహ్లి, జడేజా, మనీష్ పాండేలకు ఈ పరీక్ష నిర్వహించగా.. మిగతా వాళ్ల కంటే మిన్నగా 21 కంటే ఎక్కువ పాయింట్లే సాధించారట. ఏ ఒక్కసారో కాదు.. ఎప్పుడు పరీక్ష పెట్టినా వీరికి ఈ స్థాయిలోనే మార్కులొస్తున్నాయట. ఐతే యువీ 16 పాయింట్లకే పరిమితమవడం, ఇతర కారణాలు కూడా తోడై అతడిపై వేటు పడ్డట్లు సమాచారం. ఇక ఫిట్‌నెస్ విషయంలో మంచి పేరున్న, ఫీల్డింగ్‌లోనూ మెరుపులా కదిలే సురేశ్ రైనా సైతం యో-యో పరీక్షలో ఫెయిలయ్యాడట. అతను కూడా 16 పాయింట్ల వద్దే ఆగిపోయినట్లు సమాచారం. "ఆటగాళ్ల ఫిట్‌నెస్ విషయంలో రాజీపడొద్దన్నది కోచ్ రవిశాస్త్రి, కెప్టెన్ కోహ్లి, సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్‌ల దృఢ అభిప్రాయం. యో-యో పరీక్షలో ఆస్ట్రేలియా క్రికెటర్ల సగటు స్కోరు 21. మన దగ్గర విరాట్, జడేజా, మనీష్ మాత్రమే ప్రతిసారీ 21 పాయింట్లు అందుకుంటున్నారు. మరి కొందరు 19.5, అంతకంటే కాస్త ఎక్కువ స్కోరు సాధిస్తున్నారు. ఈ యో-యో పరీక్ష మాదిరే 1990ల్లో నిర్వహించే బీప్ పరీక్షలో అజహరుద్దీన్, రాబిన్ సింగ్, అజయ్ జడేజా మినహాయిస్తే ఎవ్వరూ 16-16.5 పాయింట్లు దాటేవాళ్లు కాదు. ఐతే ఇప్పుడా పరిస్థితి లేదు. స్వయంగా సారథే 21 పాయింట్లు అందుకుంటుండటంతో అదే ప్రామాణికమైంది" అని బీసీసీఐ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.



ఏమిటీ యో- యో?

డెన్మార్క్ ఫుట్‌బాల్ ఫిజియాలజిస్ట్ జెన్స్ బాంగ్స్‌బొ యో-యో పరీక్షను రూపొందించాడు. క్రీడాకారుల ఫిట్‌నెస్, సామర్థ్యం అంచనా వేయడం కోసం ఈ పరీక్ష నిర్వహిస్తారు. 20 మీటర్ల ఎడంతో సమాంతర వరుసల్లో కోన్స్ లేదా షటిల్స్ ఏర్పాటు చేస్తారు. రికార్డు చేసిన బీప్ శబ్దం ప్రకారం ఆటగాడు పరుగెత్తాలి. ఒక్కో నిమిషానికి బీప్ శబ్దంలో వేగం పెరుగుతుంది. బీప్ శబ్దం వినిపించేలోపు లైన్‌ను చేరుకోలేకపోతే.. మరో రెండు బీప్ శబ్దాలు వినిపించేలోపు వేగం పెంచి గమ్యానికి చేరుకోవాలి. లేకపోతే పరీక్షను ఆపేస్తారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సహాయంతో ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో లెవెల్-1, లెవెల్-2 పరీక్షలు ఉంటాయి. లెవెల్-1లో గంటకు 8 నుంచి 18.5 కిమీ వేగం ఉంటుంది. ఇందుకు 6 నుంచి 20 నిమిషాలు సమయం పడుతుంది. గంటకు 11.5 కిమీ వేగంతో లెవెల్-2 పరీక్ష ప్రారంభమవుతుంది. 2 నుంచి 10 నిమిషాల్లో ఈ పరీక్ష పూర్తవుతుంది.

ఎప్పుడో 2013 చివర్లో వన్డేలాడాడు యువరాజ్ సింగ్. మూడేళ్లకు పైగా అతడికి వన్డే జట్టులో చోటే లేదు. రెండేళ్ల కిందటి వన్డే ప్రపంచకప్‌కు కూడా అతణ్ని ఎంపిక చేయలేదు. ఈ మధ్యలో కొత్త కొత్త ఆటగాళ్లు వచ్చారు. పాత నీరంతా పోయింది. ఇంకో రెండేళ్లలో మళ్లీ ప్రపంచకప్ రాబోతున్న నేపథ్యంలో యువీకి మళ్లీ వన్డే జట్టులో అవకాశం దక్కడం అసాధ్యమనే అనుకున్నారంతా! యువీ అభిమానులే కాదు.. అతను కూడా పునరాగమనంపై ఆశలు వదిలేసుకునే ఉండుంటాడేమో! కానీ ఊహించని విధంగా ఈ ఏడాది ఆరంభంలో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు యువీని ఎంపిక చేశారు భారత సెలక్టర్లు. అప్పుడందరిలోనూ ఆశ్చర్యం! ఇప్పుడు శ్రీలంకతో సిరీస్‌కు అతణ్ని జట్టులోంచి తప్పించారు. ఇప్పుడు కూడా అదే ఆశ్చర్యం! అసలు యువీని ఎందుకు ఎంపిక చేసినట్లు..? ఎందుకు తప్పించినట్లు..? అతడి విషయంలో సెలక్టర్ల ఆలోచనలేంటి..? ఇవి సమాధానం లేని ప్రశ్నలే.

ఏం సాధించినట్లు?

ఈనాడు క్రీడావిభాగం

శ్రీలంకతో సిరీస్‌కు యువరాజ్‌ను ఎంపిక చేయకపోవడం చూస్తే.. అతడి కెరీర్ ముగిసినట్లే అని భావిస్తున్నారంతా. మూడేళ్ల విరామం తర్వాత ఈ ఏడాది ఆరంభంలో అనుకోకుండా భారత వన్డే జట్టులోకి పునరాగమనం చేసిన యువీ.. గత ఏడు నెలల్లో 11 వన్డేలాడాడు. 41.33 సగటుతో 372 పరుగులు చేశాడు. ఇంగ్లాండ్‌పై కటక్‌లో 150 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడటంతో పాటు ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్‌పై కీలక ఇన్నింగ్స్‌తో 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కూడా గెలిచాడు యువీ. మొత్తంగా పునరాగమనంలో అతడి ప్రదర్శన తీసిపడేసేలా ఏమీ లేదు. చివరగా వెస్టిండీస్‌తో సిరీస్‌లో మాత్రమే అతను పూర్తిగా విఫలమయ్యాడు. అంతగా ప్రాధాన్యం లేని ఆ సిరీస్‌లో ప్రదర్శన ఆధారంగా యువీపై వేటు వేయడం ఆశ్చర్యం కలిగించేదే. యువీ ఫిట్‌నెస్ కూడా వేటుకు కారణమని తెలుస్తోంది. ఇది వేటు కాదని.. యువీకి విశ్రాంతి మాత్రమే ఇచ్చామని చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ అంటున్నప్పటికీ.. అది నమ్మే పరిస్థితుల్లో లేరు అభిమానులు. వన్డే ప్రపంచకప్‌కు ఇంకో రెండేళ్లు కూడా సమయం లేని నేపథ్యంలో కుర్రాళ్లపై దృష్టిపెట్టాల్సి ఉండటంతో.. ఆ టోర్నీ సమయానికి 38 ఏళ్లకు చేరుకునే యువీపై భరోసా ఉంచలేకపోయారని తెలుస్తోంది. ధోని, యువీల విషయంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలన్న డిమాండ్ కొంత కాలంగా వినిపిస్తున్న నేపథ్యంలోనే యువీని సాగనంపేశారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఐతే ధోనికి అవకాశమిచ్చి, యువీపై మాత్రమే వేటు వేయడం చర్చనీయాంశమవుతోంది. నిజానికి ధోనికి, యువీకి పోలిక తేవడమూ సబబు కాదు. ఎందుకంటే ధోని ముందు నుంచి రెగ్యులర్ ఆటగాడిగా జట్టులో కొనసాగుతున్నాడు. కానీ యువీ మూడేళ్ల విరామం తర్వాత అనూహ్యంగా జట్టులోకి తిరిగొచ్చాడు. అసలు యువీని ఏ ఉద్దేశంతో మళ్లీ జట్టులోకి తీసుకున్నారన్నదే అర్థం కాని విషయం. ఇప్పుడు ప్రపంచకప్ ప్రణాళికల్లో భాగంగా కుర్రాళ్లకు అవకాశమిచ్చి, వాళ్లను తీర్చిదిద్దుకోవాలన్న ఉద్దేశంతోనే యువీపై వేటు వేశారన్న వాదన వినిపిస్తోంది. ఐతే ఈ ప్రణాళిక ముందు ఏమైందన్న ప్రశ్న తలెత్తుతోంది. మూడేళ్లుగా జట్టుకు దూరమై, 35వ పడిలో పడి, నిలకడలేమితో పలు అవకాశాల్ని వృథా చేసుకున్న యువీకి మళ్లీ అవకాశం కల్పించాల్సిన అవసరమేంటన్న చర్చ ముందు నుంచి నడుస్తూనే ఉంది. యువీ విషయంలో భవిష్యత్ ప్రణాళికలే ఉన్నట్లయితే అతడిని టీమ్‌ఇండియా సరిగ్గా ఉపయోగించుకున్నట్లయితే కనిపించలేదు. ఆల్‌రౌండర్ అయిన యువీ పునరాగమనంలో పెద్దగా బౌలింగ్ చేసింది లేదు. 11 మ్యాచ్‌ల్లో కలిపి 10 ఓవర్లే వేశాడు. కేవలం బ్యాటింగ్ ప్రదర్శన ఆధారంగా అతడిపై వేటు వేయాల్సిన అవసరమూ లేదు. యువీకి గౌరవప్రదంగా కెరీర్‌ను ముగించేందుకు ఈ అవకాశం ఇచ్చారా అంటే.. అలా కూడా కనిపించలేదు.

యువీ. సచిన్, ద్రవిడ్, గంగూలీ, లక్ష్మణ్, కుంబ్లేల తర్వాతి తరంలో వచ్చిన గొప్ప ఆటగాళ్లలో యువీ ఒకడు. అతను నవతరం దిగ్గజం! గత కొన్నేళ్లలో నిలకడ తప్పి స్థాయికి తగ్గ ప్రదర్శన చేయకపోవడం వల్లో యువీని పెద్ద స్థాయి ఆటగాడిలా, దిగ్గజంలా గుర్తించకపోవచ్చు. కానీ భారత జట్టుకు అతడందించిన సేవల్ని తక్కువ చేయలేం.

అతనూ దిగ్గజమే..: గత కొన్నేళ్లలో ఫామ్ కోల్పోయి ఉండొచ్చు. నిలకడ తప్పి ఉండొచ్చు. అంతమాత్రాన యువరాజ్‌ను తక్కువ చేయలేం. అతను భారత క్రికెట్‌కు చేసిన సేవల్ని విస్మరించలేం. 1983లో ప్రపంచకప్ గెలిచాక.. మళ్లీ మరో కప్పు గెలిచేందుకు 28 ఏళ్ల పాటు సుదీర్ఘంగా సాగిన నిరీక్షణకు తెరదించడంలో యువీది కీలక పాత్ర. 2011 ప్రపంచకప్‌లో బ్యాటుతో, బంతితో రాణించి 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా కూడా నిలిచాడు యువీ. అంతకుముందు భారత్ తొలి టీ20 ప్రపంచకప్ గెలవడంలోనూ అతను తన వంతు పాత్ర పోషించాడు. ఇవి కాక మరెన్నో సిరీస్‌ల్లో, మ్యాచ్‌ల్లో భారత్‌ను గెలిపించాడు యువీ. సచిన్, ద్రవిడ్, గంగూలీ, లక్ష్మణ్, కుంబ్లేల తర్వాతి తరంలో వచ్చిన గొప్ప ఆటగాళ్లలో యువీ ఒకడు. అతను నవతరం దిగ్గజం! ముందు తరం ఆటగాళ్ల లాగా సీనియర్ స్థాయి అందుకున్నాక వాళ్లలా పెద్దరికం, హుందాతనం చూపించకపోవడం వల్లో.. గత కొన్నేళ్లలో నిలకడ తప్పి స్థాయికి తగ్గ ప్రదర్శన చేయకపోవడం వల్లో యువీని పెద్ద స్థాయి ఆటగాడిలా, దిగ్గజంలా గుర్తించకపోవచ్చు. కానీ భారత జట్టుకు అతడందించిన సేవల్ని తక్కువ చేయలేం. క్యాన్సర్‌తో పోరాడి గెలిచి, మళ్లీ ఆటలోకి పునరాగమనం చేయడంలో అతడి సంకల్ప బలం, ఆట పట్ల ప్రేమను అర్థం చేసుకోవచ్చు. అలాంటి ఆటగాడి కెరీర్ కొంచెం గౌరవప్రదంగా ముగియాలని అభిమానులు ఆశిస్తారు. అందుకు యువీ అర్హుడు కూడా!

మరి శ్రీలంకతో సిరీస్‌కు ఎంపిక చేయకపోవడం ద్వారా యువీ కెరీర్‌కు శాశ్వతంగా తెరదించేశారా.. లేక అతడికి మళ్లీ ఇంకో అవకాశమిస్తారా అన్నది చూడాలి. యువీ విషయంలో భవిష్యత్ ప్రణాళికలేమీ లేని పక్షంలో అతడితో ఆ విషయం మాట్లాడి, చివరగా మరొక్క అవకాశమిచ్చి.. గౌరవప్రదంగా కెరీర్‌ను ముగించే అవకాశమివ్వాలన్నది అభిమానుల ఆకాంక్ష. సెహ్వాగ్, జహీర్ ఖాన్ లాంటి దిగ్గజాలకు సరైన రీతిలో నిష్క్రమించే అవకాశం ఇవ్వలేదన్న అసంతృప్తి ఇప్పటికే భారత క్రికెట్ అభిమానుల్లో ఉంది. యువీ విషయంలో అలాంటి పొరబాటు జరక్కుండా చూడాలన్నది వారి అభిమతం.

ఫిట్‌గా ఉన్న వాళ్లకే..



కొలంబో: ఫిట్‌గా ఉన్న ఆటగాళ్లు మాత్రమే 2019 వన్డే ప్రపంచకప్‌లో పాల్గొనే భారత జట్టు రేసులో ఉంటారని చీఫ్ కోచ్ రవిశాస్త్రి చెప్పాడు. "2019 వన్డే ప్రపంచకప్‌కు భారత జట్టును ఎంపిక చేసే సమయానికి ఎవరైతే ఫిట్‌గా ఉంటారో వారికే అవకాశాలు ఉంటాయి. ప్రపంచకప్‌కు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి. అయితే షార్ట్ ఫార్మాట్లలో మాత్రమే కాక టెస్టు క్రికెట్లో నిరూపించుకోవడం కూడా కీలకం. టెస్టు, వన్డేలు ఈ రెండింటికి భిన్నమైన సన్నద్ధత కావాలి. అందుకు ఆటగాళ్లంతా సిద్ధంగా ఉండాలి. నాలుగేళ్లకు ఒకసారి మాత్రమే వచ్చే ప్రపంచకప్‌లో ప్రదర్శన చేయడం జట్టులో అందరికి తెలుసు. వచ్చే ఏడాది భారత్ ఊపిరి సలపని క్రికెట్ ఆడనుంది" అని శాస్త్రి చెప్పాడు.



ఎన్నాళ్లకెన్నాళ్లకు...

సెయింట్ లూయిస్: విశ్వనాథన్ ఆనంద్.. గ్యారీ కాస్పరోవ్.. రెండు దశాబ్దాల క్రితం చెస్ బోర్డునే కదన రంగంగా చేసుకుని.. ఎత్తులకు పైఎత్తులతో గంటల తరబడి పోరాడిన వీరులు. 22 ఏళ్ల తర్వాత ఈ దిగ్గజ ఆటగాళ్లు చెస్ బోర్డుకు అటు ఇటు కూర్చున్నారు. దీనికి సెయింట్ లూయిస్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీ వేదికగా నిలిచింది. వయసు మాత్రమే పెరిగింది కానీ తనలో ఏమాత్రం చురుకుదనం తగ్గలేదని కాస్పరోవ్.. విషీతో గేమ్‌లో నిరూపించాడు. ర్యాపిడ్ గేమ్‌లో ఆనంద్.. కింగ్ పాన్ ఓపెనింగ్‌తో మొదలుపెడితే.. కాస్పరోవ్ సిసిలియన్‌తో బదులిచ్చాడు. మిడిల్ గేమ్ వరకు ఆట సమంగా సాగింది. తన ట్రేడ్‌మార్క్ ఎత్తులు వేసిన ఈ రష్యా స్టార్.. గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. చిరకాల ప్రత్యర్థులు, ఇద్దరు మాజీ ప్రపంచ ఛాంపియన్లు తలపడిన ఈ గేమ్ అందర్నీ విశేషంగా ఆకర్షించింది. అయితే ఆనంద్‌తో పాటు అరోనియన్‌తో గేమ్‌ను కాస్పరోవ్ డ్రా చేసుకున్నా.. సహచరుడు ఇయాన్ నెపొమనియాచి చేతిలో అతనికి ఓటమి తప్పలేదు. మరోవైపు కాస్పరోవ్‌తో డ్రా చేసుకున్న విషీ.. మరో గేమ్‌లో గెలిచి, ఇంకో గేమ్‌లో పాయింట్లు పంచుకున్నాడు. దీంతో అతను 5 పాయింట్లతో సంయుక్తంగా ఏడో స్థానంలో కొనసాగుతున్నాడు. "గత 12 ఏళ్లుగా సీరియస్‌గా చెస్ ఆడలేదు. అయినా మంచి ఎత్తులు వేయగలుగుతున్నా. మూడోరోజుకు కుదుటపడతానని అనుకుంటున్నా" అని కాస్పరోవ్ ట్వీట్ చేశాడు. "కాస్పరోవ్ గొప్పగా ఆడాడు. ఆకట్టుకున్నాడు. అతనికి పరిచయం లేని ఎత్తులు వేసినా.. అతను సమర్థంగా అడ్డుకున్నాడు. కాస్పరోవ్ ఎప్పటిలా చాలా సరదాగా ఉన్నాడు. ఇదో వెటరన్స్ వరల్డ్ వార్-1 అని జోకులు కూడా వేసుకున్నాం" అని ఆనంద్ చెప్పాడు.

బీసీసీఐ పెద్దలపై వేటు?



- సుప్రీం కోర్టు మార్గదర్శకాలు కోరిన సీఓఏ
- ఖన్నా, అమితాబ్‌లపై ప్రతికూల నివేదిక

దిల్లీ: బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా కార్యదర్శి అమితాబ్ చౌదరి, కోశాధికారి అనిరుధ్ చౌదరిల కుర్చీల కిందికి నీళ్లొచ్చినట్లే! వీరిని తప్పించడం కోసం మార్గదర్శకాలు ఇవ్వాలంటూ బీసీసీఐ పాలకుల కమిటీ (సీఓఏ) సుప్రీం కోర్టును కోరింది. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం లోధా కమిటీ సిఫారసుల్ని అమలు చేయడంలో తాత్సారం చేస్తున్నారన్న కారణంతో వీరిని తప్పించాలని సీఓఏ అభిప్రాయపడింది. ఈ ఏడాది ఆరంభంలో బీసీసీఐ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి బోర్డు కార్యకలాపాలు, లోధా కమిటీ సిఫారసుల అమలుపై సీఓఏ సుప్రీం కోర్టుకు నివేదికలు ఇస్తోంది. తాజాగా 26 పేజీలతో సర్వోన్నత న్యాయస్థానానికి సీఓఏ ఐదో నివేదిక ఇచ్చింది. గతంలో లోధా కమిటీ సిఫారసుల అమలులో విఫలమైన అధ్యక్ష కార్యదర్శులు అనురాగ్ ఠాకూర్, అజయ్ షిర్కేలపై వేటు వేసినట్లే.. ఖన్నా, అమితాబ్, అనిరుధ్‌లను కూడా తప్పించాల్సిందే అని ఈ నివేదికలో సీఓఏ సభ్యులు వినోద్ రాయ్, డయానా ఎడుల్జీ అభిప్రాయపడ్డారు. లోధా కమిటీ సిఫారసుల అమలు విషయంలో ఈ ముగ్గురూ నిర్లిప్తంగా ఉన్న విషయాన్ని నివేదికలో ప్రస్తావించారు. జులై 26న బీసీసీఐ సమావేశం నుంచి బోర్డు సీఈఓ రాహుల్ జోహ్రి, పాలక, న్యాయ విభాగం సిబ్బందిని పంపించేయడం వెనుక ఈ ముగ్గురికీ దురుద్దేశాలు ఉన్నాయని సీఓఏ అభిప్రాయపడింది.



టైటాన్స్ మళ్లీ..

- ప్రో కబడ్డీలో తెలుగు జట్టుకు ఏడో ఓటమి
- హరియాణా-తలైవాస్ మ్యాచ్ డ్రా

అహ్మదాబాద్: ప్రో కబడ్డీ ఐదో సీజన్లో తెలుగు టైటాన్స్ దారుణ ప్రదర్శన కొనసాగుతోంది. లీగ్‌లో తొమ్మిదో మ్యాచ్ ఆడిన తెలుగు జట్టు ఏడో ఓటమి చవిచూసింది. బుధవారం టైటాన్స్ 19-29 తేడాతో లీగ్‌లోకి కొత్తగా వచ్చిన గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్ చేతిలో పరాజయం పాలైంది. సీజన్ ఆరంభం నుంచి జట్టును గెలిపించేందుకు ఒంటరి పోరాటం చేస్తూ వస్తున్న రాహుల్ చౌదరి కూడా ఈ మ్యాచ్‌లో విఫలమయ్యాడు. అతను మూడు పాయింట్లే సాధించాడు. జట్టులో అత్యధికంగా రైడర్ వినోద్ కుమార్ 4 పాయింట్లు తెచ్చాడు. ప్రత్యర్థి జట్టులో సచిన్ 10 పాయింట్లు కొల్లగొట్టాడు. ప్రథమార్ధం ముగిసేసరికే 7-20తో వెనుకబడ్డ టైటాన్స్ ద్వితీయార్ధంలో కొంచెం పుంజుకున్నా ఓటమి తప్పించుకోలేకపోయింది. హరియాణా స్టీలర్స్, తమిళ్ తలైవాస్ ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్ 25-25తో టైగా ముగియడం విశేషం. మ్యాచ్ ఆద్యంతం ఇరు జట్లూ హోరాహోరీగా తలపడ్డాయి. ప్రథమార్ధం ముగిసేసరికి 13-10తో హరియాణా స్వల్ప ఆధిక్యంలో నిలిచినప్పటికీ.. తర్వాత పుంజుకున్న తలైవాస్ స్కోరు సమం చేసింది. ఓ దశలో ఆ జట్టు 21-19తో ఆధిక్యంలో నిలిచింది. కానీ మళ్లీ స్కోరు 22-22తో సమమైంది. అక్కడి నుంచి మరింత ఉత్కంఠభరితంగా, హోరాహోరీగా సాగుతూ చివరికి మ్యాచ్ టైగా ముగిసింది.

ప్రో కబడ్డీలో ఈనాడు దబాంగ్ దిల్లీ × తమిళ్ తలైవాస్ రాత్రి 8 గంటలకు గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్ × బెంగాల్ వారియర్స్ రాత్రి 9 గంటలకు **ప్రసారం: స్టార్‌స్పోర్ట్స్ 2లో; వేదిక అహ్మదాబాద్**

పీబీఎల్‌లోకి రెండు కొత్త జట్లు

చెన్నై: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లోకి రెండు కొత్త జట్లు రాబోతున్నాయి. ఆ జట్ల పేర్లు.. అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్, గువహటి ఈస్టర్న్ వారియర్స్. డిసెంబరు 22 నుంచి జనవరి 14 వరకు జరిగే పీబీఎల్ మూడో సీజన్లో ఈ రెండు జట్లు పాల్గొంటాయి. లీగ్‌లో ఇప్పటికే ఆరు జట్లు (హైదరాబాద్ హంటర్స్, బెంగళూరు బ్లాస్టర్స్, చెన్నై స్మాషర్స్, దిల్లీ ఏసర్స్, ముంబయి రాకెట్స్, అవధె వారియర్స్) ఆడుతున్న సంగతి తెలిసిందే. ఈసారి లీగ్ ప్రైజ్‌మనీని కూడా పెంచుతున్నారు. విజేత జట్టు రూ.3 కోట్లు, రన్నరప్ రూ.1.5 కోట్లు అందుకుంటాయి. మొత్తం ప్రైజ్‌మనీ రూ.6 కోట్లు.



దుబాయ్‌లో ధోని అకాడమీ

దిల్లీ: ఆటలో ఓ స్థాయి అందుకున్న ఏ క్రీడాకారుడైనా.. ఓ అకాడమీ ఏర్పాటు చేసి తర్వాతి తరానికి పాఠాలు నేర్పాలని ఆశించడం సహజం. ప్రకాశ్ పదుకొనే, పుల్లెల గోపీచంద్, వీవీఎస్ లక్ష్మణ్, వీరేంద్ర సెహ్వాగ్, సానియా మీర్జా.. ఇలా ఎంతో మంది భారత స్టార్ క్రీడాకారులు అకాడమీలు ఏర్పాటు చేసిన వాళ్లే. టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని కూడా ఈ బాటలోనే నడవబోతున్నాడు. అతను కూడా అకాడమీ పెడుతున్నాడు. ఐతే మిగతా క్రీడాకారుల్లా అతను మన దేశంలో అకాడమీ ఏర్పాటు చేయట్లేదు. ఇందుకోసం దుబాయ్‌ని వేదికగా ఎంచుకున్నాడు. దుబాయ్‌లోని పసిఫిక్ స్పోర్ట్స్ క్లబ్ భాగస్వామ్యంతో దాని ప్రాంగణంలోనే తన పేరిట అకాడమీ ఏర్పాటు చేయబోతున్నట్లు ధోని స్వయంగా ప్రకటించాడు.

ఇంగ్లాండ్, విండీస్.. తొలి డే/నైట్ టెస్టు



ట్రోఫీతో రూట్, హోల్డర్

బర్మింగ్‌హామ్: ఇంగ్లాండ్-వెస్టిండీస్ మధ్య బర్మింగ్‌హామ్‌లో తొలి టెస్టు గురువారం ఆరంభం కాబోతోంది. ఇది డే/నైట్ మ్యాచ్ కావడం విశేషం. ఇంగ్లాండ్, వెస్టిండీస్ డే/నైట్ టెస్టు ఆడడం ఇదే తొలిసారి. రాత్రి వేళ, గులాబి బంతితో ఆడనుండడం ఇరు జట్ల ఆటగాళ్లతో పాటు అభిమానులకు కూడా ఆసక్తిని రేపుతోంది. ఆస్ట్రేలియాలో తొట్ట తొలి డేనైట్ టెస్టు ఆడిన ఇంగ్లాండ్.. స్వదేశంలో తొలిసారి ఈ ప్రయోగాత్మక టెస్టుకు ఆతిథ్యం ఇవ్వనుంది. టెస్టు క్రికెట్ చరిత్రలో ఇది ఐదో డేనైట్ టెస్టు. ఈ ఐదింట్లో ఆసీస్ మూడు మ్యాచ్‌లు ఆడింది. 2015లో ఆసీస్-కివీస్ మధ్య తొట్ట తొలి డేనైట్ టెస్టు జరిగింది.

ప్రాజెక్టులపై విపక్షాల కుతంత్రాలు

మంత్రి జూపల్లి, తెరాస నేతలు

ఈనాడు, హైదరాబాద్: వలసలు, ఫ్లోరైడ్ తదితర బాధల నుంచి విముక్తి కల్పించి... పాలమూరు, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టులను అడ్డుకునేందుకు విపక్షాలు కుతంత్రాలు చేస్తున్నాయని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వి.శ్రీనివాస్‌గౌడ్, అంజయ్య యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డిలతో కలిసి బుధవారం తెరాస శాసనసభాపక్ష కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో 14 నియోజకవర్గాల్లోని 14 లక్షల ఎకరాలకు నీరందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, దీనిపై 2015 జూన్‌లో ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. జీవోలో ఎలాంటి మార్పులు లేనప్పటికీ, విపక్షాలు రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటుచేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. అవగాహన లేమితో కొంతమంది అవాకులు చవాకులు మాట్లాడుతున్నారన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు 200 టీఎంసీలను వాడుకునే వెసులుబాటు ఉందన్నారు. దిండి ప్రాజెక్టుతో నల్గొండ జిల్లాకు నీరు వెళితే తప్పేమిటని ప్రశ్నించారు. విపక్షాలు సీమాంధ్ర ధోరణితో వ్యవహరిస్తున్నాయని, పాలమూరుకు ఉపయోగపడే ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్నాయన్నారు.

కేసీఆర్ ఇప్పటికైనా సచివాలయానికి రావాలి: చాడ

మూడేళ్ల తెరాస పాలనలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, కోరికలు నేరవేరలేదని.. పరిపాలన సచివాలయం నుంచి సాగకపోవడంతో ప్రజానీకం ఇబ్బంది పడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఓ ప్రకటనలో విమర్శించారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా యువతకు లక్ష ఉద్యోగాలిస్తామని కేసీఆర్ ప్రకటించారని.. ఇది నమ్మశక్యంగా లేదని వ్యాఖ్యానించారు. సీఎం ఇకనైనా సచివాలయంలో అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల్ని పరిష్కరించాలన్నారు.

సెప్టెంబరులో దేశవ్యాప్త తెలుగు కవుల సమ్మేళనం

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఉన్న తెలుగు కవుల సమ్మేళనానికి కరీంనగర్ వేదిక కానుంది. దీన్ని తెలంగాణ రైతు హార్వెస్టర్ సంఘం ఆధ్వర్యంలో 'వెయ్యి కలాల వేడుక.. వెయ్యి హలాల వేదిక' పేరుతో సెప్టెంబర్ 10న నిర్వహించనున్నారు. బుధవారం కరీంనగర్‌లో కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. తెలంగాణ రైతు హార్వెస్టర్ సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే దేశవ్యాప్తంగా కవులు తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారని.. పశ్చిమ్‌బంగ, కర్ణాటక, గోవా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 786 మంది కవులు పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. ఇది ప్రపంచ రికార్డుగా నమోదు కాబోతుందని తెలిపారు. సమావేశంలో సాహితీవేత్తలు డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ గండ్ర లక్ష్మణ్‌రావు, మాడిశెట్టి గోపాల్, డాక్టర్ కలువకుంట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంచల్‌గూడ నుంచి బిశ్వాస్, హిలాలుద్దీన్ తరలింపు

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో ఉన్న ఇద్దరు ఉగ్రవాదులు బిశ్వాస్, హిలాలుద్దీన్‌లను బుధవారం మధ్యప్రదేశ్‌లోని జాన్‌పూర్ తరలించారు. సికింద్రాబాద్‌లోని బేగంపేట టాస్క్‌ఫోర్స్ కార్యాలయం పేలుడు కేసును నాంపల్లి న్యాయస్థానం కొట్టి వేయడంతో ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ఏడుగురిని విడుదల చేశారు. బిశ్వాస్, హిలాలుద్దీన్‌లు జాన్‌పూర్ పేలుడు కేసులోనూ నిందితులుగా ఉన్నారు. దీంతో విచారణ నిమిత్తం వారిని జాన్‌పూర్ తరలించినట్లు జైలు పర్యవేక్షణాధికారి సైదయ్య తెలిపారు.

తరగతి మారినా.. పురోగతి పూజ్యం

- 2వ తరగతి పాఠం చదవలేకపోతున్న 8వ తరగతి విద్యార్థులు
- అక్షరాలనూ గుర్తించలేని దైన్యం
- ఆంగ్ల వాక్యాలు అంతంతే
- 50 శాతం మందికే భాగహారాలు తెలుసు
- తెలుగు రాష్ట్రాల్లో చదువుల దుస్థితి ఇది
- 'ఏఎస్ఈఆర్-2016' అధ్యయనంలో వెల్లడి



ఈనాడు – అమరావతి

రెండో తరగతి పాఠం ఎనిమిదో తగరతి విద్యార్థికి చదవడం చాలా సులభం. అలాగే అనుకుని ఒక అధ్యయన సంస్థ కొన్ని ఊళ్లకెళ్లి అక్కడున్న విద్యార్థులను కూర్చొబెట్టి బోర్డుమీద ఈ పాఠాన్ని తాటికాయంత అక్షరాలతో రాసి చదవమని అడిగింది. అది కూడా చదవడం రాని ఎనిమిదో తరగతి విద్యార్థులు చాలా మంది ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారట. ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశంలోని పలు రాష్ట్రాల్లోనూ ఇలాంటి దృశ్యాలే కనిపించేసరికి విస్తుపోవడం అధ్యయన సంస్థ వంతైంది. ఇంకా చెప్పాలంటే కాస్తో, కూస్తో తెలుగు రాష్ట్రాల విద్యార్థులే నయం. ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్ లాంటి చోట విద్యార్థులు కనీస స్థాయిలో కూడా చదవలేని దృశ్యాలు కళ్లకు కట్టాయి.

పాఠశాలల్లో విద్యార్థులు పాఠాలు ఎలా నేర్చుకుంటున్నారు? వారిలో పఠనా ప్రతిభ, గణితంలో వారి పాటవాలు ఎలా ఉన్నాయి అనే అంశాలమీద బేరీజు వేయడానికి 'ప్రథమ్' అనే స్వచ్ఛంద సంస్థకు చెందిన 'యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్(ఏఎస్ఈఆర్)-2016' విభాగం దేశ వ్యాప్తంగా అధ్యయనం చేసి నివేదికను విడుదల చేసింది. ఒకటో తరగతి నుంచీ ఎనిమిదో తరగతి విద్యార్థులను ఎంపిక చేసుకుని వారితో ఈ అధ్యయనం చేసింది. ఎనిమిదో తరగతికి వచ్చిన విద్యార్థులు కొంతమంది రెండో తరగతి అచ్చు పుస్తకంలోని పాఠాన్ని కూడా చదవలేని స్థితిలో ఉన్నారని తేల్చింది. కొంతమంది విద్యార్థులైతే చివరకు అక్షరాలను సైతం గుర్తించలేని దీన స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఏఎస్ఈఆర్ దేశంలోని 589 జిల్లాల్లో 17,473 గ్రామాలకెళ్లి అక్కడ మూడేళ్ల నుంచీ 16ఏళ్లలోపు వయసుండి బడికెళుతున్న 5,62,305 మంది విద్యార్థులతో ఈ అధ్యయనం నిర్వహించింది. ఇందులో ఆ సంస్థ వెల్లడించిన విషయాలు సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వానికి సైతం విస్తుగొలిపాయి. ఇటీవలే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఆర్థిక సర్వే రెండో భాగంలో ఈ అధ్యయనం గురించి ప్రత్యేకంగా ఉటంకిస్తూ పాఠశాలల్లో క్షీణిస్తున్న విద్యా ప్రమాణాల పట్ల అసంతృప్తి, ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అధ్యయనం తెలుగు రాష్ట్రాలకు సంబంధించి కూడా విస్తుగొలిపే విషయాలు వెలుగు చూశాయి.

మనవాళ్లూ చదవలేకున్నారు

తెలుగు రాష్ట్రాల్లోనూ కనీసం తెలుగు అక్షరాలు గుర్తించలేని విద్యార్థులు ఈ అధ్యయనంలో కనిపించారు. ఐదో తరగతిలో ఇలాంటి వారు ఆంధ్రాలో 4.5, తెలంగాణలో 3.1 శాతం ఉన్నారు. ఎనిమిదో తరగతిలోనూ ఇలాంటి వారు ఉండటం మరింత ఆశ్చర్యం కలిగించింది. ఆంధ్రాలో 1.6, తెలంగాణలో 1.2శాతం మంది విద్యార్థులు ఇలా ఉన్నారని ఈ అధ్యయనం తెలిపింది. కొంతమంది అక్షరాలను గుర్తించగలిగినా కనీసం రెండక్షరాల పదాలను చదవలేకపోతున్నారు. ఎనిమిదో తరగతికి వచ్చినా కనీసం రెండో తరగతి పాఠం కూడా చదవడం రాని విద్యార్థులు ఆంధ్రాలో 22.2, తెలంగాణలో 24.2 శాతం కనిపించారు. ఇక మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో 30 శాతం మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు రెండో తరగతి పాఠం చదవలేకపోతున్నారు.

ఆంగ్లం అర్థమేకాదే

దేశంలోని విద్యార్థుల్లో వారి మాతృభాష చదువులే కాదు, ఆంగ్ల చదువులోనూ వారి ప్రతిభ ఏమంత ఆశాజనకంగా లేదని ఈ అధ్యయనం పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థులు చాలా మంది ఇంగ్లిషు పాఠంలోని వాక్యాలు చదవలేకపోతున్నారు. ఆంధ్రాలో 28.7, తెలంగాణలో 31.9 శాతం మంది విద్యార్థులు ఇలా ఇంగ్లిషు పాఠం చదవలేకపోతున్నారట. ఇక ఏడో తరగతిలో అయితే ఇలాంటి వారు రెండు రాష్ట్రాల్లోనూ 40 శాతంపైగానే ఉన్నారు. ఇంగ్లిషు అక్షరాలను గుర్తించలేని విద్యార్థులు కూడా పలు తరగతుల్లో గణనీయమైన శాతాల్లోనే కనిపించారు.

'తీసి'వేత దాటలేక

గణితంలోనూ విద్యార్థులు తడబడుతున్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో సగం మంది 'తీసివేత'లను దాటి భాగహారాలు కూడా చేయలేని స్థితిలో ఉన్నారు. కేవలం 50.4 శాతం మంది విద్యార్థులు మాత్రమే ఆంధ్రాలో భాగహారాలు చేస్తుంటే 31.3 శాతం మంది విద్యార్థులు తీసివేతలు చేయగలుగుతున్నారు. తెలంగాణలో కొంత పరిస్థితి మెరుగ్గా ఉంది. అక్కడ ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో 55.1 శాతం మంది భాగహారాలు దాటి గణిత సమస్యలు పరిష్కరిస్తుంటే 27.2 శాతం మంది మాత్రం తీసివేతలు చేయగలుతున్నారు. ఏడో తరగతి విద్యార్థుల్లో ఈ ప్రతిభ ఉన్నవారు మరింత తక్కువ మంది కనిపించారు. రెండు రాష్ట్రాల్లోనూ ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో ఒకటి నుంచి 9లోపు అంకెలను కూడా గుర్తించలేని విద్యార్థులు ఒకశాతం ఉండటం విస్తుగొలిపే అంశమే.

తెలంగాణ - తెలుగు (గణాంకాలు శాతాల్లో)

తరగతి	అక్షరం గుర్తించలేని వారు	అక్షరం చదవగలిగిన వారు	పదాలు	1వ తరగతి పాఠం	రెండో తరగతి పాఠం చదివేవారు
4	5.1	10.5	27.1	23.6	33.8
5	3.1	9.5	16.9	23.4	47.1
6	4.9	6.9	15.3	15.6	57.3
7	2.8	4.8	10.0	17.6	64.9
8	1.2	3.1	8.7	11.2	75.8

గణితం

తరగతి	1–9 అంకెలు గుర్తించని వారు	అంకెలు గుర్తించిన వారు	తీసివేతలు వచ్చినవారు	భాగహారాలు తెలిసినవారు
4	2.5	36.5	42.6	18.3
5	2.2	29.3	38.1	30.4
6	2.0	25.9	38.7	33.5
7	1.5	19.4	37.1	42.0
8	0.7	17.0	27.2	55.1

ఇంగ్లీషు

తరగతి	అక్షరాలు గుర్తించని వారు	చిన్న అక్షరాలు	చిన్న పదాలు	సులభ వాక్యాలు చదివేవారు
4	11.6	20.1	26.4	41.9
5	10.5	22.1	23.2	44.1
6	7.5	17.4	22.4	52.7
7	6.4	13.7	22.0	57.9
8	6.0	13.7	12.2	68.1

పీహెచ్‌డీ, ఎంఫిల్ సీట్ల భర్తీపై వివరాలివ్వండి

- హెచ్‌సీయూ రిజిస్ట్రార్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: పీహెచ్‌డీ, ఎంఫిల్ సీట్ల భర్తీకి అనుసరిస్తున్న విధానం వివరాలను తెలియజేయాలని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. హెచ్‌సీయూలోని వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ, ఎంఫిల్ సీట్ల భర్తీ కోసం ప్రకటన జారీచేశారని.. రాత, మౌఖిక పరీక్షల అనంతరం ఫలితాల్ని ప్రకటించే దశలో సీట్లను కుదించారని పేర్కొంటూ పరిశోధక విద్యార్థి ఎస్.మున్నా హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సీట్ల కుదింపుతో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందన్నారు. ఆ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు.. ఇలాంటి చర్యలతో విద్యార్థులకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని వర్సిటీ అధికారులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ అంశంపై వ్యవహరించాల్సిన తీరు ఇది కాదన్నారు. ప్రమాణపత్రం దాఖలు చేయాలని వర్సిటీ అధికారులను ఆదేశించారు.

రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేసేదెన్నడు?

- తెలంగాణ సర్కారును ప్రశ్నించిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో రైతు రుణ విమోచన కమిషన్‌ను ఎప్పటిలోగా ఏర్పాటు చేస్తారో చెప్పాలంటూ ఉమ్మడి హైకోర్టు బుధవారం తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కమిషన్ ఏర్పాటు చేయాలని చట్టంలో స్పష్టంగా ఉన్నపుడు అమలు చేయాల్సిందేనంది. రైతు రుణ విమోచన కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ భాజపా నేత ఎన్.ఇంద్రసేనారెడ్డి హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ రుణాలతో రైతుల ఆత్మహత్యల నేపథ్యంలో ప్రభుత్వం గతేడాది మే 27న తెలంగాణ రాష్ట్ర రుణ విమోచన కమిషన్ ఈ చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ఐదుగురితో కూడిన కమిషన్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సమాధానమిస్తూ రుణ విమోచన కమిషన్ ఏర్పాటులో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనన్నారు. కమిషన్ ఏర్పాటుకు గడువు అవసరమని తెలిపారు. రెండు వారాలు గడువిస్తే ప్రభుత్వ నిర్ణయం తెలియజేయడంతో పాటు పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేస్తామన్నారు. స్పందించిన ధర్మాసనం.. కమిషన్‌ను ఎప్పటిలోగా ఏర్పాటు చేస్తారో నిర్దిష్టంగా చెప్పాలంటూ విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

ఆరుబయలు రహితం చేరువలో మరో 4 జిల్లాలు

ఈనాడు, హైదరాబాద్ : రాష్ట్రంలోని మరో 4 జిల్లాలు ఆరు బయలు మలవిసర్జన రహితంగా ప్రకటించుకొనేందుకు సిద్ధమవుతున్నాయని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నీతూప్రసాద్ వెల్లడించారు. ఇప్పటికే కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, మేడ్చల్ జిల్లాలను ఆరుబయలు రహితంగా ప్రకటించినట్లు ఆమె తెలిపారు. మిగతా జిల్లాలు 2018 అక్టోబరులోగా మారతాయనే విశ్వాసాన్ని ఆమె వ్యక్తంచేశారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో వివిధ వర్గాల వారిని మమేకం చేసేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన 'స్వచ్ఛ భారత్ హ్యాకతన్'ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ బుధవారం ఇక్కడ ప్రారంభించారు. కార్యక్రమంలో నీతూప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 53 శాతం కుటుంబాలు మరుగుదొడ్లను కలిగి ఉన్నాయన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో తెలంగాణ గత ఏడాది కాలంగా మంచి ప్రతిభను కనబరుస్తోందని ఎస్పీసింగ్ చెప్పారు. గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే 2వేల పంచాయతీలు బహిరంగ మలవిసర్జన రహితంగా ప్రకటించుకోగా మరో 1,500 పంచాయతీలు త్వరలోనే ఆ జాబితాలో చేరబోతున్నాయన్నారు.

కర్ణాటకలోని వాటర్ షెడ్ల పథకాల అధ్యయనం

కర్ణాటకలోని వాటర్‌షెడ్ల పథకాల అధ్యయానికి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన 35 మంది అధికారులు బుధవారం ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. తొలుత ఆరు జిల్లాల నుంచి వీరిని ఎంపిక చేసి నాలుగు రోజుల పర్యటనకు పంపామని, మిగతా జిల్లాల వారిని దశలవారీగా పంపుతామని కమిషనర్ నీతూ ప్రసాద్ తెలిపారు.

బహిరంగ మలమూత్ర విసర్జన రహిత నగరంగా హైదరాబాద్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహితం(ఓడీఎఫ్)గా ప్రకటిస్తూ జీహెచ్ఎంసీ బుధవారం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. నగరంలోని 150 వార్డులను ఆయా డివిజన్ల కార్పొరేటర్లు ఇప్పటికే ఓడీఎఫ్‌గా ప్రకటిస్తూ నివేదిక ఇచ్చారని, ఈ అంశంపై అభ్యంతరాలు, ఫిర్యాదులు, సూచనలను ఆగస్టు 28 వరకు కమిషనర్ కార్యాలయానికి సమర్పించాలని అధికారులు తెలిపారు. బహిరంగ ప్రాంతాల్లో మల, మూత్ర విసర్జన లేకుండా చేసేందుకు అనేక ప్రయత్నాలు చేశామని, అవి సత్ఫలితాలివ్వడం వల్లే పరిస్థితి మెరుగైందని కమిషనర్ జనార్దన్ రెడ్డి తెలిపారు. గ్రేటర్ వ్యాప్తంగా మొత్తం 384 శౌచాలయాలు నిర్మించామన్నారు. మరో 25 మరుగుదొడ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు.

28 మంది పట్టణ ప్రణాళికా విభాగాధికారుల బదిలీ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రణాళికా విభాగంలో భారీగా బదిలీలు జరిగాయి. అక్రమ నిర్మాణాల సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ బదిలీలు చేపట్టింది. పట్టణ ప్రణాళికా విభాగంలోని 28 మంది అధికారులకు స్థానచలనం కలిగింది. జీహెచ్ఎంసీ అధికారులను జిల్లాలకు.. జిల్లాల్లోని ఉద్యోగులను జీహెచ్ఎంసీకి బదిలీ చేస్తూ బుధవారం రాష్ట్ర పురపాలక శాఖ కార్యదర్శి నవీన్ మిత్తల్ ఉత్తర్వులు జారీ చేశారు.

'ఎయిమ్స్' ప్రశ్నాపత్రం లీక్ కేసులో కేసు నమోదు చేశాం: సీబీఐ

దిల్లీ: ఈ ఏడాది మే 28న జరిగిన 'అఖిల భారత వైద్య విజ్ఞానాల సంస్థ'(ఎయిమ్స్) ఎంబీబీఎస్ ప్రవేశపరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్ అయిందన్న ఆరోపణలపై కేసు నమోదు చేసినట్లు సీబీఐ బుధవారం దిల్లీ హైకోర్టుకు తెలిపింది.

19 జిల్లాల్లో వర్షపాతం లోటు

- 237 మండలాల్లో తీవ్ర వర్షాభావం
- 34.50 లక్షల హెక్టార్లు దాటిన పంటల సాగు
- వ్యవసాయశాఖ తాజా నివేదిక

ఈనాడు – హైదరాబాద్

రానున్న రోజుల్లో కురిసే వర్షాలు రాష్ట్రంలో పంటలకు కీలకం కానున్నాయి. ఇప్పటివరకూ 19 జిల్లాల్లో సాధారణంకన్నా తక్కువగా వర్షపాతం ఉంది. రానున్న 3 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ తెలిపింది. వీటిలో లోటు కొంతమేర తగ్గే అవకాశాలున్నాయని అంచనా. గత జూన్ ఒకటి నుంచి బుధవారం నాటికి సాధారణ వర్షపాతం 486.4 మిల్లీమీటర్ల (మి.మీ.)కు గాను 410.6 మి.మీ. కురిసింది. గతేడాది ఇదే సమయానికి 359.3 మి.మీ. పడింది. ఈ సీజన్‌లో అత్యధికంగా భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో 659.7, అత్యల్పంగా నాగర్‌కర్నూలులో 219 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్, కుమరంభీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ జిల్లాల్లో వర్షపాతం లోటు ఎక్కువగా ఉంది. మొత్తం 584కు 237 మండలాల్లో వర్షాభావం తీవ్ర స్థాయిలో ఉంది. ఇక్కడ సాధారణంకన్నా 20 నుంచి 70 శాతం వరకూ లోటు ఉంది. ఈ మండలాల్లో పైర్లు బతకడానికి కావాల్సిన వర్షాలు అప్పుడప్పుడు కురుస్తున్నాయి కానీ చెరువుల్లో నీరు లేదు. భూగర్భ జలమట్టాలు పెరగడం లేదు.

సగం దాటిన వరిసాగు విస్తీర్ణం

వర్షాలు తిరిగి మొదలైనందున వరి నాట్లు క్రమంగా పెరుగుతున్నాయి. ఇప్పటివరకూ సాగు కావాల్సిన సాధారణ విస్తీర్ణంలో 53 శాతం నాట్లు పడ్డాయి. ఈ నెలాఖరుకల్లా వందశాతానికి చేరవచ్చని తాజా అంచనా. వరితో పాటు అన్ని రకాల పంటల సాధారణ సాగు విస్తీర్ణం 43.24 లక్షల హెక్టార్లు కాగా 34.50 లక్షల హెక్టార్లలో సాగైనట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. పత్తి సాధారణం కన్నా 7 శాతం అదనంగా వేశారు.

వర్షాలతో రైతుల్లో నూతనోత్సాహం

గత వారం రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు రైతుల్లో నూతనోత్సాహం తెచ్చాయని వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి తెలిపారు. ఈ వానలతో పైర్లకు మేలు జరుగుతుందన్నారు. వచ్చే అక్టోబరు నుంచి యాసంగి పంటల సాగుకు కావాల్సిన ఏర్పాట్లపై బుధవారం వ్యవసాయ కమిషనర్ కార్యాలయంలో ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. యాసంగికి విత్తనాలు సిద్ధం చేయాలని, ఎరువుల కొరత రాకుండా ముందస్తు నిల్వలు పెట్టాలని సూచించారు. హాకా, మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్, ఆగ్రోస్, టీఎస్ సీడ్స్ సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో సాగు వివరాలు (లక్షల హెక్టార్లలో)

పంట	లక్ష్యం	సాగైంది
పత్తి	16.76	17.89
వరి	9.34	4.94
మొక్కజొన్న	5.28	4.44
కంది	2.78	2.37
సోయాచిక్కుడు	2.32	1.61
పెసర	1.10	0.87
పసుపు	0.47	0.44
జొన్న	0.59	0.41
మినుము	0.31	0.29
ఆముదం	0.63	0.25
వేరుసెనగ	0.18	0.11

రైల్వే ప్రాజెక్టులపై జీఎస్టీ ప్రభావం

- పాత పనులకు మునుపటి పన్ను విధానాన్నే అమలు చేయాలంటున్న గుత్తేదారులు
- ఈ నెల 20 నుంచి పనుల నిలిపివేతకు నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: వస్తు సేవల పన్ను(జీఎస్టీ) దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని ప్రాజెక్టుల పనులను ప్రభావితం చేసే పరిస్థితులు కన్పిస్తున్నాయి. జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీతో పడే అదనపు భారాన్ని రైల్వేశాఖే భరించాలని, లేని పక్షంలో పనులు నిలిపివేయాలని గుత్తేదారులు నిర్ణయించడమే దీనికి కారణం. జోన్ పరిధిలో సివిల్ పనుల గుత్తేదారులు గురువారం హైదరాబాద్‌లో సమావేశమై..భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. పాత పనులకు జీఎస్టీ అమలుకు నిరసనగా ఈ నెల 20 నుంచి 'టూల్ డౌన్' పేరుతో దేశవ్యాప్తంగా పనులను నిలిపివేయాలని నిర్ణయించినట్లు దక్షిణ మధ్య రైల్వే జోనల్ కాంట్రాక్టర్స్ సంఘం ఉపాధ్యక్షుడు అఫ్సర్ రియాజ్, కార్యదర్శి కందుల సురేందర్‌రావు స్పష్టం చేశారు. ద.మ.రైల్వే జీఎంను కలిసి ఈ మేరకు విజ్ఞప్తిచేశారు.

ప్రశ్నార్థకంగా రూ.5 వేల కోట్ల పనుల ప్రగతి: దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో దాదాపు రూ.5 వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. కొత్త రైల్వే లైన్లు, వంతెనల నిర్మాణం, అదనపు మార్గాల ఏర్పాటు వంటివి జాబితాలో ఉన్నాయి. వ్యాట్ స్థానంలో వచ్చిన జీఎస్టీపై ప్రస్తుతం ఆ పనులు చేస్తున్న గుత్తేదారులు అసంతృప్తితో ఉన్నారు. గతంలో 0-5 శాతంగా ఉన్న పన్ను ప్రస్తుతం 12 శాతానికి పెరిగిందని.. కొన్నింటిపై 18 శాతం అంతకంటే ఎక్కువ చెల్లించాల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు. గతంలో ఒప్పందం కుదుర్చుకున్న పనులకూ జీఎస్టీ వర్తింపజేయడం వల్ల తమపై దాదాపు రూ.400-500 కోట్ల ఆర్థిక భారం పడే అవకాశం ఉందన్నది వారి వాదన. ఈ పరిణామాల నేపథ్యంలో కొత్తగా పనులు దక్కించుకున్న వాళ్లు సమస్య పరిష్కారమయ్యే వరకు పనులు ప్రారంభించకూడదని భావిస్తుండగా.. ఇప్పటికే పనులు చేస్తున్న గుత్తేదారులు ఈ నెల 20 నుంచి పనులు నిలిపివేయాలని నిర్ణయించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తేదీకి ముందు ప్రారంభమైన, టెండర్లు ఖరారైన పనులకు పాత పన్ను విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 'రైల్వేశాఖ రూపొందించిన అంచనాల మేరకు బిడ్లు దాఖలు చేశాం. పనులు దక్కిన తర్వాత జీఎస్టీ అమల్లోకి వచ్చింది. దీంతో నిర్మాణవ్యయం పెరగనుంది. అదనపు మొత్తాన్ని భరిస్తే నష్టపోతాం.' అని గుత్తేదారుల సంఘం ప్రతినిధి ఆవేదన వ్యక్తం చేశారు. 'జీఎస్టీకి ముందు టెండర్లు పిలిచిన వాటికి మినహాయింపు ఇవ్వాలి. లేదంటే పనులు ఆలస్యమవుతాయి. ఈ విషయాన్ని రైల్వేమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లాం.' అని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమన్ ప్రధాన కార్యదర్శి, సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ముఖ్యనేత మర్రి రాఘవయ్య చెప్పారు. ఇదిలా ఉంటే ఇప్పటికే మొదలైన ప్రాజెక్టులు, అప్పగించిన పనులపై జీఎస్టీ ప్రభావం ఎంత ఉందన్న విషయమై నివేదిక రూపొందించి పంపాలని దక్షిణమధ్య రైల్వే సహా అన్ని రైల్వే జోన్లను రైల్వేశాఖ ఆదేశించింది.

స్నేహ వైద్యం..ఎంత మధురం

- వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచన
- 'చిన్నారి డాక్టర్' పేరుతో కార్యక్రమానికి శ్రీకారం



స్నేహితురాలికి వైద్యం చేస్తున్న చిన్నారి డాక్టర్

పక్కనున్న ఈ చిత్రం చూడగానే విద్యార్థినితో.. బాలికలకు వైద్యం చేయిస్తున్నారేమిటి? అనుకుంటున్నారు కదూ. మీ ఊహ నిజమే. అయితే అక్కడ వైద్యం చేస్తున్నది మాత్రం విద్యార్థిని కాదు. .వైద్యంపై ఎంతోకొంత అవగాహన ఉన్న విద్యార్థి వైద్యురాలు. వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ఆమ్రపాలి మదిలో మెదిలిన వినూత్న ఆలోచనకు రూపమే ఈ కార్యక్రమం. రాష్ట్రంలోనే తొలిసారిగా బుధవారం హన్మకొండ లష్కర్‌బజార్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో 'చిన్నారి డాక్టర్' పేరుతో విద్యా, వైద్య శాఖల సమన్వయంతో కలెక్టర్ లాంఛనంగా దీన్ని ప్రారంభించారు. 'యుక్త వయసు పిల్లల్లో శారీరకంగా, మానసికంగా ఎన్నో మార్పులు వస్తుంటాయి. కొన్ని సమస్యలను బాలికలు తల్లిదండ్రులకు కూడా చెప్పరు. స్నేహితులతో మాత్రం వాటిని పంచుకుంటారు. అలాంటి స్నేహితులే వైద్యులై..వారి సమస్యకు పరిష్కారం చూపితే సత్ఫలితాలు ఉంటాయి. ఈ కార్యక్రమ లక్ష్యం ఇదే.' అని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గురుకుల ఆశ్రమాల్లోనూ దీన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు.

అమలు ఇలా: ఇందులో భాగంగా ప్రతి పాఠశాలలో ఒక ఆరోగ్య క్లబ్ ఏర్పాటు చేస్తారు. ఓ ఉపాధ్యాయుని పర్యవేక్షణలో అయిదుగురు బృందంతో క్లబ్ నడుస్తుంది. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థుల్లో ప్రతి తరగతి నుంచి స్నేహభావంతో ఉంటూ, నాయకత్వ లక్షణాలను కలిగిన ఇద్దర్ని 'చిన్నారి డాక్టర్ల'గా ఎంపిక చేస్తారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. సుశిక్షితులైన విద్యార్థులు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో తరగతిలోని స్నేహితులకు వైద్య చిట్కాలు అందిస్తూ..వారి ఆరోగ్యాన్ని కాపాడటానికి కృషి చేస్తారు. ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై ఎప్పటికప్పుడు తోటి వారిని జాగృతం చేస్తారు.

– ఈనాడు, వరంగల్, బాలసముద్రం, న్యూస్‌టుడే



చిన్నారి వైద్యులకు వైద్యకోటు(ఆప్రాన్) అందజేస్తున్న కలెక్టర్ ఆమ్రపాలి

రజనీకాంత్ సతీమణి పాఠశాలకు తాళం

అద్దె బకాయిలు చెల్లించలేదని యజమాని చర్య

చెన్నై, న్యూస్‌టుడే: అద్దె బకాయిలు చెల్లించని కారణంగా ప్రముఖ నటుడు రజనీకాంత్ సతీమణి లతా రజనీకాంత్ నిర్వహిస్తున్న పాఠశాల భవనానికి దాని యజమాని తాళం వేశారు. చెన్నై గిండిలోని రేస్‌కోర్స్ వద్ద 'ది ఆశ్రమ్' పేరిట ఆమె ఓ బడిని నిర్వహిస్తున్నారు. ఇది బాడుగ భవనంలో కొనసాగుతోంది. దీనికి 2009 నుంచి రూ.11 కోట్ల వరకు అద్దె బాకీ చెల్లించాల్సి ఉంది. ఆ భవనం యజమాని వెంకటేశ్వర్లు దీనిపై మద్రాసు హైకోర్టులో గతంలో పిటిషన్ వేశారు. తర్వాత కోర్టు సమక్షంలోనే ఇరువర్గాల మధ్య గత ఏడాది జూన్‌లో రాజీ కుదిరింది. బకాయిల మొత్తాన్ని ఒకేసారి చెల్లించడం కష్టమని, మొదట రూ.2 కోట్లను ఇస్తానని లత చెప్పారు. ఇప్పటివరకు తొలి వాయిదా చెల్లించకపోవడం తోపాటు నెలవారీ బాడుగ కూడా ఇవ్వలేదని సమాచారం. ఈ నేపథ్యంలో వెంకటేశ్వర్లు పాఠశాల భవనానికి తాళం వేశారు. వరుసగా నాలుగు రోజులు సెలవులు ముగిసిన తర్వాత బుధవారం పాఠశాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు వచ్చారు. తాళం వేసి ఉండటంతో వారంతా బయటే నిలబడ్డారు. దీంతో పాఠశాల నిర్వాహకులు వారిని వేళచ్చేరిలో తమకు చెందిన మరొక పాఠశాలకు తీసుకెళ్లారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. L/RN/KAR/48/2015-17 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00